# హిందువుల పండుగలు

సురవరం ప్రతాపరెడ్డి

తెలంగాణ సాహిత్య అకాడమి
హైదరాబాద్ – 500 004.

ప్రచురణ సంఖ్య : 90

**హిందువుల పండుగలు**
రచన : సురవరం ప్రతాపరెడ్డి

తొలి ముద్రణ : 1931
తర్వాతి 5 ముద్రణలు :
సురవరం ప్రతాపరెడ్డి
సాహిత్య వైజయంతి ట్రస్టు
పద్మారావునగర్, సికిందరాబాద్-25

ఏడవ ముద్రణ: అక్టోబర్, 2019
తెలంగాణ సాహిత్య అకాడమి

ప్రతులు: 1000

పేజీలు : 190
వెల :₹ 100/-

ప్రతులకు :
**తెలంగాణ సాహిత్య అకాడమి**
కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం,
హైదరాబాద్ - 500 004.
దూరవాణి : 040-29703142.

ముద్రణ:
చరిత ఇంప్రెషన్స్, ఆజామాబాద్,
హైదరాబాద్-500020,
ఫోన్: 040-27678411

Publication No : 90

**HINDUVULA PANDUGALU**
by -Suravaram Pratapareddy

First Edition : 1931
and Other Five Editions :
Suravaram Pratapareddy
Sahitya Vaijayanthi Trust
PadmaRao Nagar, Sec-25

7th Edition : October, 2019
Telangana Sahitya Akademi

Copies : 1000

Pages : 190
Price : Rs. 100/-

For Copies :
Telangana Sahitya Akademi,
Kalabhawan, Ravindra Bharathi,
Hyderabad - 500004.
Ph :040-29703142

Printed :
Charita Impressions,
Azamabad, Hyd-500020,
Ph: 040-27678411

# పండుగల పరమార్థం

హైద్రాబాద్ కొత్వాలు రాజాబహద్దూర్ వెంకట్రామిరెడ్డి కోరిక మేరకు సురవరం ప్రతాపరెడ్డి 1930లో “హిందువుల పండుగలు” అనే పుస్తకాన్ని రచించాడు.

హిందువుల పండుగలను రచించడానికి రెడ్డిగారు శాస్త్ర పురాణేతిహాసాల్ని, భారతీయ భాషల్లో ప్రచురింపబడ్డ మత సంబంధమైన గ్రంథాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. 54 ముఖ్య పండుగలను గురించిన సహేతుక వివరణ ఇందులో వుంది. ఆయా పండుగలు జరుపుకోవటానికి అనూచానంగా వస్తున్న కథలను, విశ్వాసాలను వివరించి అందులో ఏ కారణం హేతుబద్ధంగా, సమంజసంగా వుంటుందో దాన్ని ప్రతాపరెడ్డి తమ ‘‘హిందువుల పండుగలు’’ అను గ్రంథంలో విశదీకరించాడు. ఇందులో రచయిత చూపిన పరిశోధనా పాటవం, విజ్ఞత, ప్రశంసనీయం. ఆయా సందర్భాలను వివరించేటప్పుడు ఆయన తన అభిప్రాయాన్ని నిష్పాక్షికంగా, నిర్భయంగా, నిస్సంకోచంగా వివరించడం జరిగింది. ఆయన నిశిత దృష్టి ఆదర్శం కంటే – ఆచరణ యోగ్యతకు, అంధ విశ్వాసం కంటే – వాస్తవికతకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చినట్లు మనం గుర్తించగలుగుతాం. ఈ అరుదైన పుస్తకాన్ని తెలంగాణ సాహిత్య అకాడమి తిరిగి ముద్రిస్తున్నందుకు సంతోషిస్తున్నది.

హైద్రాబాద్,
19.09.2019

**–తెలంగాణ సాహిత్య అకాడమి**

# పరిచయ వాక్యములు


శ్రీయుత ప్రతాపరెడ్డిగారిచే విరచితమైన “హిందువుల పండుగలు” అను గ్రంథమునకు విపులముగా పీఠిక వ్రాయుటకు నాకు వ్యవధి చాలదు  శక్తియు చాలనిదియే. కాని ప్రీతిప్రేరితమగు వారి యాహ్వానమును వ్యర్థపరుప సాహసింపను. అనేకులు, మన దేశీయులు, పూర్వాచార నిబద్ధులై, ప్రాచీన సంప్రదాయముల నుండి యిసుమంతయు తొలగలేక, శుభాశుభకార్యముల నుపక్రమించుచు కాలము గడుపుచున్నారు. అట్టివారికి రెడ్డిగారి గ్రంథము మిక్కిలి యుపయోగకరము. విద్యావంతులు మన ఆచారములపట్ల విముఖత్వము కల్గియుండుట సామాన్యదృశ్యము. మన ఆచారములు పెక్కులు ఖండనార్హములనుట నిర్వివాదాంశము. అయినను శుభసూచకములును, ప్రియజనకూటమికి హేతువులును, సంతోషజనకములును నగు పండుగలపై ఈసుగల్గియుంట శోచనీయము. ఇట్టివారిచే గూడ నీ గ్రంథము పఠనార్హమే.

పండుగలు ఆధ్యాత్మికవృత్తికి అవసరములా, పరలోక సుఖప్రదములా అన్న చర్చ అనవసరము. అయ్యవి ముఖ్యముగ సాంసారిక, సాంఘిక జీవికభారమును ఇంచుక తొలగించి, సంతోషమును చేకూర్ప నేర్పడిన శుభక్రతువులు.

ప్రతాపరెడ్డిగారు సులభశైలిని, పురాణేతిహాస పురస్కరముగ రచించిన ఈ గ్రంథము హైందవ మతావలంబులగు ఆంధ్రుల కెల్లరకును, అందు ముఖ్యముగ స్త్రీలకు మిక్కిలి యుపయోగకరమని నా దృఢనమ్మకము.

1931 **డాక్టరు ఎస్.రాధాకృష్ణన్**

(ప్రథమ ముద్రణ పీఠిక)



**కీ.శే. సురవరం ప్రతాపరెడ్డి**

జననం :
28.05.1896

అస్తమయం:
25.08.1953

# మున్నుడి

సురవరం ప్రతాపరెడ్డి నామ సంస్మరణ మాత్రాన ఆనాటి తెలంగాణలోని సాంఘిక చైతన్యం గుర్తుకు వస్తుంది. ఆయన గోలకొండ వ్రాతల ఫిరంగి మ్రోతలతో తెలుగు గుండెలలో వీరావేశం నింపిన ధీరుడు. పత్రికా సంపాదకుడుగా, పరిశోధక పండితుడుగా, సంస్థల ప్రోత్సాహకుడుగా, ఉత్తమాభిరుచి కలిగిన రచయితగా, విశాలాంధ్రోద్యమ ప్రేరకుడుగా సురవరం వారి కృషి సంస్తవనీయం. విశిష్టమైన శైలి, నిర్దిష్టమైనభావం, ఆర్జనావేశం, విషయవైభవం వారి రచనలలోని సహజగుణాలు.

సురవరం వారి శతజయంతికి పూర్వమే వారి గ్రంథాలన్నీ పునర్ముద్రణ చేయాలని సంకల్పించి 'సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి' పేర ఒక సంస్థ ఏర్పడింది. గ్రంథముద్రణ కొరకు ప్రత్యేకంగా సంపాదకమండలిని నా అధ్యక్షతన ఏర్పాటు చేశారు. కీ.శే.దేవులపల్లి రామానుజరావుగారు, కీ.శే. జస్టిస్ కొండా మాధవరెడ్డిగారు. వైజయంతి పది గ్రంథాలు పునర్ముద్రించి శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించింది. సురవరం వారి రచనల ముద్రణకు, సమావేశాలు నిర్వహించటానికి, ప్రతియేటా వారిపేరు మీద ఒక పురస్కారం అందించటానికి "సురవరం ప్రతాపరెడ్డి సాహిత్యవైజయంతి ట్రస్టు" పేర వారి కుటుంబసభ్యులు ఒక ట్రస్టు ఏర్పాటు చేశారు. ఆ ట్రస్టులోని వారు:

1. డా.సి.నారాయణరెడ్డి (అధ్యక్షులు)
2. శ్రీ ఎస్.ఎన్.రెడ్డి (ఉపాధ్యక్షులు)
3. డా.బి.రామరాజు (ఉపాధ్యక్షులు)
4. శ్రీ దేశం జగన్‌మోహన్ రెడ్డి (కార్యదర్శి)
5. డా. సురవరం పుష్పలత (సంయుక్త కార్యదర్శి)
6. శ్రీ సురవరం విష్ణువర్ధన్‌రెడ్డి (సంయుక్త కార్యదర్శి)

7. డా. సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి (కోశాధికారి)

8. డా. సురవరం సుధాకరరెడ్డి (ప్రత్యేక ఆహ్వానితులు)

9. శ్రీ రాజ బహదూర్ గౌర్ (విశిష్ట సభ్యులు)

10. శ్రీ డా. ఎల్లూరి శివారెడ్డి (విశిష్ట సభ్యులు)

ప్రతాపరెడ్డి రచనలలో హిందువుల పండుగలు ఒక విశిష్ట రచన. ఆ విషయంపై ఈనాటికీ అదే ప్రామాణిక రచన. ఈ గ్రంథానికి ఉన్న ఆదరణ గమనించి ప్రస్తుత ముద్రణ జరిగింది. తెలుగువారి సంస్కృతికి ఈ రచన ఒక అలంకారం. వారి తండ్రిగారి పేరు మీద వారి కుటుంబసభ్యులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందించదగినవి.

తేదీ 27-6-2004

**డా.సి.నారాయణరెడ్డి**

అధ్యక్షుడు

సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్టు

# పీఠిక

ప్రతి మతమందును బండుగలు గలవు. అవి యనేక కారణముల చేత జరుపబడుచున్నవి. హిందువులందును బండుగలు పెక్కు గలవు. బహుశః హిందువులలో నుండు నన్ని పండుగలే యితర మతస్థులందును లేకుండవచ్చును. అయినను హిందువులలో ననేకులకు దాము పండుగల నేల చేయుచున్నారో తెలియదని చెప్పవచ్చును. సుప్రసిద్ధములైన విజయదశమి, దీపావళి పండుగల విషయమై పండితులు సహితము సరియైన కారణములు చూపించుటలేదు. అందు పరంపరగా వాడుకొను కారణములే చూపుదురు కాని యవి సరియైనవా, కావా యను విషయమును విచారించు శ్రమకుబోరు. ఈ గ్రంథ రచనమున కిదియొక కారణమని మొదలే విన్నవించుకొనుచున్నాము.

సాధారణముగా పండుగలను హిందువులు వ్రతములుగా నెంచుచున్నారు. ప్రతి వ్రతమును మంత్రపూర్వకముగ జరుపుచున్నారు. మంత్రముల నుచ్చరించుటకు పురోహితుల యావశ్యకముండును. హిందువులలో బండుగలు బహు ప్రాచీనమునుండి యేర్పడుచువచ్చినవి. వీని విషయమై బహు పురాణములందు చర్చించియున్నారు. ఇంతియగాక కొన్ని స్మృతి గ్రంథములందును వీని చర్చ గలదు. హారీతస్మృతియం దిట్లున్నది:

శ్లో॥ మహానవమ్యాం ద్వాదశ్యాం భరణ్యామపి పర్వసు ।
తథాక్షయతృతీయాయాం శిష్యాన్నాధ్యాపయేద్విజః ॥

శ్లో॥ మాఘమాసేతు సప్తమ్యాం రథ్యాఖ్యాయాంతు వర్జయేత్ ।
అధ్యాపనం సమభ్యంజన్ స్నానకాలేచ వర్జయేత్ ॥

అనగా,

మహానవమియందును (దేవీ నవరాత్రులు), ద్వాదశియందును, భరణీ నక్షత్రమందును, పర్వములందును, అక్షయ తృతీయమందును, రథసప్తమినాడును, మాఘసప్తమియందును గురువు శిష్యుల కధ్యాపనము చేయగూడదు.

మన పండుగలను నాలుగైదు భాగములుగా విభజింపవచ్చును. పూర్వము లోకోత్తర పురుషులై యీ ప్రపంచమందు లోకహితార్థమై యుత్తమ కార్యములను జేసిపోయిన మహానుభావుల జన్మదినోత్సవములు కొన్ని గలవు. శ్రీరామకృష్ణాది జయంతులిందులకు నిదర్శనములు.

రెండవ వర్గమందు ఋతుసంబంధమయిన యుత్సవములు చేరును. ఉగాది, సంక్రాంతి, హోలి, రథసప్తమి వంటివి యీ శాఖయందు జేరును. హిందువులు ప్రకృత్యారాధకులుగా నొక కాలమందుండినవారని వేదకాల మందార్యులు ద్యావాపృథివీ వరుణేంద్రాది దేవతలను బూజించిన విధానమే సూచించుచున్నది.

మూడవ వర్గమందు శైవవైష్ణవ సంబంధమగు వ్రతములు చేరుచున్నవి. శైవవైష్ణవ భేదములు వేదకాలమందు లేకుండెను. పురాణకాలమందవి యేర్పడ జొచ్చెను. ఇట్లు శైవవైష్ణవ సంప్రదాయానుసారముగ గొన్ని పండుగలేర్పడినవి. వైష్ణవులకు అనంత చతుర్దశి, ఏకాదశి ముఖ్యమైనవి. శైవులకు వినాయక చతుర్థి, మహాశివరాత్రి, నవరాత్రులు మున్నగునవి ముఖ్యము.

తక్కిన పండుగలను నాల్గవవర్గమందు జేర్పవచ్చును. విజయదశమి కేవలము రాజులకు సంబంధించినదిగా గానబడుచుండినను జనసామాన్యము దీనిని భక్తితో నాచరించుచున్నారు.

కొన్ని పండుగలు సర్వజనులలో లేకున్నను ద్విజులకును, స్త్రీలకును ముఖ్యమైనవైయున్నవి. ద్విజులకు రక్షికాపూర్ణిమ ముఖ్యమైనది. వారవ్రతములు (ఆది, సోమాది వ్రతములు), అశ్వత్థ తులసీ వ్రతములు, లక్ష్మీవ్రతము, సత్యనారాయణ వ్రతము మున్నగునవి స్త్రీలచే విశేషముగా నాదరింపబడునట్టివి.

స్త్రీ లాచరించు వ్రతముల గుఱించి గుప్తేపండితుడు (Hindu Holidays and Ceremonials) హిందువుల వ్రతములు' అను గ్రంథమందలి యుపోద్ఘాతమందిట్లు వ్రాసియున్నాడు:

ప్రపంచమందంతటను స్త్రీలే పురోహితుల వ్యాపారమున కనువైన సరకు. కావుననే హిందూస్త్రీల ప్రత్యేక వినోదార్థమై గోపద్మ, పంచదేవ, శుక్రవారవ్రత, నాగపంచమి వంటి యనేక వ్రతములు కల్పింపబడినవి. శాస్త్రములందు కొన్నియే పండుగలు సూచించపబడినవి. పురాణములా సంఖ్యను బెంచినవి. తర్వాత జనసామాన్య

మనేక గాథలు త్రవ్వి పైవాని నపరిమితముగా బెంచినది ఈ కడపటి వర్గము పురోహితులందును, స్త్రీలయందును విశేషముగా దాగియున్నది.”

పై పండితుని యభిప్రాయమందు గొంత సత్యము లేకపోలేదు. బౌద్ధమహా యుగము నాటికే హిందువులు తమ పూర్వౌన్నత్యమును గొంత గోల్పోయిరి. ఆ కాలము వఱకే స్త్రీకి జ్ఞానమియ్యగూడదని కొన్ని శాస్త్రములు బయలుదేరెను. అట్లు స్త్రీ శూద్రులను మూర్ఖావస్థయందుంచుటయేగాక వారికి మత విషయములగు సిద్ధాంతము లంతగా బోధింపకపోయిరి. ఇట్లు స్త్రీ శూద్రులు మౌర్ఖ్యధనులై యుండ వారినెట్లు చేయదలచిన నట్లు చదివినవారు చేయవచ్చును గదా! కావుననే వ్రతములు పెచ్చు పెరిగి పోయెను. మరియు నిజమగు వస్తుతత్త్వమును బోధింపనందున నెవ్వరికి దోచినట్లు వారు పురాణముల గల్పింప మొదలిడిరి. అనేక వ్రతముల కనేక కథలు కల్పింపబడెను. శౌనకాదిమునులో, నారదుడో, వైశంపాయనుడో, వ్యాసుడో, శ్రీకృష్ణుడో యెవరో యొకరు బోధకులగుదురు. ధర్మరాజో, జనమేజయుడో యెవ్వరో యొకరు శిష్యులై భక్తిపూర్వముగా విందురు. అట్టి గురు శిష్యుల సంవాదమును హిందువులందరు కిమ్మనక యాదరించి శ్రద్ధాయుక్తులై యాచరించికొనవలయును. ఇట్లుత్సవము లనేకము లుత్పత్తి యయ్యెను.

ఈ గ్రంథమందలి విషయములు పండుగలన నేమి విశేషమో, యేమియు దెలియని జనులకై వ్రాయబడినవి. ఈ గ్రంథమును వ్రాయుటకింకొక కారణము గూడ కలదు. అది వినదగిన యంశము; వినోదకరమగు నంశమును; విభవ సంవత్సర విజయదశమీ దివసమున నిజాము గారు రాజా వేంకటరామరెడ్డి బహద్దరు (కొత్వాలు) గారిని విజయదశమిని హిందువు లెందుకు జేయుదరని విచారింప వారిది అర్జునుదుత్తర గోగ్రహణమునందు శత్రువుల జయించిన కారణమున జేయుబడుచున్నదని నుడివిరట. “ఇంతకు పూర్వ మొకరిని విచారింపనతడిది శ్రీరాములు రావణునిపై జయముపొందిన సందర్భమున జరిగినదని చెప్పెను. ఎవరిమాట నిజము?” అని నిజాంగారు విచారింప రెడ్డిగారు నిరుత్తరులై అదే దివసమందు రాజా ధనరాజగిర్జీగారితో ఈ విషయమును గుఱించి ముచ్చటించినవారట. శ్రీ ధనరాజగిర్జీగారును హిందువులు తమ తమ పండుగల సంగతి నేమియు నెఱుగకుండుట యెంతటి హాస్యాస్పదమో కదా యని విచారించి యెవరినైన నీ విషయికమగు గ్రంథమొకదానిని వ్రాయించిన జాల బాగుండెడిదని సెలవిచ్చినారట. అప్పుడు శ్రీరాజా వేంకటరామరెడ్డి బహద్దురుగారు నన్నీపని నెరవేర్చుమని యాదేశించారు. అందులకు సామర్థ్యము లేకున్నను వారి యభిలాష యనుల్లంఘనీయమగుట జేసి యీ గ్రంథమును వ్రాసితిని.

ఆంధ్రమం దిట్టి గ్రంథముండినట్లు నాకు గానరాలేదు. మఱియు నాంగ్లమందును రెండు మూడు గ్రంథములున్నను నయ్యవి యీ విషయమును దృప్తికరముగా జర్చించినవిగావు.

ఈ గ్రంథమందు వ్రాసిన విషయములలో పండుగ, ఉత్సవము, వ్రతము, జయంతి మున్నగునవన్నియు జేరినను సౌకర్యార్థము గ్రంథనామము "హిందువుల పండుగలు" అనియే నిర్ణయించితిని. 'పండుగు' అనియే సరియగు రూపము. అయినను వ్యవహారమును 'పండుగ' అని యున్నది కాన దానినే వాడితిని.

ఈ యుపోద్ఘాతమును ముగించుటకు బూర్వమొక ముఖ్య విషయము మనవిచేసికొన వలసియున్నది. ఈ గ్రంథమునకు గారకులగు శ్రీ రాజా ధనరాజగిర్జీగారు 500 హాలీ రూపాయీలు ఈ గ్రంథ ముద్రణ వ్యయమున కని నా కొసగినారు. ఆ మొత్తము గోలకొండ పత్రికకే ఇచ్చివేసితిని.

ఈ గ్రంథమును మొదటిసారి క్రీ.శ. 1931 లో ప్రకటించితిని. అప్పుడు శ్రీ డాక్టర్ యస్.రాధాకృష్ణన్ గారు దయతో పీఠిక వ్రాసియుండిరి. దాని నీ ముద్రణమందును ప్రకటించియున్నాను. శ్రీవారికి నా కృతజ్ఞతలను తెలుపుకొనుచున్నాను. క్రీ.శ. 1938లో ఈ గ్రంథమును రెండవసారి కొన్ని మార్పులతో ప్రకటించితిని. ప్రథమ ద్వితీయ ముద్రిత ప్రతుల ఆదాయమును కూడ గోలకొండ పత్రికకే ధారపోసితిని. ఇది తృతీయ ముద్రణము. ఈ 12 ఏండ్ల నుండి దీనిని పలువురు కోరిరి. కాని పునర్ముద్రణము నాతో కాజాలని పని యయ్యెను. ఇప్పుడు కర్నూలులోని శ్రీ బాలనాగయ్యసెట్టి కంపెనీవారు ముద్రించుటకు పూనుకొనగా వారి కనుమతినిచ్చినాను.

1983 **సురవరము ప్రతాపరెడ్డి**

(తృతీయ ముద్రణ పీఠిక)

# విషయసూచిక


| విషయము | పుటలు |
|---|---|
| వ్రతమనగానేమి? | 1 |
| దీపావళి | 8 |
| విజయదశమి | 18 |
| ఉగాది | 30 |
| శ్రీరామనవమి | 34 |
| జన్మాష్టమి | 36 |
| హనుమజ్జయంతి | 44 |
| భీష్మైకాదశి | 46 |
| మహాలయపక్షము | 52 |
| దత్తాత్రేయ జయంతి | 56 |
| కూర్మ జయంతి | 57 |
| నృసింహ జయంతి | 58 |
| వామన జయంతి | 60 |
| తులసీ వ్రతము | 62 |
| కపిలాషష్టి | 66 |
| సూర్య చంద్ర గ్రహణములు | 68 |
| ఋషి పంచమి | 70 |
| సత్యనారాయణ వ్రతము | 72 |
| శ్రావణపూర్ణిమ | 75 |
| సంక్రాంతి | 79 |
| అనంతచతుర్దశి | 82 |
| రథసప్తమి | 85 |

| | |
|---|---|
| నవరాత్రులు | 88 |
| అక్షయతృతీయ | 90 |
| గణేశ చతుర్థి | 92 |
| చాతుర్మాస్య వ్రతము | 101 |
| పరశురామజయంతి | 102 |
| బుద్ధజయంతి | 107 |
| హోలీ | 110 |
| నాగపంచమి | 121 |
| ఏకాదశి | 132 |
| శీతలాసప్తమి | 139 |
| వసంత పంచమి | 143 |
| మహాశివరాత్రి | 144 |
| హరితాళిక | 154 |
| దూర్వాష్టమి | 154 |
| చంపాషష్ఠి | 154 |
| స్కంద షష్ఠి | 155 |
| గౌరీ తృతీయ | 155 |
| దశహర | 155 |
| అశోక షష్ఠి | 156 |
| ఆదివార వ్రతము | 157 |
| సోమవార వ్రతము | 158 |
| మంగళవార వ్రతము | 159 |
| బుధవార వ్రతము | 160 |
| గురువార వ్రతము | 161 |
| శుక్రవార వ్రతము | 161 |
| శనివార వ్రతము | 162 |

| | |
|---|---|
| భక్తేశ్వర వ్రతము | 163 |
| కేదారేశ్వర వ్రతము | 164 |
| యమద్వితీయ – భ్రాతృద్వితీయ | 165 |
| అముక్తాభరణము | 166 |
| సంకష్ట హరణ చతుర్థి | 167 |
| వటసావిత్రి వ్రతము | 167 |
| ఏరువాక పున్నమ | 168 |
| పండుగల పట్టి | 170 |
| పండుగల అకారాది విషయ సూచిక | 173 |

# వ్రతమనగా నేమి?

వ్రతమను పదమునకు వాచస్పత్యనిఘంటుకారుడగు తారానాథ తర్కవాచస్పతి యిట్లర్థము చేసియున్నాడు:

ప్రజఘుజస్యతః, భక్షణభేదే ఉణాది పుణ్యసాధనే ఉపవాసాదినియమభేదే చ.

అనగా పుణ్యసాధనమునకై యుపవాసాది నియమములచే జేయు కార్యమునకు వ్రతమని యర్థము.

దీనినే వివరించుచు పై నిఘంటువున నిట్లు వ్రాయబడినది:

వ్రతం చ సమ్యక్సంకల్పజనితానుష్ఠేయ క్రియావిశేషరూపం; తచ్చ ప్రవృత్తి నివృత్త్యు భయరూపం; తత్ర ద్రవ్య విశేష భోజన పూజాదికం ప్రవృత్తిరూపం; ఉపవాసాదికం చ నివృత్తిరూపం; తచ్చ నిత్యం, నైమిత్తికం, కామ్యం చ; నిత్యమేకాదశ్యాదివ్రతం, నైమిత్తికం చాంద్రాయణాది వ్రతం, కామ్యం తత్తత్తిథ్యుపవాసరూపం.

దీని యర్థమేమనగా, వ్రతమున సంకల్పపూర్వకముగ సమ్యగనుష్ఠానము చేయుట. ఈ వ్రతము ప్రవృత్తి నివృత్తి రూపములని రెండు విధములు. భోజన పూజాదికములతో గూడినది ప్రవృత్తి రూపము; ఉపవాసాదికమైనది నివృత్తిరూపము. వ్రతములు మూడు విధములయినవి: 1. నిత్య వ్రతములు, 2. నైమిత్తిక వ్రతములు, 3. కామ్య వ్రతములు.

1. ఏకాదశీ వ్రతముల వంటి వెల్లకాలములందును జేయదగినవి గాన నట్టివి నిత్యవ్రతములనబడును.

2. చాంద్రాయణాది వ్రతములు నైమిత్తికము లనబడును.

3. ఆయాతిథులం దుపవాసముండి చేయు వ్రతములు కామ్యము లనబడును.

వ్రతములలో నింకను ననేక విధములయినవి కలవు. అందు మానసిక వ్రతములను గుఱించి వరాహపురాణమం దిట్లున్నది:

శ్లో॥ అహింసా సత్య మస్తేయం బ్రహ్మచర్య మకల్మషం,
ఏతాని మానసా న్యాహు ర్వ్రతాని వ్రతధారిణాం.
ఏకభుక్తం తథా నక్త ముపవాసాదికంచ యత్,
తత్సర్వం కాయికం పుంసాం వ్రతం భవతి నాన్యథా.

వ్రతములు మానసికములు, కాయికములని రెండు విధములు. అందు అహింస, సత్యము, దొంగతనము చేయకుండుట, బ్రహ్మచర్యము, అకల్మషత్వము– ఈ గుణముల గలిగియుండుట మానసికవ్రతము లనబడును. ఇక ఒక్క ప్రొద్దు, రాత్రికాలమందుపవాసముండుట మున్నగునవి కాయికవ్రతము లనబడును.

వ్రతానుష్ఠానముల పద్ధతి బహు ప్రాచీనమునుండి వచ్చినట్లు కొన్ని పురాణ ప్రమాణముల వలన దెలియవచ్చెడి. ప్రాచీనకాల మందు రాజులు తమ యభీష్టముల సిద్ధ్యర్థమై వ్రతముల జేయుచుండిరని మనము పురాణగాథలందు జదువుచుందుము. గరుడపురాణమందు బూర్వము నానారాజులు వ్రతముల వలన నెట్టి ఫలమును బొందిరో యిట్లు చూపించబడినది:

శ్లో॥ దుంధుమారస్తు రాజర్షిర్లేభే పుత్రశతం వరా,
దానేన నియమేనైవ తపసా చ వ్రతేన చ.
సగరో నామ రాజర్షిర్దక్షు స్సర్వాసు విశ్రుతః,
పుత్రాణాం చ శతం ప్రాప్తం తేన రాజ్ఞా మహాత్మనా.
తథా దశరథో రాజా వ్రతేషు నిరతస్సదా,
యజ్ఞ దాన తపో యోగైః సంతుష్టః పురుషోత్తమః.
స్వయం పుత్రత్వమాపేదే తస్య రాజ్ఞో మహాత్మనః,
జనకో నామ రాజర్షిస్తపో వ్రతనిధి స్స్వయం.
ఐశ్వర్య మతులం ప్రాప్య యోగినాం గతి మాప్తవాన్,
ఏవ మేవ మహారాజ రాజానో బ్రాహ్మణాస్తథా
ఐశ్వర్య మక్షీణం ప్రాపు ర్గతిం వై వ్రత వైభవాత్.

దీని భావ మేమన, దాన నియమ తపోవ్రతముల చేత బూర్వము దుంధు మారుడను రాజు నూర్గుర కుమారుల గనెను. దశరథ మహారాజు వ్రతములకు బురుషోత్తముడు మెచ్చి తానే యాతని పుత్రుడై జన్మించెను. జనక మహారాజు తపోవ్రతములచేత నైశ్వర్యవంతుడై యుత్తమగతిని బొందెను. ఈ ప్రకారమే పూర్వము రాజులును, బ్రాహ్మణులును వ్రత వైభవముచే నైశ్వర్యములను బొందిరి. వ్రతముల వలన లాభములను గుఱించి ఆదిత్య పురాణ మిట్లు చెప్పుచున్నది:

శ్లో॥ వ్రతోపవాసాన్ ఖలు యో విధత్తే
దారిద్ర్యపాశం స భినత్తి చాశు,
వ్రతోపవాసేషు రతస్య పుంసః
నైవాపద శ్శాంతి ముశంతి తజ్ఞాః.

వ్రతములు, ఉపవాసములు చేయువాడు తన దారిద్ర్యమును బోగొట్టుకొను చున్నాడు. మరియు వాని కే యాపదలును నుండవు.

గుణములందు నీచుడై కేవలము వ్రతోపవాసములు చేసిన ఫలము లేదు. వ్రతమునకు దగినట్లుగా నుత్తమగుణములు కూడా గలిగియుండిన వానికి జాల శ్రేయస్సు గలుగును. ఈ యంశమునే స్కాందపురాణమిట్లు బోధించుచున్నది:

శ్లో॥ నిజవర్ణాశ్రమాచార నిరత శ్శుద్ధమానసః,
వ్రతే ష్వ ధికృతో రాజన్ అన్యథా విఫలః శ్రమః.
అలుబ్ధ స్సత్యవాదీ చ సర్వభూతహితే రతః
వ్రతేష్వధికృతో..........
శ్రద్ధావాన్ న్యాయభీరుశ్చ మదదంభ వివర్జితః,
వ్రతేష్వది..........
సమస్సర్వేషు భూతేషు శివభక్తో జితేంద్రియః
వ్రతేష్వధి..........

నిజకులాచారములను విడువనివాడును, శుద్ధమానసుడును, లోభికాని వాడును, సత్యవాక్పరిపాలకుడును, సర్వభూతముల మేలు కోరువాడును, న్యాయశీలుడును, మదదంభాది దుర్గుణరహితుడును, దేవభక్తుడును, జితేంద్రియుడును నగువాడే వ్రతములు చేయదగినవాడు కాని యితరుడు చేసిన నది విఫలమగును అని దీని భావము. దేవలుడు తన స్మృతి గ్రంథమం దిట్లు సెలవిచ్చినాడు:

శ్లో॥ వ్రతోపవాస నియమైః శరీరోత్తాపనైస్తథా,
వర్ణాస్సర్వేపి ముచ్యంతే పాతకేభ్యో న సంశయః.

అనగా వ్రతోపవాస నియములచేత మనుష్యుడు తన పాపముల నుండి విముక్తి చెందుచున్నాడు.

ఇక వ్రతముల నెవ్వరెవ్వరు చేయవచ్చునో విచారింతుము. బ్రాహ్మణాది ద్విజాతులకు మతమందు సర్వాధికారము లుండుమాట నిస్సందేహము. ఇక మిగిలినవారు శూద్రులు.

శ్లో॥ తస్మా ద్వేదః పరో మంత్రో న మంత్రో వేదవర్జితః
నతు మంత్రాధికారో స్తి శూద్రాణాం నియమః పరః
మంత్రాభావా దమంత్రేణ భాషితం సర్వకర్మ హి.

అనగా వేదముకన్న వేరు మంత్రము లేదు. శూద్రునికి మంత్రాధికారము లేదు. మంత్రాధికారము లేనందున వానికి సర్వకర్మలు అమంత్రకముగానే యుండవలెను. ఈ శూద్రులకు తోడు స్త్రీలు, స్త్రీ శూద్రులకు మన మతమందు హక్కు లేనాడు తగ్గెనో నాటినుండియు మతము క్షీణించి పోయెననుటలో సందేహము లేదు. శూద్రులు కూడ వ్రతములు చేయవచ్చునని వ్రత గ్రంథకారులు వ్రాసియున్నారు. కాని శూద్రుల వ్రతములు అమంత్రకముగా నుండవలెనని పై యుదాహృత శ్లోకము వలన విదితము. ఒకవేళ కొన్ని వ్రతములకు మంత్రము లవసరమైనచో వారికి పౌరాణికముగు మంత్రములే చెప్పవలెను. కాని వేదమంత్రములు చెప్పి వైదికముగ వ్రతములు చేయింపగూడదని చెప్పుదురు. స్త్రీలు శూద్రులకన్న కనిష్ఠలు. స్త్రీలకు స్వాతంత్ర్యమే లేదనే యనేక నీతి గ్రంథములు, శాస్త్రగ్రంథములు బయలుదేరెను.

ఆజన్మమరణము స్త్రీకి స్వాతంత్ర్యమే లేని కారణమున స్త్రీకి వ్రతాధికార మెంతవఱకు గలదో విచారించెదముగాక.

మార్కండేయ పురాణమందిట్లున్నది:

శ్లో॥ నాస్తి స్త్రీణాం పృథగ్యజ్ఞో
నవ్రతం నాప్యుపోషణం,
భర్తృశుశ్రూష యై వైతౌ
లోకా నిష్టాన్ వ్రజంతిహి.

ఆదిత్య పురాణమందును, మనుస్మృతియందును నిదే శ్లోకము కించిద్భేదముతో వ్రాయబడియున్నది. ఇట్టి యభిప్రాయమే యితర పురాణములందును గనబడుచున్నది. దీని భావమేమన, స్త్రీలకు యజ్ఞముగాని, వ్రతముగాని, ఉపవాసముగాని అవసరము లేదు. భర్తయొక్క శుశ్రూషయే వారికి ముఖ్యవ్రతము. దీనిచేత వారి కిష్టమైన లోకలములను వారు పొందగలరు.

మన్వాది ధర్మశాస్త్రములందు స్త్రీలకు వ్రతాధికారములు లేవని స్పష్టీకరింపబడినది. పరాశరస్మృతియం దీ క్రింది శ్లోకములు గలవు:

శ్లో॥ పత్యౌ జీవతి యా నారీ ఉపోష్య వ్రత మాచరేత్,
ఆయుష్యం హరతే భర్తు స్సా నారీ నరకం వ్రజేత్.
అపృష్టాచైవ భర్తారం యానారీ కురుతే వ్రతం,
సర్వం త ద్రాక్షసాన్ గచ్ఛే దిత్యేవం మను రబ్రవీత్.

అనగా భర్త యుండగానే స్త్రీ యుపవసించి వ్రతము చేయునో యామె భర్త ఆయుస్సును క్షీణింపజేయును. మఱియు నామె నరకమునకు బోవును. భర్త యనుజ్ఞ లేక వ్రతము చేయు స్త్రీ యొక్క వ్రతఫలమంతయు రాక్షసుల పాలగునని మనువు సెలవిచ్చియున్నాడు. మనువు నుదాహరించుటచే మనుస్మృతిలోను నీ నిషేధము కలదని స్పష్టము.

ఇంతవఱకు జూపినరీతిగా స్త్రీ స్వతంత్రకాని కారణము చేత వ్రతములు చేయవలయుననియే యిచ్ఛ కలిగినదైనచో దాను కన్యగా నుండిన తండ్రి యాజ్ఞను బొంది, భార్యగా నుండిన మగని సెలవుపొంది, వితంతువుగా నుండిన గొడుకు అనుమతిని బొంది వ్రతములు చేయవలయును. ఇది స్త్రీల విషయము.

ఇక వ్రతము చేయువారు పర్వదివసమునా డెట్లాచరించికొనవలయునో విచారించెదము. సాధారణముగా బండుగకు పూర్వదినము రాత్రి భుజింపకూడదు. పండుగనాడు ప్రొద్దుననే శిరస్స్నానము చేయవలయును. పిమ్మట దేవాతాపూజలు సలుపవలెను. అయితే ఈ నియమము లన్నిటికిని వర్తింపవు. సాధారణముగా జయంతుల కన్నిటికి బూర్వదినమొక పూట ఉపవాసముందురు. మఱియు సంక్రాంతి వంటి కొన్ని పండుగలనాడు తిలపిష్టముతో శరీరము రుద్దుకొని స్నానము చేయుదురు. పూజా విషయములలో నన్ని పూజలును బ్రొద్దుననే చేయుటకు వీలులేదు. శివరాత్రి, ఏకాదశి వంటి పండుగలనాడు రాత్రియంతయు జాగరణము చేసి, యారాత్రి

యంతయు దేవధ్యానము, తద్దేవకథాశ్రవణము చేయవలయును. పూజలలో మనుష్యపూజయు, పితృపూజయు, దేవపూజయునని మూడు విధములైనవి కలవు. ఈ పూజల విషయమై నరసింహ పురాణమిట్లు చెప్పుచున్నది.

శ్లో॥ దైవకృత్యం తు పూర్వాహ్ణే మనుష్యాణాం చ మధ్యమే,
అపరాహ్ణే పితౄణాం చ కార్యా ణ్యేతాని యత్నతః.

అనగా ప్రాతఃకాలమందు దేవపూజయు, మధ్యాహ్నమందు మనుష్యపూజయు, అపరాహ్ణమందు పితృదేవతల పూజయు గావింపవలయును.

వ్రతము లనుష్ఠించుచుండియు బ్రమత్తతచేత దానిని బూర్తి గావింపక పోయిన వాడు మహాపాతక మనుభవించుచుండునని పురాణములు చెప్పుచున్నవి.

శ్లో॥ యో గృహీత్వా వ్రతం మోహాత్ నాచరేత్ కామ మోహితః,
జీవన్ భవతి చండాలో మృతః శ్వానో హి జాయతే.

ఎవ్వాడు వ్రత మారంభముచేసి మోహముచే దాని నాచరింపడో వాడు బ్రతికియుండగనే చండాలుడగును. మఱియు చచ్చిన పిదప కుక్కయై పుట్టును అని పై శ్లోకము యొక్క యర్థము.

ఇవి వ్రతము యొక్క ముఖ్యాంశములు.

ప్రతి పండుగకును కాల నిర్ణయముకూడ కలదు. దీపావళినాడు చీకటిలోనే స్నానము చేసి దీపము వెలిగించవలెను. హోలీ పండుగను రాత్రి పూటనే చేయవలెను. పగలుచేసినట్లైన రాజును, రాజ్యమును నాశనమగుట నిశ్చయమని వ్రాసినారు. విజయదశమిని సాయంకాలమే చేయవలెను. ఈ ప్రకారముగా నాయా పండుగలు చేయు విషయమై కాలనిర్ణయమును వ్రత గ్రంథకారులు నిర్ణయించినారు.

వ్రత స్వరూపమును గుఱించి అగ్ని పురాణమందు 'వ్రత పరిభాష' యను శీర్షికతో విపులముగా వ్రాయబడినది. వ్రత స్వరూపమును గుఱించి యందు పై జూపిన విషయములు వివరింపబడినవి. కాని ప్రతిపదా ద్యమావాస్యా పర్యంతము నుండు పండుగలు మాత్రము సూచింపబడినవే కాని వివరింపబడలేదు. ఈ పురాణము బౌద్ధ జైన మత వ్యాప్త్యనంతరము వ్రాయబడినదని, యీ పురాణ మందలి బుద్ధాద్యవతార ప్రకరణము లోని యంశములే చాటుచున్నవి.

ఇక వ్రతములవలన ఫలములను గుఱించి వ్రతకారుల యభిప్రాయమును విమర్శింతును. ఒక్కొక్క వ్రతమును వర్ణించుచో బౌరాణికు లా వ్రతమున కన్ని వ్రతములకన్న నెక్కుడు ప్రాముఖ్యము నొసగినారు. ఆ వ్రతముతో సమానమగు వ్రతము మరొక్కటి లేదని వర్ణించినారు. "వ్రతనా ముత్తం వ్రతం" అని శ్లాఘించినారు. ప్రతి వ్రతమున కేదో యొక మహాఫలమును వ్రాసినారు. సాధారణముగా నన్ని వ్రతముల ఫలములు దీర్ఘాయువు, ధన ధాన్య సమృద్ధి, సుఖసంపద, సర్వ పాపవిముక్తి కలుగునని వ్రాయబడినది. మఱికొన్ని వ్రతములకు స్వర్గప్రాప్తియై యున్నది. కొన్ని వ్రతముల ఫల మనంతమని వర్ణింపబడినది.

దీని వలన ఇంత మాత్రము మన మూహింపవచ్చును. వ్రతగ్రంథకారులు ప్రతి వ్రతమందును విశ్వాసము, శ్రద్ధాభక్తులు జన సామాన్యమందుత్పత్తి కావలెనని యిట్లు వ్రాసిరే కాని వేరభిప్రాయముతో కానేరదు.

# దీపావళి

ఈ పండుగను నరకచతుర్దశి యని కూడ వ్యవహరింతురు. ఇది ప్రతి సంవత్సరము ఆశ్వయుజ కృష్ణ చతుర్దశీ దినమున చేయబడును.

ఈ పండుగ విషయమై యనేక కథలు చెప్పబడుచున్నవి. అందివి ముఖ్యమైనవి.

1. శ్రీకృష్ణుడు సత్యభామాసహాయుడై నరకాసురుని చంపుట.
2. బలిచక్రవర్తి వామనుని చేత దన యావద్రాజ్యమును గోలుపోవుట.
3. శ్రీరాముడు రావణవధానంతరము రాజ్య పట్టాభిషిక్తు డీ దినమందగుట.
4. నరకము నుండి విముక్తి చెందుటకై యముని గూర్చి ప్రార్థించుట.
5. విక్రమార్క చక్రవర్తి యీ దినమున పట్టాభిషిక్తుడగుట.

పై కారణముల చేత దీపావళి జరుపబడుచున్నదని తెలియుచున్నది.

వీనిలో నేది నిజమో పిమ్మట నిరూపించెదను.

మొదలు పై కథ లేమియో క్లుప్తముగా సూచింతును.

1. **నరకాసుర వధ:** ఈ కథ యాంధ్ర దేశమందంతటను, దక్షిణమునను దీపావళికి ముఖ్యకారణముగా భావింపబడుచున్నది. కావుననే యీ చతుర్దశి 'నరక' చతుర్దశి యని చెప్పబడుచున్నది. నరకాసురవధను గుఱించిన కథ భాగవతమందును, హరివంశమందును చెప్పబడియున్నది. నరకాసురుడు లోకకంటకుడు కాగా శ్రీకృష్ణుడు వాని వధింప బ్రయాణమయ్యెను. సత్యభామయు నాతని వెంబడించెను. శ్రీకృష్ణుడు మొదలు మురరాక్షసుని, వాని పుత్రులను జంపెను. నరకు డిది చూచి కోపోద్దీపితుడై కృష్ణునిపై యుద్ధమునకు వచ్చెను. అప్పుడు సత్యభామ నరకాసురునితో ఘోరయుద్ధము జేసి యలసి పోయెను. శ్రీకృష్ణుడామెకు సహాయమై నరకాసురుని వధించెను.

2. **బలిచక్రవర్తి కథ:** బలిచక్రవర్తి కథ భాగవతమందు విపులముగా వర్ణింపబడినది. బలి యను రాజు దానమందు ప్రఖ్యాతి వహించినవాడు వేడిన యభ్యర్థులకు లేదను వాడు కాడు. అప్పుడు విష్ణువు వామనావతారమెత్తి బలిచక్రవర్తిని మూడుఅడుగుల భూమిని వేడి, రెండు పాదములచే భూమ్యాకాశముల నావరించి, మూడవపాదమునకు తావు లేక దానిని చక్రవర్తి శిరముపై నుంచి యతనిని పాతాళమునకు ద్రొక్కెను. ఆ కారణము చేతనే యీ చతుర్దశీ దినము పుణ్యదినముగా భావింపబడుచున్నదని చెప్పుదురు. వ్రతరాజము మున్నగు వ్రత గ్రంథములందు దీపావళిని గురించి వ్రాయుచోట సత్యభామా కృష్ణుల కథ యొక్క సూచనయే లేదు. వానిలో బలిచక్రవర్తి కథయే యున్నది. ఎట్లన–

శ్లో॥ చతుర్దశీదినే రాజ్యం బలేర స్త్వితి యాచయేత్,
పురా వామనరూపేణ ప్రార్థయిత్వా ధరా మిమాం.
దదా వతిథి రింద్రాయ బలిం పాతాల వాసినం,
కృత్వా దైత్యపతిం దద్యా దహోరాత్రత్రయం హరిః.
తస్మాత్సహోత్సవం చాత్ర సర్వదైవ హి కారయేత్,
మహారాత్రి స్సముత్పన్నా చతుర్దశ్యాం మునీశ్వారాః.
...........................
దీపదానాదికార్యేషు గ్రాహ్యా మధ్యాహ్న కాలికాః,
తతః ప్రదోష సమయే దీపాన్ దద్యా న్న నోరమాన్.

3. **శ్రీరామ పట్టాభిషేకము:** ఇందు విశేములెవ్వియు లేవు. రాముడీ దినమున రాజ్యాభిషిక్తు డయ్యెనట!

4. **నరక విముక్తి:** నరకచతుర్దశి యను పదములోని నరకమునకు యమలోక మని యర్థము. దాని నుండి విముక్తి చెందుటకై ఈ యుత్సవము చేయవలెనని దీని భావము.

వ్రత చూడామణియం దీ సూచనయు నున్నది.

శ్లో॥ యమాయ ధర్మరాజాయ మృత్యవే చాంతకాయచ.

ఇందు యమపూజావిధి చెప్పబడి యున్నది. గుప్తే అనువారు నీయంశమునే ఇట్లు అన్వయించినారు. నరకమనగా ముఱికి యనియు కార్తిక మాసమందే సూర్యుడు

తులారాశి చేరుననియు, దాని వలన రాత్రులు దీర్ఘమగుననియు, నీ నరకమును పరిశుభ్రపఱచుట కిదియే యదననియు, నరకాసురుడు భూదేవీ కుమారుడనుట చేత భూమినుండియే ముఱికి యుత్పన్న మయ్యెనని చెప్పుట కిదియొక కథగా గల్పింపబడె ననియు వ్రాసియున్నారు. ఈ వివరణ యంతయు ఒక యుక్తిగా తోచుచున్నది.

5. **విక్రమార్కుని కథ:** విక్రమార్క శకమును లెక్కించు వారికీ దినము నుండియే సంవత్సరారంభ మగుచున్నదని చెప్పుదురు. విక్రమార్కుడను రాజు క్రీస్తువునకు పూర్వము 55 సంవత్సరముల క్రిందట, అనగా సుమారు 2000 సంవత్సరముల క్రిందట ఉద్భవించి యార్యావర్తమునంతయు నేకచ్ఛత్రాధి పత్యముగ నేలిన మహారాజు. ఈ రాజు మహాసాహసికుడనియు, నిత డనేక మనుష్యాతీతమైన కార్యములను చేసి విరాజిల్లె ననియు ననేక గాథలు వ్రాయబడి యున్నవి. ఈ విక్రమార్కుడు ఉత్తర హిందుస్థానమందే రాజ్యము చేసెను. ఇతని ముఖ్యపట్టణము ఉజ్జయిని. ఇతడు కొంత కాలమునకు దక్షిణదేశపు రాజును, నాంధ్రచక్రవర్తియు నగు శాలివాహనునిచే నోడింపబడెను. ఈ విక్రమార్క శకము దక్షిణములో బ్రచారమందు లేదు. ఉత్తర హిందూ స్థానమం దిది విశేషముగా వాడబడుచున్నది.

**ఆచారము:** మొత్తముపై నీ మహోత్సవము హిందూ దేశమంతటను బ్రచారమం దున్నది.

విశేష సంఖ్యాకులు సత్యాకృష్ణులు లోకకంటకుడగు నరకుని సంహరించిన సందర్భము యొక్క జ్ఞాపకార్థముగా నిది నేటికిని పుణ్యదినముగా భావింపబడుచున్నదని నమ్ముదురు. ఈ దినమొక స్త్రీ బాణప్రయోగము చేసి శత్రునాశన మొనర్పగా నేడు మన యార్యులును బాణములు (పటాకులు) కాల్చి తమకే హాని కలిగించుకొనుచున్నారు. ఈ పటాకులు కాల్చుట వలన విదేశములకు మన ద్రవ్యము పోవుట యొకటి, మనచే జిడ్డు వదలుట రెండు, మన పిల్లలకీ మందులచే నపాయములు సంభవించుట మూడు, మన పూర్వులను మన మీ విధమున నగౌరవపరచుట నాల్గు– ఇవి వీని ఫలితములు. ఈ పండుగనాడు పటాకులు కాల్పవలయునని యే గ్రంథమందును వ్రాయలేదు.

ఏది యెట్లున్నను మన దేశములో ఆశ్వయుజ కృష్ణ చతుర్దశినాడు చీకటిలోనే యందఱును లేచి శిరస్స్నానము చేసి దీపములు వెలిగించి పటాకులు కాల్చి పూజాదికము

లొనర్చుదురు.

ఈ దీపావళి పండుక మార్వాడీలకు చాల ముఖ్యమైనది. ఆ యుత్సవము నాటికి వారు తమ లెక్కల నన్నిటిని పరిష్కరించి క్రొత్త ఖాతా పుస్తకములు తెచ్చి పూజించి బ్రాహ్మణమంత్రములతో నాశీర్వాదములంది స్నేహితులకు విందులొసగి చాల యానందముతో నుందురు. వ్యాపారస్థులచే నీ పండుగ సంవత్సరాదిగా నెంచబడినది.

భవిష్యత్పురాణోత్తర భాగమందు శ్రీకృష్ణుడు ధర్మరాజుతో జెప్పినట్లుగా బలిచక్రవర్తి గౌరవార్థము దీపావళి పండుగ చేయబడుచున్నదని యున్నది. ఆ పురాణమున నీ పండుగను 'దీపాలికోత్సవము' అని పేర్కొని యున్నారు. శ్రీకృష్ణుడిట్లు చెప్పెను– "పూర్వము బలిచక్రవర్తిని దేవుడు వామనరూపియై భూమిని యాచింపనాతడు సర్వలోకమును నాతనికి ధారపోసెను. అప్పుడు కృతజ్ఞుడై దేవుడీ విషయమున బలిని బూజించు నట్లేర్పాటు చేసెను.

శ్లో॥ విష్ణునా వసుధా లబ్ధా ప్రీతేన బలయే పునః,
ఉపకారకరో దత్త శ్చాసురాణాం మహోత్సవః.

ఈ యుత్సవమును 'కౌముది' యని పిలుతురు. కార్తికమాసమును కౌముదీమాసమనియు పిలుతురు. ఈ పండుగ కార్తికమందే వచ్చుటచేత దీనిని కొన్ని పురాణములలో కౌముదీమహోత్సవమని పేర్కొనిరి. ఈ పండుగనాడు సర్వస్థలములందు – దేవాలయ మఠవృక్ష గృహాది స్థలములయం దంతటను– దీపములు పెట్టవలయును. మరియు –

శ్లో॥ కార్తికే కృష్ణపక్షే చ చతుర్దశ్యాం దినోదయే,
అవశ్యమేవ కర్తవ్యం స్నానం నరక భీరుభిః.

కార్తిక బహుళ చతుర్దశినాడు తెల్లవార స్నానము చేయవలెను. నేటికిని కార్తిక కృష్ణపక్ష చతుర్దశినాడే యీ యుత్సవము జరుపబడుచున్నది.

ఈ పండుగ విషయములో 'నరక చతుర్దశి' యనుచో 'నరక' యను పదము వలన నేనక సందేహములు కలుగుచున్నవి. నరకాసురుని కర్థము చేసి యాతని వధకై లోకము నేటికిని సంతసించుచున్నదని కొందరు చెప్పుచున్నారు. ఈ భవిష్యత్పురాణమందలి పై శ్లోకమందు 'నరకభీరుభిః' అనుచో నరకము నుండి

భయపడువారంద ఱానాడు స్నానము చేయవలెనని యున్నది. కావున నరకమును పొందకూడదను నిష్టముతో నీ చతుర్దశినాడు యమపూజను చేసియు బలిపూజను పిమ్మట చేయవలెనని చెప్పు పై పురాణ ప్రమాణము చాల ముఖ్యమైనది. దీని విషయమై ముందు విమర్శింతును.

ఈ పండుగనాడు ధనికులయొక్కయు, దొరలయొక్కయు, రెండు డబ్బుల నే డబ్బునన్నైన సంపాదించిన కుబేరుకుమారుల యొక్కయు నిండ్లకు తెల్లవాఱక మునుపే లేచి యలంకరించుకొని వెళ్లిన భోగపు సానులు నీరాజనము లిచ్చి పూజింతురు. ఈ యాచారమనేక నగరములందున్నది. దీనికిని మన భవిష్యత్పురాణమున నాధారమున్నది. ఈ శ్లోకమును చిత్తగింపుడు.

వైశ్యావిలాసినీ సార్ధం స్వస్తి మంగళకారిణీ,
గృహద్గృహం వ్రజంతీ చ పాదాభ్యంగప్రదాయినీ.

భోగముసానులు మంగళవాద్యాలతో ఇంటింటికి వెళ్ళి పాదపూజ చేయవలెనని దీని తాత్పర్యము.

## విమర్శనము

నరకాసుర వధ కారణమున నీ పండుగ యేర్పడినదని యే ప్రమాణమగు వ్రత గ్రంథమందును లేనందున నీ కథను త్రోసివేయవలయును. మరియు విక్రమార్క ప్రశంసగాని, శ్రీరామపట్టాభిషేక ప్రశంసగాని యీ పండుగను చర్చించిన గ్రంథములందెందును లేనందున అవియు పరిత్యాజ్యములే. ఇక బలిచక్రవర్తి విషయమే గ్రాహ్యమైనట్టిదని భావింపవలయును. ఈ పండుగనాడు,

భ్రామయేత్ స్నానమధ్యే తు నరకస్య క్షయాయ వై.

అనగా నరకక్షయము కొఱకై స్నానము చేయవలయును అనుట చేతను,

నరకాయ ప్రదాతవ్యో దీప స్సంపూజ్య దేవతాః.

అనగా నరకమునకై దీపముల బెట్టి దేవతలను బూజింపవలయును అనుట చేతను,

చతుర్దశ్యాంతు యే దీపాన్ నరకాయ దదంతిచ,
తేషాం పితృగణా స్సర్వే నరకా త్స్వర్గ మాప్నుయుః.

అనగా చతుర్దశీ దివసమున నెవ్వరు యమరాజును (నరక) దీపముల బెట్టి పూజింతురో వారి పితరులు నరకము నుండి విముక్తులై స్వర్గమును బొందుదురు అనుటచేతను, నీ పండుగ నరకాసురుని సంబంధము కాదనియు, నరకవిముక్తికై యముని పూజచేయుట కేర్పడినట్టిదనియు విశదమగును. అయితే–

చతుర్దశీదినే రాజ్యం బలే రస్త్వితి యాచయేత్

అనగా చతుర్దశీ దివసమునాడు మరల బలి రాజ్యము వచ్చుగాక యని పూజింపవలయును అనుదానికి సమన్వయము చేయవలసియున్నది. బలి చక్రవర్తి కథలో బూర్వము వామనుడు బలిని మూడు పాదముల భూమిని వేడి, రెండు పాదములచే భూమ్యాకాశము లావరించి మూడవ పాదము బలి శిరస్సుపై నుంచి యాతనిని బాతాళమున కణగద్రొక్కెనని యున్నది. బాతాళమన నధోలోకము అందు జీకటి యుండును. విష్ణువు మూడుపాదములు గలిగినవాడుగా ఋగ్వేదమందు వర్ణింపబడినాడని లోకమాన్య బాలగంగాధర తిలకుగారు తమ 'వైదిక నిలయ'మను గ్రంథమం దుదాహరించుచు నందిట్లు వ్రాసియున్నారు.

'విష్ణుని త్రిపాదములను గూర్చి ఋగ్వేదమందు పలుతావులలో పేర్కొనబడి యున్నది... సూర్యుని యుదయ, మధ్యందిన, అస్తమయములే యీ మూడు పాదములుగా వర్ణింపబడినవని మాక్సుమూలర్ పండితుడు తలంచుచున్నాడు. ఈ విష్ణుపాదములే పురాణములో వామనమూర్తి యొక్క మూడడుగులుగ వర్ణింపబడియున్నవి. ఇచ్చట విష్ణుడనగ సూర్యుడని పండితులందఱును ఒప్పుకొనియే యున్నారు.... ఈ విష్ణుపాదములలో రెండు మాత్రమే మానవులకు గాన్పించుననియు, మూడవది నరులకు గాని, పశుపక్ష్యాదులకు గాని గాన్పించదనియు ఋగ్వేదము 1-155-5 లో చెప్పి యున్నారు. (అణగా విష్ణువు మూడవ పాదము అధోలోకమందున్నదని దీని యర్థము) ఈ యధోలోకము చీకటి మయముగా నుండి నరుల కదృశ్యముగా నుండును... వేయేల, సూర్యుని వార్షికగమనమే మూడు విష్ణుపాదములుగ వర్ణింపబడినవి. సూర్యుడు దక్షిణము పై నుండి జనులకు గాన్పించు కాలము విష్ణుని రెండు పాదములగును. తదుపరి సూర్యుడు క్షితిజము క్రిందికి గ్రుంకిపోయి దీర్ఘరాత్రిని కల్పించినప్పుడు అదృశ్యమగు విష్ణుని మూడవపాద మేర్పడును."

పై వాక్యము వలన వామనకథలోని రహస్యము కొంత వెల్లడియయ్యెను.

కడపటి వాక్యమందు దీర్ఘరాత్రియన నేదియా గ్రహించిన తక్కిన యంశములు సులభమగును.

ఆర్యులొక కాలమందు, అనగా సుమారు 10 వేల సంవత్సరములకు బూర్వము ఉత్తర ధ్రువమండల ప్రాంతభూములందు నివసించిరని తిలకుగారు 'వేదిక నిలయము' అను గొప్ప గ్రంథమును వ్రాసి నిరూపించినారు. ఆ మండలమందు నాటికిని నేటికిని మన దేశమునకు భిన్నముగా నుండు ప్రకృతివైపరీత్యములు చాల గలవు. అందు మనకిప్పుడవసరమగు నంశమొకటి, అదేదన, నా భూభాగమందు ఆఱునెలలు పగలును, ఆఱు నెలలు చీకటియును నుండును. దీనినే దేవతలకొక దినమని మనవారనేక గ్రంథములందు వర్ణించిరి. ఈ యాఱునెలల పగటిని దీర్ఘదివసమనియు, ఆఱునెలల చీకటిని దీర్ఘరాత్రియనియు తిలకుగారు వర్ణించినారు. ఈ దీర్ఘదివస, దీర్ఘరాత్రులెప్పు డారంభమగునో యీ యంశమును తిలకుగారు తమ గ్రంథమందిట్లు వ్రాసియున్నారు: "ఉత్తరధ్రువము మేరు పర్వతమని మనవారు తెలిపియున్నారు. మఱియు సూర్యసిద్ధాంతము 12వ అధ్యాయము 67 వ శ్లోకములో నీ విధముగా వర్ణింపబడినది. మేరు పర్వతము వద్ద దేవతలకు మేషసంక్రమణము నాటి సూర్యోదయ మొక్కటే సూర్యోదయము. ఆ దినము మొదలుకొని సూర్యుని యొక్క అర్ధావృతము వరకు, అనగా ఆరు నెలల వరకును వారు సూర్యుని చూచుచునేయుందురు... మేరు పర్వతము వద్ద మేష సంక్రమణము నాడు సూర్యోదయమగును. తిరిగి ఆఱునెలల వరకు, అనగా తులా సంక్రమణము వరకు సూర్యుడాకాశముననే వెలుగుచుండును. తులాసంక్రమణముతో అస్తమయమగును. తులాసంక్రమణము మొదలు తిరిగి మేష సంక్రమణము వరకు సూర్యుడడుగునకు గ్రుంకుట వలన ఆఱునెలల వరకు చీకటి వ్యాపించును. దీని భావమేమన, మేషసంక్రమణము మొదలు తులాసంక్రమణము వరకు ఉత్తరాయణము. తుల మొదలు మేషము వరకు దక్షిణాయణము. అందువలననే ఉత్తరాయణకాలము దేవతలకు పగలగుచున్నది అని చెప్పబడియున్నది. కాని భాస్కరాచార్యుల కాలములో ఉత్తరాయణ దక్షిణాయణ సంజ్ఞలను వారు మార్చిరి. కర సంక్రమణము మొదలు కర్కాటక సంక్రమణము వరకు ఉత్తరాయణమని వారు నిర్ణయించిరి."

ఈ పై ప్రమాణము వలన ఉత్తర ధ్రువమండల వాసులుగా నుండి నప్పుడు మన పూర్వులగు నార్యులకు తులాసంక్రమణమునాడు దీర్ఘరాత్రి ప్రారంభమగు చుండెనని తెలియును. నాటి నుండి తిరిగి యాఱు నెలల వరకు వారు చీకటిలోనే

కాలము గడుపవలసి వచ్చెను. కావున నా చీకటి ప్రవేశించినతోడనే వారు దీపోత్సవమును జేసి, 'బలి' యను శత్రువును పాతాళమునకు తన మూడవ పాదముచే నడగద్రొక్కి యచ్చుటనే తాను బహుకాల ముందువాడగుటచే సూర్యుడు మరల తమ కగుపడగా యని ప్రార్థించుటకై యేర్పాటు చేసిన పండుగ యీ దీపావళి యని తోచుచున్నది. తులాసంక్రమణమునాడే దీపావళి యనుటకు బ్రమాణముగా ధర్మసింధు విట్లు వ్రాయుచున్నది:

తులా సంస్థే సహస్రాంశౌ ప్రదోషే భూతదర్శయోః,
ఉల్కాహస్తా నరాః కుర్యుః పితౄణాం మార్గదర్శనమ్.

సూర్యుడు దీపావళినాడు తులారాశిని పొందుచున్నాడనియు, నాడు లోకులు దివిటీలతో తమ పితృదేవతలకు మార్గదర్శనము జేయవలయుననియు దీని యర్థము. తిలకుగారు తులాసంక్రమణము నుండి దీర్ఘరాత్రి ప్రారంభమగు చున్నదని వ్రాసిన ప్రమాణ మిదివఱకే విపులముగా నుదాహరించి నాడను గావున పై ధర్మసింధు ప్రమాణము దాని కనుకూలముగా నుండుటచే దీపావళీ దినము ఉత్తరధ్రువ వాసులకు దీర్ఘరాత్రి ప్రారంభదినముగా నుండెనని నిశ్చయమయ్యెను. అందుచేతనే యే పండుగకు లేనట్టి 'దీపావళి'నీ యుత్సవమందు వెలిగించు నాచారమై యున్నది. చీకటి యెడతెగక ప్రారంభ ముగుటచేత నా కష్టకాలము త్వరగా బోవుటకు బ్రార్థించుటకై యేర్పడినది. అంతియుకాక పై ధర్మసింధువు శ్లోకమందానాడు దివిటీల (దీపములు) చే బితృ దేవతలకు మార్గము చూపించవలెను అనుదాని కర్థమేమో విచారించిన తక్కిన దంతయు విశదమగును. ఈ పండుగనాడు

యమాయ ధర్మరాజాయ మృత్యవే చాంతకాయచ.

అని యమధర్మరాజును బూజింపవలెననియు, పితృదేవతలు నరకము నుండి స్వర్గమును పొందుటకై యముని బ్రార్థించవలెననియు నిదివరకే ప్రమాణములు వ్రాసితిని. దీని యర్థమేమన, నీ దీర్ఘరాత్రి కాలమందు (నీ యాఱు నెలల కాలమందు) చనిపోయిన వారికి కర్మాదులు చేయక దీర్ఘదివసము వచ్చిన తర్వాత–ననగా నాఱు నెలల తర్వాత–వారికి కర్మాదులు చేయుచుండిరని నిరూపించినారు. ఈ క్రింది వాక్యములను వారి గ్రంథము నుండి యుదాహరించుచున్నాను. 'ఎవరైనను దక్షిణాయణము, అనగా పితృయానకాలములో చనిపోవుట అశుభసూచకమని మన హిందువు లెన్నుదురు గదా! మహాభారత యుద్ధ వీరుడైన భీష్ముల వారు దక్షిణాయనకాల

మంతమొంది ఉత్తరాయణ పుణ్యకాలము వచ్చు వరకును ప్రాణములను విడువక అంపశయ్యమీద నిరీక్షించుచుండెననియు మనకందరకును తెలిసిన విషయమే.”

ఇచ్చట నొక విషయము గమనింపవలెను. ఇది వరకు తిలకుగారు నిరూపించినట్లు మన దేశములో నుత్తరాయణము మకర సంక్రాంతి నాడువచ్చును. కాని యుత్తరధ్రువమందు తులాసంక్రాంతినాడు వచ్చును. తులాసంక్రాంతినాడే దీపావళియనుట నిరూపించినాము. కావున దీపావళినాడు ధ్రువమండలమందు దక్షిణాయనము ప్రారంభమగును. దక్షిణాయనమందు చీకటి యుండుటచే చీకటిలో (రాత్రికాలమందు) శ్రాద్ధకర్మాదులు చేయరు. కావున నీ దక్షిణాయనములో చనిపోవువారికి నుత్తరాయణము వచ్చిన తర్వాత శ్రాద్ధకర్మములను మన పూర్వులుత్తర ధ్రువమందుండినప్పుడు చేయుచుండిరని తిలకుగారు వ్రాసినారు. ఈ క్రింది వాక్యములను చిత్తగింపుడు: “చీకటి కాలములో (పితృయాన కాలములో) చనిపోయిన యెడల తిరిగి దేవయానము, అనగా వెలుతురు వచ్చు వరకు అపరకర్మలను జేయుటకు వీలుండదు. అంతకాల మీ కర్మలను చేయకుండ నిలిపియుంచుటయే చనిపోయినవాని ఆత్మకు అశుభదాయకము. ఎప్పటి మాటలో యేల, ఈ కాలములో సైతము ఎవరైన రాత్రి కాలములో చనిపోయిన యెడల సూర్యోదయము కాలము వరకు నాపియుంచుదుము కదా! ఇట్టి సందర్భములో పితృయాన కాలములో చనిపోవుట యశుభసూచకమని మనపూర్వులు తలంచుటలో నేమియును వింతలేదు.”

ఇప్పుడు మనము దీపావళినాడు దీపము లెందుకు పెట్టుదుమో, యమ పూజ నెందులకు జేయుదుమో, బితృలకు సద్గతి నెందుకీ పండుగ నాడే కోరుదుమో మున్నగు నంశములు విశదమగును. ఈ యాఱు నెలల చీకటి దీపావళినాడు ప్రారంభమై యాఱునెలలవఱ కుండుటచే నంతవఱకు చచ్చినవారు (పితృ దేవతులు) అపరకర్మ హీనులై యుత్తమ లోకములకు దప్పినవారై నరకమందే నివసించుచుండిరని మనవారు విశ్వసించిరి. నేటికిని నెవరైన తమ పితరులకు శ్రాద్ధకర్మలు చేయకుండిన పితరలకు సద్గతి లేదనియు, నరకమునందే వారు కష్టింతురనియు జనులు చెప్పుచుందురు. శాస్త్రములును నట్లే చెప్పుచున్నవి.

ఇట్లు పితృదేవత లీ యాఱునెలల నరకమందుందురు గాన వారికి నరకబాధ యుండునట్లుగా యముని పూజించుటయు, దివిటీలతో నా చీకటిలో బితరులకు స్వర్గము చూపించుటయు నీ పండుగ వలన గలుగునని మన పూర్వులూహించి యీ యుత్సవము నేర్పాటు చేసిరి.

ఇంతియు కాక మన దేశమందింకొక యాచారమున్నది. దీపావళి నుండి మొదలుకొని కార్తికమాసాంతము వఱకు గూడ దీపోత్సవములు పెట్టుదురు.

ఆకాశదీపములని కొందరు మేడలపై దీపములు పెట్టుటయు, మఱికొందఱెత్తైన గుట్టల మీద దీపముల వెలిగించుటయు గలదు. ఇదియు నా దీర్ఘరాత్రిలో పితరులకు మార్గదర్శకముగా నుండుటకై పెట్టుదురని భావించవలయును.

ఇట్లాలోచించి చూచిన నా కీ పండుగ యుత్తర ధ్రువ నివాసుల దక్షిణాయన ప్రారంభపు పండుగగా గానవచ్చుచున్నది. కాని నరకాసుర కథకుగాని, శ్రీరాముల జయమునకు గాని, విక్రమార్కునికి గాని ఈ పండుగ యే మాత్రమును సంబంధించదని నా యభిప్రాయము. విజయదశమి యను పదములో 'విజయ' అనుట కర్థము అర్జునుడని నిర్ణయించి, యర్జునుని యుత్తర గోగ్రహణ యుద్ధమునకు సంబంధించిన పండుగయని తప్పుదర్థం చేసినటుల నరకచతుర్దశి యను పదమునకు నరకము నుండి పితృదేవతలకు విముక్తి గలిగించుటకై చేయబడిన పండుగ యని యర్థము చేయుటకు మారుగా 'నరక' యను పదమును నరకాసురుని కర్థముజేసి, వాని వధను శ్రీకృష్ణుని కంటగట్టి, యా సందర్భమున నీ పండుగను జేయుచున్నారని వ్యాఖ్యానము చేసినారు.

కావున పై విమర్శ సారాంశ మేమన, నీ నరకచతుర్దశి దీర్ఘరాత్రి కాలమందు జచ్చిన పితృలకు నరకవిముక్తి చేయు పర్వదివసమని బలి, యమ, వామన, దీప, నరక, పాతాళ యను పదములు సాక్ష్యమిచ్చుచున్నవి.

దీర్ఘరాత్రులను మన సాధారణ రాత్రులకన్న నొకటి రెండు గడియలు హెచ్చుగా నుండుటయని భావింప జనదు.

మహారాత్రి స్సముత్పాన్నా చతుర్దశ్యాం మునీశ్వరాః.

అనగా నీ చతుర్దశినాడు మహారాత్రి యుద్భవించెను. ఈ మహారాత్రి పదమేక వచనముగా వాడినారు. మఱియు మహారాత్రియనుట మన దీర్ఘరాత్రి కర్థమన్వ యించుచున్నది. ఉత్తరధ్రువ పరిస్థితులు పురాణకారులకు దెలియనందున వారు మహారాత్రియను వాడినను దాని యాథార్థ్యమును గమనింపపోయిరి. వామనుడు బలిని పాతాళమునకు త్రొక్కెనని వర్ణించుచో బలి రాక్షసులకు రాజని చెప్పబడెను. రాక్షసులు రాత్రించరులని ప్రసిద్ధి నొందినవారు. మఱియు బలి నివాస మిప్పుడు పాతాళమని చెప్పుదురు. పాతాళము చీకటితో నిండినట్టిది. ఈ యంశము వలన బోధయగుట యేమన, సూర్యుడు (విష్ణువు) బలిని పాతాళము వఱకు ద్రొక్కుచు వెంబడించె ననుటచే జీకటిలో నిలిచి ప్రపంచమునకు జీకటి గలిగించెనని యర్థము కలుగుచున్నది. కావున బలిపూజ జేయుచు

చతుర్దశ్యాం దినే రాజ్యం బలేర స్త్వితి యాచయేత్.

అని వ్రాసియున్నారు. అనగా మరల బలి రాజ్యము కలుగుగాక! లేక మరల సూర్యుడు బలిని విడిచి మా కగపడుగాక యని దీని రహస్యము.

# విజయదశమి

ఈ పండగ హిందువుల పండుగలలో జాల ముఖ్యమైనది. ఈ యుత్సవమును దసరాయనియు వ్యవహరింతురు. ఇది ఆశ్వయుజ శుక్ల దశమీ దినమున జరుపబడును. విజయదశమి యనుట నేక కారణములు, అనేరక రీతులు సూచింపబడుచున్నవి.

ఆశ్వినస్య సితే పక్షే దశమ్యాం తారకోదయే,
సకాలో విజయోనాయ సర్వకామార్థ సాధకః.

అనగా ఆశ్వయుజ శుక్లపక్ష దశమీదినము సాయంకాలము (సంధ్యాకాలము) విజయకాల మనబడును. ఆ కాలము సర్వకామసాధకమై యున్నది. ఈ దశమీ దినము శ్రవణా నక్షత్రయుక్తముగా నుండవలెనని జ్యోతిష్కులు నిర్ణయించినారు. ఈ దినమందు ప్రతి గ్రామమందును హిందువులు శమీవృక్షమును మంగళ వాద్యములతో పూజింతురు. శమీపూజ (జమ్మిచెట్టు పూజ) యీ క్రింది మంత్రములతో జేయబడును:

శమీ శమయతే పాపం శమీ శత్రువినాశినీ,
అర్జునస్య దనుర్ధారీ రామస్య ప్రియవాదినీ.
శమీ శమయతే పాపం శమీ లోహితకంటకా,
ధారి ణ్యర్జునబాణానాం రామస్య ప్రియవాదినీ.
కరిష్యమాణ యాత్రాయాం యథాకాలం సుఖం మయా,
తత్ర నిర్విఘ్న కర్త్రీత్వం భవ శ్రీరామపూజితే.

అనగా – శమీవృక్షము పాపమును శమింపజేయుచున్నది. ఇది శత్రువుల నాశనమును చేయును. ఇది అర్జునుని ధనువును ధరించి యుండెను. శ్రీరామునికి ప్రియమొనరించెను. ఇది యాత్రజేయువారికి సౌఖ్యము నిచ్చును. కార్యములను నిర్విఘ్నముగా సాగించును.

ఇచ్చుట 'యాత్ర' అను పదమును కొంత వివరించవలసియున్నది. ఈ పండుగ ప్రధానముగా రాజులకు సంబంధించినట్టిది. పూర్వకాలములో వర్షాకాలము

యుద్ధములకు ప్రతికూలమగు సమయమై యుండెను. ఎందుకనగా, వర్షము విశేషముగా వచ్చుట చేత యుద్ధ శిబిరములకును, అందలి భటులకును చాల ఇబ్బంది కలిగెడిది. మరియు ప్రయాణమునకు ప్రతి బంధకములగుచుండెను. ఇంతేకాక వాగులు, వంకలు, నదులు అన్నియు పరిపూర్ణమై యుండుటచే యుద్ధ సామాగ్రితో నుండు బండ్లతోను, తోపుల తోను వాటిని దాటుట దుస్తరముగా నుండెను. అందుచేత రాజులు వర్షాకాలపు చాతుర్మాస్యములో యుద్ధములు మాని వర్షాకాలము ముగిసి నదులు తీసిన తర్వాత యుద్ధ 'యాత్ర'కు బయలుదేరుచుండిరి. ఈ యాత్రకు 'దండయాత్ర' యని ప్రసిద్ధనామము కలదు. కావున యాత్రాశబ్దమును ప్రధానముగా దండయాత్రార్థమున గ్రహించవలెను. ఏలన, ధర్మశాస్త్రములందును రాజుల సంబంధమున యాత్రాశబ్దము సర్వత్ర శత్రుదేశములపై వెడలు దండయాత్రకే యుపయోగింపబడినది. ఎట్లన, మనుస్మృతిలో శత్రువులపై ఎప్పుడు దాడి వెడలవలయునో నిర్ణయించుచు ఇట్లు చెప్పబడియున్నది.

మార్గశీర్షే శుభే మాసి యాయాద్ యాత్రా మహీపతిః.

ఇచ్చట మార్గశీర్ష మాసము ఉత్తమ యాత్రా కాలముగా నిర్ణయించినారు. ఇతరత్ర ఆశ్వయుజమాసమే నిర్ణీతమైనట్లు ముందు చర్చించుచున్నాను.

విజయదశమీ దినమున పూజలు జరుగును. సాయంకాలమందు శమీ పూజకై పోవునపుడు సీమోల్లంఘనము చేయవలయును. అనగా ప్రతి గ్రామజనులును తమ గ్రామపు బొలిమేర వఱకు పోయి రావలయును. ఈ సీమోల్లంఘనమునే నిజాం రాష్ట్రపు హిందువులు అపభ్రంశము చేసి 'సిలంగన్' అని నేటికిని వ్యవహరించు చున్నారు.

ఈ దసరా యొక్క ప్రారంభ మెట్లయ్యెనో అనేకు లనేక విధముల జెప్పుచున్నారు. కొందఱిది శ్రీరాముని విజయము నుండి ప్రారంభమయ్యె ననియు, గొందఱు విజయుని (అర్జునుని) విజయము నుండి యేర్పడెననియు వచింతురు.

శమీ పూజయందు అర్జునుని పేరును, శ్రీరాముని పేరును నుదాహరింపబడుటచే నీ యిద్దఱు మహాపురుషులతో నీ యుత్సవము సంబంధించినదని యెంచి యీ గాథ లేర్పడియుండును.

**శ్రీరాముల సంబంధమిటుల చెప్పబడుచున్నది:-** రావణునితో యుద్ధము చేయుతఱి రావణుని తలలు తునిమిన కొలది మఱల నుత్పత్తి యగుటను చూచి

శ్రీరాములు భీతి చెంది నిద్రించియుండిన దేవిని (శక్తిని) పూజించెను. దేవియు మేల్కొనెను. మేల్కొనిన సమయము ఆశ్వయుజ శుద్ధప్రథమ. ఆనాడు దేవి శ్రీరాముల పూజకు సంతసించి వారికి విజయము కలుగునట్లు చేసెను. నాటి నుండి పదియవ దినమందు శ్రీరాములు సంపూర్ణ విజయమంది పుష్పక విమానమెక్కి యయోధ్యాభిముఖుడయ్యెను. అయోధ్యకు బోవుటకు బూర్వము శ్రీరాములు శమీ పూజ చేసెను. ఆ కారణముచే నీ పదిదినము లుత్సవము జరిపి, పదియవ దినమున లోకులందఱును శమీ పూజ చేయుచున్నారు.

**భారత పరముగా నిట్లు చెప్పుదురు**:– పాండవు లజ్ఞాత వాసము చేయుటకు బూనుకొనినప్పుడు తమ యాయుధముల నొక జమ్మిచెట్టుపై దాచి యచ్చటి నుండి మారువేషములతో విరాటనగరము జొచ్చిరి. మరల నుత్తర గోగ్రహణ కాలమందు తమ సమయము పూర్తికాగా ఉత్తరసహాయముచే శమీ వృక్షమును పూజించి యర్జునుడు తన ధనస్సును దీసికొని శత్రువులపై విజయము పొందెను. ఈ కారణముచే శమీ పూజ చేయుచున్నారు.

**చారిత్రకముగా నాచార మిట్లున్నది**:– పై పురాణగాథానుకూలముగా తర్వాతి రాజులు సహితము ప్రతి సంవత్సరమును దమ శత్రువులపై జయము పొందగోరి యీ యాశ్వయుజమాసారంభమునుండి తొమ్మిది దినములు దేవీ పూజలు సలిపి పదవ దినము తమ సిబ్బంది గుఱ్ఱములు, ఏనుగులు, ఆయుధములు మున్నగు వానితో నూరేగింపు చేసి శమీ వృక్షపూజ చేయదొడగిరి. నేటికిని హిందూ రాజులు తమ తమ రాజ్యములలో దేవీ పూజలతోబాటుగా నొకదినము ఆయుధపూజను సలిపి కడపటి దిన మూరేగింపు, తర్వాత దర్బారు చేయుదురు.

ఈ పండుగ క్షత్రియుల సంబంధమగు పండుగ యనుటకు–

తస్మిన్ నరై ర్విధాతవ్యా యాత్రా విజయకాంక్షిభిః.

అను దానిచే దీనిని రాజులు శత్రువులపై జయమును పొందగోరి జేయుచుండిరని తెలియవచ్చెడి. రామాయణ భారత వీరు లందఱకును నాదర్శపురుషులు కావున, నా వీరు లీ మాసమందే యుద్ధసన్నద్ధులైనందున రాజులందఱును నిదియే జైత్రయాత్రకు దగిన కాలమని నిర్ణయించరి.

శమీ వృక్ష పూజయందు–

అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ

అని యుండుటచే లోకమందు పై నుదాహరించిన రీతిగా రాముని పరముగను, నర్జును పరముగను నెవ్వరికి ప్రియమగునట్లువారు చెప్పదొడగినారు. కాని ముఖ్యముగ రామాయణమునకే యీ పండుగ సంబంధించినదని నా యభిప్రాయము. ఎట్లన, రామాయణమందు శ్రీరాముడు శరదృతువు ప్రారంభమగుటతో విరహార్తుడై, నానావిధముల బరితపించి, యా ఋతువు రాజులకు జైత్రయాత్రకు జాలా యనుకూలమైనదని లక్ష్మణునితో ఇట్లు తెలిపెను:

సూర్యాతపక్రామణ నష్ట పంకా
భూమి స్సముత్పాదిత సాంద్రరేణుః
అన్యోన్య వైరా మర్షాయుతానా
ముద్యోగకాలోద్య నరాధిపానామ్.
అన్యోన్య బద్ధ వైరాణాం జిగీఘణాం నృపాత్మజ,
ఉద్యోగసమయ స్సౌమ్యః పార్థివావా ముపస్థితః,
ఇయం సా ప్రథమా యాత్రా పార్థివానాం నృపాత్మజ.

మఱియు హనుమంతుడు సుగ్రీవునితో నీ శరదృతువు యొక్క యారంభమందు రాజులు శత్రువులపై దండెత్తుదురని యీ క్రింది విధముగ నివేదించెను:

ప్రాప్త ముద్యోగ కాలం తు నావైషి హరిపుంగవ.

అనంతరము సుగ్రీవుడు వానర సైన్యమును పది దినములలో కూడుట కాజ్ఞ యీ శ్లోకమం దీయబడినది:

అహోభి ర్దశభి ర్యేహి నాగచ్ఛంతి మమాజ్ఞయా,
హంతవ్యాస్తే దురాత్మనో రాజశాసన దూషకాః.

అనగా వానరసైన్యమంతయు పది దినములలో సర్వదిక్కులనుండి తననగరము చేర రావలసినదనియు, దడసిన వారిని శిరశ్ఛేదము చేయుదుననియు నీ విధముగా నాజ్ఞ ప్రకటించెను. శరదృతువు ఆశ్వయుజ మాసారంభముననే ప్రారంభమగును. వానరసైన్యము లన్నియు నాశ్వయుజ దశమినాడు సుగ్రీవుని పట్టణమందు సమకూడెను. ఇది రామాయణ సంబంధము.

ఇట్లు రామాయణ పరముగా బ్రమాణము లున్నను, హిందువులందఱును

భారతపరముగనే, యందును నర్జునుని పరముగనే యీ పండుగ నన్వయించుచున్నారు. ఇందుకు గారణమేమన, విజయదశమి యనుదానిలో విజయమను పదమునకు జయ మను నర్థమేకాక అర్జునుడుగను నర్థము గూడ గలదు. కావున నీ పండుగ అర్జునుడు తన పేడిరూపమును వదలి నిజరూపము దాల్చిన దినమనియు, పాండవులు శమీపూజ జేసి తమ యాయుధములు తీసికొనిపోయిన దినమనియు, అర్జునుడు ఉత్తరగోగ్రహణము చేసిన దీదివసమే యనియు బలువురు పలు విధముల జెప్పెదరు. ఇందెవ్వి యథార్థములో, మఱెవ్వి అయథార్థములో విచారింతము.

ఉత్తర గోగ్రహణ మీశుద్ధ దశమినా డనుటకు భారతమందు బ్రమాణ ముండుటకు మారుగా దానికి విరుద్ధమగు బ్రమాణమున్నది. తెనుగు భారతమున నుత్తర గోగ్రహణమును గుఱించి యిట్లున్నది. సుశర్మతో దుర్యోధను డిట్లు పలుకుచున్నాడు:

క॥ బహుళాష్టమి నీతడు స
న్నహనముతో పసులబట్టు, నవమిని మన గో
గ్రహణమని నిశ్చయించిన
నహికేతను పలుకులకు మహాహ్లాదమునన్.
దీనినే సంస్కృతమునం దిట్లు వ్రాసియున్నారు:
ఆదాతుం గాః సుశర్మో ఽథ కృష్ణ పక్షస్య సప్తమీం
అపరే దివసే సర్వే రాజన్ సంభూయ కౌరవాః
అష్టమ్యాం తేప్యగృహ్ణంత గోకులాని సహస్రశః

తెనుగు భారతమందు బహుళాష్టమీ నవమీ తిథులు దక్షిణోత్తర గోగ్రహణములకై నిర్ణయింపబడెనని యుండ సంస్కృత మూలమున బహుళ సప్తమ్యష్టమీ తిథులు నిర్ణయింపబడెను. ఏది యెట్లున్నను నీ తిథులే మాసమందు వచ్చినవైనను శుక్లపక్షమందు గాక బహుళపక్షమందు వచ్చుటచే విజయదశమి యుత్తరగోగ్రహణ సంబంధమైనది కాదని నిశ్చయమైనది.

ఇక శమీ పూజ యీ దినము చేసినట్లు భారతమందు ఏ నిదర్శనములును లేవు. శమీ పూజచేసి పాండవులు తమ యాయుధములను దీసికొనిన యనంతరమే యభిమన్యుని పెండ్లి యయ్యెను. ఈ యభిమన్యుని పెండ్లి యెప్పుడైనది నిర్ణయించిన శమీ పూజాదివసము కూడ నిర్ణయమగును. భారతయుద్ధమెప్పుడు జరిగినది

నిర్ణయించిన అభిమన్యుని పెండ్లి నిర్ణయమగును. కావున ముందు భారత యుద్ధ ప్రారంభ దినమును నిర్ణయించెదము.

శ్రీకృష్ణుని రాయబార ముద్యోగపర్వమందు జరుగును. అతడు రాయబారిగా బోవునప్పుడిట్లు వర్ణింపబడినది:

తతో వ్యపేతతమసి సూర్యే విమలవద్గతే
మైత్రే ముహూర్తే సంప్రాప్తే మృద్వర్చిషి దివాకరే
కౌముదేమాసి రేవత్యాం శరదంతే హిమాగమే
స్ఫీతసస్య శుభే కాలే కల్వః సత్యవతాం వరః.

అనగా, శ్రీకృష్ణుడు సూర్యోదయమయిన వెంటనే మైత్రీ ముహూర్తమందును, కార్తికమాసమందును, శరత్కాలాంతమందును. హేమంతుర్తు ప్రారంభమందును రాయబారియై బయలుదేరెను. ఈ శ్లోకమున నీలకంఠ వ్యాఖ్యానమందు 'కౌముదేమాసి' అనగా కార్తిక మాసము అని యర్థము వ్రాయబడినది. అంతియ కాక శరదంతమును, హిమాగమమును కార్తికమాసాంతమందే వచ్చును. ఈ పై ప్రమాణముకు ప్రోద్బలముగా శ్రీకృష్ణుడు తాను తిరిగి పాండవుల దగ్గఱకు వచ్చుచు కర్ణునితో చెప్పిన వాక్యములందు గాననగును. శ్రీకృష్ణుడు కర్ణునితో నిట్లనెను:

బ్రూయ త్కర్ణ గత్వా ద్రోణం శాంతనవం కృపం
సౌమ్యోయం వర్తతే మాసః సుప్రాప యవసేంధవః
సర్వోషధి వనస్ఫీతః ఫలవా నల్పమక్షికః
నిష్పంకో రసవత్తోయో నాత్యుష్ణ శిశిర స్సుఖః
సప్తమాచ్చాపి దివసా దమావాస్యా భవిష్యతి
సంగ్రామో యుజ్యతాం తస్యాం తామాహు శ్శక్రదేవతామ్.

అనగా, 'ఓ కర్ణ, నీవు పోయి భీష్మ ద్రోణకృపాచార్యుల సన్నిధిలో నిట్లనుము. ఈ మాసము సౌమ్యమయి పొట్టు, కట్టెలు సులభముగా దొఱకు కాలమై, నానాఫలౌషధి సంయుతమై, ఈగలు లేనిదై, సమశీతోష్ణస్థితి కలదై, బురదలేనిదై యున్నది. కావున నింక ఏడు దినములకు అమావాస్య వచ్చును. నాడెల్లభంగుల భండనము గాగలదు.'

ఇట్లు చెప్పుటచే నమావాస్యనాడు యుద్ధము ప్రారంభమయ్యెనని విశదమగును. శ్రీకృష్ణుడు కార్తికమాసాంతములో రాయబారిగా బోయి యుండెనని పైన

జూపియుంటిమి. మఱి యిప్పటి శ్లోకమువలన శ్రీకృష్ణుడు కార్తిక బహుళ షష్ఠినాడు పాండవుల పక్షమున రాయబారిగా కౌరవుల దగ్గఱకు బోయి, బహుళాష్టమినాడు తిరిగి వచ్చెనని యర్థమగుచున్నది. ఏలన, షష్ఠినాడు బయలుదేరి రాత్రి కుశస్థలములో నిద్రించి, సప్తమినాడు కరినగరము చేరి, యారాత్రి విదురునింట నిద్రించి అష్టమినాడు ప్రొద్దున రాయబారము జరిపి విఫలీకృతుడై తిరిగి పాండవుల పాలికి బోవుచు కర్ణునితో పై విధమున జెప్పినట్లు భారతమందు వర్ణింపబడినది. కావున కృష్ణుడు బహుళాష్టమినాడు తిరిగివచ్చుటయు, కార్తికామావాస్యనాడు యుద్ధము ప్రారంభమగుటయు నిశ్చయమయ్యెను. కార్తికామావాస్యనాటి వర్ణనయు గమనింపదగినది. హేమంతారంభమందే నిష్పంకము, నిర్మక్షికము, నాత్యుష్ణము, నాతిశీతలము, ఫలసమృద్ధి మున్నగునవి కాననగును. భారతయుద్ధము కార్తికామావాస్య నాడే యను విషయము నితరాధారముల చేతను నిర్ణయింపవచ్చును. శాంతిపర్వమందు భీష్ముని సందర్శించినప్పుడు శ్రీకృష్ణుడాతనితో నిట్లనెను:

పంచాశతం షట్చ కురుప్రవీర శేషం దినానాం తజీవితస్య,
తతశ్శుభైః కర్మ ఫలోదయై స్త్వం సమేష్యసే భీష్మ విముచ్యదేహమ్.

ఈ శ్లోక మనేక శంకలకు మూలమైనట్లున్నది. కావున గ్రంథ విస్తరమైనను నిచ్చట చర్చించుట యవశ్యకర్తవ్యమై యున్నది.

ఈ శ్లోకమునకు సాధారణముగా నందఱకును గోచరించు నర్థమునే తిక్కన సోమయాజిగా రర్థము చేసికొని యీ క్రింది విధముగా వ్రాసినారు:

తే॥ అనఘ యిను డింక యేబదియారు దివస
ములకు దా నుత్తరాయణమున జరింప
దొడగు నీ వప్డు దేహంబు విడిచి యేగు
దపునరావృత్తిపదమున కభిమతముగ –శాంతి. 2ఆ. 115ప.

శాంతి పర్వాదియందు పాండవులు యుద్ధము ముగించిన యనంతరము నిఖిలజ్ఞాతులకు సంస్కారము గావించి "గంగాతీరంబున నశుచిత్వం బపనయించుటకై యచ్చట మాసమాత్రంబు నిలిచిరి" అని యున్నది. సంస్కృత మూలమందు నిదేవిధముగా నున్నది. ఈ నెల దినముల యనంతరము శ్రీకృష్ణుడు యుధిష్ఠిర సహితుడై భీష్ముని పాలి కరిగి యాయనతో నింక 56 దివసముల కుత్తరాయణము వచ్చుననియు, నప్పుడాతడు ప్రాణములు వదల వచ్చుననియు చెప్పెను. అనగా

యుద్ధానంతరము 86 దినములకు భీష్ముడు చచ్చుట యని నిశ్చయమయ్యెను. భీష్ముడు మాఘ శుక్లాష్టమినాడు చచ్చెనని నిరూపింతురు. ప్రకృతము ఆ తిథిని సిద్ధాంతులు గుర్తించి దాని నుండి 86 దివసములు తీసివేసి కార్తిక శుద్ధ ఏకాదశినాడు భీష్ముడు యుద్ధభూమిపై నంపశయ్యపై బడెనని నిర్ణయించిరి. ఈ లెక్క ప్రకారము అట్లే చేయవలసివచ్చును. కావున వ్రత గ్రంథములలో నిట్లు వ్రాసియున్నారు:

కార్తికస్య సితే పక్షే స్నాత్వా సమ్య గ్యతవ్రతః
ఏకాదశ్యాంతు గృహ్ణీయాత్ వ్రతం పంచదినాత్మకం
ఏకాదశ్యాం కార్తికస్య యాచితం చ జలం త్వయా
అర్జునేన సమానీతం గాంగం బాణస్య వేగతః
తుష్టాని తవ గాత్రాణి తస్మా దద్య దినావధి
పూర్ణిమాంతం సర్వలోకా స్తర్పయం త్వర్ఘ్యదానతః.

అనగా కార్తిక శుద్ధైకాదశినాడు భీష్మ దంపశయ్యపై బడి దప్పిగొని, నీరడుగ, అర్జునుడు బాణముచే భూమిని గొట్టి, జలధార నుబికించి భీష్ముని తృప్తుజేసెను. ఈ పై కార్తికైకాదశి సరియైనదో కాదో విచారింతుము. భీష్ముడు చనిపోవునాడిట్లనుచున్నాడు:

దిష్ట్యాప్రాప్తోసి కౌంతేయ సహామాత్యో యుధిష్ఠిర
పరివృత్తోహి భగవాన్ సహస్రాంశు ర్దివాకరః
అష్ట పంచాశతం రాత్ర్య శ్శయానస్యాద్య మే గతాః
శరేషు నిశితాగ్రేషు యథా వర్షశతం తథా
మాఘోయం సమనుప్రాప్తో మాస స్సౌమ్యో యుధిష్ఠిర
త్రిభాగశేషః పక్షోయం శుక్లో భవితు మర్హతి.

అనగా నేను శరపంజరముపై బడి 58 దినములయ్యెను. ఈ 58 దినముల కష్టము నాకు నూరేండ్లుగా గనబడినది. నేడు మాఘ శుక్లాష్టమి కాన నిది నాకు మృతించుట కుత్తమదినము.

అనగా మాఘ శు॥ 8 నుండి 58 దినములు తీసివేసిన మార్గశిర శు॥ 11 వచ్చును. ఆనాడు భీష్ముడు శరపంజరసుప్తుడయ్యెను. ఇదియే సరియయిన ముందు జూపిన 86 దివసముల లెక్క యెట్లు కుదురును? కావుననే యీ మతభేదములను సమన్వయించుటకై నీలకంఠ వ్యాఖ్యానముపై

శ్లో॥ పంచాశతం షట్చ... ... ...

అను శ్లోకమును తిక్కన "అనఘ యినుడింక యేబదియారు దివసములకు దానుత్తరాయణమున జరింప" అను నర్థము చేసినట్లు చేయక వేరు విధముగా నర్థము చేసి సమన్వయము చేసినది, ఎట్లన,

'పంచాశతం షట్చేతి తవ జీవిత సంబంధినాం దినానాం శేషం పంచషట్చ పంచవార మావర్తితాః షడితిరీత్యా త్రింశతి జ్ఞేయం తావ దేవ ఆశత శతావధి యద్దినానాం శతేన కర్తుం శక్యం తత్త్రింశతాం కర్తుం శక్యమిత్యర్థః తత్ర త్రింశతా పరిశిష్టాః అష్టావింశతిః ఇతః పూర్వం వ్యతీతాఃతథాహి భీష్మస్య శరతల్పశయనా నంతర అష్టౌ దినాని యుద్ధం తతో దుర్యోధనాశౌచం యయుత్స్లోః షోడశ దినాని తేన సహపురం ప్రవిశతాం పాండవానామపి తావంతి దినాని గతాని పంచవింశే సర్వేషాం శ్రాద్ధదానం షడ్వింశే పురప్రవేశః సప్తవింశే రాజ్యాభిషేకః అష్టా వింశే ప్రకృతి సాంత్వనం అభ్యుదైకం దానం చ ఊనత్రింశే భీష్మం ప్రత్యాగమనం తద్దినం ఆరభ్య త్రింశతి దినానీతి జ్ఞేయం'.

దీని భావమేమన, శాంతిపర్వాదిలో 30 దినములు పాండవులుండి పిమ్మట భీష్ముని దర్శించుకొని యాతనితో నింక 56 దివసముల కుత్తరాయణమందు భీష్ముడు చావగలడని చెప్పుటయు, భీష్ముడు చచ్చునాడు తాను యుద్ధానంతరము 58 దినములు శరతల్పమందుంటినని చెప్పుటయును నసమంజసము గావున దానిని సమన్వయించుటకై 56 దినములకు అనుటకు సంస్కృతములో "పంచాశతంషట్చ" అఖ దానికి 56 అను నర్థము కాదనియు, అయిదార్లు ముప్పది యను నర్థమేయనియు నీలకంఠులవారు వ్యాఖ్యానము చేసినారు. ఇట్లు చేయుట చేత గంగాతీరమందుండిన 30 దినములు, కృష్ణుడుత్తరామాయణము "పంచాశతంషట్చ" (30 దినములకు) వచ్చునని చెప్పుటయు కలిపిన 86 దినములకు మారుగా 60 దివసములే వచ్చును. ఇవి భీష్ముడు చెప్పిన 58 దినముల లెక్కకు సరిపోవును. ఇట్లుపాయము చేసి సమన్వయము చేసినారు. యుద్ధము కార్తికామావాస్యనాడు ప్రారంభమైనది నిస్సందేహము. భీష్ముడు మాఘశుక్లాష్టమి నాడు చచ్చినది నిస్సంశయముగా అనుశాసనిక పర్వమందు బైశ్లోకములందు జెప్పబడినది. ఇక సందేహము కలిగినది 56 దినముల లెక్కయే. ఇది తిక్కన సోమయాజుల వంటి వారికి గూడ 56 దినములుగా నర్థమగుచుండు దానిని సమన్వయించుటకై వ్యాఖ్యాతకు 30 దినములను నర్థము చేయవలసి వచ్చినది. ఈ పదముల అర్థభేదము చేతనే పొరపాటులు జరిగినవి. కావున తెనుగుభారతము ప్రకారము నేనిదివఱకు లెక్కించి వ్రాయుగా

ఆశ్వయుజామావాస్యనాడు యుద్ధమయ్యెనని నిశ్చయింపవలసి వచ్చెను. సంస్కృత భారతమును జూచిన యనంతరము లెక్క తప్పనియు, కార్తికామావాస్యయే యుద్ధారంభ దివసమనియు నిశ్చయమయ్యెను. ఇక అభిమన్యుని పెండ్లి నిశ్చయింపవలెను.

స్త్రీ పర్వమందు కౌరవ స్త్రీలు తమ యాప్తుల శరీరములపైబడి విలపింతురు. అందుత్తర యభిమన్యుని కళేబరముపైబడి యిట్లు విలపించును.

సీ॥ దేవలోకంబున నీవిప్పు డెవ్వత
దీపారుపలుకుల దేర్చి కురులు
... .... .... .... ....
యంగనాగోష్ఠి నున్నపుడు నా నడవడి
బుద్ధి దలంతె, నిన్నొంద గాంచి
యాఱునెలలు వోయె.

అణి యభిమాన్యుని నుత్తర పొంది యాఱు నెలలయ్యెనని విలపించుచున్నది.

**సంస్కృత భారతమందలి భావమిట్లున్నది**: "నిన్ను బొంది యాఱునెలలయ్యెను. నీవు ఏడవ మాసమందు జంపబడితివి." మనము కార్తికాంతము యుద్ధారంభమని నిశ్చయించితిమి కదా! నాటికి ఏడు నెలల పూర్వముత్తరాభిమాన్యుల పెండ్లి యయ్యెనని యుత్తర మాటల వలన దెలిసెకదా! అట్లైన వీరి వివాహము వైశాఖ మాసమందయ్యెనని తెలియగలదు.

ఇక శమీపూజాదినమును విచారింతుము. అభిమన్యుని పెండ్లికి బూర్వము పాండవులు ప్రకాశులై శమీపూజ జేసి తమ యాయుధములను దెచ్చికొనిరని యున్నది. అనగా వైశాఖమాసమందో, లేక, చైత్రమాసాంతమందో వీరిట్లు చేసిరని చెప్పవలెను. అట్లుకాక వీరు ఆశ్వయుజ శుద్ధ దశమినాడే శమీపూజ చేసిరనిన వీరిట్లు పూజ చేసిన 7, 8 నెలల తర్వాత నభిమన్యుని పెండ్లి చేసిరని చెప్పవలెను. ఇట్లు లెక్కించిన వీరు శమీ పూజ చేసి యొక్క సంవత్సరమయిన తర్వాత యుద్ధము చేసిరని చెప్పవలెను. ఇట్లు చెప్పుటకు బ్రమాణములు లేవు. మఱియు నింత యవధి జరిగినట్లు కథాసందర్భములను బట్టి మనకు గనుపింపదు.

కావున పాండవులు చైత్రమందు శమీ పూజ చేయుటయు, వైశాఖ మందు అభిమన్యుని పెండ్లి చేయుటయు నిశ్చితములగుటచే బెండ్లి యనంతర మాఱునెలల

కాలమందు బాండవులు సైన్యమును సమకూర్చుటయు, రాయబారము లంపుటయు గావించిరని చెప్పవలెను. మూడు రాయబారము లీ యంతరాళమున జరిగెను. కౌరవుల పక్షమున సంజయురాయబారమును, బాండవుల పక్షమున పురోహితుని రాయబారమును, శ్రీకృష్ణుని రాయబారమును జరిగెను.

## సారాంశము

మొత్తముపై రామాయణమందే సరియగు ప్రమాణములుండుట చేత నీ పండుగ రామపరముగనే యెంచవలసినదని నా యభిప్రాయము. వాడుకలో 'విజయదశమి' అనుటచేతను, 'అర్జునస్య ధనుర్ధారీ' అనుట చేతను భారతమున కర్థమేర్పరచి యిట్లు లోకము విశ్వసించుచున్నది. 'అర్జునస్య ధనుర్ధారీ' యనునది శమీ వృక్ష వర్ణనలో నొక విశేషణముగానే భావింపవలెను. మఱియు విజయదశమి యనుదానికి విజయకాలమందు చేయబడు దశమి యని అర్థము.

విజయకాలమును గుఱించి వ్రత గ్రంథకారులందఱు నిట్లు వ్రాసినారు.

ఆశ్వినస్య సితే పక్షే దశమ్యాం తారకోదయే,
సకాలో విజయో నామ సర్వకామార్థ సాధకః.

అనగా ఆశ్వయుజ శుద్ధదశమీ దివసమునాటి సాయంకాలము విజయకాల మనబడును. ఆ కాలమందు పూజలెవ్వరు చేయుదురో వారు తమ కార్యములందు విజయము పొందుదురని దీని యర్థము.

కావున విజయదశమికిని అర్జునునకును సంబంధము లేదు. మొత్తముపై నీ విజయదశమి భారతముకన్న రామాయణమునకే యెక్కుడు సంబంధము కలదై యున్నది.

ఈ విజయదశమి క్షత్రియుల పండుగయని ప్రారంభముననే తెలిపియుంటిని. ఇంకను కొన్ని విశేషములు మనవి చేసికొందును. అతి ప్రాచీనకాలములో ఆర్యుల దేవతలలో 'అపరాజితాదేవి' ముఖ్యదేవతయై యుండెను. ఈ యపరాజితపదమున కర్థము పరాజయము లేనట్టి దేవత. రాజులు తమకు పరాజయము లేకుండుటకై యీ యపరాజితా దేవిని పూజించుట సమంజసమే. ఈ దేవీపూజా విషయమై స్కాందపురాణమిట్లు శాసించుచున్నది:

దశమ్యాంచ నరై స్సమ్యక్ పూజనీయా పరాజితా
మోక్షార్థం విజయార్థం చ పూర్వోక్త విధినా నరైః
నవమీ శేషయుక్తాయాం దశమ్యా మపరాజితా
దదాతి విజయం దేవీ పూజితా జయవర్ధనీ.

నవమీ శేషయుక్తమైన దశమీదివసమున అపరాజితాదేవిని పూజించిన ఆ దేవి 'విజయము' నిచ్చును. ఈ అపరాజితాదేవి చాణక్యుని కాలములో గణనీయయై యుండినది. చాణక్యుడు తన అర్థశాస్త్రములో అపరాజితాదేవితో సహా అప్రతిహాత, జయంత, వైజయంత అను దేవతల పేరుల నుదాహరించినాడు. విశేషమేమన, ఈ పేరులన్నియు 'విజయ'మును సూచించు నర్థములచే యిచ్చుచున్నవి. కావున పై యంశముల వలన నిర్ణయమైన దేమన, పూర్వకాలమందు రాజులు ఈ దశమీ దివసమునాడు అపరాజితా దేవిని పూజించి విజయయాత్ర, లేక జైత్రయాత్రకు బయలుదేరెడివారు.

ఇంకొక చిత్రమున్న దీ యపరాజితా పూజా విషయములో అపరాజితా శబ్దమునకు దేవీశక్తి అను నర్థమున్నను ఇంకొక యర్థము కూడా కలదు. వైద్య గ్రంథములలో అపరాజితా శబ్దమునకు 'శమీ వృక్షభేదము' అనియు నొక యర్థము కలదని శబ్దకల్పద్రుమ నిఘంటువులో వ్రాసియున్నారు. ఈ యర్థమును కనిన తర్వాత ఒక ఊహ తట్టుచున్నది. ఏమన, అపరాజితా దేవీపూజ తర్వాతి కాలములో శక్తి పూజగా మారినను, దాని పర్యాయపదార్థమగు శమీవృక్ష పూజ కూడ తర్వాత నేర్పడి యుండవచ్చును. జనసామాన్యములో అపరాజితా దేవి పూజలు ఆచారమందు లేనందున తత్పర్యాయ పదార్థమగు శమీవృక్ష పూజ ఆచరణలోనికి తీసుకొని వచ్చిరేమో!

ఎన్నియో వృక్షములుండగా నీ శమీ వృక్షమున కెందులకు ప్రాధాన్యమిచ్చినారో యని పండితులు శమీవృక్ష గుణములను, దాని శక్తిని వర్ణింపమొదలిడిరి. ఎన్ని చెప్పినను తృప్తికరమగు సమాధానమగుపడుటలేదు.

ఏది యెట్లున్నను ఇది పూర్వము క్షత్రియుల పండుగయైనను ఇప్పుడు హిందువులలో అన్ని వర్ణములవారు తమ తమ వృత్తిలో విజయము కలుగవలెనని యీ దినమునాడు తమ కభిమానమగు వస్తువులను పూజింతురు. కాపులు నాగండ్లను, కమ్మరి కొలిమిని, వడ్రంగి తన ఉలిబాడిసను, సాలెవారు తమ మగ్గములను, విద్యార్థులు తమ పుస్తకములను, ఈ ప్రకారముగా ప్రతి వృత్తివారును పూజించుట పరిపాటియైపోయినది.

# ఉగాది

ఉగాది కర్ణాటాంధ్రులకు చాల ముఖ్యమైన పండుగ. దీనినే సంవత్సరాది పండుగయని యందురు. ప్రతి సంవత్సరము చైత్ర శుక్ల పాడ్యమి దినమున నీ పండుగ చేయబడును. ఇదియే యన్ని పండుగులలో మొదటి పండుగ. ఈ దినమున ప్రతి జాతివారును శిరస్స్నానము చేసి క్రొత్త బట్టలు కట్టుకొందురు. సాయంకాలమున దేవాలయమందు జేరి బ్రాహ్మణాశీర్వాదమును బొంది, ప్రతివాడునూ తన పేర నా సంవత్సరమందెన్ని సున్నలుండునది విచారించును. బ్రాహ్మణుడు పంచాంగము చూచి యేయే వ్యక్తి కెన్ని సున్నలుండినది చెప్పును. ఎన్ని సున్నలుండిన నన్ని మారు లా సంవత్సరమం దా మనుష్యుడు రోగార్తుడగుని దీని భావము. తెలంగాణమందలి కొన్ని భాగములలో సాయంకాలమందూరి బండ్లన్నియు నలంకరింపబడి మంచి యెడ్లచే నీడ్పింపబడును. ఉగాది పండుగ యొక్క భోజనములలో జాల ముఖ్యమైనది 'ఉగాది పచ్చడి', లేక గొజ్జు. ఈ గొజ్జును వేపపూత చేతను, లేతమామిడి కాయల ముక్కల చేతను క్రొత్త చింతపండు పులుసు, క్రొత్త బెల్లము పానకము, గసగసాలు, పప్పులు మున్నగువానిని కలిపి సిద్ధము చేయుదురు. అనగా క్రొత్త సంవత్సర ఫలపుష్పములచే నిది సిద్ధము చేయబడుచున్నది. ప్రకృతి యంతయు నప్పుడే ప్రాత యాకులను దుల్చి క్రొత్త చివురుల చేతను, ఫలపుష్పముల చేతను వికసించుచుండు సమయ మాంధ్రులకు సంవత్సరాది. ఈ పండుగ సర్వ వర్ణముల వారికిని ముఖ్యమైనట్టిది.

పూర్వము 'యుగాది' (యుగ+ఆది; యకారాది పదము) పండుగను నొక దానిని చేయుచుండినట్టుల భవిష్యత్ పురాణోత్తర భాగమందలి కథనము వలన తెలియవచ్చెడి. శ్రీకృష్ణుడు ధర్మరాజుతో నిట్లు చెప్పుచున్నాడు.

కృతయుగము వైశాఖ తృతీయనాడు ప్రారంభమయ్యెను. కార్తిక నవమినాడు త్రేతాయుగ ముద్భవించెను. నభత్రయోదశినాడు ద్వాపరము వచ్చినది. మాఘ పౌర్ణిమ కలికాలాది యని చెప్పబడుచున్నది. ఈ తిథులు యుగాదులని పండితులచే బేర్కొనబడియున్నవి.

శ్లో॥ యుగాదయశ్చ కథ్యంతే తథైతాః సర్వసూరిభిః.

ఈ నాలుగు యుగముల యాది తిథులందు నాయాదేవతలను బూజించి బ్రాహ్మణులకు నానాదానము లియ్యవలెను.

కలియుగము మాఘమాసమందు ప్రారంభమయ్యెనని పై పురాణము చెప్పుచున్నది. మన ఉగాది చైత్రమందు జరుగునట్టిది. కావున పై పురాణము మనకు బ్రమాణము కాదు.

ధర్మ సింధుకారుడును, నిర్ణయ సింధుకారుడును నీ యుగాది పండుగ సంవత్సరారంభపు బండుగయని నిర్ణయించినారు. ధర్మసింధుకారుడు విశేషించి యిట్లు వ్రాయుచున్నాడు:

'అత్ర శుక్ల ప్రతి పదాది రమాంత ఏవ మాసః ప్రాయేణ దాక్షిణాత్యై రాద్రియతే.'

అనగా నీ పండుగ దాక్షిణాత్యులచే నాదరింపబడుచున్నదని వీరి యభిప్రాయము. ఈ పండుగనాడు ఈ ప్రకారము చేయవలయునని ధర్మసింధువు చెప్పుచున్నది.

'నూతన సంవత్సర కీర్తనాద్యారంభం ప్రతి గృహ ధ్వజారోహణం నింబపత్రా శనం వత్సరాది శ్రవణం నవరాత్రారంభః'.

అనగా నీ దివసమున ప్రతియింటికి దోరణములు కట్టి వేపపూతచే గొజ్జు చేసి భుజించి సంవత్సర ఫలశ్రవణమును చేయవలయును. కొందఱు ఉగాది నుండి శ్రీరామనవమి వఱకు శ్రీరామనవరాత్రులు చేయుదురు.

'చైత్ర శుక్ల ప్రతిప న్మత్స్యజయంతీ త్యేకే'.

అనుట వలన నీ దివసమునాడు మత్స్యజయంతి యని కొందఱందురని యనుమానముగా జెప్పినాడు.

'ఆర్య పర్వ పద్ధతి' యను గ్రంథ మొకటి పండిత భవానీ ప్రసాదు (ఆర్య) గారిచే హిందీలో బ్రకటింపబడినది. అందు గొన్ని పండుగల చర్చ గలదు. ఈ గ్రంథములో గొన్ని విషయములు చాలా యుత్తమములుగా నున్నవి. దీనిలో 'నవ సంవత్సరోత్సవము' లేక 'సంవత్సరేష్టి' యను శీర్షికయం దీ యుగాదిపండుగ విషయమున నిట్లు వ్రాయబడినది:

'మధుశ్చ మాధవశ్చ వాసంతికా వృత్'. – యజుర్వేదము

అణగా యజుర్వేదమందు సంవత్సరము వసంతముతో బ్రారంభమగుననియు, నా ఋతుమాసముల పేర్లు మధువు, మాధవము అని యుండెననియు వీరి యభిప్రాయము. కాని కాలక్రమేణ చైత్రాది మాసములే వ్యవహార సిద్ధము లయ్యెనట.

ఈ విషయమై హేమాద్రి యిట్లు వ్రాసియున్నాడు:

'చైత్రే మాసి జగద్బ్రహ్మ ససర్జ ప్రథమేహని,
శుక్ల పక్షే సమగ్రం తు తదా సూర్యోదయే సతి.'

అనగా బ్రహ్మదేవుడు చైత్రశుక్ల ప్రతిపత్తునాడు జగత్తు యొక్క ప్రథమ దివసమును ప్రారంభించెను.

భాస్కరాచార్యులు తమ సిద్ధాంత శిరోమణి యను జ్యోతిష గ్రంథమం దిట్లు సెలవిచ్చినారు:

'లంకానగర్యా ముదయాచ్చ భానౌతస్యైవ వారే ప్రథమం బభూవ,
మధోస్సితాదే ర్దినమాసవర్షం యుగాదికానాం యుగపత్ప్రవృత్తిః.'

అనగా లంకానగరమందు భానుడుదయించుటజేసి మధుమాసము (చైత్రము) యొక్క శుద్ధ పాడ్యమినాడు యుగాదుల యొక్క ప్రారంభమయ్యెను. పై శ్లోకమందలి 'యుగాది' అను పదము గమనింపదగినది ఈ ఉగాది ప్రారంభమున యకారాదిపదమగు యుగాదిగానే యుండి యుండవలెను. అది తర్వాత నపభ్రంశము కాకున్న తద్భవమైనదని యెన్నవలెను. హిందీ గ్రంథకారుడు రెండు మూడు విశేషము లీ పండుగును గుఱించి సూచించి యున్నాడు. ఔరంగజేబు తన కొడుకగు మొఅజ్జమ్ అను వానికి వ్రాసిన జాబులో నీ పండుగను గుఱించి యిట్లు పార్సీలో వ్రాసెను: "ఈ దినమున అగ్ని పూజకులగు పారసీకుల పండుగ. మఱియు నిది కాఫరులైన హిందువుల విశ్వాసానుసారముగ ధిక్కృతుడైన విక్రమాదిత్యుని రాజ్యాభిషేకదివసము. మఱియు హిందూ దేశములో నిది సంవత్సరాదిగా నున్నది." పై యౌరంగజేబు ధిక్కార వాక్యములలో నొక్కటి గమనింపదగియున్నది. ఈ పండుగ పార్సీలకు గూడ సంవత్సరాది పండుగగా నున్నదనుటలో నీ యాచారము ప్రాచీన వేదకాలమందు ఆర్యులు, పార్సీలు కలిసియుండిన కాలపు మర్యాదను సూచించుచున్నది. మరియు పై భవానీ ప్రసాద పండితుని యభిప్రాయున నీ చైత్రాదిపర్వమే పూర్వము హిందూస్థాన మంతటను

నుండెనట. కాని తర్వాత చాంద్రసౌరమాన భేదములు కలిగిన తర్వాత దక్షిణమున చైత్రమాసమందును, నుత్తరమున మేష సంక్రాంతినాడును నీ పండుగజేయు నాచారమయ్యెనట. ఈ పండితుని యభిప్రాయములు గమనింపదగినవి.

పార్సీలలో ఉగాదిని నౌరోజ్ అనగా క్రొత్త దినము అని యందురు. ఇది సాధారణముగా ఇంగ్లీషు మాసమగు మార్చి నెలలో వచ్చును. అనగా వసంత కాలారంభమందు వచ్చును. ఇంచుమించు మన ఉగాది వచ్చు కాలములో వారికిని సంవత్సరాది పండుగ వచ్చుచుండును.

శాలివాహనశకమును పాటించువారందఱును ఈ పండుగను చేయుదురు. అందు ముఖ్యముగా తెనుగువారు, కర్ణాటకులు, మహారాష్ట్రులు ఈ పండుగను చేయుదురు. మహారాష్ట్రులు కూడా ఉగాది గొజ్జును సేవింతురు. అయితే వారు అందు వేపపూతనే కాక లేత ననలను కూడ నూరి కలిపి పుచ్చుకొందురు.

# శ్రీరామనవమి

ఇది విష్ణ్వవతారమని పేరుగాంచిన శ్రీరామచంద్రుని పుట్టుక దినము. కావుననే హిందూ ప్రపంచమంతయు నీ దినమును మహా సుదినముగా భావించి గృహ గృహమందుత్సవములు సలుపును. అవతారపురుషుల జన్మదినములలో శ్రీకృష్ణాష్టమియు, శ్రీరామ నవమియు ముఖ్యమైనవి. శ్రీరామనవమి ప్రతి సంవత్సరము చైత్రశుక్ల నవమీ దివసమందు జరుపబడును. ఈ పండుగను గుఱించి వ్రతచూడామణి యందు అగస్త్య సంహితలో నిట్లు వ్రాయబడినదని యుదాహరింపబడినది:

చైత్రమాసే నవమ్యాంతు జాతో రామ స్స్వయం హరిః,
పునర్వ స్వృక్ష సంయుక్తా సా తిథి స్సర్వకామదా.

చైత్రమాస శుక్ల నవమినాడు పునర్వసు నక్షత్ర మందు శ్రీమహావిష్ణువు స్వయముగా శ్రీరామావతారమెత్తెను. ఈ దినము సమస్తకామముల నొనగూర్చునట్టిది.

శ్రీరాముల యవతారమును గుఱించి చెప్పవలయు ననిన రామాయణమంత కథ యగును. శ్రీరాముల చరిత్రను మొదట వ్రాసిన వాడు వాల్మీకి. ఈతని రామాయణమునే యాదికావ్యమని వ్యవహరింతురు. హిందువులలో సీతారాముల కథ తెలియని దౌర్భాగ్యుడొక్కడైన లేడని గట్టిగా జెప్పవచ్చును. కావున ఆ కథ నిందు వివరింపనైతిని.

హిందువులలో ఏక పత్నీవ్రుతుని నిదర్శనమునకు శ్రీరాముల కన్న మించిన యుదాహరణ మింకొకటి కానేరదు. హిందూ స్త్రీలకు బతివ్రతాదర్శమునకై సీతాదేవి కన్న మించిన యాదర్శముండదు. రామాయణకథ హిందూ పురాణకథలన్నింటిలో నత్యంత ప్రాచీనమైనదిగా, సత్యమైనదిగా గనబడుచున్నది. దక్షిణ అమెరికా దేశములోని మధ్యభాగమందు నివసించు రెడ్ ఇండియన్ మున్నగు నాదిమ నివాసులలో నేటికిని 'సీతారాముల' యుత్సవ మొకటి ప్రతి సంవత్సరము జరుప బడుచున్నదనియు, సీతారాముల గుఱించిన పాటలు పాడుదురనియు, నీ యుత్సవ సందర్భమున సీతారాములను గూర్చిన నాటకము లాడుదురనియు చరిత్ర పరిశోధకులు

తెలుపుచున్నారు. ఈ యంశము వలన ననేక విశేషములు బయలుపడుచున్నవి. ఒక కాలమందు హిందువులు అమెరికా దేశముతో వ్యాపారము చేసిరనియు నూహించిన నాశ్చర్యమేమియు లేదు. ఏలన ప్రాచీన కాలమందు నేటి సంకుచిత పద్ధతివలె కాక హిందువులు తమ మత ప్రచారమును సర్వఖండములందు చేసిన వారు. ఒక కాలమందు హిందువులకు మించిన సముద్రవ్యాపారులు ప్రపంచమందు లేకుండిరి. కావున రామాయణకథ హిందువులచే కొలంబసుకన్న రెండు మూడు వేల యేండ్లకు బూర్వమే ఖండ ఖండాంతరములందు వ్యాపింపజేయబడినది.

రామాయణము సర్వప్రపంచమున కాదర్శ గ్రంథమనజెల్లును. పితృవాక్య పరిపాలనకును, ఏకపత్నీ వ్రతత్వమునకును శ్రీరాములే తార్కాణము. భ్రాతృవాత్సల్యమునకు లక్ష్మణ భరతులే నిదర్శనము. పతి భక్తికి సీతాదేవియే పేర్కొనదగినది. స్వామిభక్తి, సేవాపరాయణతలకు హనుమంతుడే పేర్కొనదగిన బంటు. ప్రతి హిందువును నేయితర గ్రంథమును జదువు శ్రమకు బోక శ్రీమద్వాల్మీకి మహర్షిచే రచితమగు శ్రీమద్రామాయణమునే చదివి ధన్యుడగుగాక!

అయితే విచారకరమగు విషయ మేమన, జన సామాన్యము శ్రీరామనవమిని పండుగగా చేసుకొనరు. వారికి ఏరువాక, సంక్రాంతి యెంత ముఖ్యమో అందు శతాంశమైనను శ్రీరామ, శ్రీకృష్ణ జయంతులు ముఖ్యముగా కానరాలేదు.

# జన్మాష్టమి

శ్రీ మహావిష్ణువతారముగా హిందు ప్రపంచముచే బూజింపబడు శ్రీకృష్ణ భగవానుడు శ్రావణ బ. 8 దివసమున జననమందెను. ఈ కృష్ణుడు అవతారములలో నెనిమిదవ యవతారముగా బరిగణింపబడుచున్నాడు. ఈ మహాపురుషుని చరిత్రము సుప్రసిద్ధమైనది. భాగవతములోను, హరివంశమందును, నితర మహాపురాణములందును నీతని చరిత్ర వ్రాయబడినది. భారతమందు సహితము శ్రీకృష్ణుడే ప్రధానపాత్ర యనవచ్చును. భాగవతములో నీ మహామహుని జన్మము నుండి మొదలుకొని సమగ్రమైన చరిత్ర వ్రాయబడియున్నది. ఈ చరిత్రలో నొక్క యంశము మాత్రము నిందు విమర్శించుచున్నాను. భాగవతమందు శ్రీకృష్ణుడు వ్యభిచారిగ వర్ణింపబడి యున్నాడు. దీని వలన శ్రీకృష్ణుని నిర్మల చరిత్రకొక కళంకము కలిగినది. దీని మూలముననే వ్యభిచారమునకు శ్రీకృష్ణుడొక సామెతగా లోకులచే వ్యవహరింప బడుచున్నాడు. భక్తిపరముగా నీ వ్యభిచార కథనమును గ్రహించవలసినదిగా గొందఱు సమాధానము చెప్పెదరు. కాని యీ భక్తిని బ్రదర్శించుట కిట్టి విధానమును భాగవత రచయిత యవలంబించినందున దుదకు లోకమందు శ్రీకృష్ణునకు నింద తప్పకపోయెను.

శ్రీకృష్ణుని చరిత్ర చాల గంభీరమైనది. పుట్టిన కాలము చాల విషమ సమయము. తల్లిదండ్రులగు దేవకీ వసుదేవులు క్రూరకంసునిచే జెఱసాలలో నుంచబడిరి. కృష్ణుడును, బలరాముడును బుట్టిన దాదిగ యశోదానందులను గొల్లదొరల యిండ్లలో దాచబడి పెంచబడిరి. పిమ్మట విద్యనేర్చి పెద్దవారై తమ తల్లిదండ్రుల హింసించిన మేనమామను జంపిరి. తర్వాత జరాసంధ శిశుపాలాది మహావీరుల దెబ్బకు తాళలేక సముద్రతీరమందు ద్వారకానగరమును నిర్మించి కొంత కాలమునకు శత్రువులను సంహరించిరి. శ్రీకృష్ణుడు మహాబలశాలి. బాల్యమందే యనేక దుర్మార్గులను బరిమార్చెను. పెద్దయైన పిమ్మట తన బంధువులగు పాండవుల యొక్క రాజసూయ యాగమందు అగ్రపూజ నందెను. భారతయుద్ధమందు అర్జునసారథియై పాండవులకు జయము నాపాదించెను. శ్రీకృష్ణుడు 116

సంవత్సరములు బ్రదికినట్లు భాగవతాదులలోని సందర్భముల వలన తెలియవచ్చును. (వివరములకై భీష్మైకాదశీ వ్రతమున జూడుడు.) ఇతనికి ఎనుమండుగురు భార్యలు. అందు ముఖ్యురాలు రుక్మిణి.

శ్రీకృష్ణుడు గొప్ప తత్వవేత్త. లోకోపకారార్థము భగవద్గీతను బోధించిన మహర్షి. ఈ భగవద్గీత హిందూ మత గ్రంథములలో నొక యుత్కృష్ట గ్రంథమై యున్నది.

ప్రతి సంవత్సరము శ్రావణ బహుళాష్టమీ దివసమున శ్రీకృష్ణుని జన్మదినోత్సవము ప్రతిగృహమందును జరుపబడుచున్నది. సాయంకాలమందు శ్రీకృష్ణుని విగ్రహము నూరేగించుదురు. శ్రీకృష్ణుడు బాల్యమందు గొల్లల యిండ్లలో బెరిగి, పెరుగు, పాలు, వెన్న దొంగిలించిన దుడుకు చేతకు నిదర్శనముగ వీథులలో నుట్లుపెట్టి, వాటిని జనులచే గొట్టించు వేడుకలు నేటికిని జరుగుచున్నవి. శ్రీకృష్ణుడెన్నియో సాహసములు చేసి యుండ నీయుట్ల దొంగతనమునే యాదర్శముగా భారతీయులు గ్రహించి యుండుట యాశ్చర్యముగా నున్నది.

భవిష్యత్పురాణమందు శ్రీకృష్ణుని జన్మదినోత్సవమును బ్రతి మనుష్యుడును జేయవలయుననియు, అట్లు చేయనివాడు క్రూర రాక్షసుడై పుట్టుననియు శాసింపబడినది.

## విమర్శ

హిందువులు చేయుపండుగ లన్నింటిలో శ్రీరామనవమి, శ్రీకృష్ణ జయంతి యీ రెండును జాల ముఖ్యమైనవి. కాని యేమి చిత్రమో శూద్రులలో ననేకులనేక ప్రాంతములలో నాగపంచమి వంటి పండుగలకు బ్రాముఖ్యమిచ్చి యీ పండుగను స్మరింపనైన స్మరింపరు. కొన్ని ప్రాంతములలో కృష్ణాష్టమి నాడు ఉట్ల పండుగ యనియు, ఉట్ల తిరునాళ్ల యనియు చేయుదురు. ఈ పద్ధతి ఆంధ్రదేశమందంతటను విరివిగా నున్నది. ఇది దాక్షిణాత్యులు కొందఱు చేయు 'లొట్లపండుగ' కన్న మేలే కాని 'గ్రుడ్డిలో మెల్లవంటిది.' శ్రీకృష్ణుడు నిందలకు బాలయినట్లు ఏ యితర మహాపురుషుడును గాలేదనవచ్చును. ఇట్లు నిందించినవారు వారి పరమభక్తులే. భక్తికొఱకై యీ పరమ పురుషునిచే చిన్న తనమున దొంగతనము చేయించినారు. వయసున వ్యభిచారము చేయించినారు.

శుకసప్తతికారు డొక గొల్లనిచే నిట్లు చెప్పించినాడు:

సీ॥ మేరలెంచక యూరివారిండ్ల కేగి పా

ల్పెరుగు వెన్నలు మ్రుచ్చిలించె ననుచు
నీరాడుతఱి నాడువారి కట్టిన పాత
లెత్తుకపోయి చెట్టెక్కెననుచు
బ్రతుకు భాగ్యము క్రింద బడగ బాపనయిండ్ల
కరిగి యాకటికి కూ డడిగెననుచు
కడపట చుట్టాల గరితల పైటలో
జెయి వేసి యేమేమొ చేసెననుచు

తే.గీ॥ వ్రాసికొన్నారు బాపన బైసిగాంద్రు
కొలము సామి విచారించుకొక యిట్లు
చేయునేయంచు బెద్దలచేత వినెడు
కృష్ణ కథలందు నిటువంటి వెల్ల వినుచు.

ఇప్పుడు సూచించున దేమనగ, శ్రీకృష్ణుడు పాలు, నెయ్యి, వెన్న, మజ్జిగ, పెరుగు నుట్లలో బెట్టిన వాటిని చిన్నతనమున దొంగిలించుచుండెనని వ్రాసిన కారణము చేత నిప్పుడా దొంగతనమును నాతని జీవితములో బ్రాముఖ్యమైనదిగా నెంచి యుట్ల పండుగను నూరూర జేయుచున్నారు. దక్షిణదేశమందు గొన్ని స్థలములందు శ్రీకృష్ణ జయంతినాడు రాత్రికాలమందు కొందఱు భక్తులు దంపతులుగా సంకేతిత దేవతాయతనము లందు జేరి తప్ప త్రాగి యా రాత్రి కంచుక క్రీడను చేయుదురుట.

ఈ క్రీడకు రవికయే ప్రధానము. కాని వావి వరుసలైనను తుదకు ప్రధానములు కావు.

దీనిని సమర్థించుటకై కొన్ని తప్పుడు శాస్త్రములు వ్రాసినారు. ఈ హేయమును గుఱించి యింతకన్న నెక్కుడుగ వ్రాయనొల్లను. కావున లొట్ల పండుగ కన్న నుట్ల పండుగయే మేలని చెప్పితి.

ఇప్పుడిప్పుడు శ్రీకృష్ణుని నిజమగు గొప్పతనమును కొందఱు పండితులు చాటుచున్నారు.

ఈ సందర్భమున శ్రీకృష్ణుని రూప మెట్లుండెనో విచారించుట యప్రస్తుతముగా

నుండనేరదని పరిశోధకుల వినోదార్థము నా యభిప్రాయమును బ్రకటించుచున్నాడను.

## శ్రీకృష్ణుని రూపము

శ్రీకృష్ణుని ఫోటో గాని, ప్రాచీన చిత్రముగాని మనకు దొఱకియుండిన మనమందఱము నెంత యాశ్చర్యపడి యుందుమో యేమో! కాని మన యీ భూమండలమున మనము మనకు దోచినట్లుగా శ్రీకృష్ణుని చిత్రించుటను దేవలోకమందలి దివ్య విగ్రహులు చూచి యేమనుకొనుచున్నారో పాపము!

నా యభిప్రాయమున ప్రాచీనము నుండి నేటి వఱకును సిద్ధము చేయబడుచుండిన శ్రీకృష్ణ విగ్రహములును, శ్రీకృష్ణ పటములును సరియైనవి కావు. శ్రీకృష్ణుడును మహానుభావుడొక కాలమం దుండినదియు, నా కాలమున నాతడు లోకోత్తర పురుషుడుగా భావింపబడి తుద కవతారములలో నెన్నికగని ప్రపంచ స్వరూపము మార్చి పోయినదియు నిర్వివాదాంశము. అట్టి శ్రీకృష్ణుడెట్టి స్వరూపము కలవాడుగా నుండెనో యను విషయమును విచారింతుము. సాధారణముగా శ్రీకృష్ణుడు నీలవర్ణుడుగను, సుందరాకారుడుగను, మీసములు లేని యౌవనుడుగను, స్త్రీలోలుడుగను, లేక సదా మురళీ గానలోలుడుగను, నెమలి ఫించపు తుఱ్ఱాకల కిరీటధారిగను చిత్రింపబడుచున్నాడు. ఈ స్వరూపమును విశేషముగా ప్రచారమునకు దెచ్చి యపచారము చేసిన వారిలో ముఖ్యుడు రాజారవివర్మ. ఇతడును నాలుగైదు వందల యేండ్ల నుండి లిఖింపబడుచున్న చిత్తరువుల నాధారముగా చేసికొని వ్రాసినవాడు. 'అంధేనైవ నీయమానో యథాంధ' యన్నట్లు తర్వాతి వారందఱును నీతనినే యనుకరించినారు. తుదకు విశేషముగా బొగడ్తగన్నట్టి బెంగాలీ చిత్రకారులు సహితము ఎక్కువ మార్పులు చూపించలేదు.

శ్రీకృష్ణుని యొక్క స్వరూప మిది సరియైనది కాదని నా నమ్మకము. అయితే శ్రీకృష్ణుని నేను ఏ దివ్యజ్ఞానమూలకముగా జూచిన వాడను గాను. కాని మన పురాణగాథలను బట్టి యిదమిత్థమని నిర్ణయించుటకు గొంత వీలుగలదని నా మనవి.

మొట్టమొదట దేమన, శ్రీకృష్ణుడు నీలవర్ణుడు, అనగా నలుపు వర్ణము వాడని నిశ్చయించుట సమంజసము. 'శ్రీకృష్ణ' పదమున కీయర్థమే కలదు.

రెండవది సాధారణముగా శ్రీకృష్ణుడు సుకుమారగాత్రుడుగా నిరూపింపబడుచున్నాడు. కొన్ని పటములలో నీతడు స్త్రీయో, పురుషుడో గుర్తింప

శక్యము కానివాడై యున్నాడు. శ్రీకృష్ణునికి ముక్కుపై నొక ముత్తెపు 'బులాకి'ని బెట్టి లావైనట్టియు, కండ కలిగినట్టియు చెంపలు పెట్టి, యా మోముపై యొక పిల్లనగ్రోవిని బట్టించి, దొఱకినన్ని ముత్యాల హారములను కంఠములో ధరింపజేసి, స్త్రీత్వమాపాదింప జేయుచున్నారు. ఇది సరియైనది కాదు. శ్రీకృష్ణుడు బాల్యమందు గొల్లలతో బయళ్లలో తిరిగి పెరిగినవాడు. నూనూగు మీసాలనాడు మంచి జెట్టీలతో బోరి కర్కశకాయుడైనవాడు. పరిపూర్ణవయః పరిపాకమునాడు నానారాజులతో యుద్ధము చేసి వారిని నిర్జించి యసామాన్యుడని యనిపించుకొనినాడు. ఇట్టివాడు 'నాజుకు' జనుడుగా నేటి నవాబుల వలెను, మహారాజులవలెను లీలగా, అలంకార ప్రాయముగా, నామకార్థముగా కత్తిబట్టినవాడుగా నుండియుండడు.

శ్రీకృష్ణమూర్తి స్త్రీ లోలుడని భావింపబడుచున్నాడు. ఇతనికన్న మించిన నిగ్రహశక్తి సంపన్నుడును, జితేంద్రియుడును మఱియొక డుండడు. 'రంగీలా' రాజు ఎన్నటికి భగవద్గీతను బోధింపజాలడు. కావున చీటికి మాటికి శ్రీకృష్ణునికి స్త్రీల గుంపులో నిలిపి పటములు వ్రాయుట అపచారముగా నుండును.

"అయితే యిక శ్రీకృష్ణు డెట్టివాడో నీవే చెప్పుము చూచెదము గాక" యని విమర్శకులందురేమో? నివేదించుకొనుచున్నాను.

శ్రీకృష్ణు డాజానుబాహువు. అవతార పురుషుల లక్షణములలో నిది యొక ముఖ్యలక్షణమై యున్నది. కావున నీతడు పొట్టివాడు గాక యెత్తైన విగ్రహమై యుండి యుండును. ఇతడు నల్లనివాడని ముందే నివేదించితిని. యాదవులు మున్నగు నొత్తరాహు లాజానుబాహులనియు, యుద్ధములందు ముందుపంక్తిలో నుంచదగినవారనియు భారతమందు వర్ణింపబడి యున్నారు.

ఇతడు మీసములు కలవాడుగా నుండియుండును. శ్రీకృష్ణునికి మీసములను ఎందుకో చిత్రకారులందఱును గొఱిగివేసినారు. ఇది చాలా దౌర్జన్యము. ఈ చిత్రకారులు శ్రీకృష్ణుని బావమఱదులగు పాండవులకు బుష్టిగా, లోపము లేకుంటునట్లుగా మీసములుంచియున్నారు. శ్రీకృష్ణుడే యపరాధమును జేయనప్పుడిట్లు శిక్షించుట న్యాయము కాదు. అయితే ప్రాచీన కాల మందార్యులలో మీసములుంచు వాడుకయే లేదని వాదింపవచ్చును. అట్లైన పాండవులకును నుండకూడదు. ఇంతియుకాక ప్రాచీనకాలమందు మీసములు చాల గౌరవస్థానము వహించియుండెనని ధర్మశాస్త్రముల శిక్షావిధానమే సూచించుచున్నది. కావున నింతవఱకు వ్రాసినదాని

వలన శ్రీకృష్ణు డెత్తైనవాడుగను, నల్లనివాడుగను, కర్కశ శరీరుడుగను, మీసములు కలవాడుగను నేర్పడెను.

ఇంకొక్క యంశము విమర్శనీయమైయున్నది. శ్రీకృష్ణుడే పటమందు చూచినను 30 యేండ్ల లోపలి యువకుడుగా గనబడుచున్నాడు. భగవద్గీతలోని ముఖపటములందు శ్రీకృష్ణుడు సారథిగా చిత్రింపబడిన పటములు ముఖ్యముగా గమనింపదగినవి. అందును శ్రీకృష్ణుడు 30 యేండ్ల లోపలి వాడుగా గోచరించును. కాని యివన్నియు సరిగావు. శ్రీకృష్ణుడు, భగవద్గీతా బోధనకాలము నాటికి 80 యేండ్ల వృద్ధుడు. హరివంశమందును, భాగవతమందును, విష్ణుపురాణమందును శ్రీకృష్ణుడు 125 యేండ్లు జీవించెనని వర్ణింపబడినది. భారతమందు పాండవుల వయస్సు 115 యేండ్లకు పైగా నుండినట్లు కావలసినన్ని నిదర్శనములు కలవు. పాండవులలో ధర్మరాజు తప్ప తక్కినవారికన్న శ్రీకృష్ణుడు పెద్దవాడు. కావున శ్రీకృష్ణుని యాయుర్దాయము 116 యేండ్లకు తక్కువ కాదనుట నిశ్చయము. అతడు యుద్ధ ప్రారంభము నాడు (అనగా భగవద్గీత బోధ చేసినాడు) ఎంత వయస్సు వాడని నిర్ణయించుట సులభము. యుద్ధము ముగిసిన వెంటనే గాంధారి తన నూర్గురు పుత్రుల కళేబరములను జూచి నిర్భర విషాదయుతమై శ్రీకృష్ణుని జాచి యిట్లనెను: "కృష్ణా! ఇదంతయు నీమూలముననే జరిగినది కావున నీవు నేటికి 36 సంవత్సరముల యనంతరము దిక్కులేనివాడవై చత్తువుగాక!" ఈ శాపము వలన శ్రీకృష్ణుడు భారత యుద్ధమునాటికి 80 ఏండ్ల వృద్ధని విశదమయ్యెడి. ఈ వార్ధక్య చిహ్నము లే పటమునందును నేను గాంచలేదు.

శ్రీకృష్ణుని వయస్సుని గుఱించి ఛాందోగ్యపనిషత్తు నుండి కొంత వరకు నిర్ణయింపవచ్చును. ఛాందోగ్యోపనిషత్తులో శ్రీకృష్ణుని చర్చ యుండుటచే శ్రీకృష్ణుడు చాలా ప్రాచీనకాలమందే సుప్రసిద్ధుడని విశదమగును.

మం. తద్ధైత ద్ఘోర ఆంగిరసః కృష్ణాయ దేవకీ పుత్రా మోక్త్వో వాచా
పిపాస ఏవ స బభూవ సోంత వేళాయా మేతత్త్రయం పతి పద్యేతా
క్షితమస్యచ్యుతమసి ప్రాణ సంశితమసీతి, తత్రైతే ద్వే ఋచౌ భవతః
3-17-6

దీని యర్థమేమన, "పురుష యజ్ఞ విజ్ఞానమును ఆంగిరస గోత్రుడైన ఘోరుడు అణు ఋషి కృష్ణుని కుపదేశము చేసి యీ యుపాసనాంగముగా స్థూల శరీరము యొక్క అంత్యకాలమందు మూడుమంత్రములను జపము చేయవలసిన దని చెప్పెను".

ఈ మంత్రమందలి కృష్ణుడింకెవ్వరైన వేరు కృష్ణుడు కావచ్చునని చెప్పుటకు వీలులేదు. ఏలన, నితడు దేవకీపుత్రుడని వర్ణింపబడియున్నాడు. అయితే, మన ప్రకృతాంశమునకు సంబంధించిన దేమన, నీ పురుష యజ్ఞమంత్రమును పఠించునాతడు 116 ఏండ్లు సంపూర్ణవయస్కుడై యుండునని పై యుపనిషత్తులోని 16వ ఖండములోని మంత్రములు బోధించుచున్నవి.

మం. ఏతద్ధస్మవై తద్విద్వానాహ మహీదాస ఐతరేయస్స కింమ ఏతదుప తపసి యోహమనేన నప్రేష్యామీతి సహ షోడశం వర్ష శత మ జీవత్ప్రహషోడశం వర్ష శతం జీవతి య ఏవంవేద. 3-16-7

దీని భావమేమన, ఏ పురుషుడైనను పురుషయజ్ఞము నుపాసించిన నతడు రోగాదివిముక్తుడై 116 వర్షములు జీవించి పూర్ణాయువు నొందును. కావున శ్రీకృష్ణుడు పై మంత్రమున కర్తృడై బోధింపబడినవాడన నతడు 116 వఱకో, లేక యంతకన్న నెక్కుడు కాలమువఱకో జీవించినవాడని యందఱకు నాకాలమున దెలిసిన విషయముగా నుండినందున ఉపనిషత్తులో నుదాహృతుడయ్యెననుటలో సందేహము లేదు.

ఇదే తృతీయ ప్రపాఠకములోని 16వ ఖండమందలి యింకొక మంత్రము గమనింపదగినది.

మం. అథయ త్తపోదాన మార్జవ మహింసా సత్యవచన మితి తా అస్య దక్షిణాః

అనగా పురుషయజ్ఞమున కందఱును నర్హులుగారు. ఎవ్వరు తపస్సంపన్నులో, దానపరులో, ఇంద్రియ నిగ్రహులో, అహింసా తత్పరులో, సత్యవంతులో వారే యీ యజ్ఞనమున కర్హులని పై మంత్రము బోధించుచున్నది. ఇందుమూలమున శ్రీకృష్ణుడు పురుషయజ్ఞమున కర్హుడయ్యెననిన నతడు 'తపోదాన మార్జవ మహింసా సత్యవచన' ములందు బ్రఖ్యాతి వహించినవాడని వేద ప్రమాణము సిద్ధాంతీకరించుటచే దద్విరుద్ధముగా వచించు పురాణములన్నియు శుద్ధాబద్ధములే యగును.

ఇట్టి తపః ప్రభావుని, జితేంద్రియుని, సత్యవాక్పరిపాలకుని ఉట్ల దొంగగా, వల్లవీపల్లవునిగా, వ్యభిచారిగా వర్ణించిన పురాణములన్నియు చాలా యపచారము చేసినవని చెప్పక తప్పదు.

కావున పై ప్రమాణములచేత శ్రీకృష్ణుడు 116 ఏండ్లకన్న హెచ్చు కాలము జీవించినవాడని నిశ్చయమయ్యెను.

ఇది నాకు దోచిన శ్రీకృష్ణస్వరూపము. ఇక నీతడెట్టి వేషము ధరించియుండెనో విచారింతుము. సాధారణముగా మన చిత్రకారులు శ్రీకృష్ణునికి వైదికపు ధోవతి పింజకట్టును, చెంచువారివలె నెత్తిన నెమలి పింఛపు నుంచుదురు. ఇది సరియైనది కాదనుకొందును. కాని అజంతా ఎల్లోరా గుహలలో హిందూ దేవతల విగ్రహము అలంకారములను పరీక్షించవలెను. ఆ చిత్రములు 2000 యేండ్ల క్రిందటివి. అంతకన్న ప్రాచీనమగు చిత్తరువులు మనకు లభింపలేదు. అందుచేత పురాణ పురుషుల చిత్తరువులను అజంతా చిత్తరువుల కనుకూలముగా చిత్రించుట యుక్తము.

శ్రీకృష్ణుని సంబంధమగు నితర విషయములను 'భీష్మైకాదశీ వ్రతము'న జూడగలరు. శ్రీకృష్ణుని జీవితమును గురించి యనేక గ్రంథములు ఆంధ్రమందును వెలువడియున్నవి. అందుచేత నిట వ్రాయలేదు.

# హనుమజ్జయంతి

ఈ జయంతిని ప్రతి చైత్ర పౌర్ణమా దివసమున జరుపుదురు. హనుమంతుడు వానరజాతిలో జేరినవాడు. ఇతని తల్లిపేరు అంజనీదేవి. ఈమె పూర్వజన్మమందు పుంజికస్థల యనుపేర బరగునొక యప్సరసయై యుండెను. శాపఫలితముగా వానరంగనయై జన్మించి కేసరి యను వానరుని బెండ్లాడెను. ఒకనాడు వాయుగతిచే నామె వలువలు జారి వలుదగుబ్బలు బయల్పడ వాయుదేవునికి మనస్సు చెదిరి యామెను గట్టిగా కౌగిలించుకొని, యామెతోడి సంబంధఫలితముగా నొక కొడుకును బ్రసాదించెను. ఆమె కొడుకునే ఆంజనేయుడని పిలుతురు. ఇతడు కేసరికి క్షత్రజుడుగను, వాయువునకు నౌరసుడుగను నేర్పడెను. ఇతని నొక గుహలో గని యచటనే తల్లి పెంచుచుండ నొకనా డీతడు సూర్యబింబమును చూచి ఫలమను అపేక్షచే దాని గబళింపబోయెను. అప్పుడింద్రుడు తన వజ్రాయుధముచే నీతని గొట్టెను. నాటినుండి హనుమంతుడను పేరు గలిగెను. కొడుకును గొట్టినది వాయువు జూచి తాను ప్రపంచములో సంచరించుట మానుకొనగా నఖిలభూతములు దేవతల సమేతముగా నార్వజొచ్చెను. అప్పుడు బ్రహ్మ హనుమంతునికి చిరంజీవత్వమును బ్రసాదించి వాయువు కుందు మాన్పెను.

హనుమంతుడు పెద్దయై సంస్కృతాద్యనేక విద్యల నేర్చెను. సీతతో మాట్లాడునప్పుడు మనుజ భాషను మాట్లాడెను. ఇతడు నిత్య బ్రహ్మచారిగా నుండెను. పెద్దయైన తర్వాత సుగ్రీవు నాశ్రయించి, యతనికి మంత్రియై యుండి, రామునికి సుగ్రీవునికి సంధి కుదిరించి వాలిని జంపించి, పిమ్మట సీతాన్వేషియై సీతను జూచి లంకగాల్చి, రామునికి వార్తదెలిపి, యుద్ధమందు జవసత్త్వములజూపి, సంజీవ పర్వతమునేతెచ్చి యిచ్చి, లక్ష్మణు మూర్ఛ దెలిపి, శ్రీరామునికి నమ్మిన బంటై జీవనముగ గడపిన మహానుభావుడు. ప్రపంచములో శ్రీరాములవంటి యజమాని పుట్టలేదు. హనుమంతునివంటి సేవకుడు పుట్టబోడు.

ఈ హనుమజ్జయంతి మధ్వులకు ముఖ్యమగు పండుగ. వానర జాతి యేజాతియో పండితులు నిర్ణయించుటకు వీలులేనివారై యున్నారు. కొందరు తోకలు

కలిగిన మనుజులే యనియు. గొందఱు అడవి మనుష్యులనియు దలచుచున్నారు. ఏది యెట్లున్నను హనుమంతు డాదర్శ పురుషుడు, అనుకరణీయుడు, పూజ్యుడు.

నా యభిప్రాయములో రామాయణ వానరులు కోతులు కారు. వారాకాల మందు బళ్లారి ప్రాంతములలో నివసించిన అనార్యజాతివారని అభిప్రాయపడుదును. ఈ చర్చను విపులముగా 'రామాయణ విశేషముల'లో చేసినాను.

# భీష్మైకాదశి (భీష్మాష్టమి)

భీష్ముడు భారతవీరాగ్రేసరుడని యందఱకు దెలియును. ఇతని జీవితము చాలా గంభీరమైనది. ఇతడు శంతనునికిని, గంగాదేవికిని బుట్టిన వాడు. ఈయన తల్లిదండ్రుల వివాహమును గుఱించియు, నితని బాల్యమును గుఱించియు, తర్వాత ఇతడు తండ్రికొఱకై సత్యవతిని తెచ్చి పెండ్లి చేయుటయు, నా సందర్భమున తాను రాజ్యపదవిని వదలుకొనుటయు, నిత్యబ్రహ్మచారిగా నుండుటకై వ్రతము బూనుటయు నీ మున్నగు కథలనన్నింటిని భారతమందు జూడనగును. సత్యవతి వలన నీతనితండ్రికి విచిత్రవీర్యు డుద్భవించెను. అతనికి అంబ అంబాలికలను కన్యలను రాక్షసముగా దెచ్చి పెండ్లి చేసెను. కాని విచిత్ర వీర్యుడనపత్యుడై గతించెను. అతని భార్యలను వ్యాసుడు పొంది పాండు ధృతరాష్ట్రుల బుట్టించిన కథను గూడ భారతమందు జూడనగును.

ఇచ్చట మనము కేవలము భీష్మ సంబంధమగు వ్రతములను గుఱించియే చర్చింతము. భీష్మైకాదశీ వ్రతమని యొకటి కలదు. కార్తిక శు॥ 11 నాడు భీష్ముడు పది దివసములు యుద్ధము చేసి యంపశయ్యపై పడిపోయెను. ఆ సందర్భపు జ్ఞాపకార్థమై యీ యేకాదశి వ్రత మాచరింపబడుచున్నది.

కార్తికైకాదశినాడు భీష్ముడంపశయ్యపై బడినాడనియు, మాఘశుద్ధాష్టమినాడు చనిపోయి నాడనియు వ్రత గ్రంథములు వ్రాయుచున్నవి. మాఘశుద్ధాష్టమినాడు చనిపోయినట్లు భారతమందు సరియగు ప్రమాణములున్నవి. కాని యత డంపశయ్యపై బడినది మార్గశిర శుద్ధైకాదశియే. కార్తిక శుద్ధైకాదశి కాదని 'విజయ దశమి' యను పండుగ వివరములలో వ్రాసినాను. అందు జూడనగును.

భీష్ముడు యుద్ధములో గూలిపడినను ఉత్తరాయణము వచ్చిన తర్వాతనే మృతిచెందెను. ఉత్తరాయణము మాఘశుద్ధ 8 దివసమున వచ్చెనని ప్రమాణములు కలవు. నిర్ణయ సింధువులోను, ధర్మసింధువులోను మాఘశుద్ధ 8 దివసమున భీష్మునికి దిలాంజలి విడిచి పూజింపవలెనని నిర్దేశింపబడినది. ధర్మసింధుకారు డిట్లు వ్రాయుచున్నాడు:

'మాఘ శుక్లాష్టమీ భీష్మాష్టమీ అస్యాం భీష్మోద్దేశన యే[శ్రాద్ధం కుర్వంతి తే సంతతిమంతో భవంతి, తత్ర శ్రాద్ధ కామ్యం తర్పణం తునిత్యం తర్పణే కృతే సంవత్సరో పాత్త దురిత నాశః అకృతే పుణ్య నాశః – తత్ర తర్పణ మంత్రః.'

'వై యాఘ్ర పర్యగోత్రాయ సాంకృత్య ప్రవరాయ చ
గంగా పుత్రాయ భీష్మాయ ఆజన్మ బ్రహ్మచారిణే'.

ఈ పై శ్లోకము వలన భీష్ముని గోత్ర ప్రవరములు తెలియవచ్చెడి. భీష్మాష్టమి నాడు భీష్మునికి శ్రాద్ధ కర్మలు చేయువారికి సంతానాభివృద్ధి కలుగుననియు, పుణ్యము కలుగుననియు, చేయనివారికి పుణ్యానాశమగు ననియు పై ప్రమాణముల వలన విశదమగును.

ఇట్లు భీష్మైకాదశియు, భీష్మాష్టమియు బుణ్యదివసములై యున్నవి. భారత వీరులలో నెవ్వరెవ్వరేయే తిథులందు జచ్చిరో సరిగా జెప్పుట కష్టమైనను భీష్ముని యంపశయ్యాదివసము, మరణదివసమును నిశ్చితములై యున్నవి. ఈయన యెప్పుడు పుట్టెనో, యెంత కాలము జీవించెనో యీ వివరములు సరిగా గానబడవు. అయినను గొన్ని యాధారములచే నతని వయస్సించుమించుగా నెంత యుండునో పరీక్షింతుము. భారతమందు శ్రీకృష్ణుని యొక్కయు, పాండవుల యొక్కయు వయస్సు మనకించుమించు సరిగా గుఱుతుపడుచున్నది. శ్రీకృష్ణుడు 125 సంవత్సరములు జీవించెనని భాగవత పురాణ ప్రమాణముల వలన దెలియవచ్చెడి.

భాగవతమందిట్లున్నది:

యదోర్వంశే వతీర్ణస్య భవతః పురుషోత్తమ
శరచ్ఛతం వ్యతీతాయ పంచ వింశాధికం విభో.

ఈ శ్లోకమును పోతనామాత్యు డిట్లు తెలిగించినాడు:

గీ॥ అఖిలలోకేశ! సర్వేశ! యభవ! నీవు
నుదయమొందుట భూభార ముడుపు కొరకు
పంచవింశోత్తర శతాబ్ద పరిమితంబు
నయ్యె విచ్చేయు వైకుంఠ హర్మ్యమునకు. (ఏకాదశస్కంధము)

కాని ఛాందోగ్యోపనిషత్తులో శ్రీకృష్ణుడు 116 సంవత్సరములు జీవించి యుండినట్లు ప్రమాణము లుండుటచేతను, పురాణములకన్న ఉపనిషత్తులే యెక్కువ ప్రాముఖ్యమైనవి కనుకను మనము 116 ఏండ్ల వయస్సునే అంగీకరించవలెను.

మఱియు భారతమందంతటను శ్రీకృష్ణుడు ధర్మరాజుకు నమస్కారము చేయుటయు, భీమునాలింగనము చేయుటయు, నరుని నాశీర్వదించుటయు వర్ణింపబడినది. అనగా ధర్మరాజు శ్రీకృష్ణునికన్న పెద్దవాడు; భీముడు సమానీకుడు; అర్జునుడు చిన్నవాడని దీని యభిప్రాయము. ధర్మరాజుకన్న భీమార్జును లొక్కొక్క సంవత్సరము చిన్నవారు. కావున ధర్మరాజు వయస్సు 117 సంవత్సరములున్ను, భీముని వయస్సు 116 సంవత్సరములున్ను, అర్జునుని వయస్సు 115 అనియు నిర్ణయము చేయవలసివచ్చును. ఈ యూహను భారత ప్రమాణముల చేతనే సమర్థించెదను.

ధర్మరాజు శతశృంగము నుండి వచ్చినప్పుడు అతని వయస్సీ క్రింది వాక్యము వలన తేటపడును:

"యుధిష్ఠిర భీమార్జునయములు గ్రమంబున షోడశ పంచదశ చతుర్దశ త్రయోదశ వర్షజాతులై శతశృంగంబునకు వచ్చి, యందు గౌరవులంగలసి, యస్త్రవిద్యలం గఱచుచు పదమూడేండ్లుండి యపుడు ధృతరాష్ట్ర నియోగంబున వారణావతంబునకు జననీ సహితంబుగ బోవసమకట్టిరి." దీని వలన ధర్మరాజు వారణావతమునకు బోయిన కాలము నాటికి 29 సంవత్సరములవాడని బోధపడును. వారణావతములో,

క॥ ధనధాన్యములను బ్రియభో
జనదానములను విశిష్ట సిద్ద్విజతతులన్
దనువుచునుండగ దత్పుర
మున షణ్మాసములు భరతముఖ్యుల కరిగెన్.

అనగా లక్క యిల్లు కాలువరకు ధర్మరాజు 29 1/2 సంవత్సరముల వాడు. వారణావతము నుండి పాండవులు శాలిహోత్రునొద్దికి వచ్చి యతని దగ్గఱ "అనేక ధర్మశాస్త్ర నీతిశాస్త్రంబు లభ్యసించి యమ్ముని వీడ్కొని చని విదర్భ మత్స్య త్రిగర్త కీచక విషయంబులు గడచి యేకచక్రపురంబును గనిరి." ఇట్లు ఏకచక్రపురమందు కొంతకాలముండి, బకాసురుని జంపి, పాంచాలదేశమునకు బోయి ద్రౌపదిని

వివాహమాడిరి. అనేక ధర్మనీతిశాస్త్రము లభ్యసించి నానాదేశములందు సంచారములు చేయుటకు వీరికి 10 సంవత్సరములైన పట్టియుండును. కావున ద్రౌపదీ వివాహము నాటికి ధర్మరాజునకు 39 సంవత్సరముల వయస్సుండును. వివాహానంతరము పాండవులు మామ ఇంటిలో 'ఒక్క సంవత్సరం బుండిరి" అని యున్నది. అనగా 40 సంవత్సరములవయస్సు అయ్యెను. తర్వాత ధృతరాష్ట్రుడు వీరిని బిలిపించుకొనెను. పాండవులు "దుర్యోధనాదులతో గలసి యెప్పటియట్లు రాజ్య వినోదంబుల నేను సంవత్సరములుండునంత" ధృతరాష్ట్రుడు వారిని ఇంద్రప్రస్థ పురమున కంపెను. అనగా నిప్పటికి ధర్మరాజుకు 45 సంవత్సరములు. తర్వాత వీరు జూదమం దోడిపోయిరి. "ఇట్లింద్ర ప్రస్థపురంబున నిరువది మూడేండ్లుండి పాండవులు పాపద్యూత పరాజితులైరి" అని సభాపర్వాంతములో నున్నది. కావున ధర్మరాజు అరణ్యమునకు బోవు వరకు 68 యేండ్ల వాడని తెలిసెను. అరణ్యాజ్ఞాత వాసములు 13 యేండ్లు, కలిపి ధర్మరాజు యుద్ధప్రారంభకాలము నాటికి 81 సంవత్సరముల వాడు. యుద్ధాంతమందు గాంధారి శ్రీకృష్ణునికి శాపమిచ్చును. ఇంక 36 యేండ్లకు శ్రీకృష్ణుడు దిక్కులేని చావు చచ్చునని శపించును. కావున పాండవులు శ్రీకృష్ణుడు చచ్చిన వెంటనే చచ్చినవారు గావున వీరును 36 ఏండ్లు యుద్ధానంతర ముండిరని విశదమగును. అప్పటి ధర్మరాజుకు 117 సంవత్సరముల వయస్సుండును. 'శ్రీకృష్ణ జయంతి' లో వ్రాయుచు ఛాందోగ్యోపనిషత్తులో శ్రీకృష్ణుడు 116 ఏండ్లు జీవించినట్లు నిదర్శనములను చూపినాడను. ఇందు భారత ప్రమాణములను బట్టిచూపిన విషయముల వలన ధర్మరాజు 117 ఏండ్లవాడని తేలుటచే శ్రీకృష్ణుడు సరిగా 116 ఏండ్లవాడని పై ఉపనిషత్తు ప్రమాణము ప్రబలమగుచున్నది. కావున శ్రీకృష్ణుడు 116 ఏండ్ల వరకు జీవించి యుండెనని ప్రాచీన ప్రమాణముల సారాంశమై యున్నది.

ఇక మనము భీష్ముని కాలము నిర్ణయింపవలెను. భీష్ముడు ధర్మరాజుకు 80 సంవత్సరముల వయస్సుండినప్పుడు – యుద్ధకాలమందు – మృతిచెందెను. భీష్ముడు ధర్మరాజు తాత. ధర్మరాజు 40వ సంవత్సరమున వివాహమాడెను. ఈ కాలమువలె బాల్య వివాహములు కాక యాకాలమందు క్షత్రియులు కనిష్టము 30 సంవత్సరముల వయస్సు వచ్చినప్పుడే వివాహమాడెడివారు. ఏలయన నాకాలములో స్వయంవరమందు కన్యచే వరింపబడని క్షత్రియులు వరించిన వానిపై యుద్ధము చేసేడివారు. అట్టిచో 20 యేండ్ల పిల్లవాని కేమి యస్త్రవిద్యయుండును? ఎట్టి పాటవముండును? కావున పాండురాజు కుంతిని తన ముప్పదియవ యేట

వివాహమాడెనని నిర్ణయించిన కొంత కాలము శాపమనుభవించి నియోగముచే కుంతీదేవి యందు పుత్రులను గాంచెను. అనగా ధర్మరాజు పుట్టువరకు పాండురాజు కనిష్టము 40 యేండ్లవాడుగా నుండి యుండును. పాండురాజు తండ్రి విచిత్ర వీర్యుడు. విచిత్ర వీర్యుడు పుట్టకముందే భీష్ముడు పుట్టియుండెను. అతడు బ్రహ్మచారిగా నుండు ప్రతిజ్ఞను బూని రాజ్యమున కర్తృతను వదలుకొను నప్పటికి 20 సంవత్సరములవాడుగా నుండి యుండవలెను. లేకున్న బాలుని యొక్క ప్రతిజ్ఞలు పనికిరానివగును. పైగా మత్స్యగంధి తల్లిదండ్రులు భీష్మునికి భయపడియే యీ వరములడిగిరన్న భీష్మడప్పటికే సమర్థుడై, ప్రబలుడై యుండి యుండును. అట్లు 20 సంవత్సరముల యీడునాడు తనతండ్రికి సత్యవతిని దెచ్చి పెండ్లి చేసెను. సత్యవతికి విచిత్రవీర్యుడు పుట్టెను. విచిత్రవీర్యుడు మనము పైన వ్రాసిన సిద్ధాంతము ప్రకారము 30 సంవత్సరముల యీడునాడు పెండ్లి చేసుకొనియుండును. అతనికొఱకే భీష్ముడు బలిమిచే అంబ యంబాలిక లను పడుచులను దెచ్చెను. కావున విచిత్రవీర్యుని పెండ్లినాటికి భీష్ముడు 50 సంవత్సరములవాడు. విచిత్రవీర్యుని భార్యలందు నియోగముచే పాండురాజును ధృతరాష్ట్రుడును బుట్టిరి. పాండురాజుకు ధర్మరాజు పుట్టు వఱకు 40 యేండ్ల వయస్సుండునని ముందే తెలిపియుంటిని. కావున ధర్మరాజు పుట్టువరకు భీష్మునికి 90 యేండ్ల వయస్సుండె ననవలెను. భారత యుద్ధమునాటికి ధర్మరాజుకు 80 ఏండ్లు అని చెప్పితిమి కదా. కావున భీష్ముడు యుద్ధము చేసి చచ్చినపుడు కనిష్ఠము 170 ఏండ్ల వాడని నిర్ణయించవలసి వచ్చును.

170 ఏండ్ల వరకు సాధారణముగా ప్రపంచమందెవ్వరును బ్రదుకరని యనుమానింప నవసరము లేదు. ఈ కాలమందు నానాదేశములందు కొందరు 170 యేండ్లు వారున్నారని పత్రికలలో జదువుచుందుము. అట్టిచో బ్రాచీన కాలమందును ఆయుఃపరిమాణము విశేషముగా నుండినవారు కొందరైన నుండి యుందురు. మఱియు భీష్ముడు నిత్య బ్రహ్మచారి. మహాబలశాలి. కావున 170 యేండ్లు బ్రతికినను బ్రదికియుండవచ్చును.

ఇట్టి భీష్ముని నేల పూజింపవలెనో యన సంశయింపబనిలేదు. ఇతడాదర్శ పురుషుడు. భారతమందు శ్రీకృష్ణుడీతని గుఱించి చెప్పుచు నీతడు చనిపోయెనేని ప్రపంచమునకు గొప్ప నష్టము కలుగుననియు, నీతనకి దెలిసినన్ని విషయములు మఱెవ్వరికిని దెలియవనియు స్తుతించెను. ఇట్లు వయస్సునందును, సర్వజ్ఞత్వ మందును నీతడు పరిపూర్ణుడు. ఇక గుణములందును నీతడు తక్కువ వాడు కాదు.

ముదకతండ్రియొక్క సుఖముకొఱకై వయస్సునందుండిన నీతడు రాజ్య సుఖములను వదలుకొనెను. తుదకు నిత్యబ్రహ్మచారిగా నుందునని వ్రతము పూనెను. కొంతకాలము తర్వాత అంబికను వివాహమాడుమని యతని గురువగు పరశురాముడు బోధించినను వినలేదు. ఈ కారణముచే వారిద్దఱికి 23 దివసములు యుద్ధము జరిగెను. పరశురాముడోడిపోయెను. ఇట్లు గురువుతో యుద్ధము చేయుటకు కూడా జంకలేదు. కాని తన ప్రతిజ్ఞాభంగము మాత్రము గలుగకుండునట్లుగా గాపాడుకొనెను. ఇట్లతిలోకుడై, గుణగణోత్తరుడై, వృద్ధుడై, జ్ఞానఖనియై నిష్కళంకజీవనము గడిపి, ప్రార్థించినట్టి పాండవులకు దనను జంపునుపాయము చూపి తన ప్రాణము లర్పించి మరల వారికే సమస్తనీతులు బోధించి, "అపునరావృత్తిపదమున కేగిన" భీష్ముడు నిశ్చయముగా సర్వసంపూజ్యుడు; నిత్యస్మరణీయుడు.

ఈతని పూజలు బ్రాహ్మణులు చేయుదురు. జనసామాన్య మితని గుఱించిన పండుగ చేయదు.

# మహాలయ పక్షము

ఇది భాద్రపద కృష్ణపక్షమందు వచ్చును. ఈ పక్షమందు హిందువులు తమ తమ పితృదేవతలకు తర్పణములు విడుతురు. ఇవి చాల ముఖ్యమైన దినములు. చచ్చినవారికి తప్పక ఈ దినములలో శ్రాద్ధకర్మలు చేయవలెను. ఇది సర్వవర్ణముల వారిచే చేయబడును. బ్రాహ్మణులగువారు మంత్రపూర్వకముగా తర్పణములు విడుతురు. బ్రాహ్మణేతరులలో విశేష సంఖ్యాకులు మంత్రములు లేకయే చేయుదురు.

బ్రాహ్మణేతరులు – అనగా శూద్రులు – చేయు పద్ధతినించుక విచారింతము. ఈ భాద్రపదమాసములో మన యాంధ్రదేశమందు రెండు పండుగలను శూద్రులు ముఖ్యముగా జేయుదురు. ఒకటి 'మాలపున్నమ'; రెండవది 'పితరుల అమాస'. దీనినే నోరుతిరగక 'పెతర్ల అమాస' అనియు, 'పెద్దల అమాస' యనియు నపభ్రంశముగా నుచ్చరింతురు. ఇందు రెండవది పేరుచేతనే పితృదేవతల సంబంధము కలదని విశదమగును. భాద్రపద కృష్ణ ప్రతిపత్తునుండి యమావాస్య వఱ కెప్పుడైన బితృకర్మలు చేయవచ్చును. కాని శూద్రు లీ కడపటి దివసమున జేయుదురు. ఆనాడు కొందరు మాంసముతోను, కొందరు భక్ష్యములతోను బండుగ జేసికొందురు.

ఇక మాలపున్నమ యన నేమో విచారింతుము. మాల పున్నమను గుఱించి యిట్లు కథ చెప్పుదురు: జోకరయ్య యను తెలుగువాడు మాలపిల్ల నొకదానిని మోహించి, దానిని బొందెనట. కేవలము పొందుటయే కాదు; దాని యింటిలో ప్రతిదినము మాంసము మెక్కుచుండెనట. ఈతని జారత్వమును గుర్తించి పట్టవలెనని యీతని కులస్థు లొకనాడు వీని ప్రియురాలి యింటికి బోవుచుండిరట. అప్పుడీ జోకరయ్య తన ప్రియురాలి యింట మాంసము భుజించుచు నొక యెముకను గొరుకుచుండెనట. అంత నాతని ప్రేయసి యాతనితో దన బంధువులు వచ్చుచున్నారని తెలుప గబగబా యా యెముకను మ్రింగబోవ నది వాని గొంతులో నిరికెనట. అంత జోకరయ్య యా వేదనచే జనిపోయెను. అప్పుడు మాల లీ జోకరయ్యను నొక యెండిన గుంతలో బాఱవైచిరట.

జోకరయ్య స్వర్గలోకమునకు బోయెను. అచ్చటి కింతకు మునుపే వినాయకుల వారు బాగుగ గుండ్రాళ్ళ పరమాన్నమును, కుడుములను భుజించి కుంటుచు పోయియుండెను. (అనగా నీ భాద్రపద మాసమందే శుక్ల చతుర్థీ దివసమున వినాయక వ్రతము జరుగును.) ఈ విఘ్నేశ్వరుడు స్వర్గలోకము పోయినప్పుడు ఇంద్రుడు "ఏమయ్యా! లోకములో మానవుల స్థితిగతు లెట్లున్నవి?" అని విచారించెనట. అప్పుడు 'వెనకయ్య' యిట్లనెనట: "ఏమి చెప్పుదునయ్యా! లోకములో కాపులు, బాపలు, అందరు బలసిపోయినారు. వర్షములు సమృద్ధి. పంటలు పుట్లు పుట్లు. నాకు బొట్ట బగుల మంచి మంచి తిండి పెట్టగా మెక్కి పొట్ట బగిలి వచ్చితిని." ఈ కథ విని యింద్రుడు వర్షమును బిగియబట్టెనట. లోకమందు వానలు లేక పున్నమ వఱకే జనులకిక వర్షమురాదను భయము కలిగెనట. అప్పుడు పున్నమనాడు మన జోకరయ్య యెండిన గుంతలో బడి చావుతప్పి కన్ను లొట్టబోయినట్లు పొర్లి లేచి స్వర్గమునకు బోయెను. ఇంద్రుడిటీవలి వార్తలు– శుద్ధ చతుర్థినుండి పున్నమ వఱకు లోకము లోని జనుల సంగతి – యేమూలమునను దెలిసికొనలేదు. కావున మన జోకరయ్య పోయిన వెంటనే "ఏమయ్యా! ఇప్పుడెట్లున్నది మానవ లోకము?" అని ప్రశ్నించెనట. అందులకు జోకరయ్య జవాబు– "ఏమి చెప్పుదునండీ! ప్రపంచమందు వానలు లేనందున లోకులు కూడులేక చచ్చుచున్నారు. నాకు పట్టుమని పట్టెడైన యన్నము పెట్టజాలక యెముక నోటిలోబెట్టి కుక్కి చంపి వట్టి గుంతలో బారవేసిరి. చెఱువులు, కుంటలు, బావులు అన్నియు నెండిపోయినవి."

ఇంద్రునికి దయ గలిగెను. తాను బంధించిన మేఘములను మరల విడిచెను. వర్షములు సమృద్ధి యయ్యెను. ఇట్లుపకారము చేసినందున నీ జోకరయ్యను నీ దినము శూద్రులలో తెలగ, మాల మున్నగువారు పూజింతురు. జోకరయ్య మాలపిల్లను బొంది మాలడైనందున నీ పండుగను 'మాలపున్నమ' యని యందురట!

ఇది మాలపున్నమను గుఱించి యాంధ్రదేశమందు బ్రచారమందుండు కథ. పౌరాణికులొకటి కల్పించిన బ్రజలు పది కల్పింతురు. ఈ కథకు మూలము కేవలము పుక్కిడి పురాణమే. ఇది కల్పితము. అబద్ధము.

ఇక యథార్థమును గుర్తించెదము. ఈ పండుగ మహాలయపక్ష సంబంధమైనది. మహాలయ పదమునకు తారానాథుడు తన వాచస్పత్య మునందిట్లు వ్రాసియున్నాడు:

మహాలయ – 1. మహాన్ ఆత్యంతికే లయో యత్ర

2. కన్యాస్థ రవిక మాస కృష్ణ పక్షే.
తస్యాం దద్యాత్ న చేద్దత్తం
పితౄణాం వై మహాలయే.

మహాలయము అనగా గొప్ప వినాశనము, లేక చావు. ఇది కన్యాసంక్రమణ మాసమందు వచ్చును. అనగా భాద్రపద కృష్ణపక్షమందు వచ్చును. ఈ పక్షమం దిదివరకు తిలతర్పణములచే పూజింపబడకుండినట్టి పితృదేవతలకు తర్పణము చేయవలెను అని భవిష్యత్పురాణ వచనము. కావున మహాలయ పక్షమున బితృపూజలు జరుగును. ఇక నీ మాలపున్నమ అను పదములలో 'మాల' యను పదము 'మహాలయ' యను పదమున కపభ్రంశము. శూద్రులు 'మహాలయ' యను మాటను నోరుదిరుగక 'మహా' ను 'మా' జేసి, 'మాలయ' యనుట గష్టముగాదోచి, కడపటి అ 'య్య'ను బంపివేసి 'మాల'ను జేసిరి. 'మాల' యన చండాల జాతిభేదము కనుక జోకరయ్య కథను గల్పించిరి. ఈ పండుగ బితృ సంబంధమనుట కీ పున్నమనాడు శూద్రులు మాంసము చేతను, కల్లు సారాయి చేతను బండుగ చేసికొనుట యొక నిదర్శనము అయితే పితరులకు (పెద్దలకు), మాంసమునకు ఏమైన సంబంధమున్నదా యన నున్నదని పురాణధర్మశాస్త్రములే చెప్పుచున్నవి. భారతశాంతి పర్వమందును, విష్ణుపురాణమందును, ఆపస్తంబ మను ధర్మశాస్త్రాదులందును ప్రతిమాస మొక్కొక్కరీతి జంతుమాంసముచే శ్రాద్ధకర్మలు చేయవలెనని యాదేశములు కలవు. మనుస్మృతి యిట్లాదేశించుచున్నది:

పితౄణాం మాసికం శ్రాద్ధ మన్వాహార్యం విదుర్బుధాః,
తచ్చామిషేణ కర్తవ్యం ప్రశస్తేన ప్రయత్నతః.

మాసిక శ్రాద్ధమును ప్రశస్తమైన మాంసము చేత చేయవలసినది అని దీని భావము.

భక్ష్యం భోజ్యం చ వివిధం మూలాని చ ఫలాని చ,
హృద్యానిచైవ మాంసాని పానాని సురభీణీ చ. –మను. 3 అ. 227

ఈ శ్లోకము కూడ పితృ శ్రాద్ధకర్మలందు బ్రాహ్మణులకు – అందు ముఖ్యముగా వేదములు చదివిన బ్రాహ్మణులకు – శ్రాద్ధానంతరము రుచి కరమగు మాంసపు గూరచే గుడువబెట్టవలెనని చెప్పుచున్నది.

మనుస్మృతిలోని తృతీయాధ్యాయములో 268, 269, 270 శ్లోకములలో చేపల మాంసము చేతను, జింక, పొట్టేలు, పక్షులు, మేక, దుప్పి, ముండ్లపంది, దున్నపోతు, కుందేలు, తాబేలు – వీని మాంసము చేతను శ్రాద్ధము చేసిన పితృదేవత లత్యంతముగా తృప్తి పొందుదురని వర్ణింపబడియున్నది.

కాని యిటీవల బ్రాహ్మణులు మాంసభోజనము విడుచుట యుత్తమమని భావించి దాని కాధారము కల్పింపనెంచి వృద్ధపరాశరుని సృష్టించి ఆ ముదుకచే 'ఫలపైతృకము' కలియుగమందు వర్జ్యము అని చెప్పించిరి! అయినను శూద్రులు మాత్రమింకను నీ విషయమున సత్యయుగ ధర్మమునే యాచరించుచున్నారు!!

అయితే 'మాలపున్నమ' మహాలయపక్ష సంబంధమనుట కొక్క యాక్షేపణము కలుగుచున్నది. బహుళ పాడ్యమినాడు దీనిని చేయుచుండిన సందేహమే యుండదు. అయితే యిది శూద్రులందఱిలో నాచారమై యున్నందున వారీ పున్నమనాడే, అనగా ఒక దినము ముందుగానే యీ పండుగను జేసి మరల అమావాస్యనాడు, అనగా కడపటి దివసమునను నీ పండుగ చేయుటచే నిది మహాలయ (పున్నమ) యగుటలో నేమియు సందేహము లేదు.

మనుస్మృతిలో మహాలయ శ్రాద్ధ విధిని గుఱించి యిట్లున్నది:

యత్కించి న్మధునా మిశ్రం ప్రదద్యాత్తు త్రయోదశీం,
తదప్యక్షయ మేవ స్యా ద్వర్షాసు చ మఘాసు చ.

వర్షర్తువునందు భాద్రపద కృష్ణ 13 నాడు తేనెతో శ్రాద్ధము చేసిన నది అక్షయముగా నుండునని దీని భావము.

ఈ వివరములు తెలిసికొనగోరువారు మనుస్మృతిలో తృతీయాధ్యాయ మందలి 273 నుంచి 286 వరకుండు శ్లోకములను జూచికొనగలరు.

# దత్తాత్రేయ జయంతి

ఈ జయంతి మార్గశిర శుద్ధ దశమినాడు చేయబడును. దత్తాత్రేయుడు త్రిమూర్తుల యవతారమని భావింపబడును. ఇతని సృష్టిని గుఱించి యీ క్రింది యితిహాసము గలదు: నారదు డొకమారు త్రిమూర్తుల భార్యలతో నత్రిభార్య యగు అనసూయను బోలుపతివ్రతలు సర్వలోకములం దెందును లేరని చెప్పి కలహబీజము నాటిపోయెను. త్రిమూర్తులును దమ తమ భార్యలు అనసూయ పాతివ్రత్యమునకు భంగము కలిగించునట్లు చేయవలెనని ప్రేరేపణ చేసిరి. ముగ్గుఱు మూర్తులదే ప్రకారము మారు వేసములతో ననసూయ యింటికి కతిథులై వచ్చిరి. అనసూయ వారిని బూజించి భుజింప గూర్చుండబెట్టెను. కాని వారామె నగ్నయై వచ్చిననే భుజింతుమని చెప్పిరి. అప్పుడు అనసూయ తన భర్త పాదములు గడిగి, యా నీటిని వీరిపై చల్లెను. ఆశ్చర్యము! ఆ ముగ్గుఱు దేవతలు పిల్లలై కావు కావు మనిరి. ఆ పిల్లల కీమె దిగంబరయై పాలిచ్చెను. పిమ్మట వారినామె నుయ్యేలయం దుంచి యూచెను. ఇట్లు మూర్తిత్రయము శిశుత్రయమైరి. వారి భార్యలు వారికై యెదురు చూచి చూచి, తుదకు అనసూయదేవి యింటికివచ్చి తమ మగల యవస్థను జూచి ఖిన్నలై యామెను పతిభిక్ష పెట్టుమని ప్రార్థించిరి. అప్పుడామె మరల తన భర్త పాదముల గడిగి యా నీటిని వారిపై చల్లగా నా శిశువులు యథారూపమును దాల్చి త్రిమూర్తులైరి. అప్పు డీబ్రహ్మ విష్ణు మహేశ్వరు లనసూయా పాతివ్రత్యమునకు మెచ్చి వరమును వేడుమన నామె వారిని వేరు రూపమున దనకు బుత్రులై యుండగోరెను. కాననే దత్తాత్రేయుడు పుట్టెను. ఇతని కాళ్ళు చేతులు, మూడు తలలు. మధ్యశిరస్సు విష్ణువుదనియు, దాని కుడిది శివునిదనియు, నెడమది బ్రహ్మదనియు జెప్పుదురు.

వేదకాలమందు నింద్రాది దేవతల ప్రాముఖ్యము హెచ్చు. పురాణకాలమందు మూర్తిత్రయ మేర్పడెను. ఈ ముగ్గుఱు మూర్తులు భిన్నులు కారనియు, నొక్కరే యనియు, దేవుడొక్కడేయను వేదప్రమాణమును సమన్వయించుటకై యీ దత్తాత్రేయోద్భవ కథా సందర్భ ముద్దేశమై యుండియుండును. మఱియు పాతివ్రత్య ప్రభావము వలన సాక్షాద్దేవ దేవులనైన దారుమారు చేయవచ్చునని బోధించుట నీ కథోద్దేశములలో నొకటియై యుండును.

# కూర్మ జయంతి

ఇది వైశాఖ పౌర్ణమీ దివసమున జేయబడును. ఇది యంత ప్రాముఖ్యమైనది కాదు. దేవదానవు లమృతమును మథించినప్పుడు మందరపర్వతము సముద్ర మందు గ్రుంకకుండునట్లుగా విష్ణువు కూర్మరూపమునదాల్చి దానిని మోసెనని పురాణములందు జెప్పుదురు. కూర్మావతారము దశావతారములలో నొక్కటిగా బరిగణింపబడుచున్నది.

ఈ కూర్మావతార విషయమై యాంగ్ల పండితులభిప్రాయ మిట్లిచ్చి నారని గుప్తే పండితు డుదాహరించినాడు:

"పూర్వ మొకప్పుడు సంపూర్ణ సూర్యగ్రహణము సంభవించెను. అది బెంట్లీ పండితుని యభిప్రాయము ప్రకారము క్రీస్తువునకు పూర్వము 945వ సంవత్సరమున సంభవించెనట. (అనగా నేటికి 2883 ఏండ్ల క్రిందట ఈ సంఘటన మేర్పడెను.) దీనినే దేవదానవుల యుద్ధముగా వర్ణించినారు. దేవతలు వెలుతురునకును, దానవులు చీకటికిని గల్పింపబడిరట. ఈ సూర్యగ్రహణము నాడే శనిగ్రహము మొట్టమొదట జ్యోతిష్కులకు గనబడెనట. గ్రహణసమయమున చంద్రు డడ్డము వచ్చి చీకటిని గలిగించినందున నది మందరపర్వతముగా గల్పింపబడెనట. కౌస్తుభరత్నము దొఱకెననుట శనిగ్రహమును గుర్తించుట యట. తక్కిన దంతయు నుత్ప్రేక్షయట" విమర్శకు లేది నిజమో విచారించుకొనగలరు.

ఒకవేళ ఈ సూర్యగ్రహణ నిరూపణమే నిజమైన ఇంత మాత్రము మనము నిశ్చయించుకొనవచ్చును. అదేమన, పురాణములలో ముఖ్యమైనట్టివి సుమారు 2800 ఏండ్ల క్రిందట వ్రాయబడెను.

# నృసింహ జయంతి

ఈ నృసింహ జయంతి ప్రతి వైశాఖ శుక్ల చతుర్దశీ దివసమున గావింపబడును.

ఈ జయంతి సర్వవర్ణముల వారు చేయవచ్చునని యీ క్రింది ప్రమాణము చెప్పుచున్నది:

"సర్వేషామేవ వర్ణానా మధికారో ఒ స్తి మద్వ్రతే"

అట్లైనను నిది కేవలము బ్రాహ్మణుల చేతనే చేయబడును. బ్రాహ్మణేతరులలో శ్రీరామనవమీ, కృష్ణాష్టమీ జయంతులే ప్రధానముగా నుండనప్పుడు ఈ నృసింహ జయంతియు ప్రాముఖ్యము నొందలేదని చెప్పవచ్చును.

ఈ వ్రతమును గుఱించి హేమాద్రి బ్రహ్మాండ పురాణము లిట్లు వ్రాయుచున్నవని వ్రత గ్రంథకారు డుదాహరించినాడు.

## నృసింహ జయంతి కథ

నృసింహస్వామి హిరణ్యకశిపుని చంపి, ప్రశాంతుడైయున్న తర్వాత ప్రహ్లాదుడు చేతులు జోడించుకొని యా స్వామి నిట్లు ప్రశ్నించెను: "ఓ స్వామీ! మిమ్ముల బ్రీతుగా జేయుటెట్లు?" ఆ మాటకు స్వామి యిట్లానతిచ్చెను: "నా యందు భక్తికలవాడే నాకు బ్రియుడగును. పూర్వజన్మమందు నీవును వేశ్యాలోలుడవై యుండి నన్ను భజించిన కతన నీయుత్తమజన్మమును బొందితివి. అదెట్లన, పూర్వము అవంతీ పురమందు సుశర్మయను వేదపారగుడగు బ్రాహ్మణుడొక డుండెను. అతని భార్య సుశీల యను సార్థక నామధేయ. ఆ పతివ్రత కైదుగురు కొడుకులు పుట్టిరి. అందొకడవు నీవు (ప్రహ్లాదుడవు). నీవు వేశ్యాలోలుడవై, నానా పాపము లాచరించితివి. సురాపానము, సువర్ణస్తేయము మున్నగు మహాపాతకము లొనర్చితివి.

అట్టి నీవును, వేశ్యయు మీరు చేసిన పాపముల నుండి, నా వ్రతము తెలియక చేసి ముక్తి పొందితిరి. ఒకనాడు నీ గృహమందు కలిపురుషుడు నీ బోగపుసానితో గూడియుండెను. ఆ దివస మీ వైశాఖ చతుర్దశి. ఆ నూతన విటునితో నీకు గలహము

జరుగుటయు, నీ వానాడు పగలు మితిమీరి తినుటచే రాత్రి భుజింపక జాగరణ చేయుటయు నా వ్రతము చేయునదిగా నయ్యెను. దానిచే నీవు విముక్తుడవైతివి నా వ్రతము దేవతలు కూడ జేసినారు. బ్రహ్మదేవుడు సృష్ట్యర్థమై నా వ్రతము చేసెను. ఈశ్వరుడు త్రిపురాసుర వధకై నన్నారాధించెను. నా వ్రతము చేయు జనులు కల్పశతానంతరము గూడ నీలోకమునకురారు. వారు నిత్యకైవల్యపదవి బొందుదురు. మఱియు పుత్రులు లేనివారు, ధనములేని వారు, వేయేల, యేయే వస్తువుల నభిలషించువారు నా వ్రత మాచరించిన తమ యీప్సితముల బొందుదురు. నా వ్రతము చేయనివారు నరకమునకు బోదురు... వ్రతము చేయువాడీ దివసమున నదీతటాకాదులందు స్నానము చేసి, శుచియై, నన్ను ఋతుకాలోద్భవములైన పుష్పముల చేత బూజింపవలెను. రాత్రి జాగరణ చేయవలయును. బ్రాహ్మణులకు స్వర్ణమయమగు సింహ విగ్రహమును దానము చేయవలయును. ఈ విషయములో విత్తశాఠ్యము చేయజనదు; అనగా లోభత్వము చూపగూడదు. మఱియు బ్రాహ్మణులను భోజనముచే సంతోషపెట్టవలయును. ఈ ప్రకారముగా నావ్రత మాచరించువాడు, సర్వపాప విముక్తుడై సద్గతి పొందును." ఇది నృసింహ జయంతి కథ.

## విమర్శ

దశావతారములలో నృసింహావతార యొక యవతారముగా బరిగణింపబడుచున్నది. ఈ యవతారము కథ యందఱకును విదితమే. భాగవతమందీ కథ చాల రమ్యముగా వర్ణింపబడినది. ఆంధ్ర భాగవతమందు సహితము పోతన ప్రహ్లాదుని చరిత్రమును బహురమ్యముగా వర్ణించినాడు. అభిలాషులందీ వివరములను చూచికొనగలరు.

ఈ యవతారము కేవలము హిరణ్యకశిపుని వధ కేర్పడినదని పురాణములు చెప్పుచున్నవి.

# వామన జయంతి

ఈ వామన జయంతిని ప్రతి సంవత్సరము భాద్రపద శుక్లమందు శ్రవణానక్షత్రయుక్తమైన ద్వాదశినాడు చేయుదురు. భాగవతమందు నీ దినమందే వామనుడుద్భవించెనని యున్నది. ఆంధ్ర భాగవతము నుండి యీ యంశము నుదాహరించుచున్నాను:

మ॥ రవి మధ్యాహ్నమునం జరింప గ్రహతారాచంద్ర భద్రస్థితిన్
శ్రవణద్వాదశినాడు శ్రోణనభిజిత్ సంజ్ఞాత లగ్నంబునన్
భువనాదీశుడు పుట్టె వామనగతిన్ బుణ్యవ్రతోపేతకున్
దివిజాధీశ్వరు మాతకున్ బరమ పాతివ్రత్య విఖ్యాతకున్

దశావతారములలో నీ వామనావతార మొకటిగా భావింపబడుచున్నది.

ఈ వామనుని కథ శ్రీ మహాభాగవతమందు జాల విపులముగా వర్ణింపబడినది. అందఱకు దెలిసినదియైనను రెండు మాటలలో దాని సారాంశము నిందు వ్రాసెదను.

పూర్వము బలి చక్రవర్తియను రాక్షసుడు చెలరేగి దేవతలను గెలిచి, యింద్రుని బాఱదోలి, ముల్లోకముల కధిపతి యయ్యెను. ఈ దైన్యమును దేవతల తల్లి యోర్వక కశ్యపునితో జెప్పికొని విష్ణు నారాధించెను. విష్ణువు తన యంశముచే ఆమె గర్భమందు వామనుడై పుట్టెను. ఈ పొట్టివాడు పెద్దయై బలిచక్రవర్తి దానములు చేయుచున్నాడని విని బ్రాహ్మణుల గుంపులో గలిసి బలి దగ్గఱకు బోయి మూడడుగుల భూమిని వేడెను. బలియు దన గురువగు శుక్రుడు వలదని వారించి నను వినక మాట తప్పనివాడై, వామనునికి ధారపోసెను. వామనుడు తన నిజరూపముతో భూమ్యాకాశములను దన రెండు పాదములచే నావరించి, మూడవ పాదమునకు దావులేక, బలి శిరస్సుపై నుంచి యతనిని బాతాళమున కణగద్రొక్కెను.

ఇది కథ. ఈ బలిచక్రవర్తిని నిర్జించి యింద్రునికి మరల స్వర్గరాజ్య మిప్పించుటకై యీ యవతార మేర్పడినదిగా పురాణములు చెప్పుచున్నవి.

## విమర్శ

ఈ బలిచక్రవర్తి విషయమై, వామనుని మూడడుగల విషయమై దీపావళి పండుగ యొక్క విమర్శనయందు వివరించినాడను. అందుజూడనగును. బలిచక్రవర్తిని నిర్జించుటకు మాత్రమే యీ యవతార మెత్తుటలో విశేషమేమియు గానరాదు.

పరిత్రాణాయ సాధునాం వినాశాయచ దుష్కృతాం,
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.

అని భగవద్గీతయందు బోధింపబడిన రీతిగా దుష్టశిక్షణార్థమే యవతార మవసరమగును. అట్టిచో బలిచక్రవర్తి దుష్టుడని నిరూపింపజాలము. ఆడినమాట తప్పువాడు కాడు. తుదకు తన గురుశాపమునైన నోర్చెను గాని సత్యమును తప్పకపోయెను. రాక్షసులందఱు వామనుని కైతవము జూచి కత్తులు కటారులు చేతబూని యుద్ధసన్నద్ధులు కాగా వారిని శాంతపఱచెను. ఈ బలిరాజ్యములో బ్రపంచమంతటను సకాల వర్షములు కురిసెననియు, ధన ధాన్య సమృద్ధి యుండెననియు, ముఖ్యముగా బ్రాహ్మణులు తృప్తిబొంది, కోరిన యర్థముల నాతని నుండి పడసిరనియు భాగవతమందు వర్ణించియున్నారు. తుదకు వామనుడే బలి నిట్లు ప్రశంసించెను:

శా॥ బద్ధుండై, గురుశాప తప్తుడయి, తాబంధుప్రజత్యక్తుడై,
సిద్ధైశ్వర్యము గోలుపోయి, విభవక్షీణుండునై, పేదయై,
శుద్ధత్వంబును, సత్యమున్, గరుణయున్, సొంపేమియుం దప్ప డు
ద్బుద్ధుండై యజయాఖ్య మాయ గెలిచెం బుణ్యుం డితం డల్పుడే?

ఇట్టివాని వినాశార్థముగా నీ యవతారము వచ్చుటయేలయో యూహింప శక్యము కాదు. ఇంద్రలోకము నీ బలి గెలిచె నను నెపమున నీతడు వామనునిచే బాతాళలోకమున కంపబడెను. ఈ పై సందర్భములను బట్టి చూడ నేను దీపావళిని గురించి వ్రాసిన విమర్శలో విషయములనే యొక రమ్యమగు కథారూపముగా పురాణకారులు వ్రాసిరని విశ్వసింపవలయును.

ఈ వామనజయంతి నృసింహజయంతివలెనే బ్రాహ్మణులకే ప్రధానమైనది. తక్కిన వర్ణముల వారు నాచరించుట లేదు.

# తులసీ వ్రతము

ఈ వ్రతమును క్షీరాబ్ధిశయన వ్రతమనియు, క్షీరాబ్ధి వ్రతమనియు వ్యవహరింతురు. ఈ వ్రతము బ్రాహ్మణులలో, స్త్రీలలో విశేష ప్రాముఖ్యము వహించియున్నది.

అనేక పురాణములలో, ననకే విధముల నీ తులసీ కథ వ్రాసి యున్నారు. ఒక పురాణమందిట్లున్నది:

తులసి పూర్వజన్మలో కాలనేమి యను రాక్షసుని బిడ్డయై జన్మించెను. ఆమెను జలంధరు డను రాక్షసునికిచ్చి పెండ్లి చేసిరి. ఈశ్వరుడొక మారింద్రునిచే జీవాట్లు తినినప్పుడతని ఫాలస్థలము చెమ్మరించెనట. ఆ చెమట సముద్రమందు బారవేయబడ దాని నుండి యీ జలంధరు డుత్పత్తి యయ్యెను. ఈ జలంధరుడు సముద్రమందు బుట్టినందున దన తండ్రియైన సముద్రుని నుండి దేవతలు లాగికొనిన లక్ష్మీకౌస్తుభ పారిజాత కామధేన్వాది వస్తువులను మరల దనకిమ్మని యింద్రుని గోరెను. ఇంద్రు డియ్యకొననందున జలంధరుడు స్వర్గలోకము నాక్రమించుకొనెను. జలంధరునికి బ్రహ్మ యొక వరమిచ్చి యుండెను. ఎంతవరకాతని భార్య జలంధరుని తప్ప నితరుల బొందదో యంతవఱకు జలంధరుని జంపు వీరుడే లోకమునను నుండడని. ఈ కీలకము నెఱిగి విష్ణువు జలంధరుని వేషమున నతని భార్యయగు తులసిని బొందెను. అప్పుడు ఇంద్రుడు జలంధరుని తలదునుమ నా తల తులసి ముందఱ వచ్చిపడెను. తులసి సర్వము నెఱిగి విష్ణువును రాయిగమ్మని శపించెను. గండకీనదిలో దొఱకు సాలగ్రామశిలలే యీ శాప ఫలితశిలలట. విష్ణువు కూడ తులసికి బ్రతిశాపమిచ్చి యామెను మొలకయై యుండుమనెను. కావున నా దేవి యిప్పుడు తులసిచెట్టయియున్నది. అయినను వీరిద్దఱకు నేటి కాలమందు వివాహము చేసి బూజలు చేయుచున్నారు.

పద్మపురాణమందీ కథ యించుక భేదముగానున్నది. జలంధరు డీశ్వరుని మూడవకంటి మంటనుండి జన్మించెనట. ఇతని భార్యపేరు బృంద. ఈ బృంద తన భర్త దేవతలతోడి యుద్ధమందు జయమందుటకై విష్ణువును గూర్చి పూజ చేయుచుండెను. అప్పుడు విష్ణు వామెకు జలంధరుని రూపమున గనబడెను. తన భర్త వచ్చె నను

సంతోషమున నామె విష్ణు పూజ పూర్తిగా జేయకపోయెను. ఆ కుహనాభర్తయు, బృందయు గొన్ని దినములు కాపురము సేయుచుండ జలంధరుని శిరము దునుమబడి యాబృంద ముంగల బడెను. అప్పుడు తులసి విష్ణువును శపింపబోగా, విష్ణువామెతో దా నెల్ల లోకముల దులసీదేవిగా బూజింపబడునట్లు వరమిచ్చి పోయెను.

బ్రహ్మకైవర్త పురాణమున నీ కథ యిట్లున్నది: యుధిష్ఠిరుదరణ్యవాసము చేయుచుండ వ్యాసులవారు వారి దగ్గఱకు వచ్చి, ప్రసంగవశమున నీ తులసీదేవి కథ నిట్లు జెప్పిరట: "కార్తిక శుద్ధ ద్వాదశినాడు విష్ణువు క్షీరసముద్రము నుండి మేల్కొంచి, బృందావనమునకు వచ్చి, యిట్లు లోకమునకు వెల్లడించెను. ఏ మానవుడీ దివసము నన్ను, దులసిని బూజించునో వాడు సర్వపాప విముక్తుడగును. కావున కార్తిక శుద్ధ ద్వాదశినాడు తులసికి దీపములు పెట్టి పూజింపవలెను. ఒక దీపదానము చేసిన ననేక పాతకములు నశించును. నూరు దీపములచేత విష్ణురూపమును బొందును. నూటికి మించిన దీపదానములు చేసిన నాఫలమును వర్ణించుటయే కష్టము."

"తులసీ మహిమ బ్రహ్మకు గూడ దెలియదు. ఈ తులసీ పూజను ద్వాదశి నాడెవ్వడు చేయడో వాడు పలు జన్మములు చండాలుడై పుట్టును. తులసి చెట్టును పెంచిన వారా చెట్టుకెన్ని వేరులుండునో, యన్ని మహాయుగములు విష్ణులోకమం దుందురు. దీనిని గుఱించిన కథ యొకటి కలదు. కాశ్మీర బ్రాహ్మణులిద్దరు కాశీయాత్ర చేయుచుండిరి. అందొకడు బాటలో నొకతులసిని జూచి, దానిని వలగొని నమస్కరింప, రెండవ బ్రాహ్మణుడా విశేషమేమని విచారింప, వారిరువురొక చింత తొఱ్ఱ క్రింద గూర్చొని తులసీ మహాత్మ్యమును జెప్పుకొనిరి. అంత తటాలున చెట్టు తొఱ్ఱ నుండి యిద్దఱు దివ్యపురుషులు బయటకు దుమికి "మహాత్ములారా! మీరు మాకు జాల యుపకారము చేసితిరి. మేమప్సరసల తోడి వినోదములందు దగిలి రోమశ మహాముని శాపము వలన బ్రహ్మరాక్షసులమై తులసీ మహాత్మ్య శ్రవణానంతరము విముక్తి బొంద ననుగ్రహింపబడితిమి. మీకు బదివేలు దండములు. మీకు శుభమగును. మేము పని వినియెదము" అని ప్రార్థించి, దీవించి యంతర్ధానమైరి.

వితంతుల కిది ముఖ్యముగా నేర్పాటు చేయుట కీ క్రింది కథ ప్రమాణము. పూర్వము ద్వారపతీ నగరమున నొక బ్రాహ్మణుని కూతురు చిన్నతనమందే నవ్యవైధవ్య బహువిధ వ్యథలచే గుంది తండ్రితో నాదుఃఖోపశమనార్థమై జ్ఞానోపదేశము చేయుమని వేడ నాతడు సంతసించి యీ తులసీ పూజను బట్టువడజేసెను. ఈ కారణమున నాయమ రెండవ జన్మమున మిత్రవిందయై పుట్టి శ్రీకృష్ణునికి భార్యయయ్యెను.

ఈ తులసీ మహాత్మ్యమును గుఱించి యింకొక కథ కూడా గలదు. అదెట్లన:

తంటాల తాకట్ల నారదుడొకమారు సత్యభామతో భర్తను వశీకరించు వ్రతమొకటి యున్నదని చెప్పి, యందులకై శ్రీకృష్ణునే యాతనికి దానమియ్యవలసినదని బోధించెను. మరల నాకృష్ణుని తూకముతో సమానమగు బంగారునిచ్చి శ్రీకృష్ణుని విడిపించుకొనవచ్చునని చెప్పెను. సత్యభామ యీ యుపాయమున కొప్పుకొని శ్రీకృష్ణునితో దనముచ్చట యొకటి నెరవేర్పవలెనని ప్రార్థించి, యొప్పించి యా భర్తను నారదునికి దానము చేసెను. నారదు డా కృష్ణుని దన తంబురాను, జింకతోలును నిచ్చి మోసికొని తన వెంట రమ్మని యాజ్ఞాపించెను. శ్రీకృష్ణుడట్లే చేసెను. సత్యభామ పిమ్మట శ్రీకృష్ణుని నొక త్రాసు నందుంచి యాతని తూకమునకు సరిపోవునట్లు తననగల నన్నింటిని దూచెను. కాని త్రాసు చింతాకంత కూడ కదలకపోయెను. సత్యభామ ఖిన్నురాలయ్యెను. నారదుడు శ్రీకృష్ణుని వెంటగొని పోదునని తొందరపెట్టెను. అప్పుడు శ్రీకృష్ణుని యితర భార్యలు సహితము తమ యాభరణములను, ధనమును సర్వము తక్కెడలందుంచిరి. కాని త్రాసునందు జలనమేమియు లేదు. అప్పుడు రుక్మిణిదేవి భక్తితో దులసిని పూజించి, యొక్క తులసీ పత్రమును దీసికొని త్రాసులో వేయగా శ్రీకృష్ణుడు పైకి దూదివలె లేచెను. అప్పుడు నారదుడు రుక్మిణి భక్తిని తులసీ మహిమను గొనియాడి, సత్యభామ గర్వభంగ మొనరించి, శ్రీకృష్ణునికి దాస్యవిముక్తి నిచ్చెను.

ఈ కథనే శ్రీకృష్ణ తులాభారమందురు. ఇవి తులసీ సంబంధమగు కథలు.

## విమర్శ

ఈ తులసీ మహాత్మ్యమును గుఱించి వ్రాసిన కథలు పరస్పర విరుద్ధముగా నున్నవి. ఏ ప్రమాణమగు శ్రుతి స్మృతి గ్రంథములందును తులసీ చర్చ లేదు. ఇది తర్వాతి కొన్ని పురాణములలో క్రమముగా కల్పింపబడినట్లు తోచును. ఏది యెట్లున్నను దీని ముఖ్యతత్వము మనము గుర్తింపవలయును. తులసి చాల యుత్తమమగు నోషధి. ఇది ప్రతివారి యింట నుండిన నారోగ్యకరముగా నుండును. కావున నీ తులసిని ప్రతి యింట నుంచవలెనని పౌరాణికుల యభిప్రాయమై యుండును. అట్టిచో "మీ ఇంటిలో దులసిని తప్పక పెంచుడు. అది యనేక రోగములను హరించును. దాని వలన మీరు మేలు పొందుదురు" అని వారు చెప్పి యుండిన నెవరు విందురు? మఱియు నట్లు బోధించుట వారి పద్ధతికాదు. ఏ చిన్న విషయమును గాని భక్తుల మనస్సున కెక్కింపవలయుననిన నా వస్తువు త్రిమూర్తులకే ముఖ్యాధారమైనట్టిదని

చెప్పకుండిన వారి కులమునకు దప్పు వచ్చును. కావున వారీ తులసిని గుఱించి “ఇది యిట్టి పతివ్రత. ఇది విష్ణువు భార్య. ఇది దేవతలచేతనే పూజింపబడినది. దీనిని పూజించినవారు యుగాంతరముల వఱకు విష్ణుసాయుజ్యమొందుదురు” అని వర్ణించియుందురు.

ఇక తులసి యొక్క గుణము లెవ్వియో విచారింతుము. వైద్య గ్రంథములు దీనిని గుఱించి యిట్లు వ్రాసియున్నవి:

1. ఇది వాయువును శుభ్రపఱచును.
2. దీనిని తినిన నాకలి గుణము కలుగును.
3. ఇది రక్తమును శుభ్రపఱచును.
4. పక్క నొప్పులను బాగు చేయును.
5. చర్మ రోగములను బాగుచేయును. (గజ్జి, దురద, తామర, కలవారిది రుద్దుకొనిన నవ్వ తక్కువ యగును)
6. మూత్ర వ్యాధులను పోగొట్టును.
7. తులసి నిండ్లలో విశేషముగా నుంచిన దోమలుండవు. దోమలు లేకుండిన చలిజ్వరములు (మలేరియా) ఉండవు.
8. కుష్టు వ్యాధులకును, పాము కాటులకును దీని యాకు రసము, వేరు వలని గంధము పనికివచ్చును. ధన్వంతరి నిఘంటునందు తులసిగుణముల నిట్లు వర్ణించినారు:

తులసీ లఘుతిక్తోష్ణా రూక్షాచ కఫవాతనుత్,
క్రిమిదోషం హర త్యేషా రుచికృ ద్వహ్ని దీపనీ.

అనగా తులసి తేలికగను, చేదుగను, ఉష్ణము కలిగించునదిగను నుండును. మఱియు రూక్షము గలది, కఫవాతము బోగొట్టు నదియునైయున్నది. ఇది క్రిమి దోషమును హరించును. రుచికరముగా నుండును. ఇంతికాక అగ్ని దీపనమును గలిగించును. మఱియు అష్టాంగహృదయము (బాహటము)లో దీని గుణము ఇట్లు వర్ణింపబడినది: “ఈ నల్ల తులసి హిధ్మకాసము, శ్రమశ్వాసము, పార్శ్వశూల, దౌర్గంధ్యము వీనిని హరించును.”

# కపిలా షష్ఠి

షష్టి అనగా 60 సంవత్సరములు. కావున నీ వ్రతము 60 సంవత్సరముల కొకమారు వచ్చును. భాద్రపద మాసములో కృష్ణపక్షమందు సూర్యుడు హస్తానక్షత్ర సమీపమం దుండినపుడు మంగళవారమునాడు రోహిణీ నక్షత్రమున నీ వ్రతము చేయవలెను. అనగా నిన్ని గ్రహములు భాద్రపద మాసమందు కూడియుండవలెను. ఏ సంవత్సర మివన్నియు గూడునో యప్పుడిది చేయవలెనని యర్థము. దీనిని గుఱించి యొక కథ గలదు. అదెట్లనగా:

నారదుడొకసారి గంగలో స్నానము చేయుచు రెండు చేపలు క్రీడించుట జూచెను. వానిని జూచి యతనికి సంసార సౌఖ్యముపై కాంక్ష గలిగెను. కలిగి యిట్లనుకొనెను: "శ్రీకృష్ణునికి 16008 గురు భార్యలట, అందొకతెను నాకిచ్చిన నతని కేమి తక్కువ? కావున నాతనినే యడిగెదను" అని బయలుదేరి, శ్రీకృష్ణునితో దన యభిలాష నెఱింగించెను. శ్రీకృష్ణుడును నిదియొక వినోదముగా భావించి, కోపగించుకొనక నారదునితో నిట్లనెను: "నీవు నా భార్యల యిండ్లకు బొమ్ము. ఏ భార్య దగ్గఱ నేనుండనో దానిని నీవు పరిగ్రహింపుము." నారదుడట్లే 16008 యిండ్లు తిరిగెను. కాని ప్రతి యింటిలో కృష్ణుడే కనబడెను. ఇంతలో నాతడు స్నానము చేయు ప్రొద్దయ్యెను. కావున మరల గంగకు బోయి యొక మునుక మునిగెను. మునిగి పైకి లేచువఱ కతడొక సుందర స్త్రీ యయ్యెను. అతడు తన సర్వాంగములు మారినది చూచుకొని విస్మితుడయ్యెను. ఇంతలో నొక సన్యాసి వచ్చి యా 'నూతన వధువును' చేయి బట్టి లాగి బలవంతపు బెండ్లి చేసికొని తన కుటీరమందే యుంచుకొని, యామె వలన క్రమక్రమముగా 60 మంది కుమారులను గనెను. ఇట్లు 60 సంవత్సరములు గడిచెను. పిల్లలను బోషింపలేక సంసారము నుండి విముఖియై, యీ స్త్రీ నారద విష్ణువును బ్రార్థించెను. అప్పుడా సన్యాసి భర్త మాయమై, విష్ణువు ప్రత్యక్షమయ్యెను. "ఏమి వరము కోరెదవో కోరుము" అనెను. నారదునికి దెలివి వచ్చెను. "స్వామీ! నేను మూర్ఖునైతిని. నాకీ సంసారములో సుఖమున్నదని తలచితిని. ఇంత దుఃఖభాజనమైనది మరొకటిలేదు. దీనినుండి నన్ను దప్పించి, యీ పెంటి రూపును మాపి, నన్ను మరల పూర్వము

వలెనే చేయవలెను” అని యనెను. ఇట్లనుచుండగనే యాతని 60 మంది కుమారులు ‘తల్లి’ చుట్టు చుట్టి ‘కూడో కూడు” అని లబలబ కొట్టుకొనుచుండిరి. విష్ణువు కనికరించి యిట్లనెను: “నారదా! నీవు యథాప్రకారముగా పురుషుడవై యుండగలవు. ఈ నీ కుమారులు ప్రపంచ రాజ్యమున ఏటేట నౌకరి వంతుల 60 యేండ్ల ప్రకారము అనుభవించుచు నుండగలరు.” ఇది కథ.

ఈ యరువది కుమారులే ప్రభవ, విభవాది యరువది సంవత్సరములు. ఈ సంవత్సర విభాగము వింధ్యకు దక్షిణభాగమందు శాలివాహన శకము చెల్లు దేశములందున్నది. ఈ విభాగ ప్రకారము 60 ఏండ్లు నిండునప్పు డీ కపిలావ్రతమును జేయవలెను. వ్రతకారుల యుద్దేశమై యుండును. మఱియు నీ సంవత్సరముల ప్రాముఖ్యమును జూపుటకై నారదునికీ యవస్థను గల్పించి, యతని కుమారులనుగా వీని నేర్పాటు చేసిరి.

ఈ వ్రతమునా డొక విచిత్ర కపిలధేనువును సిద్ధము చేయవలెనట. దీనికి రెండు బంగారు కొమ్ము లుండవలెను. రాగి రేకుతో వీపు చేయవలెను. గిట్టలు వెండివిగా నుండవలెను. తక్కిన భాగము కంచు. దీని దూడ కూడ నిట్లే యుండవలెను. దీనిని బ్రాహ్మణునికి దానము చేయవలెను. అట్లు చేసిన పాపక్షయమగును.

# సూర్య చంద్రగ్రహణములు

ప్రతి సంవత్సర మొకసారి సూర్యగ్రహణమును, చంద్రగ్రహణమును సంభవించుచుండును. దీనికి గారణము పురాణములందు రాహువను రాక్షసుని యొక్క పీడ యని చెప్పబడుచున్నది. భాగవతమందీ కథ అష్టమస్కంధమందు వ్రాయబడి యున్నది. ఆ కథను సంక్షేపముగా నాలుగు మాటలలో జెప్పెదను. పూర్వము దేవదానవులకు నిరంతర వైరముండెను. ఆ వైరముచే వారికి పోరాటములు జరుగుచుండెను. అందు రాక్షసులే జయము పొందుచుండిరి. అప్పుడు దేవత లందఱును రాక్షసులతో సంధిచేసి వారి గర్వము నణచుటకై శ్రీ మహావిష్ణువును బ్రార్థించిరి. విష్ణువు వారిని సముద్ర మథనము జేసి అమృతమును సంపాదించుటకై నియోగించెను. దేవతలును, రాక్షసులును గలిసి యీ పనికై పూనుకొనిరి. రాక్షసులు మందర పర్వతమును సమూలముగా బెకలించికొనివచ్చి సముద్రములో వేసిరి. వాసుకి సర్పమును కవ్వపుద్రాడుగా జేసిరి. విష్ణువు కూర్మరూపియై పర్వతమును మోసెను. సురాసుర లట్టి సాధనములతో సముద్రమును మథింపగా నందు లక్ష్మి, ఉచ్చైశ్రవము, ఐరావతము, కల్పవృక్షము, కామధేనువు మున్నగునవి యుద్భవించెను. తరువాత హాలహల మను విషముద్భవించి ప్రపంచమును దహింపజొచ్చెను. దానిని శివుడు మ్రింగెను. తుదకు ధన్వంతరి అమృతకుంభముతో సముద్రము నుండి వెడలెను. వెంటనే రాక్షసులా కుంభమును లాగికొని, తామే దానిని భుజింతుమని నిశ్చయించిరి. అప్పుడు విష్ణువు మోహినీరూపము దాల్చి రాక్షసులను మోహింపజేసి వారి నుండి అమృత కుంభమును దీసికొని సురాసురలకు సమముగా పంచియిత్తు నని నమ్మజెప్పి, మొదలు దేవతలకా యమృతమును బంచిపెట్టెను. రాక్షసులలో నొకడగు రాహువు దేవలత పంక్తిలో గూర్చొని యమృతము త్రాగెను. ఈ సంగతిని సూర్య చంద్రులు విష్ణువును కెఱిగింప నాతడు తన చక్రముచే వాని తల దునిమెను. కాని యతడంతవఱకే యమృతము త్రాగినవాడగుటచే వాని శిరమొక గ్రహమై యాకసమున నిలిచెను. ఈ గ్రహము ప్రతి సంవత్సరము సూర్యచంద్రులను బట్టి విడుచును. ఇది పురాణగాథ.

## విమర్శ

ఈ గాథ కల్పితము. జ్యోతిశ్శాస్త్ర గ్రంథము లన్నియు సూర్య చంద్ర గ్రహణములకు గారణములను వేరుగా జూపుచున్నవి. అవియే విశ్వసనీయములు. ఏలన, పంచాగములను వ్రాయు వారీ జ్యోతిశ్శాస్త్ర ప్రకారము గుణించి ప్రతి సంవత్సర మాయా కాలములందు సూర్యచంద్ర గ్రహణములు కలుగునని చెప్పుదురు. అదే ప్రకారము నేటికిని మన యనుభవమందు జరుగుచున్నది. ఒక్కొక్క సంవత్సరము గ్రహణములు కనుపించును. వేరు సంవత్సరములందు వేరు దేశములందు గనుపించును. ఇవి భూమీ చంద్రుల గమనమును బట్టి యుండును. ఈ గ్రహణములకు కారణము గణకానంద మను జ్యోతిశ్శాస్త్రమం దిట్లు సూచింపబడినది. చంద్రగ్రహణము కారణము:

కింతు భూమే రథ స్సూర్య శ్చోర్ధ్వభాగే నిశాకరః
ఉభయోః పూర్ణమాయాంతు రాశి షట్కాంతరం భవేత్.
అతోర్ధ్వ వ్యాపిభూచ్ఛాయాం యావద్విశతి చంద్రమాః,
తావ ద్విక్షేపత శ్చంద్ర గ్రహణస్య మితి ర్భవేత్.

పౌర్ణమినాడు సూర్యచంద్రుల మధ్య భూమి వచ్చిన చంద్రగ్రహణమగును.

స్వకక్ష్య రాశితుల్యత్వం దర్శాంతే సూర్యచంద్రయోః,
భవం త్యేవహి సూర్యస్య కక్ష్యధ స్సంస్థిత శ్శశీ.
కాలేన యావత స్సూర్య మాచ్ఛాదయతి పర్వణి,
సూర్యస్య తావ ద్గ్రహణం భవే దత్ర నసంశయః.

అమావాస్యనాడు సూర్యునికిని, భూమికిని మధ్య చంద్రుడు వచ్చిన సూర్యగ్రహణము కలుగును.

# ఋషి పంచమి

భాద్రపద శుక్ల పంచమీ దివసమున నీ వ్రతము చేయబడును. ఇది సర్వజనులకు ప్రాముఖ్యము కాదు. బ్రాహ్మణులలో సహితము కొందఱే చేయుదురు. ఇది సప్తర్షుల నుద్దేశించి చేయబడునట్టి వ్రతము.

కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, వసిష్ఠుడు– వీరు సప్తర్షులు. ఈ ఋషి పంచమీ వ్రతము చేయువారు వీరితో సహా వసిష్ఠుని భార్యయగు నరుంధతిని గూడ నర్చింతురు. ఈ దివసమున సప్తర్షి పూజలు ప్రత్యేకముగా చేసి, తర్వాత నందఱి పూజయు జేయవలెను. ఈ వ్రతమును జేయువారు సర్వపాపముల నుండి విముక్తులగుదురని చెప్పబడినది.

## ఋషి పంచమీ కథ

పూర్వము విదర్భదేశమందు ఉదంకుడను బ్రాహ్మణుడును, సుశీలయను వాని భార్యయును, చిన్నతనముననే వితంతువైన వాని బిడ్డయు నివసించు చుండిరి. రాత్రి కాలమందావిధవ నిద్రించిన యనంతరము క్రిమిరాశియై పోవుచుండెను. భార్య దాని కారణము విచారింపగా త్రికాలవేదియగు భర్త యిట్లునెను: "పూర్వ మీ బిడ్డ యేడవ జన్మమందు ఋతుమతిగా నుండిన కాలమున భాండాది స్పర్శనము చేసిన దోషమున నీ జన్మమునందామె శరీరము పురుగులకుప్ప యగుచున్నది. కావున దీని పరిహారార్థము ఋషిపంచమీ వ్రతము చేసినట్లైన నీ స్త్రీ పరిశుద్ధయగును."

ఈ వ్రతమును గుఱించి శ్రీకృష్ణుడు ధర్మరాజుతో నిట్లు చెప్పెను.

'రజస్వలయగు స్త్రీ మూడు దినములు క్రమముగా చండాలిని వలె, చాకలి వలె, బ్రహ్మఘాతిని వలె మహాపాతకినియై యుండును. నాల్గవ దివసమున స్నానము చేసిన పరిశుద్ధురాలగును. రజస్వలగా నుండు కాలమున తెలిసియో, తెలియకయో యింటిలోని కుండలు మున్నగునవి ముట్టిన నా స్త్రీ మహాపాతకమును బొందును. పూర్వమింద్రుడు వృత్రాసురుని వధచే పాపము బొంది, యా పాపమును అగ్నికి, జలమునకు, చెట్లకు, స్త్రీలకు బంచి పెట్టి, తాను పాపవిముక్తుడయ్యెను. స్త్రీలవంతునకు

వచ్చిన పాప భాగమే యీ రజోరూపము దాల్చుచున్నది. దీనిని గుఱించి యొక కథ యున్నది. పూర్వము విదర్భదేశమందు సుమిత్రుడను బ్రాహ్మణుడుండెను. అతని భార్య రజస్వలగా నుండిన కాలమందు భాండాదులను ముట్టుకొనెను. ఆ పాపముచే వారు జాతిస్మరణ కలిగినట్టి కుక్కలుగా తమ కొడుకు గృహమందే పుట్టిరి. కొంతకాల మిట్లుండనొకనాడు తండ్రి తద్దినమునకై యా యింట పాకము చేసిన పాయస భాండమం దొక పాము విషము విడిచిపోయెను. తల్లియగు కుక్క దీనిని జూచి కుండను ముట్టి కొడుకున కుపకారము చేసెను. కాని కొడుకది గుర్తింపక, దానిని నడుమ విఱుగనడచెను. పెంటికుక్క పోతుతో తమ పూర్వజన్మపు గొడుకు చెయిదములను జెప్పికొని యేడ్చెను. ఇది కొడుకు విని, ఋషులను సమీపించి, వారి యాదేశముచే నీ దీనదశ నుండి తన తల్లిదండ్రులకు ముక్తినిప్పించుటకై ఋషి పంచమీవ్రతము నేడు సంవత్సరములు చేసెను. అప్పుడు తల్లిదండ్రులు శునకరూపముల జాలించి దేవవిమానమునందు దివ్యలోకముల కేగిరి."

ఇది భవిష్యోత్తర పురాణమందు శ్రీకృష్ణుడు ధర్మరాజునకు జెప్పినట్టి వ్రత కథ. ఈ ఋషి పంచమీ వ్రతము వలన స్త్రీలు పాపవిముక్తులై, సుఖసంపద బొంది, పుత్ర పౌత్రాభివృద్ధి కలిగి యుందురని వ్రతఫలముగా జెప్పబడినది.

# సత్యనారాయణ వ్రతము

కామ్య వ్రతములలో సత్యనారాయణవ్రతము ముఖ్యమైనట్టిది. ఈ వ్రతమునకు నితర వ్రతములవలె నొక ప్రత్యేక దిన మేర్పాటు కాలేదు. ఈ వ్రతము నెప్పుడైనను చేయవచ్చునని శ్రీవిష్ణు భగవానుడే నారదునికి ఇట్లు చెప్పెను:

"ఈ వ్రతము దుఃఖమును బోగొట్టును. ధనధాన్యముల నిచ్చును. సౌభాగ్యమును, సంతతిని నిచ్చును. దీని నేదినమందైనను నొక దినమందు సాయంకాల సమయమున జేయవలయును."

ఈ సత్యనారాయణ వ్రత ప్రభావ మెట్టిదో తెలుపుటకై స్కాంద పురాణమందలి రేవాఖండమందిట్లు వ్రాయబడినది. మున్నొకసారి నారదుడు ప్రపంచమందలి జనుల దుర్గతిని జూచి, వారి నుద్ధరించు నిమిత్తమై వైకుంఠమున కరిగి విష్ణువును స్తుతించి ప్రసన్నుగావించుకొని, యా దేవుని నిట్లు ప్రశ్నించెను: "మర్త్యుల విమోచనార్థమై ఒక సులభోపాయమును తెలియజేయుడు." అందులకు శ్రీ విష్ణువు సమ్మతించి యిట్లు సెలవిచ్చెను.

"ప్రపంచములో నేజనులు సత్యనారాయణ వ్రతమాచరింతురో, వారు సుఖులై, దుఃఖవిముక్తులై, ధన ధాన్య సౌభాగ్యసంతతియుక్తులై సుఖింతురు. ఈ వ్రతమును పూర్వ మెవ్వరెవ్వరు చేసిరో ఈ విషయమును తెలుపుచున్నాను. పూర్వమొకప్పుడు కాశీపట్టణమున నొక దరిద్ర బ్రాహ్మణుడు వ్యాకులుడై, దేశ దేశముల దిరుగుచుండ, సత్యనారాయణుడు కరుణించి, వృద్ధ బ్రాహ్మణ రూపధారియై యతనికీ వ్రతమును బోధించెను. అటులనే యాతడానాడు ఆర్జించిన ద్రవ్యముచే సత్యనారాయణవ్రత మాచరించి, సర్వదుఃఖముల నుండి విముక్తి బొంది సుఖించెను. ఈ బ్రాహ్మణుడిటులే పలుమారు వ్రతములు నాచరించుచుండ నొక నాడొక (కాష్ఠవిక్రేత) కట్టెలమ్మువాడిది చూచి విచారించి సంగతి నెఱిగి తానును జేయ నుద్యుక్తుడయ్యెను. ఇట్లు సంకల్పమాత్రము కలుగగా నా దినము వాని కట్టెలకు క్రయము రెండంతలు దొఱకెను. ఆ క్రయము నంతయు వ్రతమునకే వినియోగించి వాడు సుఖించెను. అట్లు సుఖించుటే కాదు. వాడవసానమందు సత్యలోకమును బొందెను."

ఈ వ్రతమును గుఱించి మఱియొక కథయు నిదే స్కాంద పురాణమందు కలదు. అదే మన, పూర్వమందు జితేంద్రియుడును, సత్యప్రియుడును నగు ఉల్కముఖుడను రాజు ఈ వ్రతమందు శ్రద్ధాళుడై యుండెను. వ్రతము చేయు కాలమందుడొక కోమటి వచ్చి దాని విశేషమును రాజు వలన నెఱిగి, తాను సంతానహీనుడగు కారణమున తనకు సంతానము కలిగిన సత్యనారాయణుని కొలుతునని మ్రొక్కులిడెను. కొంత కాలమునకు వీనికి కళావతియను కూతురు పుట్టెను. భార్య తిన్నగా భర్తతో తనమునుపటి మ్రొక్కును జ్ఞప్తికి దెచ్చెను. "బాలిక పెండ్లియప్పుడా వ్రతమును జేయుదుము. ఇప్పుడేమిలే!" యని యతడు ప్రత్యుత్తరమిచ్చెను. కన్యకకు పెండ్లియయ్యెను. కన్యతండ్రియు, అల్లుడగు వరుడును కలిసి ద్వీపాంతరమునకు వ్యాపారార్థము వెళ్ళిరి. పెండ్లి జరిగినను వ్రతము జరుపనందున సత్యనారాయణుడు క్రుద్ధుడై, వైశ్యునికి ఘోర దుఃఖములు సంభవమగునట్లు శపించెను. వైశ్యు దేద్వీపమున కేగెనో యచ్చట రాజగృహమందు దోపిడియయ్యెను. దొంగలు రాజభటులచే తఱుమబడి వారి నుండి విముక్తి గానక, తమ దొంగిలించిన ధనమును మన సెట్టిగారి బసలో బారవైచి యథేచ్ఛం జనిరి. సెట్టిగారిని, అల్లుని రాజభటులు పట్టుకొని రాజసభకు పోయిరి. వారాద్రవ్యమును లాగికొని వారిని కారాగృహమందు ద్రోయించిరి. సత్యనారాయణుని కోపమంతటితో శమించలేదు. ఇంటిలో సెట్టిగారి భార్యయు బిడ్డయు దరిద్రులై వీథులందు కూటికి తిరుగసాగిరి. ఇట్లుండ నొకనాడొక భక్తుని యింట వ్రతము జరుగగా నావ్రతాంతమందు స్వామి ప్రసాదము కొంత సెట్టి బిడ్డకు లభించెను. అప్పుడు తల్లిబిడ్డలకు వ్రతము జ్ఞాపకము వచ్చుట తడవ వారా వ్రతమును గావించి దేవుని ప్రసన్నునిగా జేసికొనిరి. ఇట్లు ప్రీతుడై సత్యనారాయణుడు సెట్లను చెఱనుంచిన రాజు స్వప్నమందు గనిపించి, వారిని విడుదల చేయునట్లాజ్ఞాపించెను. రాజును మఱునాడు మామాయల్లుండ్రను కారాగృహ విముక్తులనుగా జేసి, వారి ద్రవ్యము వారికిచ్చి, వారిని మర్యాదతో బంపించెను.

అయితే ధనమదాంధులగు నీ వియ్యంకులను మరల పరీక్షింపనెంచి, సత్యనారాయణస్వామి వారికొక సన్యాసిగా గనబడి, వారి యోడలో నేమి యున్నదని విచారించగా, వారు గర్వముతో నిట్లనిరి: "దానిలో నుండు ధనమును నీ వపహరింప నెంచిన నది వ్యర్థ ప్రయాసమే యగును. అందేమియు లేదు. అందుకు కుండలుతప్ప నింకేమియు లేవు." కుహనా సన్యాసియు "నట్లయగుగాక" యని శపించెను. వైశ్యులు తమ ధనమునకు మారుగా నిజముగా వట్టికుండలే యుండుట జూచి, ఖిన్నులై,

సన్యాసిపాదములు పట్టుకొని క్షమాపణ వేడి సుముఖునిం గావించుకొని గండము తప్పించికొని తమ దేశమును జేరికొనిరి. చేరిన వార్త యింటిలో దెలిసెను. సెట్టిగారి కూతురు వ్రతము చేయుచుండినదై, భర్తయు, తండ్రియు వచ్చిన వార్తను విని, సంతోషమున వ్రతమును బూర్తిచేయ మఱచి, సముద్రతీరమున కెదుర్కొనబోయెను. సత్యనారాయణునకు మరల పట్టరాని కోపము కలిగెను. సెట్ల నిరువుర సముద్రమందే ముంచివైచెను. మరల వ్రతమును జేసిరి. మరల దేవునికి దయ కలిగెను. మరల కోమట్లు సముద్రముపై తేలివచ్చిరి.

ఇందుల కింకొక కథయు గలదు ఒక రాజు మృగయావినోదియై, నానాజంతు సంహారమొనర్చి, యలసి, యొకచో గొల్లలు చేయు వ్రతము చెంత విశ్రమించెను. గొల్లలు ప్రసాద మర్పించినను తీసికొనడయ్యెను. దేవునికి కోపము వచ్చెను. రాజు రాజ్యభ్రష్టుడయ్యెను. అప్పుడు రాజు తెలివి తెచ్చుకొని మరల గొల్లలుండుచోటికి వచ్చి వ్రతమాచరించి వారిచ్చు ప్రసాదమును స్వీకరించి తన రాజ్యమును మరల పొందెను.

ఇవి సత్యనారాయణస్వామిని గూర్చిన వ్రతకథలు. ఈ వ్రతమును సర్వజనులాచరించవచ్చును. ప్రత్యేక కాలనియమము లేదు. అయినను కొన్ని సమయములలో చేయుట మంచిదని వ్రత గ్రంథములలో చెప్పబడినది.

"పౌర్ణమాస్యా మమావాస్యాం సూర్య సంక్రమణ వ్యతీపాతాష్టమీ ద్వాదశీ భౌమభృగు సూర్యపర్వదినేషు చన్ద్రానుకూల్యే మన ఉత్సాహ బ్రాహ్మణ ముఖ్యోక్త పర్వసువా సత్యనారాయణవ్రతం కుర్యాత్."

అనగా పౌర్ణిమావాస్య సూర్యసంక్రమణాదికాలములందును, అష్టమీ ద్వాదశీ తిథులందును, లేక బ్రాహ్మణులు సూచించిన దినము నందును నీ వ్రతము నాచరింపవచ్చును. బ్రాహ్మణాది ద్విజులకు వేదోక్తముగ వ్రతము చేయవలయును.

"స్త్రీశూద్రాదిః కర్తాచే ద్వైదిక మంత్రప్రయోగో నకార్యః"

స్త్రీశూద్రులు వ్రతమాచరించిన వారికి వైదిక మంత్రములు కూడవు. అనగా వారితో పౌరాణికముగా నీ వ్రతము చేయించవలయును.

# శ్రావణ పూర్ణిమ

రాకీపున్నమ యని యీ పండుగ వ్యవహరింపబడును. దీనినే సంస్కృతములో రక్షికాపూర్ణిమ యనియు నందురు. రక్ష యనగా సంరక్షణ. ఈ రక్షికాపూర్ణిమయే వికృతరూపమున రాకీపున్నమయైనది. ఈ పండుగనాడు బంధువులును, స్నేహితులును నొకరికొకరు ముంజేతిపై పట్టుదారమునైన, వెండితీగనైన, బంగారుతీగెనైన, నింకను వెలగల రత్నమౌక్తికములతో జేరిన కంకణములనైన కట్టుకొందురు. దీనినే 'రక్షాబంధము' అని యందురు. ఈ పండుగ ప్రతి సంవత్సరము శ్రావణపూర్ణిమనాడు జరుగును. ఈ పండుగనాడు యజ్ఞోపవీతధారులగు ద్విజులు క్రొత్త జందెములను ధరింతురు. కావున నీ పండుగ బ్రాహ్మణాదులలో ప్రాముఖ్యముగ నున్నది. శూద్రులచే నీ పండుగ యాచరింపబడదు. రక్షాబంధన విధానము ఆంధ్రదేశమందు విశేష ప్రచారమందు లేదు. ఇది విశేషముగా నుత్తర హిందూ స్థానమందు జరుపబడుచున్నది. కొంకణదేశములో నీ దినమునాడు సముద్రమునకు జనులంద ఱరిగి టెంకాయలతో సముద్రమును బూజింతురు. కావున నా దేశమున నీ పండుగను 'నారలీ పూర్ణిమ' యని యందురు. ఈ పండుగ విషయమై భవిష్యత్పురాణమం దిట్లున్నది. "పూర్వము రాక్షసులు దేవతలచే నోడింపబడిరి. అప్పుడు బలి మున్నగు రాక్షసులు తమ గురువగు శుక్రునితో తమ విషాదమును దెలుపుకొనగా నాతడు దేవతలు రక్షాబంధనముచే నజేయులైరనియు నట్టి రక్షాబంధమునే రాక్షసులకు గూడ నేర్పాటు చేయుదుననియు చెప్పి వారలకుందు మాన్పెనట. అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణునితో నిట్లనెను: "ఈ రక్షాబంధమెట్టిది? ఎట్లు, ఎప్పుడు చేయవలెను?" శ్రీకృష్ణుడిట్లు చెప్పెను:

"శ్రావణ పూర్ణిమనాడు బ్రాహ్మణాది చాతుర్వర్ణ్యములవారు స్నానము చేసి దేవపితరులను పూజింపవలెను. తర్వాత ఉపాకర్మాదికమును జేయవలెను. మధ్యాహ్నకాలమందు రక్షను సిద్ధము చేయవలెను. గృహమధ్యమందు అలికి పీటను వేయవలెను. అచ్చట యజమాని బ్రాహ్మణ పరివృత్తుడై కూర్చుని వారిచే రక్షను గట్టించుకొనవలెను. ఈ ప్రకార మొకరికొకరు నాలుగు వర్ణములవారు రక్షికాబంధమును గట్టుకొనవలెను. ఇట్లు చేసిన నొక సంవత్సరకాలము వఱకు వారు సుఖముగా నుందురు."

పండిత భవానీ ప్రసాదుగా రీ శ్రావణ పూర్ణిమను గుఱించి తన 'ఆర్యపర్వ పద్ధతి' యను గ్రంథమందుత్తమ పరిశోధనా ఫలితములగు విషయములను వ్రాసియున్నారు. వానిని క్రింద నుదాహరించుచున్నాను.

ఈ పండుగను గుఱించి పారస్కర గృహ్యాసూత్రమందిట్లున్నది:

ఆథాతో అధ్యాయోపాకర్మ. ఓషధీనాం ప్రాదుర్భావే శ్రవణేన శ్రావణ్యాం పౌర్ణిమాస్యాం శ్రావణస్య పంచమ్యాం హస్తేనవా.

భావము: ఈ యుపాకర్మను శ్రావణ పంచమినాడు గాని, పున్నమనాడుగాని చేయవలయును.

మనుస్మృతిలో నిట్లున్నది:

శ్రావణ్యాం ప్రౌష్ఠపద్యాం వా ప్యుపాకృత్య యథావిధి,
యుక్తశ్ఛందాం స్యధీయేత మాసాన్ విప్రోర్ధ పంచమాన్.
పుష్యే తు ఛందసాం కుర్యాత్ బహిరుత్సర్జనం ద్విజః,
మాఘశుక్ల స్య వా ప్రాప్తే పూర్వాహ్ణే ప్రథమేహని.

భావము:- బ్రాహ్మణాదులు శ్రావణపూర్ణిమనాడు కాని, భాద్రపద పూర్ణిమ నాడు కాని యుపాకర్మ చేసికొని, నాటినుండి 5 1/2 నెలల పర్యంతము వేదాధ్యయనము చేయవలెను. తర్వాత పుష్యమందుగాని, మాఘమందుగాని యైదు నెలలు 15 దినములైన వెంటనే యధ్యయనము చాలింపవచ్చును.

పై ప్రమాణముల వలన శ్రావణపూర్ణిమనాడు తన యజ్ఞోపవీతధారణము చేసికొని బ్రాహ్మణాది ద్విజాతులు 4, 5 మాసముల వఱకు వేదాధ్యయనము జేయవలసిన విధియై యుండెను.

కాని యిక్కాలమందా యాచారము లన్నియు నడుగంటినవి. మధ్యవచ్చిన యప్రధానమగు రక్షికాబంధము ప్రాముఖ్యత వహించినది.

ఈ రక్షాబంధనమునకు ప్రమాణము భవిష్యత్పురాణమందు దప్పమరెందును లేదు. మఱియు నీ యాచారము మొగలాయి రాజులు ఢిల్లీలో సామ్రాజ్య మారంభించిన కాలములో ముసల్మానుల క్రౌర్య నైచ్యముల నుండి స్త్రీలను రక్షించుటకై రాజపుత్రస్థానములో ప్రారంభమయ్యెను. రాజపుత్ర స్త్రీలు తాము మెచ్చుకొనిన వీరుని

హస్తమందీనాడు రక్షికను గట్టుటచే యా స్త్రీ పురుష లక్కదమ్ముల వరుసవారైరి. అట్టి సోదరిని యావజ్జీవము రక్షించు భార మాకృతక సోదరునిదై యుండెను.

చిత్తూరు మహారాణియగు కర్ణావతి తన కోటను గుజరాతు నవాబగు బహదూరుషా ముట్టడింపగా దనను రక్షింపుమని ఢిల్లీ చక్రవర్తిగా నుండిన హుమాయూను పాదుషాకు రక్షాబంధన మంపి ప్రార్థించెను. అతడా ప్రార్థన మంగీకరించి బహదూరుషాను దణిమివైచెను. నాటి నుండి యీ యాచారము మన దేశమున బహు ప్రాంతముల ప్రబలెను.

## విమర్శ

యథార్థ మేమన, ప్రాచీనములో యజ్ఞోపవీతధారణము ఆర్యులకు ప్రధానాచారమై, వారిని అనార్యుల నుండి భిన్నింపజేసిన నాడు సంవత్సరమున కొకమారు నూత్నయజ్ఞోప వీతములను ద్విజులు ధరించుటకై ఏర్పాటు చేసుకొనిన దివసము ఈ రక్షికాపూర్ణిమ. అందుచేత దక్షిణ హిందూ దేశములో ఈ దినమున క్రొత్త జందెములను ధరింతురేకాని ఒకరిచేతి కొకరు రక్షను కట్టుకొను నాచారము లేదు. ఇప్పుడిప్పుడందందు ఈ నూత్నాచారము ప్రారంభమగుచున్నది.

రక్షికను కట్టు నాచారము మొదలు రాజపుత్రస్థానములో ప్రారంభమయ్యెనని చారిత్రికాధారములను పైన చూపించినాను. మహమ్మదీయులు ఉత్తర హిందూ స్థానము నాక్రమించుకొనినప్పుడు స్త్రీలపై అత్యాచారము లందందు జరుగుటకు మొదలయ్యెను. అప్పుడు రాజపుత్ర స్థానములో హిందువులు తమ యైక్యతకును, ఆత్మగౌరవార్థమును తమ స్త్రీల మానసంరక్షణార్థమును నీ రక్షికాబంధ నాచారమును ప్రచారమునకు తెచ్చిరి. అయితే ఆ కాలములో శ్రావణపూర్ణిమ నాడే యీ యాచారము నాచరణయం దుంచినట్లు కానరాదు. ఏ రాజపుత్ర స్త్రీయైనను తనకు శత్రువుల నుండి కష్టస్థితి యేర్పడినప్పుడు తనకు నచ్చిన వీరునికి – అతని నామె చూచినదైనను, చూడనిదైనను, లేక ఇక ముందును చూడ తటస్థము కాకుండినను, అతడామెకు పరిచితుడైనను, కాకపోయినను, ఎట్టి పరిస్థితులోనైనను సరే– ఒక మణిబంధము పంపుచుండెడిది. అట్లే వీరుని కామె (రక్షికా) మణిబంధము నంపునో అతడామెకు కృతక సోదరుడయ్యెను. ఆ సోదరుడు తన ప్రాణముల నొడ్డియైనను తన యంగీకారసూచకముగా తన నూత్నసోదరికి ఒక పట్టు రవికెను– ముత్యాలతో పొదిగించిన దానిని పంపెడివాడు. ఇట్టి యాచారము చేతనే ఈ రాజపుత్రులలో ఐక్యత ఏర్పడుచు వచ్చెను. రాణీ కర్ణావతి

ఇదే పద్ధతిచే హుమాయూన్ సుల్తాను సహాయము పొందగా నా సుల్తాను తానప్పుడు బెంగాలులో యుద్ధము చేయుచుండినవాడైనను ఆ పనిని వదిలి మహావేగముతో చిత్తూరును చేరి, బహదూరుషాను ఓడించి, రాణియొక్క శిశువగు ఉదయసింగును సింహాసనముపై ప్రతిష్ఠించెను.

క్రమక్రమముగా ఉత్తర హిందుస్థానమందలి హిందువులలో నీయాచారము వ్యాపించిపోయెను. దీనికి ప్రాధాన్యత నిచ్చుటకై తర్వాతి కాలములో దీనిని భవిష్యత్పురాణములో నెక్కించినట్లు తోచుచున్నది. ఏలన, మరి యే పురాణ మందును దీని నిదర్శనము లేదు.

ఏది యెట్లున్నను శాఖోపశాఖలచే భిన్నులైన హిందువులలోనీ యొక్క యాచారమైనను సర్వత్ర ప్రచారమునకు తేదగినదైయున్నది. ఈ శ్రావణపూర్ణిమ శాస్త్రోక్తముగా బ్రాహ్మణాది ద్విజులదే యైనను ఈ కాలములో కేవలము బ్రాహ్మణులకే దక్షిణదేశమందిది ప్రధానమైనట్టిది. శూద్రాదివర్ణములవారి కిందు స్థానము లేదు. అందుచేత ఉత్తర హిందుస్థానపు ఆచారము దక్షిణమునకు సర్వత్రా వ్యాపించిన హిందువులలో ఐక్యత కిది యొక ముఖ్య సోపానముగా నుండగలదు.

ఈ పండుగను 'నూలిపున్నమ' యని పూర్వము వ్యవహరించిరి. పాల్కురికి సోమన తన పండితారాధ్య చరిత్రలో దీనిని పేర్కొనినాడు.

# సంక్రాంతి

ఈ పండుగ ప్రతి సంవత్సర మితర పండుగలు వచ్చినటుల ఒకే దినము రాదు. ఏలన, ఈ పండుగ సూర్యుని సంచారమును బట్టి యేర్పడును. సూర్యుడారు మాసముల కాలము దక్షిణాయనమం దుండి పిమ్మట ఉత్తరాయణమునకు బోవును. ఆ సందర్భమున నీ పండుగను జేయుదురు. సాధారణముగా నిది మార్గశీర్ష మాసమందు వచ్చును; లేదా పుష్యమాసమందైనా వచ్చును.

సంక్రమణము నాడు జనులు ఉపవసించి పితరులకు తిలోదకములు విడిచి తామును నూలపిండితో శరీరమును రుద్దుకొని స్నానము చేయుదురు. కొన్ని ప్రాంతములందు సంక్రాంతి పండుగ మూడు దినముల వఱకు కూడా చేయుచుందురు. ఆ దినములో ప్రతిదినము ఇంటిముంగట నలికి, రంగు రంగుల పిండితో ముగ్గులు పెట్టి, గోమయముతో గురుగులు చేసి, వానిలో నానావిధములగు రంగుల పూలను, నూలు బియ్యమును, రేగుపండ్లను పెట్టి యిండ్ల నలంకరించికొందురు. మఱియు ప్రతిదివసము కొందఱు నూల నంటించిన రొట్టెలను జేసి భుజింతురు. సజ్జలు పండు భూములలో నివసించువారు సజ్జ రొట్టెలకు నిండుగా నూలనంటించి చేసి భుజింతురు. సంక్రాంతి పండుగ చలికాలమందు వచ్చును. సజ్జలు ఉష్ణము గలిగించు స్వభావము కలవి. కావున వీనితో జేసిన రొట్టెలా కాలమందు భుజించుటకు జాల యోగ్యములైనవి. సంక్రాంతి పండుగనాడు నానావిధములగు కూరలనన్నింటిని గలిపి వండుదురు. ఆ దినము బ్రాహ్మణులకు కూరగాయలను, ధాన్యమును, దక్షిణను నిచ్చెదరు.

మొదటి దినము చేయు పండుగను భోగి యందురు. రెండవ దినము నాడు సంక్రాంతి చేయుదురు. దీనిని మకర సంక్రాంతి యని యందురు. ఈ సంక్రాంతి పండుగనాడు బ్రాహ్మణులకు కుంకుమ, సుగంధ ద్రవ్యములు, తండులములు, గుడము, పుష్పములు, వస్త్రములు మున్నగు వానిని స్త్రీలు దానము చేయవలయునని పురాణములు బోధించుచున్నవి.

ఈ పండుగ కేవలము సూర్యుని నుద్దేశించి చేయబడునట్టిది. సూర్యుడు

దక్షిణము నుండి యుత్తరాయణమునకు బోవును గాన నీ పండుగ జేయబడును.

## విమర్శ

సంక్రాంతి మాసమున కొకసారి వచ్చును. జ్యోతిశ్శాస్త్రమందు 12 నక్షత్ర రాసుల నేర్పాటుచేసియున్నారు. ఒక్కొక్క మాసమందు సూర్యుడొక్కొక్క రాశి యందు వచ్చుటచే నామాసమందా నక్షత్రముతో సంబంధించిన సంక్రాంతి యని యందురు. ఈ సంక్రాతులలో ముఖ్యమైనది మకర సంక్రాంతి. అనగా నా దివసము సూర్యుడు మకరరాశి యందు వచ్చును. కర్కాటకము నుండి మకర సంక్రాంతి వఱకు సూర్యుడించుక దక్షిణాభిముఖముగా సంచరించుట చేత నీకాలమును దక్షిణాయనమని యందురు. తిరుగ మకర సంక్రాంతి నుండి కర్కాటక సంక్రాంతి వఱకు సూర్యుడించుక యుత్తరాభిముఖుడై సంచరించుటచే నీ కాలము నుత్తరాయణమని అందురు. ఉత్తరాయణము దేవతలకు ముఖ్యమనియు, దక్షిణాయనము పితృదేవతలకు ముఖ్యమనియు చెప్పుదురు. కావుననే ఉత్తరాయణకాల ముత్తమకాలమనియు, దక్షిణాయన కాలము కీడుకాలమనియు జనులు విశ్వసింతురు. మఱియు దక్షిణాయన కాలమందు దక్షిణ దిశద్వారము తెఱచియుంచి, యుత్తరద్వారము మూసియుంచుదురనియు, నుత్తరాయణ కాలమందే యుత్తర ద్వారము తెఱచియుంచుదురనియు జనవిశ్వాసము. ఇందుచే దక్షిణాయన కాలమందు మరణించిన వారి కుత్తమగతి యుండదనియు, భీష్ముడు దక్షిణాయనములో యుద్ధభూమిపై బడిన వాడైనను ఉత్తరాయణము వఱకు ప్రాణముల నిలుపుకొనియుండెననియు జెప్పుదురు. ఈ వివరములను 'దీపావళి పండుగ' యను శీర్షిక క్రింద జూడుడు.)

సంక్రాంతి విషయమై జయసింహకల్ప ద్రువమందినట్లున్నది:

తత్ర మేషాదిషు ద్వాదశ రాశిషు క్రమేణ సంచరతః సూర్యస్య పూర్వస్మాద్రాశే రుత్తరరాశౌ సంక్రమణ ప్రవేశః సంక్రాంతిః.

అనగా సూర్యుడు క్రమముగా మేషాది ద్వాదశరాసులందు సంచరించుచు పూర్వరాశినుండి యుత్తరదిక్కు మొగమై ప్రవేశించినప్పుడు సంక్రాంతి యగును.

ఉత్తరాయణ దక్షిణాయన పదములలోని 'అయనము' అను పదమున కర్థము జయసింహకల్పద్రుమమం దిట్లున్నది:

"సూర్యుడు ఋతుత్రయమం దుత్తర దక్షిణగామిగా సంచరించు దానిని అయన

మని యందురు. ఆఱుమాసములు దక్షిణముగా, నాఱు మాసము లుత్తరముగా సూర్యుడు సంచరించును. మార్గశీర్షమాసము నుండి మొదలుకొని మూడు ఋతువుల వఱకు, అనగా ఆఱు మాసముల వఱకు సూర్యుదుత్త రాయణమం దుండును. జ్యేష్ఠమాసము మొదలుకొని మూడు ఋతువుల వఱకు, అనగా నాఱు మాసముల పర్యంతము సూర్యుడు దక్షిణాయనమం దుండును. కర్క సంక్రాంతి మొదలుకొని సూర్యుడు దక్షిణాయనమందుండును. మకర సంక్రాంతి మొదలుకొని సూర్యుదుత్త రాయణమందుండును."

ఇట్లుపై ప్రమాణములను బట్టి మకరసంక్రాంతి నాడు సూర్యుదుత్తరాయణ గతుడగుటచే జనులీనాడు సంక్రాంతి పండుగ చేయుదురని విశదమగును.

హిందీ గ్రంథకారులగు భవానీ ప్రసాదు గారి యభిప్రాయ మొకటి గమనింపదగినది. అదేదన:

"ఈ పండుగ నాడు నువ్వులు, నెయ్యి, గొంగళ్లు బీదలకు దానము చేయవలయునని ప్రతకారులాదేశించినారు. దీనియందు మంచి యర్థము కలదు. ఈ పండుగ శీతకాలమందు వచ్చును. కావున పైమూడు వస్తువులుష్ణమును గలిగించునవి కాన నీ విధి చెప్పబడినది.

నువ్వుల ద్రవ్యగుణమును గుఱించి వైద్య గ్రంథములం దిది యుష్ణము గలిగించున దని వ్రాసినారు.

మఱియు కంబళి విషయమై చెప్పవలసింది లేదు. 'కం బలవంతం న బాధతే శీతః" యని శ్లిష్టోక్తిగా నొక కవి వర్ణించియున్నాడు.

"నెయ్యి ఓజస్సు, తేజస్సు, అగ్ని దీపనము కలిగించునదని వైద్య గ్రంథములు చాటుచున్నవి. కాన అత్యంత శీతలముండు నుత్తర హిందుస్థానమందీ పండగనాడీ వస్తువుల దానము చాల సమంజసము."

సంక్రాంతి సర్వసాధారణముగా చలికాలమందు వచ్చును. ఈ సందర్భముననే శ్రీనాథకవి తన శివరాత్రి మహాత్మ్యమం దిట్లు రమ్యముగా వర్ణించినాడు:

ఇండ్ల మొదలను నీరెండ నీడికలను
ననుగుదమ్ముడు నన్నయ నాటలాడు
అత్తయును కోడలును గుమ్మలాడు కుమ్ము
గాచు చోటికి మకర సంక్రాంతి వేళ.

# అనంత చతుర్దశి

అనంత వ్రతము భాద్రపద శుక్ల చతుర్దశీ దినమున జరుగును. ఇది వైష్ణవులకు జాల ముఖ్యమైనది. దీనిని గుఱించి భవిష్యోత్తర పురాణమందు విశేషముగా వ్రాయబడియున్నది.

పూర్వము ధర్మరాజు రాజసూయ యజ్ఞమందు సకలైశ్వర్యయుక్తుడై యుండినతఱి దుర్యోధనుడు మయనిర్మిత హర్మ్యమందు నేలయని భ్రమించి నీటబడినప్పుడు ద్రౌపది పరిహసింపగా దుర్యోధనుడుగ్రుడై కొంత కాలమునకు పాండవులను శకుని సహాయుడై మాయాద్యూతమం దోడించి యరణ్యవాసము చేయ పాండవుల బంపెను.

అరణ్యమందు ధర్మరాజు ఖిన్నుడై తన్ను చూడవచ్చిన కృష్ణునితో దాము మరల తమ స్వత్వముల బొందు నుపాయ మెట్లని ప్రశ్నింప, కృష్ణుడు వారి కనంత వ్రత మాచరించునట్లాదేశించెను. ధర్మరాజు అనంతు డననేమని ప్రశ్నింప కృష్ణుడిట్లు చెప్పెను:

అనంతుడు అనగా సర్వేశ్వరుడగు విష్ణువు. అతని గూర్చిన వ్రతమే యనంత వ్రతము. ఆ వ్రతమును పూర్వము శీల యను పతివ్రత యాచరించి సర్వాభీష్టముల నందెను.

అదెట్లన, తొల్లి కృతయుగమందు సుమంతుడను బ్రాహ్మణుడు దీక్షాదేవి యను భార్య వలన శీలయను కూతును బడసెను. దీక్ష కొంత కాలమునకు మృతింప సుమంతు డింకొక భార్యను– గర్కశ యను సార్థక నామధేయను– బెండ్లాడెను. శీల సుశీలయై వినయవిధేయతలచే నొప్పుచుండెను. అంత నామె పెద్దదికాగా కౌండిన్యుడను బ్రాహ్మణుడొక్క డామెను వివాహమాడెను. దంపతులు ప్రయాణమగునప్పుడు సవతితల్లి వారికేమియు బహుమతుల నొసగక కఠినముగా వారిని వెడల నడచెను.

ప్రయాణము చేయుచు దంపతులు యమునానదిని సమీపించరి. అచ్చట అనేక పుణ్యస్త్రీలు కుసుంభారుణ వస్త్రాలంకృతులై యమునా పూజలు సేయు చుండిరి.

ఆదినము భాద్రపద శుద్ధ చతుర్దశి. శీల యా స్త్రీలను సమీపించి, వారు అనంతవ్రత మాచరించుట యెఱింగి, యా విధానము తానును నేర్చి యాచరించి బ్రాహ్మణులకు దమ యన్న మందు సగము భాగమిచ్చి మరల ప్రయాణమై భర్తృ గృహము చేరెను. అచ్చట నామె గృహము సంపదలకు నిలయమయ్యెను. ఒకనాడామె భర్త యామె వామ హస్తమందు చతుర్దశ గ్రంథియుక్తమైన దోరకమును జూచి "యీ ముళ్ళుగల దారము నీ హస్తమం దేల యున్నది? నన్నేమైన వశీకరణము చేయుటకై కట్టుకొనిన తంత్రమా యిది? యేమి చెప్పుము" అని యామెను కఠినముగా నడిగెను. ఆయమ యనంత వ్రతకథను జెప్పెను. భర్త యిది విశ్వసింపక, కోపముతో నా దోరకమును ద్రుంచి యగ్నిలో వైచెను. ఈ దుడుకునకు ఫలితముగా కౌండిన్యుని సంపదయంతయు కొల్లబోయెను. కొలదికాలము లోపలనే సర్వదరిద్రుడయ్యెను. దీనిని జూచి ఖిన్నుడై యొకనాడు తన భార్యతో దాని కారణమడుగ నాసాధ్వి యాతడు దోరకమును ద్రుంచివైచినందులకీ యవస్థ ఘటిల్లిన దనియు, మరల నావ్రత మాచరించుట యుక్తమనియు బోధించెను.

కౌండిన్యుడప్పు డరణ్యముకేగి, కొంతకాలము ఘోరతపము చేసి, పిదప పిచ్చివానివలె వనమంతటను గ్రుమ్మరుచు నెదురగు చేతనా చేతనముల "దా మనంతుని జూచితిరా" యని ప్రశ్నింప దొడగెను. ఒక మామిడిచెట్టు చెదలచే నిండియు, ఫలవంతమై యొక్క పక్షియేనియు దానిపై వ్రాలక యుండ జూచి కౌండిన్యుడు దానితో ననంతుని విషయమడిగెను. ఆ వృక్షము అనంతుని జూడలేదని ప్రత్యుత్తర మిచ్చెను.

పిమ్మటనొక యావును, దాని దూడను నరణ్యములో బోవు చుండజూచి, నిని గూడ ననంతుని వృత్తాంతమడిగి, చూడలేదను ప్రత్యుత్తరము వడసి ముందరిగెను. మఱికొంత దవ్వరిగి రెండు తటాకములను జూచెను. అచ్చట కూడ నదే ప్రత్యుత్తరమందెను. అటుపిమ్మట నొక గాడిదను, గజమును జూచి వాని వలన గూడ నదే జవాబు వినెను. ఇట్లు సర్వవిధముల బ్రయత్నించియు ననంతుని సాక్షాత్కారము బొందక హతాశుడై యొక చెట్టుపై యురివేసుకొని చావ సంసిద్ధుడయ్యెను. అప్పుడొక వృద్ధ బ్రాహ్మణు డచ్చటికి వచ్చి కౌండిన్యుని యుద్యమమును వారించి యతని నొక గుహలోకి గొంపోయెను. అచ్చట నొక గొప్పనగర మగపడెను. ఆ నగరమధ్యమందొక మహాసౌధమందొక రత్న ఖచిత సింహాసన ముండెను. దానిపై అనంతుడు కూర్చుని గరుడునిచే సేవింపబడు చుండెను. అప్పుడా కౌండిన్యుడు వృద్ధబ్రాహ్మణుని పాదములపై బడి తాను మహాపాతకి ననియు, దన్ను రక్షింపుమనియు బ్రార్థించెను. ఆ వృద్ధ

బ్రాహ్మణుడు తన నిజమగు ననంత రూపమును జూపి కౌండిన్యుని వరము వేడుమని చెప్పెను. కౌండిన్యుడిట్లు పలికెను: "ఓ దేవా! నేను సంపదచే గర్వించి నా భార్య చేసిన వ్రతములను సరకుగొనక దోరకమును ద్రుంచి మంటవైచి మిమ్ము నవమానపఱచి మహాదోషినైతిని. దాని ఫలితమును వెంటనే యనుభవించితిని. నా సంపదయంతయు నాశనమయ్యెను. బంధువులందఱు నాతోగలహించిరి. మరల మీ కరుణచే నిప్పుడు మీ దివ్య విగ్రమును జూడగంటిని. ఇంతియు చాలును. అయినను నా పాతకముల నెట్లు బాపికొనవలెనో నాకు దెలుపవేడెదను." అనంతుడు కౌండిన్యుని గరుణించి యిట్లానతిచ్చెను: "నీవు నీ గృహమునకు బొమ్ము. పదునాల్గు సంవత్సరముల వఱకు దోరకమును బూజించి నా వ్రతమును జేయుము. నీ పాపములన్నియు సమసిపోవును. నీవు పుత్ర పౌత్రులతోడను, సర్వసౌఖ్యముల తోడను వృద్ధికి రాగలవు. ఇంతియకాక యికముందు బ్రపంచమం దెవ్వరెవ్వ రనంతవ్రతమాచరింతురో వారెల్లరును నీవు పొందునట్టి సౌఖ్యమును, ముక్తిని బొందగలరు." ఈ మాటలు విని కౌండిన్యుడు 'ధన్యోస్మి' యని దేవుని నానా విధముల స్తోత్రము చేసి, యీ దేవునిట్లు ప్రశ్నించెను:

"దేవా! నేను గొన్ని దృశ్యముల జూచితిని, అవన్నియు నేలయట్లయ్యెనో సెలవీయవలయును."

**అనంతుడు**:– నీవు జూచిన మామిడిచెట్టు పూర్వ జన్మమున బ్రాహ్మణుడై యుండెను. అతడు తన శిష్యులకు వేదముల బోధింపనందున చెదల కాహారమగు చెట్టుగా బుట్టినాడు. ఆవు భూదేవతగా నుండెను. ఆమె నేను సృష్టించిన యౌషధులను మ్రింగినందున జంతువై, పుట్టినది. చెరువులు బ్రాహ్మకన్యకలు. వారు దానముల నెవ్వరికి నీయకుండ నన్నియు దామే యపహరించు చుండినందున చెరువులైరి. గాడిద కోపము యొక్క పరిణామము. ఏనుగు అహంకారము."ఇట్లు చెప్పి యనంతు దదృశ్యుడయ్యెను.

కౌండిన్యు డింటికేగి దేవు డానతిచ్చినటుల పదునాల్గు సంవత్సరములు వ్రతమాచరించి సంపదలబొందెను. కాని యీ కాలమందే భక్తుడైన నొక్క సంవత్సర మీవ్రత మాచరించిన నభీష్టము బొందును అని శ్రీకృష్ణుడు ధర్మజునికి బోధించెను.

ఇదే భవిష్యత్పురాణమందీ వ్రతమును త్రయోదశితో కూడిన చతుర్దశి నాడాచరించిన నది నిష్ఫల మగుటయే గాక యా సంవత్సర మాచరించిన పుణ్యమంతయు నశించుననియు, కావున పూర్ణిమతో కూడిన చతుర్దశినాడే యీ వ్రతమును జేయవలయుననియు నాదేశింపబడి యున్నది.

# రథ సప్తమి

రథ సప్తమీ వ్రతము మాఘ శుక్ల దినమున చేయబడును. ఈ వ్రతము సూర్యు నుద్దేశించి చేయబడుచున్నది. సూర్యమాహాత్మ్యమును గురించియు, సూర్యు పూజావిధానమును గురించియు భవిష్యత్పురాణమం దనేకాధ్యాయములు వ్రాయబడియున్నవి. రథసప్తమీ విషయమును గూర్చి విశేషముగా వర్ణింపబడి యున్నది. ఈ వ్రతమును హిందువులందన్ని వర్ణమువారు చేయరు. ఇది కేవలము బ్రాహ్మణులకే ప్రాముఖ్యమైనది. అయినను పురాణములందు రాజుల నుద్దేశించి చెప్పిన కథలం దీ వ్రతమునాడు బ్రాహ్మణులకు బంగారు మొదలుకొని ధాన్య వస్త్రముల వఱకు దానమియ్యవలసినదిగా జెప్పబడినందున వారి యుద్దేశమున నితర వర్ణములకును నీ వ్రత ముపకరించుటకే యని భావింపవలెను.

శ్రీకృష్ణ పరమాత్ముల నొకపరి యుధిష్ఠిరులవారు రథసప్తమీ వ్రతము నెట్లు చేయవలెను? ఎందులకు జేయవలెను? దాన నేమి ఫలము? అని ప్రశ్నింపగా కృష్ణభగవాను ఇట్లు సెలవిచ్చిరట:

## కథ

పూర్వము కాంభోజ దేశమందు యవవర్మ యను రాజుండెను. అతనికి ముసలి ముప్పునకు సర్వవ్యాధియుతుడైన కొడుకొకడు జన్మించెను. బ్రాహ్మణులను బిలిపించి యా రాజు దాని కారణ మరసెను. ఆ త్రికాలవేదు లిట్లనిరి: “రాజా! వీడు పూర్వజన్మమున ఓలుబ్ధాగ్రేసర చక్రవర్తియైన కోమటి. వీడు రథసప్తమీ వ్రతమును జేయుచుండ జూడ దటస్థించెను. ఆ దర్శనమాత్ర ఫలితముగా వీడు మీకు పుత్రుడై జన్మించెను. వాని కాజన్మమున సంపద విశేషముగా నుండియు నా దినమున చిల్లి గవ్వ గూడ దానము చేసినవాడు కానందున నీ వ్యాధిని వెంటదెచ్చికొనినాడు.” రాజీ మాట విని యిట్లనెను: “ఓ భూసురులారా! వీని రోగమును బోగొట్టు నుపాయమేమో సెలవిండు.” మరల త్రికాలవేదులు గణించి గుణించి తుదకిట్లు తమ యభిప్రాయమును భూపతికి విన్నవించిరి: “ఏ వ్రతదర్శనము చేత వీని కీ యఖండ వైభవము కలిగినదో, ఏ కార్పణ్యముచే వీనికీ జాడ్యము సంభవించినదో యా వ్రతమునే చేసి వ్రతానుష్ఠాన

కాలమందు షోడశ మహాదానములు చేసిన జాడ్యము కుదిరిపోవును. ఈ రథసప్తమీ వ్రతము నెవ్వారు భక్తిశ్రద్ధా సమన్వితులై యాచరింతురో వారు చక్రవర్తిత్వమును బొందుటలో నేమియు సందేహము లేదు. కావున నా విధానమును వివరించెదము, వినుడు.

మాఘ శుక్ల షష్ఠీ దివసమున నదీ కూపతటాకాదులందు పరిశుద్ధ జలమున తిలపిష్టముతో శరీరమును రుద్దుకొని స్నానము చేయవలయును. పిమ్మట సూర్యాలయమునుకు పోయి భక్తిపూర్వకముగా మార్తాండ భగవానుని నమస్కరించి పుష్పధూపాదులచే సమ్యగారాధన చేయవలెను. పిమ్మట నింటికి వచ్చి పంచ యజ్ఞములు చేసి సర్వజ్ఞులైన బ్రాహ్మణులను పిలిపించి వారిని పూజింపవలెను. సప్తమీ దినమున ప్రాతఃకాలమున మేల్కొంచి స్నానము చేసి కింకిణీ జలముతో గూడిన రథము నొకదానిని సిద్ధము చేయించవలెను. రథమును, గుఱ్ఱములను, సూతుని వీనినన్నింటిని బంగారముతో గాని, చేతగానివారు వెండితోనైనను జేయించవలెను. ఆ రథమును వస్త్రముతో గట్టిన మంటప మందుంచవలెను. ఆ రథమున బంగారుతో జేసిన సూర్య విగ్రహము నునిచి మంత్రోక్తముగా పూజలొనర్పవలెను. నానావిధ ఫలములు, భక్ష్యభోజ్యములు వీనితో దేవునికి నైవేద్య మొసగవలెను. ఈ ప్రకారముగా పూజించి రాత్రికాలమందు జాగరము చేయవలెను. ఇట్లు రాత్రియంతయు కనురెప్ప వాల్పక భక్తియుక్తుడై పూజచేసి ప్రాతఃకాలమున స్నానమాచరించి బ్రాహ్మణులను ధనధాన్యాన్ని వస్త్ర భూషణములచే తృప్తి పరుపవలెను. రథమును గూడ గురువులగు బ్రాహ్మణుల కిచ్చివేయవలయును. ఈ ప్రకారము రథసప్తమీ వ్రత మాచరించిన సర్వరోగ విముక్తి కలుగుటయే కాక పుత్ర పౌత్రాభివృద్ధి కలిగి సూర్యలోకమును బొంది యచ్చట నొక కల్పకాలము వసియించి పిమ్మట భూలోకమున కవతరించి సర్వ సర్వంసహా చక్రవర్తియై మానవుడు సౌఖ్య మనుభవింపగలడు.

## విమర్శ

ఇది సూర్య సంబంధమైది. ప్రాచీన కాలమున–వేదకాలము నుండి బహు కాలము వరకు – ఆర్యులలో ప్రకృత్యారాధన చాలా ప్రాముఖ్యము వహించి యుండెను. అనేక ప్రాంతములలో సూర్యాలయములుండెను. కాని శైవ వైష్ణవ సంప్రదాయములు ముదిరిన కొలది సూర్యారాధనము మాసిపోవుచు వచ్చెను. ఈ రథసప్తమీ వ్రతము ప్రాచీన సూర్యారాధనము యొక్క నిదర్శనము.

ఈ సూర్యుని రథ మేకచక్రయుతము. అందు సూర్యుడు కూర్చొనును. అదే చక్రమే మన కగుపడు సూర్యబింబమని భావింపవలెను. సూర్యుడనుదిన మారథమం దాకాశమున సంచరించునని చెప్పుదురు. యథార్థముగా సూర్యుడు పశ్చిమ మార్గమున సంచరింపడు. భూమియే సూర్యుని చుట్టివచ్చుటచేత మనకీ భ్రమలు కలుగుచున్నవి. సూర్యుని రథము నీడ్చు గుఱ్ఱము పేరు సప్తి. ఈ సప్త సంఖ్య బహుశః ఏడు దినములు కల వారమును సూచించునేమో! ఏడవ సంఖ్య కల దివసమందే యీ వ్రతమాచరించుట కేర్పాటు చేయుటయు, సూర్యుని పూజించు మంత్రములో 'సప్తలోక ప్రదీపన' యని యుండుటయు గమనింపదగినది.

# నవ రాత్రులు

నవరాత్రులను దేవీ నవరాత్రులని కూడ వ్యవహరింతురు. ఏలన, నవరాత్రులలో దేవీపూజలు గావింపబడును. ఈ పూజలు ఆశ్వయుజ శుక్లపక్ష పాడ్యమి నుండి నవమి వరకు జరుగుచుండును. నవరాత్రులు అనగా తొమ్మిదిరాత్రులు. పార్వతీ దేవి యొక్క యవతారములు పది యవతారములనియు, నొక్కక్క యవతారమందు దేవి రాక్షసాదులను జంపి ప్రపంచమును రక్షించెననియు చెప్పుదురు. మార్కండేయ పురాణమందు దేవీ మహాత్మ్య ఘట్టమునం దీ విషయముల కథనములు కలవు.

మధుకైటభులను రాక్షసులు విష్ణువు యొక్క చెవిలోని మురికి నుండి యుద్భవించిరట! వీరు ప్రపంచమునకు కంటకులుకాగా వారితో విష్ణువు 5000 ఏండ్ల యుద్ధము చేసియు నోడింపజాలక యలసిపోయెనట! అప్పుడు మధుకైటభులు మహామాయ యొక్క మాయకు లోనై దర్పోద్ధతులై కన్ను గానక విష్ణువు తమతో నింతకాలము పోరినందులకు వరమడుగుమని విష్ణువునే కోరిరట. విష్ణువు వారి చావును గోరెనట. ఇట్లు వంచితులై వారు చచ్చిరట!!

మాయాదేవి నల్లనిది, పదితలలు, పదికాళ్ళు కలదిగానుండుటచే నామెను మహాకాళి యని పిలుతురు.

మాయాదేవి రెండవ యవతారములో మహిషాసురుని జంపెను. మహిషాసురుడు ఇంద్రుని జయింపగా దేవతలు భీతిల్లి యీశ్వరుని ప్రార్థింప నాతని కోపాగ్ని నుండి యీ యవతారము వచ్చెనట. మహిషాసుర మర్ధని సింహవాహనయై మహిసాసురుని జంపెను.

మూడవ యవతారముందు శుంభనిశుంభులు సమయింపబడిరి. పార్వతీదేవి గంగాస్నానము చేయబోవుతరి యాదేవి శరీరము నుండి యొక సుందరి యవతారమెత్తెను. శుంభు డీమెను జూచి మోహించి తన్ను పెండ్లియాడమని రాయబారము పంపెను. కాని విఫలీకృతుడయ్యెను. అప్పుడీ సోదరులు చండ, ముండ యను వీరుల వెంట సైన్యమునిచ్చి యామపై యుద్ధమును కంపిరి. వాతిద్దరిని ఆయమ చంపి వారి తలలు దేవి దగ్గఱకు గొనిపోవ దేవి సంతోషించి యా చండ,

ముండులను చంపినందున నామెకు చాముండ యని బిరుదునిచ్చెను. పిమ్మట శు ంభనిశుంభులు రక్తబీజు డనువానితో గలసి యుద్ధమునకు వచ్చిరి. రక్తబీజుని శరీరము నుండి యెన్ని రక్తబిందువులు భూమిపై పడునో యందఱు రాక్షసులద్భవించుచుండిరి. అప్పుడు కాళీదేవి వాని శరీరము నుండి రక్తబిందువులు పడునట్లుగా వారి రక్తమును ద్రావెను. దేవి వానిని సునాయాసముగా జంపెను. ఇది మూడవ యవతారము.

ఇక నాల్గవ యవతారమం దీదేవి నందుని పుత్రికగా జన్మించెను. కంసుడా శిశువును రాతిపై మొత్తగా నామె యదృశ్యమై కంసుని వధించువాడు క్షేమముగా నున్నవాడని చెప్పి పోయెను.

అయిదవ యవతారమందీ దేవి యొక రాక్షసిని దంతముతో చీల్చినందున నీమెకు రక్తదంతి యను పేరు వచ్చెను.

ఆరవ యవతారమున ననేక సంవత్సరములుండి లోకమందు క్షామము సంభవించి ప్రజలు మలమలమాడుచుండ దేవి వారిని సంరక్షించినందున ఈమెను శాఖాంబరి యని పిలుతురు.

ఏడవ యవతారమందు దుర్గుడను రాక్షసుని చంపినందుకు దుర్గయని పిలుతురు. ఎనిమిదవ యవతారమందు మాతంగిగాను, తొమ్మిదవ యవతారమందు లభ్రమారిగాను నీదేవి యవతారమెత్తెను.

నవరాత్రులలో సాధారణముగా దేవీ భక్తులుపవాస వ్రతములు సలుపు చుందురు. కొందరు దేవికి జంతుబలులు నిచ్చెదరు. మరికొందరు కన్యక నొకదానిని దెచ్చి పూజింతురు.

భవిష్యత్పురాణమున నీ రాత్రులకు 'మహానవమి' యని యున్నది. ఈ దివసములు పార్వతీదేవి యవతారమగు చాముండీదేవికి చాల ప్రియములని వర్ణించియున్నారు. పార్వతి యొక్క తొమ్మిది యవతారముల కథలు పైన పేర్కొనబడినట్లుగా నిందులేవు. ఇంకొక్క విషయమేమన నీదినములలో శస్త్రాస్త్రములను పూజింపవలెననియు, గజ హయాదివర్గముతోను, భటులతోను దేవిని పల్లకిలో నుంచి యూరేగింపు కడపటి నాడు చేయవలయుననియు నిందు వర్ణింపడియున్నది.

ఈ నవరాత్రముల యనంతరమే విజయదశమి వచ్చును. విజయదశమి క్షత్రియుల పండుగ యని యిదివరకే నిరూపింపబడినది. ఈ నవరాత్రులలో శస్త్రాస్త్ర పూజ మున్నగు నాచరణములన్నియు పై యంశమునే స్థిరపరచుచున్నవి.

ఈ నవరాత్రులు స్మార్తులకు, శైవులకు ప్రధానమగు నుత్సవకాలములు.

# అక్షయ తృతీయ

ఈ పండుగ ప్రతి వైశాఖ శుక్ల తృతీయనాడు వచ్చును. భవిష్యోత్తర భాగమందిట్లున్నది:

ఈ అక్షయ తృతీయ కృతయుగారంభ దివసముగా నున్నది. ఈ దినమందెవ్వరు దానము లిచ్చెదరో వారు సర్వసంపదలతో నుండెదరు."

పూర్వమొక కోమటి – ధర్మనాముడు – చాల దరిద్రుడు. వాని భార్య వలదన్నను వినక తనకున్న దానిలో మరల ఇతరులకు దానము చేయుచుండెడి వాడు. కొంతకాలమునకు చనిపోయి క్షత్రియుడై మరల జన్మించెను. అప్పుడు నిత్యాన్నదానమును, జపహోమములను చేయుచు తనకున్నదంతయు వ్యయము చేయదొడగెను. కాని యాతని ద్రవ్యము క్షయమగుటకు మారుగా 'అక్షయము'గా నుండెను. కావున నీ పండుగ నాడు చేసిన దానము వలన అక్షయ సంపదలు కలుగుటచే నీ పండుగను అక్షయ తృతీయ యని పిలిచిరి.

ఈ దినమునాడు బ్రాహ్మణులకు ఛత్రము, చెప్పులు దానము చేసిన పితరులు తృప్తిచెందుదురు. ఇది భవిష్యత్పురాణ కథ.

ఈ తృతీయనాడే పరశురాముడు జన్మించెనందురు.

"అస్యామేవ తృతీయాయాం పరశురామో జాతః, అతః పరశురామ జయంతీత్యుచ్యతే."

పరశురాముని జన్మదినమగుటచే దీనిని పరశురామజయంతి యనియు చెప్పుదురు.

బ్రహ్మపురాణ మిట్లనుచున్నది:

వైశాఖే తృతీయాయాం శుక్లాయాం తు జనార్దనః,
బ్రహ్మలోక త్రిపథగాత్ పృథివ్యా మవతారయత్.

ఏవ ముత్పాదయామాస రవౌ మధ్యందినే సతి,
ప్రోక్తా పరశురామస్య జయంతీతి చ సూరిభిః

ఈ వైశాఖ శుక్ల తృతీయమందు మధ్యాహ్నకాలమందు బ్రహ్మ లోకము నుండి సాక్షాత్పరమేశ్వరుడే యవతార మెత్తెను. కావున పండితులు దీనిని పరశురామ జయంతి యని చెప్పుదురు. ఈ తిథి ప్రభావమునుగూర్చి భవిష్యత్పురాణమం దిట్లున్నది:

"ఈ తిథి నాడు దేవతలను గుఱించియు, పితరులను గుఱించియు జేసిన పూజ అక్షయముగా నుండును."

# గణేశ చతుర్థి

గణపతి, వినాయక, విఘ్నేశ్వర, గణేశ మున్నగు పేర్లతో నొప్పు నీ దేవుని పూజ ప్రతి సంవత్సరము భాద్రపద శుద్ధ చతుర్థినాడు జరుపబడును. ఈ విఘ్నేశ్వరుడు పౌరాణిక కాలమందు చాల ప్రాముఖ్యమునకు వచ్చెను. హిందువులు ప్రతి శుభకార్యమునకు ముందును విఘ్నేశ్వరుని పూజ జరుపుట యాచారమైనది. ఈ విఘ్నేశ్వరునికి నింతటి ప్రాముఖ్యము కలుగుట యే కారణముననో యూహింపశక్యముగాదు.

**పౌరాణికము**:– ఈ విఘ్నేశ్వరుని యుత్పత్తి విషయమై యీ ప్రకారముగా చెప్పుదురు. శివుడొకనాడు వేటాడుటకై వెడలెను. పార్వతి యింట స్నానము చేయుటకై సిద్ధమగుచు, ద్వారము దగ్గఱ కావలి యుండుటకై యొక మట్టి విగ్రహమునుజేసి, దానికి జీవము కల్పించి స్నానపు గది లోనికి ఎవ్వరిని రానియ్యకుమని యా జీవపు బొమ్మకు చెప్పి, తాను స్నానము చేయబోయెను. ఇంతలో శివుడు వేటనుండి తిరిగివచ్చి లోపలబోవ ప్రయత్నింపగ నీ విఘ్నేశ్వరుడు నివారించెను. శివునికి కోపము వచ్చి తల నఱికి లోపలికేగెను. పార్వతి యీ సమాచారమును విని తను సృష్టించిన కుమారుని మరల పునర్జీవుని చేయమని పట్టుపట్టెను. శివుడు తాను నఱికిన తలను మరల మొండెమున కతికింపనెంచి చూడగా, నా తల కనపడకపోయెను. అప్పుడు సమీపమున నుండిన యొక యేనుగు తలను కోసి యీ మొండెమున కతికించి జీవము వచ్చునట్లు చేసెను. ఈ యేనుగు తలగల దేవుని విఘ్నేశ్వరుడని వ్యవహరింతురు. ఇట్లు వికారముగా నొనరించిన కారణమున దానికి ప్రత్యామ్నాయముగా నీ విఘ్నేశ్వరుని కగ్రపూజ జరుగున ట్లేర్పాటు చేసెను. కొంతకాలమున కీ దేవుడు విద్యకుగూడ నధిపతి యయ్యెను.

**నామములు**:– భాద్రపద శుద్ధ చతుర్థినాడు విఘ్నేశ్వరుని విగ్రహమొకటి మట్టితో జేసి పూజింతురు. ఈ వినాయకునికి వాహనము ఎలుక. కావుననే యితనిని 'మూషకవాహన' యని యందురు. ఇతనికొకే దంతము. కావుననే 'యేకదంతా' యని సంబోధింతురు. ఇతని కడుపు పెద్దది. తిండికాడు. కావుననే 'లంబోదరా' యని పిలుతురు. చెవులు చేటల వంటివి. కావుననే 'శూర్పకర్ణా' యని వ్యవహరింతురు.

సర్వసిద్ధులను కలిగిన వాడని యితనిని సర్వసిద్ధి ప్రదాయకుడని వ్యవహరింతురు. ఈ ప్రకారముగా నీ దేవునికి సహస్రనామములున్నవని యందురు.

**పూజావిధి**:– ప్రతి గృహమందును శుద్ధ చతుర్థినాడు ప్రాతఃకాలమందు వినాయకుని మంత్రపూర్వకముగా నానా విధములగు పత్రపుష్ప ఫలములతో పూజింతురు. భాద్రపద మాసమందలి ఫలపుష్పములన్నియు సమర్పింతురు.

మాలతీపత్రము, భృంగరాజపత్రము, బిల్వపత్రము, బదరి, శమీపత్రము, అపామార్గపత్రము, బృహతీపత్రము, కరవీరము, అర్కము, విష్ణుక్రాంత, దానిమ్మయాకులు, దానిమ్మపండు, దేవదారు, అశ్వత్థము, మొగలిపువ్వులు మున్నగువానిచే విఘ్నేశ్వరుని పూజింతురు.

వినాయకునికి కుడుములు ఇష్టము. కావుననే,

నానాఖాద్య మిదం దివ్యం తుష్ట్యర్థం తే నివేదితం
ఏకవింశతి సంఖ్యాకాన్ మోదకాన్ ఘృతపాచితాన్
నైవేద్యం సఫలం దద్యాం నమస్తే విఘ్ననాశినే.

21 కుడుములు – నేతితో జేసినట్టివి – లెక్క పెట్టి వీరికి నైవేద్యముగా నిడవలయునట. వినాయకుని దగ్గఱ నొక దీపము వెలిగించి యుంచుదురు. ఇది యారిపోనట్లుగా మరునాటివఱకుంచుదురు. మఱుదివసము సాయంకాలము వినాయకుని మట్టి ప్రతిమను బావిలో, లేక నదిలో వేయుదురు.

విఘ్నేశ్వరుడు సర్వాభీష్టముల నొసంగువాడని యందఱును నీవ్రత మాచరింతురు. వ్రతచూడామణియం దీ వ్రతమును గుఱించి యిట్లు వ్రాయబడినది:

నైమిశారణ్యమున శౌనకాది మునులు సర్వకార్యములు నిర్విఘ్నముగా నడచు మార్గ మెద్దియని సూతుని విచారింపగా నాతడిట్లని చెప్పదొడగెను: పూర్వము కురుపాండవ సేనలు యుద్ధము చేయగడగినప్పుడు యుధిష్ఠిరుడు శ్రీకృష్ణునితో దాను జయమందుటకు మార్గమెద్ది యని విచారించెను. అందులకు శ్రీకృష్ణుడిట్లు చెప్పెను: “నీవు గణాధ్యక్షుడగు గణపతిని పూజింపుము. నీ రాజ్యము నీకు లభింపగలదు.”

యుధిష్ఠిరుడు ఆ పూజ యెట్లు చేయవలెనని విచారింపగా కృష్ణుడిట్లు చెప్పెను:

భాద్రపద శుక్ల చతుర్థి మధ్యాహ్నమందు, లేక శ్రావణ మాసమందుగాని, మార్గశీర్ష మాసమందుగాని వినాయకుని మంత్రయుక్తముగా పూజించి యతనికి

నైవేద్యము సమర్పింపవలయును. ఆ దినము బ్రాహ్మణుల కెంత దక్షిణ యిచ్చిన అంతకు పదియంతలు మరల ఆ యిచ్చిన దాతకు సమకూరును.

ఈ చతుర్థినాడు చంద్రుని చూచినవారి కొక సంవత్సర పర్యంతము లేనిపోని యపవాదములు కలుగుచుండునని పురాణములు చెప్పుచున్నవి. ఈ దోష పరిహారార్థమై యీ క్రింది మంత్రము నుచ్చరించవలయునట.

సింహః ప్రసేన మవధీ త్సింహో జాంబవతా హతః,
సుకుమారక మారోది స్తవ హ్యేష స్యమంతకః.

ఈ మంత్రమును జదువుటయే కాక స్యమంతకోపాఖ్యానమును గూడ వినవలయును. చంద్ర దర్శన దోషమునకు కారణమిట్లు చెప్పుదురు. విఘ్నేశ్వరుడు తనను పూజించిన బ్రహ్మకు వరము లొసగి, మూషకముపై స్వారీచేయుచు చంద్రలోకమును జేరుతఱి తట్టుకొని పడెను. అది చూచి తన సౌందర్యమునకు గర్వించిన చంద్రుడు పక్కున నవ్వి, వినాయకునికి పట్టరాని కోపము వచ్చి "ఓరి చంద్రా! నీ ముఖమును జూచిన వారందరును మిథ్యాపవాదములకు లోనగుదురుగాక!" యని శపించెను. చంద్రు భయభ్రాంతుడై సముద్రమున దాగెను. లోకమంధకార బంధుర మయ్యెను. దేవతలు తల్లడిల్లిరి. అప్పుడు త్రిమూర్త్యాదు లందఱును జేరి చంద్రునికి వినాయకుని పూజించు విధానమును నేర్పి వినాయకుని ప్రసన్నునిగా చేసిరి. వినాయకుడప్పుడు శాపము కేవలము భాద్రపద శుద్ధ చతుర్థ దినము నాటికి మాత్రమే వినియోగమగునని సెలవిచ్చెను. ఆనాడు పొరపాటుతో చూచినవారికి సహితము విముక్తి యెట్లని ప్రార్థింపగా నా దినము వినాయకు పూజించి బ్రాహ్మణులకు దక్షిణలిచ్చి స్యమంతకోపాఖ్యానము జదువు వారి కే యపవాదములు నుండవని చెప్పెనట.

**స్యమంతకోపాఖ్యానము:** – ఈ కథ భాగవతమందును, స్కాందపురాణ మందును నున్నది. దీనినే యిచ్చట సంగ్రహముగా సూచింతును. శ్రీకృష్ణుడు ద్వారకలో రాజ్యము చేయుచుండగా నందొక యాదవుడు ఉగ్రసేనుడను వాడుండెను. అతనికి సత్రాజిత్తు, ప్రసేనుడు నను నిరువురు కుమారులుండిరి. అందు సత్రాజిత్తు సూర్యసంబుద్ధలోచనుడై సూర్యభగవాను నారాధింప నా దేవు డతనికి ప్రత్యక్షమై వరమును గోరుమనెను.

సత్రాజిత్తు స్యమంతకమణి నిమ్మని కోరెను. సూర్యుడదే విధముగ నా మణి నిచ్చుచు నిట్లు చెప్పెను: "ఈ మణి యసాధారణమైనది. ప్రతి దినమును నిది తన

తూకమంత కెనిమిదంతల బంగారము నిచ్చుచుండును. ఎవ్వడు నిర్మలుడో, ఎవ్వడు సన్మార్గుడో వాడే దీనిని ధరింపగలడు. పాతకియైన వాడు దీనిని ముట్టెనేని వెంటనే నశించును. "సత్రాజిత్తామణిని ధరించుకొని ద్వారకకు రాగా పౌరులందఱు దాని కాంతి జూచి సూర్యుడే సమీపించెనేమో యని భ్రమించిరి. సత్రాజిత్తు శ్రీకృష్ణుని దర్శనార్థమై యరుగగా శ్రీకృష్ణు డామణిని చాల ప్రశంసించెను. అంతట శ్రీకృష్ణు డెన్నడైన దానిని తన వద్ద నుండి యపహరించునని సత్రాజిత్తు భయపడి, తన తమ్ముడగు ప్రసేనునికి దాని నిచ్చెను. ప్రసేనుడును, శ్రీకృష్ణుడును నొకనాడు వేట కరిగిరి. అనంతరము శ్రీకృష్ణుడు మాత్రమే తిరిగి వచ్చెను. ప్రసేనుడు రాలేదు. శ్రీకృష్ణుడు తన తమ్ముని సంహరించి మణినపహరించెనని సత్రాజిత్తు నిందజేయ దొడగెను. జనులు గుసగుసలాడ జొచ్చిరి. శ్రీకృష్ణుడు చాల నొచ్చికొని యడవిలో ప్రసేనుని వెదకబోయెను. ఒకచోట ప్రసేనుడు చచ్చిపడినది జూచి యొక సింహము వీనిని జంపినట్లు జాడవలన గుర్తెఱిగి యా సింగపు జాడల వెంటపోయెను. కొంత వడికి సింహశవమును జూచెను. ఆ సింహమొక యెలుగుబంటుచే చంపబడి యుండెను. ఎలుగు జాడలను బట్టి పోవంబోవ నొక మహాగుహ యెదురయ్యెను. ఆ గుహ 800 మైళ్ల పొడవై యుండెను. అందొక మేడ యుండెను. ఆ మేడలో నొక శిశువు నిద్రించుచుండెను. ఆ శిశువు జాంబవంతుని కుమారుడు. ఆ శిశువు యొక్క యుయ్యేలపై స్యమంతకమణి కట్టబడి యుండెను. ఆ యుయ్యేల నొక సుందరాంగి యూచుచుండెను. ఆ కన్యక జాంబవంతుని కూతురు. ఆమె యిట్లు పాడుచుండెను:

"ప్రసేనుని సింహము చంపెను. సింహమును జాంబవంతుడు చంపెను. కావున ఈ మణి నీదే. ఓ బాలక! యేడువ వలదు."

శ్రీకృష్ణుడుయ్యేలను సమీపింపగా బాలిక అతనిని జూచి మోహించి, కృష్ణునితో "ఈ మణి తీసుకొని తండ్రి మేల్కాంచు లోపల పారిపో"మ్మని చెప్పెను. శ్రీకృష్ణుడు నవ్వి తన శంఖమును పూరించి జాంబవంతుని యుద్ధమునకు పిలిచెను. ఇద్దఱికిని యుద్ధము 21 దినముల వఱకు జరిగెను. కృష్ణుని వెంట వచ్చిన పరివారము గుహ వెలుపల వారము దినములు నిరీక్షించి కృష్ణుడు రానందున నాతడందే మృతిచెందెనని నిశ్చయించి నగరమునుకు బోయి యా వార్త తెలిపి యాతని యంత్యకర్మల సహితము చేయించిరి. అచ్చట గుహలో జాంబవంతుడు శ్రీకృష్ణునితో ఘోరముగబోరి తుద కోడిపోయి యా స్యమంతకమణితో గూడ తన కూతురు జాంబవతిని శ్రీకృష్ణునికిచ్చి గౌరవించెను. శ్రీకృష్ణుడు ద్వారకకు వచ్చి సభ జేసి యందఱి యెదుట మణియొక్క

వృత్తాంతమును చెప్పి సత్రాజిత్తునకు దాని నిచ్చెను. సత్రాజిత్తు కూడ దా నన్యాయముగా కృష్ణుని నిందించి నందులకు సిగ్గుపడి తన కూతురగు సత్యభామను శ్రీకృష్ణునికిచ్చి పెండ్లి చేసెను.

పాపము! సత్రాజిత్తు మాత్రము మణిమూలమున మృతినొందెను. శతధన్వుడనువా డా మణి నపహరించి సత్రాజిత్తును జంపెను. పిమ్మట శ్రీకృష్ణుని భీతిచే నా మణిని అక్రూరుడను వానికిచ్చి ద్వారక నుండి పారిపోయెను. కృష్ణుడును, బలరాముడును వానిని వెన్నంటి చంపిరి. కాని మణిని మాత్రము కానలేదు. మరల కృష్ణుడు దాని నపహరించె ననునట్టి యపవాదమునకు పాలయ్యెను.

అక్రూరుడా మణిని దీసికొని కాశిలో దాని నుండి వచ్చు బంగారముచే దినదినము దానములు చేయుచుండెను. ఇచ్చట శ్రీకృష్ణుడు మణిదొరకనందున చాలా విచారము నొందుచుండెను. ఇట్లుండ నొకనాడు నారదుడు శ్రీకృష్ణుని సందర్శించి వారి పరితాపమునకు గారణ మరసి తెలిసికొని భాద్రపద శుద్ధ చతుర్థినాడు చంద్రుని శ్రీకృష్ణుడు చూచి యుండినందున నిందలకు పాలయ్యెనని చెప్పి యా చంద్రదర్శన దోషసంబంధ కథనంతయు దెలిపి వినాయకుని పూజ సేయుటకై బోధించెను. శ్రీకృష్ణుడదే విధ మాచరించి దూరునుండి విముక్తుడయ్యెను. ఇది స్యమంతకమణి వృత్తాంతము.

విఘ్నేశ్వరుడు సత్యవినాయక నామము చేత గూడ గొందఱిచే పూజింప బడుచున్నాడు. దీనిని గుఱించి బ్రహ్మాండపురాణములో వ్రాయబడియున్నది. అందు కుచేలుడు కడు దరిద్రుడై శ్రీకృష్ణుని జూడబోవ శ్రీకృష్ణుడతనితో సత్యవినాయక పూజ సేయుమని బోధించెననియు, నతడట్లే చేసి ధనాధికుడయ్యెననియు జెప్పబడియున్నది. భాగవతము లోని కుచేలుని కథనే యించుక మార్చి పెంచి బ్రహ్మాండ పురాణములో వ్రాసియున్నారు.

**విశేషాంశములు:–** ఈ వినాయకుని నిజమగు తత్త్వమేమో యూహింప జాలము. సాధారణముగా ఇంద్రాదిదేవత లొక్కొక్క ప్రకృతితత్త్వమున కధిపతులుగా నుందురు. ఆ రీతిగా నాలోచించిన వినాయకుడు పురుషు లొనరించు కార్యములు నిర్విఘ్నముగా గొనసాగవలె నను తలపుతో పూజింపబడి యుండును. గుప్తే పండితు డీ వినాయకుడు పంటల దేవుడని యూహించినాడు. ఏలయన, పంటలను నాశనము చేయునట్టివి యెలుకలు. ఆ యెలుక యాతని వాహనము. అనగా నే వస్తువును వీరులు నిర్జింతురో దానిని వాహనముగా చేసికొందురనియు, శ్రీకృష్ణుడు కాళీయసర్పము జయించినందున నందిపై స్వారీచేసెననియు, నదే విధమున నెలుకలను నాశనము చేయు వినాయకుని

కెలుక వాహనమనియు నాపండితుని యభిప్రాయము. మఱియు చెవులు చేటలవంటివని వర్ణించుటచే చేటలు తూర్పు పట్టుటమున్నగు ధాన్య సంబంధ కార్యములలో వాడబడు చున్నందున నీయుపమానము కూడ పంటల సంబంధమైనదని వారు వ్రాసినారు. ఏకదంతము యొక్క యర్థము నాగలిగా భావింపవచ్చు ననివారు. ఈ వాదమే నిజమని భావించిన వినాయకుని పూజావిధానములో సమర్పింపబడు పత్రపుష్ప ఫలములను గూడ నాలోచింపవలయును. అనగా ప్రకృతి యంతయు పంటలచే నుండినప్పుడీ దేవుడు కొలువబడుచున్నాడు. ఈ వాదము సరియైనదో కాదో నిర్ణయింపజాలము. వినాయకుని పూజకొక ప్రత్యేక దినము పూర్వులు నిర్ణయించి నట్లు కనబడదు. భాద్రపదమందుగాని, శ్రావణమందుగాని, మార్గశీర్షమందుగాని చేయవచ్చు ననుటలో నేమి సందర్భమో దురూహ్యము.

## విమర్శ

గణేశ పూజను గుఱించి యనేక పండితులు (ప్రాచ్యులు, ప్రతీచ్యులును) తమతమ తెలివినంతయు వినియోగించి యిదమిత్థమని నిర్ణయింప ప్రయత్నించినారు.

గణపతిని గుఱించి ఐతరేయ బ్రాహ్మణములో 1–21 లో చర్చ గలదు. అందితడు బ్రహ్మ, బ్రహ్మణస్పతి లేక బృహస్పతిగా వర్ణింపబడినాడు.

మ్యూర్ (Muir) అను పాశ్చాత్య పండితుడిట్లనుచున్నాడు:

"ప్రాచీన వేదాంతులు లేఖక కళను మంచి పద్ధతిపై నుపయోగించిరి. సమానార్థ ద్యోతకములగు పదములన్నియు నొకచో జేర్పబడెను. వీనినే 'గణములు' అని పేర్కొనిరి. ఈ 'గణములు అధిపతి'ని బ్రహ్మణస్పతియని నిర్వచించిరి. తర్వాత దీనినే విద్యతో సరిపోల్చిరి. ఈ విద్యనే బ్రహ్మయనియు, వేదమనియు ననిరి."

యాస్కుడు ఇట్టి గణములను సమకూర్చెను. ఈ పండితుని అభిప్రాయమున నీగణముల (విద్య) యధిపతియే గణేశుడు.

శివమహాపురాణములలో గణేశునికి వివాహము జేసియున్నారు. ఇతనికి బుద్ధి, సిద్ధి అను నిద్దఱు భార్యలు వీరిరువురికి క్షేమ, లాభ అను పుత్రులు కలిగిరట. ఈ పదముల యర్థము చూచిన వినాయకుడు విద్యాధిదేవత యనియే బోధ యగుచున్నది.

గణపతి పూజ జేయునప్పుడు పౌరోహితు లీ మంత్రమును జదువుదురు.

గణానం త్వా గణపతిం హవామహే
కవిం కవీనా ముపమశ్రవస్తమం
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత
ఆనశ్శృణ్వ న్నూతిభి స్సీదసాదనం॥ (ఋగ్వేద-మం. 2,23,1)

పై వివరింపబడిన బ్రహ్మణస్పతినామమవే గణపతి నామమని దీని యభిప్రాయము. కాని యీ మంత్రము మన గణేశుని సంబంధము కాదని గోవిందదాసుగారి యభిప్రాయము. అది ముందు వివరింతును.

తైత్తిరీయోపనిషత్తులో నీ క్రింది మంత్రమున్నది:

తత్పురుషాయ విద్మ హే
వక్రతుండాయ ధీమహి
తన్నో దంతిః ప్రచోదయాత్

దీని భావము:

"ఆ పురుషుని తెలిసికొనుచున్నారము. వక్రతుండుని ధ్యానించుచున్నాము. ఆ ధ్యానమునందు మమ్ములను మహాదంతముగల దేవుడు ప్రేరేపించుగాత!"

ఈ మంత్రము సుప్రసిద్ధమగు గాయత్రీ మంత్రము నమూనాపై సిద్ధము చేయబడినది. ఇట్టి మంత్రము లీ యుపనిషత్తులో విశేషముగా నున్నవి. అయితే విశేషమేమన, అన్నిటికిని భాష్యము వ్రాసినట్టి శ్రీమత్ శంకర భగవత్పాదులవారు ఈ మంత్రముల కేమియు భాష్యము వ్రాయలేదు. ఈ యుపనిషత్తు యొక్క పాఠభేదములు నానా ప్రాంతములందును కలవు. కొన్ని ప్రాంతాలవారు ఈ మంత్రములకు గల పాఠభేదముల నొప్పుకొనరు. దీని వలన మనకు బోధయగుటయేమన, శ్రీమచ్ఛంకరాచార్యుల యనంతరమెవ్వరో శైవభక్తులీ మంత్రముల నీతైత్తిరీయోపనిషత్తు నందు చేర్చినారు.

ఒక పండితుడు గణపతి యుత్పత్తిని గుఱించి యిట్లు ఇంగ్లీషు భాషలో వ్రాసియున్నాడు:

"క్రీస్తు శకానంతరము 200 లేక 300 ఏండ్ల తర్వాత బౌద్ధజన్మ కథలను తిన్నగా హైందవ పురాణములలోనికి మార్చుకొన మొదలుపెట్టిరి. మాయాదేవిని బౌద్ధులు గజముచే నభిషేకింపబడినట్లు చిత్రించుచుండిరి. ఈ గజయుక్త మాయాదేవినే

పౌరాణికులు గజలక్ష్మిని జేసిరి. అదే ప్రకారము బౌద్ధుల 'జంభాలర' యను దేవతను వీరు గణేశునిగా జేసిరి. జంభాలుని వాహనము ముంగిస, దీనినే చిట్టెలుకగా మార్చి గణేశుని వాహనము చేసిరి."

గోవిందదాసుగారు 'హిందుమతము' (Hinduism) అను నాంగ్ల గ్రంథమందు గణేశుని గుఱించి బహుతీవ్రముగా ఖండనపూర్వకముగా వ్రాసియున్నారు. ఎట్లు వ్రాసినను భిన్నాభిప్రాయములను గూడ పాఠకుల యెదుట నుంచుటలో దోషముండనేరదు.

"ఆధునికులలో ప్రతి పూజకును మొదట రక్తవర్ణుడును, అటిక బొజ్జ కలవాడును, చతుర్భుజుడును, ఏనుగుతలవాడును, ఎలుక నెక్కిన సామియు నగు గణేశుని పూజించుట యాచారమైపోయినది. ఈ వికారపు దేవుని తత్త్వమందేదో పరమార్థమున్నదని నిరూపింప కొందఱు ప్రయత్నింతురు. కాని యాజ్ఞవల్క్యస్మృతి కాలము వఱకే యితనిని మంచి దేవతగా బరిగణింపక దుష్టదేవతగా నెంచినారు. (చూడుడు స్మృతి 1, 270, 289, 293) ఇతడు వాల్మీకికి బరిచితుడే కాడు (అనగా రామాయణ కాలమున లేడు). ఇతడనేకేతర దేవతల వలె అనార్యదేవతగా నుండినను కొందఱు "గణనాం త్వా గణపతిం హవామహే" యను ఋగ్వేదమంత్రము నీతనికే సమన్వయింతురు. కాని యథార్థముగా నీ మంత్రము బృహస్పతి నుద్దేశించి చెప్పబడినది. ఇదేప్రకారము వేదమందలి రుద్రులను పౌరాణిక మహాదేవునికి (శివునికి) అంటగట్టుదురు. ఇది తప్పు.

మానవగృహ్యసూత్రముల ప్రకారము (2, 14) ఈ గణేశుడు ఒకే దేవుడు కాడు. గృహ్యసూత్రములలో నలుగురు దేవతల పేరు లున్నవి. అవేవన, (1) శలకటంకట, (2) కూష్మాండరాజపుత్ర, (3) అజస్మిత, (4) దేవయజన. ఈ నలుగురును మానవులను పీడించి వారికి గష్టముల గలుగ జేయుచుండిరట. ఈ దుష్టులను తృప్తిపఱచుటకై పై గృహ్యసూత్రములు పూజావిధానమిట్లు నిరూపించినవి. వీరికి పచ్చి మాంసము, చేపలు, మద్యము నైవేద్యముగా నియ్యవలెను.

యాజ్ఞవల్క్యుని కాలము వఱకీ నాల్గుదేవతలు ఒక దేవత యయ్యెను. కాని పేరులు మాత్రము ఆఱయ్యెను. అవేవన, (1) శాల, (2) కటంకట, (3) కూష్మాండ, (4) రాజపుత్ర, (5) మిత, (6) సమ్మిత.

ఈ పేరులను చూచిన పై నాల్గు నామములనే తల తోక విఱిచి ఆఱు చేసినారని విశదమగును. మొదటి నాల్గింటిలోని దేవయజన నామము మాత్ర మెగుర గొట్టబడినది.

ఇట్లు సూత్రకాలము వచ్చు వఱకు ప్రాచీనములైన 11 రుద్రులు, 4 వినాయకులును క్రమముగా ఒకే మహాదేవుడుగను, గణపతిగను మారెను. ఈ గణపతి పార్వతీ మహాదేవులకు గొడుకయ్యెను.

ఇతడు సర్వసత్కార్యములను నాశనము చేయువాడు గాన 'విఘ్నకారకు' డయ్యెను. ఇట్టి దయ్యమును విద్యాధిదేవతగా చేయుట విచిత్రము. ఇతని కేనుగుతలను, తిండిపోతుతనమును జూపించు పెద్ద పొట్టను పెట్టుటయే గాక యా వికార పరిణామముగా నొక యెలుకను సవారి గుఱ్ఱముగా జేసినారు.

ఈ గణేశభక్తులు ఆఱు తెగలవారు. కొందఱు వామ మార్గీయులు. ఈ వామ మార్గీయుల దేవతలను ఉచ్ఛిష్ట గణపతి యందురు. ఈ విగ్రహము ప్రక్కన నొక నగ్నదేవి యుండును. ఈమెపై గణపతి యొక్క తుండము ఆడుచుండును.

'సుప్రభేదాగమము' అను తంత్రగ్రంథమం దిట్లున్నది: తెలివిగల కొడుకు (వినాయకుడు) తన తండ్రిని (శివుని) తన వికృతరూపమునకు గారణమేమని యడుగగా జనకుడిట్లనెను:

'నేనును, నీ తల్లియగు పార్వతియు హిమవంతమందు సంచరించు చుండగా మేము ఏనుగులు రమించి చుండుటను జూచితిమి. అప్పుడే మాకును ఏనుగల రూపుతో గూడవలెనని కోరిక గలిగెను. ఆ సంభోగ ఫలితముగా నీవు జన్మించితివి.

ఇవి గోవిందదాసు గారి యభిప్రాయములు. మొత్తముపై వారి యభిప్రాయమున వినాయకుడు అనార్యుల దేవతయై యుండి, తర్వాత నార్యులచే పూజింపబడజొచ్చెను.

నా యభిప్రాయమున మ్యూరు (Muir) పండితుని యభిప్రాయమే సమంజసముగా నున్నది. ఋగ్వేదమందువర్ణించబడిన బ్రహ్మణస్పతియే గణములకు (అనగా శబ్దములకు – లేక విద్యకు) అధిపతి. అతడే గణపతి. అతనికే తర్వాతి పౌరాణికులు శైవ సంబంధము కల్పించి నానా విధముల నతని యుత్పత్తి ప్రకారమును సృష్టించి విఘ్నముల కధిపతినిగా జేసియుందురు.

# చాతుర్మాస్యవ్రతము

శేష ధర్మమందు ద్రౌపది భీష్మునితో స్త్రీలకు సకల సంత్కరమగు వ్రతమేదియని విచారించగా నా పితామహుడిట్లు చెప్పెనని యున్నది:

"అధిక మేకాదశీవ్రతం; బంధు శ్రావ
ణంబు మొదలుగ మాసము ల్నా లుగింట
నాచరించిన వారికి నఖిల వాంఛి
తంబు లీడేరు నిందిరాధవుని కరుణ"

"నారాయణు దేవుండు శ్రావణ మాసంబున శుక్ల పక్షంబున నేకాదశీ దినంబున యోగనిద్రగైకొని, కార్తీకంబున బ్రసన్నుండగు. ఆ శేష శయనుండు మేల్కాంచిన దినంబు ద్వాదశి యనంబరగు. అందు బూజించిన వారికి సర్వ పాపవిముక్తియు, హరిసాలోక్యంబు నబ్బు."

ఈ నాలుగు మాసములలో అనగా శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక మాసములందరి ఏకాదశీ దివసములం దుపవసించి జాగరముండుట ముఖ్యము.

ఈ చాతుర్మాస్యము శేషధర్మమందు స్త్రీలకే ప్రధానమని చెప్పినను నాచరణలో సన్యాసులు, పీఠాధిపతులు, బ్రాహ్మణులు మున్నగువారు కూడా దీని నాచరింతురు. శ్రీ మహావిష్ణువు ఈ నాలుగు మాసములు యోగనిద్ర చెందుననుట యుక్తికి సరిపోదు. యథార్థమేమన, నీ నాలుగు మాసములు వర్షకాలమున వచ్చినవి. ఈ నాలుగు మాసములందే సస్యోత్పత్తియు, సకల పిపీలికాది కీటకముల యుత్పత్తియు విశేషముగా నుండును. జను లీ కాలములలో విశేషముగా సంచరించిన సూక్ష్మ జీవరాసులకు ప్రాణహానియని జైనుల విజృంభణకాలమున మనవారు గ్రహించి యుందురు. మఱియు రాజులకు పరదేశములపై, పీఠాధిపతులకు తమ శిష్యకోటిపై, అర్థులకు దాతలపై దండయాత్ర చేయుట కీ నాలుగు మాసములందు దుస్తర పంకమును, పరిపూరిత నదీ తటాకములను నడ్డు పెట్టుటచే నెచ్చటికిని కదలక, యున్న చోటనే కాలము గడుపుట యుక్తమని మన పెద్దలు భావించి యీ చాతుర్మాస్యము నేర్పాటు చేసి విష్ణునికి యోగనిద్రను కల్పించి యుందురు.

# పరశురామ జయంతి

పరశురామ జయంతి ప్రతి వైశాఖ శుద్ధ తృతీయనాడు జరుపబడును. ఈ పరశురాముడు దశావతారములలో నొకడుగా బరిగణింపబడుటచేత శ్రీరామాద్యవతార పురుషులవలె నీతని జయంత్యుత్సవము సహితము ఆబ్రాహ్మణ చండాలముగా జరుపబడవలసియుండగా నిప్పుడది కేవలము బ్రాహ్మణులకే ప్రాముఖ్యమైనదై యుండుటకు గారణమేమో?

పరశురాముడు క్షత్రియ స్త్రీయగు రేణుకకును, బ్రాహ్మణుడగు జమదగ్నికిని బుట్టినవాడగుటచే నేటి యాచారమును బట్టి సంకరజాతిలో జేరవలసినవాడు. కాని పూర్వకాలమందుండిన శాస్త్రముల యాధారమున నేమి, మర్యాదల వలననేమి బ్రాహ్మణుడు దక్కిన మూడు జాతుల స్త్రీలను బొందుట కర్హుడై యుండెను. కావున జమదగ్ని యొక్క యుత్పత్తి అణులోమపద్ధతిచే సశాస్త్రీయమే.

ఈ పరశురాముని చరిత్ర అతి విచిత్రమైనది. ఇతడు చాల ముక్కోపి. తండ్రి నుండి యీ ధనమును వారసత్వపు హక్కుగా పొంది వృద్ధి చేసికొనినట్టివాడు. జమదగ్ని భార్యయగు రేణుక ప్రతిదినము నదికేగి యచటి యిసుకతో నొక బిందెను సిద్ధము చేసికొని దానితో నీరు దెచ్చి పాకాదికములను జేయుచెండెడిది. ఒకనాడు నదీ తీరమున నొక రాజు విడిసియుండెను. అతని సౌందర్యమును, వైభవమును చూచి రేణుక కొంత మనసు చెదరినదయ్యెను. ఆనాడెన్ని ప్రయత్నములు చేసినను యిసుక కుండ సిద్ధము కాకపోయెను. తుద కెటులో ఇంటికి పోయెను. జమదగ్ని తన భార్యతో నాలస్యమున కేమి కారణమని యడిగి, సరియగు సమాధానము కానక, తన యోగదృష్టి చేతనే యామె మనశ్చంచలతను గుర్తించి, యాగ్రహోదగ్రుడై యలిగి ఆమె తల నఱుకుటకై తన కుమారుడగు పరశురాముని నియోగించెను. గొడ్డలియే యాయుధముగా గలిగి యా పేరుపొందిన పరశురాముడు జంకు కొంకు లేక యట్లే చేసెను. పితృవాక్య పరిపాలకుడగు కొడుకు యొక్క యాజ్ఞాపరిపాలన క్రమమునకు సంతసించి, వరము వేడుకొనుమని తండ్రి కోరగా సమయ స్ఫూర్తిగల యా బాలుడు తన తల్లిని పునర్జీవితనుగా చేయుటే వరప్రసాదమున జనకుడట్లే యొనరించెను.

కొంతకాలమునకు జమదగ్ని తపశ్చర్య చేసికొనుచుండ కొందఱు క్షత్రియ లా ఋషిని గ్రూరముగా జంపివైచిరి. దానిని విని పరశురాముడు క్రోధోద్దీపితుడై ధాత్రి నంతయును నిరువది యొక్కమారు చుట్టి చుట్టి క్షత్రియులను వెదకి వెదకి సంహార మొనర్చెను. ఇట్లు ప్రపంచమును ఇంచుమించు నిక్షత్రముగా నొనర్చి శాంతి బొంది క్షత్రియ నరమేధమో నాగనొక యజ్ఞము చేసి, యందు దక్షిణగా కశ్యపుడును బ్రాహ్మణునికి యావత్ప్రపంచమును దానము చేసి తాను మహేంద్ర పర్వతమం దునికి చేసికొనెను.

కొంత కాలమునకు శ్రీరాముడు సీతకొరకై శివ ధనస్సును భగ్నము చేయగా పరశురాము డచ్చటికి వచ్చి రాము నెదిరించి యోడి పోయెను. ఇది మొదటి యోటమి. ఇందు విశేషమేమన, ఒక యవతార పురుషుని ఇంకొక యవతారపురుషు డోడించెను!

తర్వాత రామాయణ కాలమందే కాక భారత కాలమందును పరశురాముడు మన కగుపడుచున్నాడు. భారతమందు భీష్మాచార్యుల కితడు చాపాచార్యుడు.

గురు శిష్యుల కొకసారి యంబ విషయమై పోరాటము జరిగెను. అందు పరశురాముడు శిష్యునిచే నోడింపబడెను. ఇది రెండవ యోటమి.

ఈ పరశురాముని దగ్గఱ శాస్త్రాస్త్ర విద్య గఱచుటకై కర్ణుడు పోయి తాను ద్విజుడనని బొంకి యాయన యొద్ద విద్దెను నేర్చుకొనెను. కాని యింద్రుని కైతవముచే పరశురాముడు యథార్థమును గుర్తించి కర్ణునికి శాపమిచ్చి చాప విద్యయందు జెడినవానిగా జేసెను. ఇది యాతని చరిత్ర.

## విమర్శ

పరశురాముని కాలమందు క్షత్రియులను, బ్రాహ్మణులకును జాత్యున్నతి విషయమై కలహములు జరుగుచుండెనని చరిత్రకారుల యభిప్రాయము. ఒక సమయమున క్షత్రియులు మొదటితరగతిని బొంది, బ్రాహ్మణులను రెండవ దర్జాకు దించియుండిరి. దీని సంబంధమగు నిదర్శనములు జాతక కథలందుగూడ జాల కలవు. కావున నుత్కృష్టతకై తీవ్రముగా పెనగుచుండిన వీరి వివాదమును గొడ్డలితో బరశురాముడు తీర్చెను.

ఆ కాలమందు క్షత్రియులు చాల ధర్మేతరులై ప్రపంచమును బాధించుచుండి రనియు, నట్టి యుపద్రవమును పరశురాముడు నివారించెననియు, దాన నీత డవతార పురుషుడనియు జెప్పుదురు. కాని యథార్థమేమన, తన తండ్రిని జంపిన క్రోధముచే

రాజులనందఱను వెదకి వెదకి చంపెను. మఱియు దల్లినే నిర్ఘృణుడై చంపినవానికి క్షత్రియులొక లెక్కయా?

పరశురాముడెట్లు రామాయణ, భారత కాలములందు రెండు యుగాంతరము లందు జీవించెనో, యాతని వయస్సు ఎంత యని నిశ్చయింపవలెనో యను విషయముల నిర్ణయించుట కష్టము. ఇతడు శ్రీరామ శ్రీకృష్ణుల కాలమందు- రెంటను నుండినవా డనునది విశ్వసించిన శ్రీరామ శ్రీకృష్ణుల కాలమందు జాల వ్యత్యాసము లేదనియు, నించుమించు వీరు సమకాలీకులనియు జెప్పవలసి వచ్చును. అప్పటికిని పరశురామునికి సుమారు 170 సంవత్సరముల వయఃకాలమని చెప్పవలసి యుండును. అయితే పౌరాణికులు పరశురాముడు చిరంజీవి యని చెప్పి యీ చిక్కు నుండి తప్పించుకొనుచున్నారు. పరశురాము డొక్కడే కాదు నేటికిని జీవించువాడు. ఇతనితోబాటు నశ్వత్థామ, హనుమంతుడు మున్నగువారు నేటికిని బ్రతికియున్నారట! శ్రీరామ శ్రీకృష్ణులు శతవత్సరముల జీవితానంతరము మరణించిరి. కాని వీరు మాత్రము చిరంజీవులై ప్రకృతి విరుద్ధ మర్యాదచే విలసిల్లుచున్నారట. ఏమి కారణమో? నిజమో? కల్లయో? ఎందున్నారో? ఎవరి కగపడువారో? ఇవన్నియు మనకు నచ్చజెప్పువారెవరో తెలియదు.

పరశురాముడు రామాయణ భారత కాలములందు రెంటను నుండినది విశ్వసనీయమే. శ్రీరాముడు, శ్రీకృష్ణులు యుగాంతరములో నుండి నారని విశ్వసించువారు పరశురామునికి చిరంజీవత్వసిద్ధిని ఇయ్యవలసి వచ్చెను. యథార్థమేమన, శ్రీరామ శ్రీకృష్ణులకు అంతరాయము విశేషముగా లేనట్లు కనబడుచున్నది. శ్రీరాముల వార్ధక్యదశలో శ్రీకృష్ణుడు బాలుడుగా నుండి యుండును.

రామాయణమందును, భారతమందును వచ్చు వీరులలో పరశురాముడొకడు. ఇంకను చాలామంది రామాయణములోనివారు భారతమందు కనబడుచున్నారు ఎట్లన:

1. **హనుమంతుడు**:- ఇతడు రామాయణమునకే పూర్తిగా చెందినవాడైనను భారతములో వృద్ధుడుగా కానవచ్చుచున్నాడు. సౌగంధికాహరణములో భీమునితో కలసి అతనికి సాయపడుచున్నాడు.

2. **బభ్రువాహనుడు**:- ఇతడు జాంబవంతుని మనుమడు. జాంబవంతుడు రామాయణములో ముఖ్యుడు. బభ్రువాహనుడు భారత వీరులలో నొకడు.

3. **విభీషణుడు**:- ఇతనిని రాముడు లంకాధీశ్వరునిగా పట్టాభిషేకము చేసిపోయెను. నలుడు దక్షిణదేశ దిగ్విజయయాత్రకు పోయినప్పుడును ఇతడే వృద్ధుడై రాజ్యము చేయుచుండెను. నలునితో ఢీకొనుటకు మారుగా అడిగిన వెంటనే లోబడి కప్పము గట్టెను.

4. **పరాశరుడు**:- ఇతడు వసిష్ఠుని మనుమడు. భారతములో నితని గురించి యిట్లు వ్రాయబడినది:

చ॥ గత మదమత్సరుండు త్రిజద్వినుతుండు వసిష్ఠపౌత్రుడు
న్నతమతి శక్తిపుత్రు డఘనాశన ఘోరతపోధనుండు సు
వ్రతుడయి తీర్థయాత్రసనువాడు పరాశరు డన్మునీంద్రు డ
య్యతివ దలోదరిం గనియె నయ్యమునానది యోడ రేవునన్

– ఆది. 3 ఆ. 34 ప.

పై పద్యమందు పరాశరుని తండ్రి శక్తిపుత్రుడనియు, తాత వసిష్ఠముని యనియు తెలిసెడి. వసిష్ఠుడు శ్రీరాములకు కులగురువు.

5. **సుగ్రీవుడు**:- తెనుగు భారతములో సభాపర్వమందు సహదేవుని దిగ్విజయములో కిష్కింధావిజయము వదలివేయబడినది. సంస్కృత భారతమందిట్లున్నది:

గుహా మాసాదయామాస కిష్కింధాం లోక విశ్రుతాం,
పురం వానర రాజెన సుగ్రీవేణాభిపాలితమ్.

కావున సుగ్రీవుడును ఉభయత్ర కనుపించువాడే.

నాకు గోచరించిన విషయము లివి. పండితులకు ఇంకను మరెందరు కనిపింతురో యేమో! ఈ విషయములను బట్టి యాలోచించి చూచిన రామాయణ, భారత కాలములందు అంతగా అంతరాయము కనిపించదు.

పరశురాముడు ఒక విధముగా గొప్ప సంస్కర్త. స్వయముగా అనులోమ సంజాతుడు. ఇతని క్షత్రియసంహారము నేటి వరకును చాలా జాతులకు అనుకూలముగా నాధారముగా నేర్పడి యున్నది. పతిహీనులైన క్షత్రియ స్త్రీల నుండి మిశ్రజాతు లేర్పడినట్లు ఎందరో ప్రమాణములను కల్పించుకొనినారు.

పరశురాముండు భీకరనిజకోపాగ్ని నుగ్రుడై యిరువదియొక్క మారు
ధాత్రీతలం బపక్షత్రంబు చేసిన దత్ క్షత్ర సతులు సంతానకాంక్ష

వెలయంగ ఋతుకాలముల మహావిప్రులదయ చేసి ధర్మువు తప్పకుండ
బడసిరి పలువుర గొడుకుల గూతుల... ...

అని భారతమందు వ్రాసినారు. మరియు స్కాంద పురాణములోని సహ్యాద్రి ఖండములో నిట్లు వ్రాసినారు:

అ బ్రాహ్మణ్యే తదా దేశే కై వర్తాన్ ప్రేక్ష్య భార్గవః,
స్థాపయిత్వా స్వకీయే సక్షేత్రే విప్రాన్ ప్రకల్పితాన్.

తాను కశ్యపబ్రాహ్మణునిచే వెడలగొట్టబడినవాడై సహ్యాద్రి పర్వతప్రాంత మందు నివసించి అందు బ్రాహ్మణులు లేకుండుటనుజూచి అచ్చటి ఆటవికులైన కొండజాతివారిని (అనగా శూద్రులకన్న నీచులైన జాతివారిని) జూచి, వారి మెడలలో జందెములు వేసి, వారిని బ్రాహ్మణులనుగా చేసెను. ఇంతటి సంస్కార కార్యము సామాన్యమైనది కాదు.

# బుద్ధ జయంతి

దశావతారములలో బుద్ధ భగవాను డొకడు. ఇతడే కడపటి యవతారము. వీరి తర్వాత ముందెన్నడో కల్క్యవతారము రానున్నదని హిందువులు విశ్వసింతురు. అన్ని యవతారముల మాట యటుండ బౌద్ధావతారము హిందువులకు సరిపడినది కాదు. ఒక ప్రక్క యవతారమని చెప్పుచు వేరొక్కప్రక్క బుద్ధుని నిందింతురు. దీనికి గారణమేమన, బుద్ధుడు వేదప్రామాణ్య మొప్పుకొనలేదనియు, జాతి సంకరము చేసెననియు, నాస్తికతను ప్రబలజేసెననియు నిందింతురు. బుద్ధుని వంటి భావములనే వెల్లడించిన శ్రీశంకర భగవత్పాదులను సహితము ప్రచ్ఛన్న బౌద్ధుడని నిందించినారు. బౌద్ధమత మెట్టిదైనను మన కా ప్రసక్తితో నవసరము లేదు. అన్ని జయంతులను గుఱించి యీ గ్రంథమందు వ్రాసినాము. కావు నీ జయంతి విషయము సహిత మించుక వ్రాసెదము.

## బుద్ధుని జీవితము

కలియుగమందు 2478 వ సంవత్సరమున వైశాఖ పౌర్ణమినాడు కపిలవస్తు సమీపమందలి లుంబిని యను నారామమందు శ్రీబుద్ధభగవానుడు జన్మించెను. ఇతని తల్లి మాయాదేవి; తండ్రి శుద్ధోదనుడు. వీరిది క్షత్రియ వంశము. గౌతమగోత్రము. శాక్యులను శాఖవారు ఇక్ష్వాకు సంతతివారగుటచే వీరు సూర్యవంశ క్షత్రియులు. బుద్ధుడు పుట్టిన నాడే యతని భార్యయగు యశోధరయు, బోధివృక్షమును జన్మించెనని చెప్పుదురు. బాలుని మొదటిపేరు సిద్ధార్థుడు. అతని జాతకము జూచి యతడు చక్రవర్తియైన నగును, లేదా ప్రవక్తయైన నగునని కాలవేత్తలు పల్కిరి. బాలుడు పుట్టిన యేడవనాడే యాతని తల్లి మరణించెను. తండ్రియే ఆ బాలుని బ్రీతితో పెంచి విద్యలు చెప్పించెను. అతని 16వ యేట యశోధరతో బెండ్లియయ్యెను. వీరికి రాహులుడను కొడుకు పుట్టెను. ఈ కొడుకు వారికి 29వ యేట పుట్టెను. ఈ కొడుకు పుట్టిననాడే సిద్ధార్థుడు సంసారమును వదలెను. ఇతడెప్పుడు సన్యసించునో యేమో యను భయముచే నీతని తండ్రి యితనిని సదా భవనమందే సర్వసౌఖ్యములతో బెంచెను. ఒకనాడు సిద్ధార్థుడు నగరము చూచుటకై రథమెక్కి పోయెను. అతడు వీథులందు బోవుచుండగా నాలుగు దృశ్యములు చూచెను.

1. మొదలు ఒక ముదుసలిని జూచెను. చూచి రథచోదకునితో వాని తల నరసిన కారణము విచారించగా నందరును నిట్లే ముదుక లగుదురని ప్రత్యుత్తరము బడసెను.

2. తర్వాత నొక జాడ్యస్థుని జూచి తానును జాడ్యముల బొందవచ్చునని గ్రహించెను.

3. అటు తర్వాత నొక శవమును జూచి అందఱును నొకనాడు చచ్చువారే యని తలపోసెను.

4. కడపట నొక భిక్షువును జూచి, వాడు సర్వసంగ పరిత్యాగియై యుండుటను గమనించి ప్రాపంచిక దుఃఖముల నుండి విముక్తి కిదియే మంచి సాధనమని, యా దినమే యర్ధరాత్రమందు నిల్లు, వాకిలి, తల్లి పిల్లలను వదలి యేకాంతముగా నడవుల కేగెను.

అచ్చట నాఱు సంవత్సరములు తపస్సు చేసి, నానా యోగాభ్యాసములు చేసి తుద కవి నిరుపయోగములని గ్రహించెను. తర్వాత నొకనాడు (వైశాఖ పూర్ణిమనాడు) అతనికి దివ్యజ్ఞానము కలిగెను. అప్పుడే బుద్ధుడయ్యెను. నాటినుండియే సిద్ధార్థునికి బౌద్ధుడనియు, నతని మతమునకు బౌద్ధమతమనియు లోకమందు ప్రఖ్యాతి కలిగెను.

ఇట్లు బుద్ధుడై యతడు మొదలు కాశీలోని సారనాథులో మతబోధ చేసెను. అనేక బ్రాహ్మణులు వారి శిష్యులైరి. బుద్ధుడైన తర్వాత నతడు 45 సంవత్సరములు మతవ్యాపనము చేసెను. అతడు తన 80వ యేట కుశీనర యను స్థలములో రెండు సాలవృక్షముల మధ్య మరణించెను.

బుద్ధుని ముఖ్య సందేశము అహింస. ఈ తత్వము పూర్వము హిందువులందు కానము. హిందువులు పశువులను యజ్ఞము పేర జంపి మాంసభక్షకులై యుండిరి. బుద్ధుడిది నిరాకరించెను. ఈతని తత్వమునే తర్వాతి కాలములో బ్రాహ్మణులు సంపూర్ణముగా నొప్పుకొనిరి.

బుద్ధుని రెండవ సందేశము సర్వసమత్వము. ఆర్యులలో చాతుర్వర్ణ్యములు ముదిరి నానాశాఖలుగా వ్యాపించి పరస్పర ద్వేషములు వ్యాపించియుండెను. బుద్ధుడీ కులమును ధ్వంసము చేసెను. అందఱను నోకేకులము వారినిగా జేసెను.

ఈ బౌద్ధమతము తూర్పున జావా (యవద్వీపము), బోర్నియో, సుమత్ర, బలి, చీనా, జపానుదేశముల వఱకును, దక్షిణమున సింహళము వఱకును, పశ్చిమమున బాబిలోనియా వఱకును వ్యాపించెను. కాని యేమిచిత్రమో రాను రాను తన యుత్పత్తిస్థానమగు హిందూస్థానమందు నామమాత్రావశిష్ట మయ్యెను.

జయదేవకవి తన గీతగోవిందములో శ్రీ బుద్ధపరమాత్మను నిట్లు వర్ణించి నాడు:

నిన్దసి యజ్ఞ విధే రహహ శ్రుతిజాతం
సదయహ్రదయ దర్శిత పశుఘాతం
కేశవ! ధృత బుద్ధశరీర! జయ జగదీశ! హరే!

భావము:– "హే కేశవా, హేహరే, హేజగదీశ! నీవు బుద్ధావతార మెత్తితివి. బుద్ధావతారమున నీ హృదయము దయామయమైనది. నీవు వేదమందు పశుఘాతముచే యజ్ఞము చేయవలయునని చెప్పెడి శ్రుతిని ఖండించినావు. అనగా అహింసాతత్త్వమును బోధించినావు."

భారతమందు శాంతిపర్వములోని 340వ అధ్యాయములోని యీ క్రింది శ్లోకములో దశావతారములు తారుమారైనవి.

హంసః కూర్మశ్చ మత్స్యశ్చ ప్రాదుర్భావా ద్విజోత్తమ
వారాహో నరసింహశ్చ వామనో రామ ఏవచ
వమో దాశరథిశ్చైవ సాత్వతః కల్కి రేవచ!!

ఇట్లుండినను 'సాత్వతః' అను అవతారము బుద్ధావతారమని స్పష్టము.

# హోలీ

హోలీ పండుగ ఫాల్గుణ శుక్ల పౌర్ణమీదివసమున చేయబడుచున్నది. హోలీ పండుగ నేటికాలమందించుమించు హిందూస్థానమందన్ని ప్రాంతములందును గావింపబడుచున్నది. అయినను నిది యుత్తర దేశీయుల కుండినంత ప్రాముఖ్యముగా దాక్షిణాత్యులకు లేదనవచ్చును.

హిందువుల యనేక పర్వముల చరిత్రరీతినే యీ హోలీ పర్వచరిత్రము నసమగ్రముగా నున్నది. ఈ పదమెట్లు వాడుకలోనికి వచ్చెనో, యిది యేల చేయబడుచున్నదో యే గ్రంథకారుడును తృప్తికరముగా చూపించి యుండలేదు. దీని నిజమైన తత్త్వమేదో నేను విమర్శలో చర్చించి నిర్ణయించెదను. ప్రకృతము ఈ పండుగకు సంబంధించిన కథలు, చూపించు కారణములు వివరింతును.

హోలీ పండుగ కామదేవోత్సవ మని కొందరు, హోలిక యను రాక్షసిని గుఱించి శాంత్యర్థముగా చేయు నుత్సవమని కొందఱును, దోలికోత్సవమని మఱికొందఱును, వసంతోత్సవమని వేరు జనులును జెప్పుచున్నారు. వీని వివరములను ముందు చర్చింతము

## హోలికా సంహారము

హోలీకా సంహారమును గుఱించిన చర్చలు ధర్మసింధు, నిర్ణయసింధువు లందును, హేమాద్రియందును, జయసింహకల్పద్రుమందును, భవిష్యత్ పురాణమందును, మఱియు నొండు రెండు గ్రంథము లందును గలవు. అందు జయసింహకల్పద్రుమ గ్రంథముననను, భవిష్యత్పురాణము నను నిట్లు వ్రాసియున్నారు:

“శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునితో నిట్లు చెప్పెను: పూర్వము కృతయుగమందు రఘునాథుడను సూర్యవంశపు రాజుండెను. అతడు సమస్త దుష్టులను శిక్షించి ప్రజానురంజకముగా బాలించుచుండెను. కాని కొంతకాలమునకు బ్రజలందఱాతనితో హోలిక యను రాక్షసి తమ పిల్లలను హింసించుచున్నదని మొరలిడిరి. అప్పు డా సభయం దుండిన నారదుడిట్లనెను: ఈ హోలికను ప్రతి ఫాల్గుణ పౌర్ణమీ దివసమున

పూజించిన శిశువులకే బాధయు నుండదు. రఘునాథుడ దేవిధముగా నాచరించుట కాజ్ఞ యిచ్చెను. నాటినుండియు నీయుత్సవము చేయబడుచున్నది."

ధర్మసింధువు, నిర్ణయసింధువు అణు గ్రంథములందు హోలీ యనియు, హోలికా యనియు రెండు పదము లుపయోగింపబడినవి. ఈ గ్రంథములలో హేమాద్రినుండియు, భవిష్యత్పురాణము నుండియు ప్రమాణములు గైకొనుచు నిట్లు వ్రాసియున్నారు: "ఈ హోలీ పండుగ నాడు రాత్రి కాలమందు శిశువులను గృహములందు భద్రముగా దాచి యుంచవలెను." దీనిని బట్టి హోలిక యను దాని భయముచే పిల్లల దాచుచున్నారని విశదమగును. దేవదాసీయ వచనమని పై నిర్ణయ సింధుకారడిట్లుదాహరించినాడు:

నిశాగమే ప్రపూజ్యతే హోలికా సర్వదా బుధైః,
దివివా పూజయే ద్ఢుంఢాం పూజితా దుఃఖదా భవేత్.

అనగా రాత్రికాలమందే హోలికను పూజించవలెను. పగటికాలమందు పూజించిన వారు దుఃఖముల పాలగుదురు. ఈ శ్లోకమందు హోలీకను ఢుంఢ యని సంబోధించియున్నారు. హిందీలో 'ధులండీ' యను పదమునకును, దీనికిని సామీప్యము కనబడుచున్నది. 'ధులండీ' అను పదమునకు 'దుమ్ము రేపుట' అనియర్థమని కొందఱు చెప్పుదురు. అట్లయిన నీ శబ్దము వసంతోత్సవ సూచకముగా నున్నది.

మరికొందరు హోలిక హిరణ్యకశిపుని చెల్లెలనియు, హిరణ్య కశిపుడు ప్రహ్లాదుని అగ్నిలో త్రోయించినపుడు హోలిక ప్రహ్లాదునితో నగ్నిలో ప్రవేశించెననియు, నప్పుడు హోలికయే భస్మమయ్యెననియు, తర్వాత నా హోలికను శిశుసంరక్షణార్థమై పూజింప మొదలు పెట్టిరనియు చెప్పుదురు.

## కామదేవోత్సవము

ఇక హోలికిని, కామునికిని సంబంధమును గుఱించి యించుక విచారింతము. పూర్వమొకప్పుడు లోకమంతయు నొక రాక్షసునిచే బాధింపబడుచుండెను. వానిని జంపుటకు శివోద్భవుడే సమర్థుడని దేవతలు నిర్ణయించిరి. శివుని ప్రథమ భార్యయగు సతీదేవి దక్షప్రజాపతి యజ్ఞములో దనకును, దన భర్తకును నవమానము కలిగెనని దేహమును విసర్జించెను.

సతీదేవి శరీరమును జాలించి పార్వతియై పుట్టెను. ఈశ్వరుడు సతీదేవి మరణానంతరము విరాగియై ఆత్మధ్యాన పరాయణుడై హిమవత్పర్వతమందు వసించెను. అప్పుడింద్రాదిదేవత లాలోచించి మన్మథుని బిలిచి యీశ్వరునికి పార్వతిపై

మోహమంకురించునట్లు చేయగోరిరి. మన్మథుడు తన భార్యయగు రతీదేవితోడను, సఖుడగు వసంతునితోడను హిమవంతము చేరి పార్వతిదేవి యీశ్వరునికి సపర్యలు పిత్రాదేశముచే చేయుచుండు సమయము చూచి శివునిపై తన పుష్పబాణముల బ్రయోగించి యతని మనస్సును గకావిక లొనర్చెను. ఈశ్వరుడు తన దివ్యదృష్టిచే నీ కాముని చర్యలను గ్రహించి కోపించి తన మూడవకంటిమంటచే వానిని దహించెను. రతీదేవి యత్యంతముగా విలపించి భర్తతో సహగమనము చేయ సమకట్ట నాకాశవాణి వారించి యామెకు మరల శుభము కలుగనున్నదని చెప్పెను. పిమ్మట పార్వతి తపస్సుచే నీశ్వరుబ్రసన్ను చేసి యాతని పెండ్లాడెను. మన్మథుడు శరీరము లేకున్నను బూర్వము వలెనే దేవతలలో నుండ ఈశ్వరుడు వరమొసగెను. కావుననే మన్మథుని ననంగుడందురు. ఈ మన్మథ దహనమునే ఫాల్గుణ శుద్ధ పౌర్ణమీ దివసమున జనులు పండుగగా చేయుచుందురు.

## డోలికోత్సవము

ఈ సందర్భముననే యింకొక యంశము సూచింపదగినదై యున్నది. నిర్ణయ సింధువులో నిట్లున్నది:

నరో దోలాగతం దృష్ట్వా గోవిందం పురుషోత్తమం,
ఫాల్గుణ్యాం సంయతో భూత్వా గోవిందస్య పురం వ్రజేత్

అనగా గోవిందుడు (కృష్ణుడు) దోలికయందు (ఉయ్యేలయందు) ఎక్కిన కాల మీ ఫాల్గుణ దివసమందగుటచే నీనాడు నియతిచే బూజసేయ నరుడు వైకుంఠమును బొందును.

పై ప్రమాణరీత్యా బెంగాలులో నేటికిని నీ పండుగనాడు శ్రీకృష్ణ విగ్రహము నుయ్యేలలో నుంచి పూజింతురు.

## ఆచారము

ఈ యుత్సవమునాడు జనులు కొన్ని హేయమగు పనులను జేయుదురు. కొన్ని ప్రాంతములలో వీథులలో జనులొకరిపై నొకరు దుమ్ము జల్లుకొందురు. కావుననే ఈ యుత్సవమును ధులండీ యని వ్యవహరించియుందురు. మఱియు నొకరి నొకరు తిట్టుకొందురు. రంగులు చల్లుకొందురు. కొన్ని ప్రాంతములలో నదేపనిగ వారకాంతలను కూలికి బిలుచుకొనివచ్చి మంగళవాద్యములతో నూరేగింపు చేయుచు వారిపై రంగులను

చెంబులతోడను, పిచికారీల తోడను జల్లుచుందురు. కొన్ని ప్రాంతములలో నీ దివసమున మంది యిండ్లలో దూరి పాలు, పెరుగు, భక్ష్యాది భోజన పదార్థములను దొంగిలించుకొని పోదురు. మఱియు రాత్రి కాలమందు వీథులలో కామదేవుని పటమును దహింతురు. దహించుటకు కట్టెలను గూడ దొంగిలింతురు. ఆంధ్రదేశమందీ యుత్సవమును కామదహనమనియు, కాముని పున్నమయనియు వ్యవహరింతురు. ఆంధ్రదేశమున కన్న మహారాష్ట్ర దేశమందింకను హేయమగు పనులు చేయుదురు. ఇందూరు సంస్థానమందును, దత్పరిసర దేశములందును నీ పండుగనాడు 'నత్థూరాం' అను గొప్ప విగ్రహము నొకటి చేసి, దానికొక గొప్ప లింగము నుంచుచుండిరట. ఈ యంగమును స్త్రీ పురుషులు పూజించుచుండిరట. ఇట్టి హేయమును రోసి యిచ్చటి శిష్టులెల్లరును నొక మహాజరును దర్బారువారి కిచ్చి నివేదించుకొన నీ యాక్షేపణీయాంగమును దీసివైచి విగ్రహమును పూజించుకొనవచ్చునని యాజ్ఞ యయ్యెను. హైద్రాబాదు నగరములో కూడ మార్వాడీ లుండు బేగంబజారు మున్నగు ప్రాంతాలలో నిన్న మొన్నటివరకు ఈ 'నత్థూరాం' యొక్క వికార విగ్రహములు బజారులలో స్థాపింపబడుచుండెను.

## వసంతోత్సవము

ఈ హోలీ పండుగ వసంతోత్సవమని కొందరందురు. వసంతోత్సవమును గుఱించి కొన్ని గ్రంథములలో చర్చ గలదు. కాని తిథి భేదముచే నిదమిత్థమని నిర్ణయించుట కష్టము. నిర్ణయసింధువునందిట్లున్నది:

ప్రవృత్తే మధుమాసే తు ప్రతిపద్యుదృతే రవౌ
కృతా చావశ్యకార్యాణి సంతర్ప్య పితృదేవతాః
వందయే ద్ధోలికా భూమిం సర్వదుఃఖోపశాంతయే.

చైత్ర శుక్ల ప్రతిపత్తునాడు హోలికాభూమిని నమస్కరించిన సర్వదుఃఖశాంతి యగునట!

భవిష్యత్పురాణమందు 'మదన మహోత్సవము' అను దానిని వర్ణించి యున్నారు. ఇందు నేను పై వర్ణించిన మన్మథ దహనకథ యంతయు వివరింపబడి యున్నది. అందీ శ్లోకము గాననగును:

అస్మిన్ వసంతసమయే శుక్లపక్ష త్రయోదశీ

అస్యాం మనోజో దేవి! భవిష్యతి శరీరవాన్.

అనగా చైత్రశుక్ల త్రయోదశినాడు అనంగుడు సశరీరుడగునట. ఈ యుత్సవమునే చైత్రోత్సవమనియు నీ భవిష్యత్పురాణ శ్లోకము నుండి విశదము కాగలదు.

చైత్రోత్సవే సకలలోక మనో నివాసం
కామం వసంత మలయాద్రి మరుత్సహాయం
రత్యా సహార్చ్య పురుషః ప్రవరాచ యేషిత్
సౌభాగ్యరూప సుతసౌఖ్యయుతా సదా స్యాత్ ॥

అనగా సకలలోక మనోనివాసుడగు మన్మథుని, వసంతుని, రతీదేవిని చైత్రోత్సవమందు పూజించువారు సౌభాగ్యరూప సుత సౌఖ్యయుతులై యుందురు.

ఇట్లు చైత్రోత్సవమనియు, వసంతోత్సవమనియు మన్మథోత్సవములు చేయవలెనను భవిష్యత్పురాణ నిర్ణయసింధు ప్రమాణములున్నను నీయుత్సవము చైత్రమాసాదియందని యొకరును, శుక్ల త్రయోదశియందని యొకరును నిర్ణయించుట వలన హోలికా సంబంధము కాదనవచ్చును. కాని చైత్రశుక్ల ప్రతపత్తున జేయవలయునను శాస్త్ర ప్రమాణమునకు, హోలికిని కొంత సంబంధము లేకపోలేదు. సాధారణముగా హిందూస్థానమందు కాలనిర్ణయము రెండు పద్ధతులపై చెల్లుచున్నది. ఉత్తర హిందూస్థానమందు ప్రతిమాసము పౌర్ణిమాంతముతో పూర్తియగును. దక్షిణ హిందూస్థానమందు అమావాస్యతో మాసము పూర్తియగును. కాలనిర్ణయము సౌరమానమనీయు, చాంద్రమాన మనియు, బార్హస్పత్య మానమనియు మూడు తరగతలుగా నున్నది. వింధ్యోత్తర భాగమందు సౌరమానమును, వింధ్యకు దక్షిణభాగమందు చాంద్రమానమును ప్రచారమందున్నవి. ఉత్తర హిందూస్థానమందు పౌర్ణిమాంతముగా మాసనిర్ణయ మున్నదనుట కీ క్రింది ప్రమాణము గమనింపదగినది:

చాంద్రో మాసో ద్వేధా శుక్లాదిః అమాంతః కృష్ణాదిః పూర్ణిమాంతశ్చ, తయోశ్చః॥

శ్లో॥ కృష్ణ పక్షాదికం మాసం నాంగీకుర్వంతి కేచన
యేపీచ్ఛంతి సతేషామపీష్టో వింధ్యస్య దక్షిణే ॥

ఇతి వింధ్యస్య దక్షిణే కృష్ణా నిషేధా దుత్తరే ద్వయో రభ్యనుజ్ఞాగమ్యతే, తత్రాపి శుక్లాది ర్ముఖ్యః, కృష్ణాది ర్గౌణః

ఇట్లు చూచిన ఉత్తర హిందుస్థానమందు ఫాల్గుణ పౌర్ణిమతో మాసాంత మగును.

తర్వాత చైత్రమాస ప్రతిపత్తు ప్రారంభమగును. ఈ కారణముచే చైత్ర ప్రతిపత్తు వసంతారాంభమని యెంచవలెను. అందుచే నీ వసంతోత్సవమునకును, హోలికకును తిథిబేధ ముండదు.

ఈ వసంతోత్సవమునకును, కామదహనోత్సవమునకును దగ్గతి సంబంధము కలదనుటలో నేమియు సందేహము లేదు. ఋతువులన్నిటిలో శ్రేష్ఠమని యెంచబడిన వసంతర్తువులో కామదహనము చేయబడుచున్నది. ఈ ఋతువునందే ప్రకృతియంతయు సుందరముగా పుష్పాదులచే వికసించి శుకపికాదులకు నానందదాయకముగా నుండును. ఈ కాలమే మన్మథుని విజృంభణ సమయమని కవులందఱు వర్ణించియున్నారు. వసంతుడు మన్మథుని ప్రాణసఖుడు. కావుననే యీ వసంతోత్సవ సమయమున జనులు కామవికారపు చేష్టలను ప్రకటింతురు.

మన్మథుని సృష్టి చేసినవారెవ్వరోగాని యిది యన్ని సృష్టులలో చాల రమణీయమైనది. ఇతడు మన్మథుడట– మనస్సుల మథించువాడు కాన; ఇతని భార్య సాక్షా'ద్రతీ' దేవియే. ఇట్టి దేవుని పూజకు ఫాల్గుణ పౌర్ణమీ దివసము, పండు వెన్నెల రాత్రి, నాత్యుష్ణ నాతిశీతకాలము ఉచ్ఛృంఖలతకు తగినట్టి సమయము.

## విమర్శ

పైన వ్రాసిన విషయములలో నేది సరియైనదో, హోలికా నిజతత్త్వమేదియో గుర్తించుట ముఖ్యవిషయము. ఇంతవఱకు హోలికను నాలుగు విధముల వర్ణింతురని చూపినాడను. అనగా నీ పండుగ హోలికా రాక్షసీ తృప్త్యర్థ మనియు, కామదహనోత్సవమనియు, దోలికోత్సవ మనియు పలువురు పలువిధముల తలచుచున్నారు. కావున నిందేది నిజమో, యేది యసమంజసమో విచారింతము.

**రాక్షసి కథ**: రఘుమహారాజు కాలమందొక రాక్షసి రాజ్యమందలి బాలికలను చంపుటచే దానిని శాంతిపఱచుటకై యీ పండుగను రఘుమహారాజు చేయ నాజ్ఞాపించె ననుటకు భవిష్యత్పురాణ నిర్ణయసింధువు వంటి గ్రంథములందు ప్రమాణములున్నను, నవి యవిశ్వసనీయములు. రాక్షసి బాలురను హింసించుటకు హేతువేమో, రఘుమహారాజు నంతటివానికి దానిని సంహరించుట కేల సామర్థ్యము చాలలేదో దురూహ్యము. ఒకవేళ రాక్షసిని సంహరింపలేక పోయినను కొన్ని హేయపద్ధతులచే దానిని శాంతింపజేయుటయు నసమంజసముగా నున్నది. ఈ హోలికా రాక్షసిని తృప్తి పఱచుటకై దొంగతనము చేయవలయునట. చండాలుర యింటినుండి దాని

నంటుపెట్టుటకై యగ్నిని తేవలయునట. బూతులలో తిట్లు తిట్టవలయునట. ఈ క్రింది ప్రమాణము లీ విషయమున గమనింపదగినవి.

పురుషార్థ చింతామణి యను గ్రంథములో నీ క్రింది విధముగ నుదాహరించి యున్నారు:

దశ స్యుః శోభనా స్తాసు కాష్టస్తేయం విధీయతే
ఆపత్యై ర్వాథ వృద్ధైర్వా యువాభిర్వా దినాత్యయే
ప్రాప్తోయం పూర్ణిమాయాంతు కూర్యాత్త త్కాష్ఠ దీపనం
చండాల సూతిక గేహా చ్ఛిశు హారిత వహ్నినా
భద్రాముఖం పరిత్యజ్య హోలాయా దీపనం శుభం

– – –

గ్రామాద్బహిశ్చ మధ్యే వా తూర్యనాదసమన్వితం.

ఇట్లు హోలికా దహనము చేయునప్పుడు దీపన మంత్రము లీ క్రింది విధముగా నున్నవి:

అర్చయిత్వాక్షతై రక్తైః కుంకుమేన సుసంస్కృతైః
గీతైర్వాద్యై స్తథా నృత్యైరాత్రిః సా నీయతే జనైః
తమగ్నిం త్రిః పరిక్రమ్య శబ్దైర్లింగ భగాంకితైః
తేన శబ్దేన సా పాప్మా రాక్షసీ తృప్తి మాప్నుయాత్.

ఇందు బూతుల నుపయోగించుట కనుజ్ఞ యియ్యబడినది. ఇట్లు మానవులు నీచకార్యములు చేయుట రఘుమహారాజుకు సమ్మతమై యుండునా? నీ యభిప్రాయమున నీ తప్పుడు శాస్త్రములన్నియు మధ్యన కల్పింపబడినవే!

## దోలికోత్సవము

ఇదియు కేవల భ్రమజనితమో యేమో నా కనుమానము కలుగుచున్నది. హోలికను దోలిక యని భ్రమించి యా పదమును కొక కథను కల్పించి శ్రీకృష్ణుని నుయ్యేలలో బరుండజేసినారు. ఈ యాచారము బెంగాలులో మాత్ర ముండుటచే నిది యనాదరణీయము.

## కామదహనము – వసంతోత్సవము

ఇక కామదహనము, వసంతోత్సవమును జర్చనీయములు. నా యభిప్రాయమున మీ రెండును నొకటియే. వసంతకాలమందు కామోత్సవము చేయుటచే నీ రెండు పేరులు కలిగినవి. ఈ హోలీ పండుగ వసంతోత్సవమే. ఈ విషయమును నిరూపించుటకు పూర్వము హోలీ శబ్దమును గుఱించి కొంత చర్చించెదను.

## హోలీశబ్ద నిర్వచనము

ఈ హోలీపదము సంస్కృత వాఙ్మయమునకు గ్రొత్తదిగా నుండినట్లున్నది. కావుననే నిఘంటుకారులు సహితము సరిగా నిర్వచనము చేయకపోవుటయే కాక నితర శాస్త్రకారులును గొంత సంశయించినట్లున్నది. ఎట్లన, వాచస్పత్య నిఘంటువు నందిట్లు వ్రాసియున్నారు:

'హు, విచ్, తం లాతి, లా, కసంజ్ఞాయాం కన్.' హు అనగా దానదానము అనియు, లా అనిన దానదానమే అనియు ధాత్వర్థములు. మొత్తముపై ఏమి అర్థమో నిఘంటుకారులు వ్రాయక "వసంతోత్సవ భేదే ఉపచారాత్" అని వ్రాసినారు. ఇట్లు వసంతోత్సవ భేదమని అర్థము చేసి నిఘంటుకారులు జైమిని నిట్లుదాహరించినారు:

"హోలికాచ ప్రాచ్యాభిమానిభి రనుష్ఠీయతే హోలాకాచ వసంతోత్సవ విశేషః హులీతి ప్రసిద్ధఃఏమాదీనేషు కాదికం దాక్షిణత్యైః ఆదినేషుకం స్వస్వకులాగతం కరంజార్కాది స్థావర దేవపూజాదికం తద్దేశ ప్రసిద్ధం ఉద్వృషభ యజ్ఞాదిక ముదీచ్యైః క్రియతే."

శబ్దకల్పద్రుమ కోశమందు 'హోలిక' యను పదమున కిట్లర్థము చేయబడినది:

"తృణాగ్ని భ్రష్టార్థపక్వ శమీధాన్యం హోలకః హోలా ఇతి హిందీభాషా"

అనగా అగ్నిలో సగము కాలిన గడ్డితో కూడిన గింజలు (కాపిళ్లు) అని అభిప్రాయము చెప్పుచు నిది హిందీపదము అని తప్పించుకొనినారు. మఱియు వైద్య గ్రంథములందును నిదేయర్థమిచ్చి యున్నారు.

అర్థపక్వశమీధాన్యైః తృణ భ్రష్టశ్చ హోలకః
హోలకోల్పానిలో మేదఃకఫదోషశ్రమాపహః.

అనగా అగ్నిలో సగము పక్వమైన ధాన్యము హోలక మనబడును. ఇది యుదరమందు స్వల్పముగా నగ్ని దీపనము కలిగించును. కఫదోషములను బోగొట్టును.

ఈ పై రెండు ప్రమాణములచే బూర్వము మన దేశమందు గ్రొత్తగా బండిన

ధాన్యమును గడ్డితో తెచ్చి గ్రామస్థులందఱును నొక చేట జేరి దానిని గాల్చి సగము పక్వమైన తర్వాత భుజించుచు పండుగ చేయుచుండిరని యూహింప వచ్చును. వడ్లు, గోధుమలు, జొన్నలు, సెనగలు ఈ ఫాల్గుణ పౌర్ణమివఱకు బూర్తిగా పండును. కావున వసంత కాలములోని హోలికాధాన్యమును వేపుకొని భుజించుచుండిరే కాని హోలికా రాక్షసిని గాల్పలేదని నమ్మవచ్చును.

జైమినీ న్యాయమాలలో హోలాకాధికరణమని ప్రత్యేకాధికరణ మొకటి కలదు. అందు 15 నుండి 23వఱకు గల సూత్రములలో హోలికాచర్చ యిట్లున్నది:

"హోలాకాదే ర్వ్యవస్థా స్యాత్ సాధారణ్య ముతాగ్రమః
దేశభేదేన దృష్టత్వా త్సామ్యం మూలసమత్వతః.

హోలికాదయః ప్రాచ్యైరేవ క్రియంతే వసంతోత్సవో హోలాకా అహ్నీనైజకాదయో దాక్షిణాత్త్యైః ఉద్వృషభ యజ్ఞాదయ ఉదీచ్యైః జ్యేష్ఠ మాసస్య పౌర్ణిమాస్యాం బలీవర్దానభ్యర్చ్య ధావయంతి సోయముద్వృషభయజ్ఞః. ఏవం హరీతాదిస్మృతిః కాచి త్క్వచిద్దేశ విశేషే దృశ్యతే తస్మా ద్వ్యవస్థితం ప్రామాణ్యమితిచేత్. మామైవం, తన్మూలత్వేనానుమితస్య వేదస్య సర్వసాధారణత్వేన తేషామపి సర్వసాధారణత్వాత్ అత్రైవ గురుసుతమాహ...."

మొత్తముపై జైమిని యభిప్రాయమేమన, దేశాచారముగా నీ హోలి కోత్సవ మున్నదిగాన నిది ప్రమాణముగా గ్రహింపదగినది. తైత్తరీ యోపనిషద్భాష్యము వ్రాయుచు రంగరామానుజలవారు "యా న్యస్మాకం సుచరితాని తాని సేవితవ్యాని – నో ఇతరాణి" అను దానికిట్లుదాహరణము చెప్పినారు. "శిష్టాచారేష్వపి శ్రుతిస్మృతి విరోధశూన్యతా యాని సుచరితాని తాన్యేవ హోలాది కాని గ్రాహ్యాణి నలోభాది మూలచరితా నీత్యర్థః" అనగా శ్రుతి స్మృతి విరుద్ధములైనను శిష్టాచారములైన హోలికాద్యుత్సవముల వంటివి చేయవచ్చును. ఇట్లు కొందఱు హోలికా శబ్దమును గుఱించి సంశయించియున్నారు.

అయినను నీ హోలికోత్సవము వాత్స్యాయనుని కాలము వఱకే ప్రసిద్ధి నొంది వసంతోత్సవముగా భావింపబడినదని వాత్స్యాయనుడే తెలిపియున్నాడు. కామ సూత్రములం దిట్లు వ్రాయబడి యున్నది:

యక్షరాత్రిః కౌముదీజాగరం... మదనోత్సవః, దమనభంజికా, హోలాకా, అశోకోత్తంసికా... తాస్తాశ్చ మహిమాన్యః దేశ్యాశ్చ క్రీడాజనేభ్యో విశిష్ట మాచరేయు రితి సంభూయ క్రీడా.

పై కామసూత్రములకు యశోధరుడు తన జయమంగళ వ్యాఖ్య వ్రాయుచు హోలాక కిట్లు అర్థము వ్రాసినాడు:

హోలాకా ఫాల్గుణ పూర్ణిమాయాం శృంగకాది ముక్త కింశుకాది కుసుమ రాగాంభసా పరస్పరోక్షణం మిథః పటవాసప్రక్షేపశ్చ.

అనగా ఫాల్గుణ పూర్ణిమనాడు పిచికారీలతో (చిమ్ముడు గొట్టములతో) మోదుగు పూలతో సిద్ధము చేసిన రంగులతో జల్లులాడుటయు, బుక్కచల్లుటయు ముఖ్య వినోదములు. వాత్స్యాయనుడు క్రీస్తువునకు బూర్వము 150 సంవత్సరములు నాటివాడనియు, యశోధరుడు క్రీ.శ. 10వ శతాబ్ది వాడనియు పండితులు నిర్ణయించినారు.

క్రీ.శ. ఏడవ శతాబ్దిలో నుండి శ్రీహర్షుడు తన రత్నావళీ నాటకములో వసంతోత్సవమును విపులముగా వర్ణించినాడు. విస్తరమగునని యా భాగమిందు దాహరింపలేదు.

మహారాష్ట్రులలో హోలికాగ్నిలో పోలీలు (భక్ష్యములు) వేయునాచారము కలదు. కన్నడ, మహారాష్ట్ర భాషలలో కొన్ని పదములను 'ప' కారమునకు మారుగా 'హ' కారముతో నుచ్చరింతురు. కావున పోలి యను పదమును వారు హోలి యని యుచ్చరించి పై పద్ధతిగా నుత్సవము చేయుచుందురని యనుమానింప వచ్చును.

పైన వివరించిన యంశము నీ హోలిక వసంతోత్సవమనియు, వసంతకాల మందు నానా ప్రాంతములందు నానా విధములుగా నుత్సవములు జేయుచుందురనియు గ్రహింపగలము. కొన్ని ప్రాంతములలో నెద్దుల నురికించి వినోదములు చేయుచుందురనియు, కొన్ని చోట్ల పోలీల నాహుతి చేయుదురనియు, కొన్ని తావుల వసంతర్తువులో దొఱకు పంటలను మంట చేసి కాల్చి భుజింతురనియు, కొన్ని ప్రాంతములందు శృంగికా నిర్ముక్తమగు రంగులతో వినోదములు చేయుదురనియు, నిట్లు దేశాచారములచే భిన్న మర్యాదలు కలదైనను మొత్తముపై నిది వసంతోత్సవమే యనియు నిశ్చయమయ్యెడి.

## ఉత్సవ ప్రాచీనత

వాత్స్యాయనుని కాలము వఱకే యీ పండుగ చాల ప్రాముఖ్యత వహించియుండెనని సూచించియుంటిని. ఇంతకన్న నిది ప్రాచీనముదని చెప్పవచ్చును.

ఇది కేవలము హిందూస్థానమందే గాక ప్రాచీనమందు బహుదేశములలోను నాచరింపబడుచుండెను. రోములో (ఇటలీ దేశములో) ప్రాచీనమందు లూపర్కేలియా (Lupercalia) అను వసంతోత్సవము చేయబడుచుండెను. అందు యువకులు వీథులలో నగ్నులై పరుగెత్తుచుండిరి. మఱియు వారి కడ్డముగా మగనాండ్రు సంతానప్రాప్తి కలుగునను నమ్మికతో నిలిచి వారిచేత నుండు తోలు కొరడాల దెబ్బలను దినుచుండిరి. రోము జనులు మన్మథుని బ్యాకస్ (Bachus) అనుచుండిరి. ఈ బ్యాకసు పండుగలో చెప్పగానట్టి కామవికారములు ప్రదర్శించు చుండిరి.

జర్మనీలో పూర్వకాలము నిట్టి దురాచారమే యుండెను. అచ్చటి యువకులు నగ్నులై వీథులందు దిరుగుచు స్త్రీలను బూతులతో దిట్టుచుండిరట. గ్రీసు, పోర్చుగల్లు మున్నగు దేశములలో నిట్టి వసంతోత్సవములే యుండెనని పాశ్చాత్య గ్రంథకర్తలు నిరూపించియున్నారు. పోర్చుగల్లులో 'లెంటు' పండుగనాడు (ఏప్రెలు మాసములోని పండుగ) జనులు బజారులలో – నెవ్వరైనను సరియే – పోవువారిపై రంగులు జల్లు చుండిరట.

పర్ష్యాదేశములో నీపండుగనాడే సంవత్సరాది. దానిని నౌరోజ్ అనుచుండిరి. మఱియు ఇంగ్లాండులో నీకాలమందే వసంతోత్సవము చేయుచుండిరి. దానినే ఏప్రిల్ ఫూల్ ఉత్సవ (April Fools day) మనిరి. హోలీపండుగను ఫాల్గుణి యనియు వ్యవహరింతురు. ఈ ఫాల్గుణీ శబ్దము వంటి ధ్వనికల 'పల్లికా' యను నుత్సవము ఈజిప్టులో జేయబడుచుండెను. దీనినే గ్రీసు దేశములో 'ఫ్లోరేలియా' యని వ్యవహరించిరి. ఈ పదమునకు 'పుష్పోత్సవము' అని అర్థము. ఇది మన వసంత వర్ణనమునకు సరిపోవును.

ఈ విధముగా ప్రాచీనమం దార్యశాఖలలో జేరిన జాతు లన్నింటిలో నీ వసంతోత్సవ ముండుటయు, నన్ని తావులలో నీతి బాహ్యపు చర్యలను, పచ్చి శృంగార చేష్టలను చేయుటయు ప్రసిద్ధము. కావున హోలికోత్సవము బహుప్రాచీనమైనది. హిందువు లార్యావర్తమునకు రాక పూర్వము (తక్కిన యార్యశాఖలలో గలసియుండిన కాలము) నుండియు నీయుత్సవ మాచారమం దుండినది. సర్వవిధముల నిది వసంతోత్సవమే యనుటలో నేమియు సందేహము లేదు.

# నాగ పంచమి

ప్రతి సంవత్సరము శ్రావణశుద్ధ పంచమీ దినమున నాగపంచమీ పూజలు జరుగును. తెనుగులో నీ పండుగను నాగులపండుగ యని యందురు. ఈ పండుగ కేవలము సర్పముల పూజానిమిత్తమై యేర్పడి నట్టిది. ఈ పండుగ విషయమై వ్రతచూడామణియం దిట్లున్నది:

"నాగపంచమీ వ్రతవిషయమై హేమాద్రి భ్రాస ఖండమందు ఈశ్వరుడు పార్వతితో నిట్లనెను: సర్పములను ప్రతి గృహము యొక్క ద్వారముపై గోమయముతో వ్రాసి శ్రావణశుక్ల పంచమీ దివసమున పూజింపవలెను. చతుర్థి నా డుపవాసవ్రత మాచరించి పంచమినాడు బంగారుదిగాని, వెండిదిగాని, కట్టెదికాని, తుదకు మట్టిదిగాని యొక పంచముఖముల సర్పమును చేయించి, దానిని నానా విధములగు ఫల పుష్పములతోడను, గంధాది ధూపములచేతను పూజించి బ్రాహ్మణులను ఘృత పాయస మోదకములచేత దృప్తి పరుయవలెను. దివారాత్రములం దెప్పుడు భూమిని త్రవ్వకూడదు. ఇట్లు స్కాందపురాణమందు జెప్పబడినది."

ఎవ్వరైనను పాములచే గఱవబడిన వారి బంధువులు నాగపంచమీ ప్రవతమును నిష్ఠతో జేసిన నాబాధలు తొలగిపోవునని పై స్కాందపురాణమందు వ్రాసినారు.

**గాథలు**

నాగపంచమి పండుగను గుఱించి హిందూస్థానమం దీ క్రింది గాథలు కలవని గుప్తే పండితుడు తన యింగ్లీషు గ్రంథమందు వ్రాసియున్నాడు.

అనగా ననగా నొక బ్రాహ్మణు డుండెను. అతని కేడుగురు కోడండ్రు. కట్టకడపటి కోడలికి తల్లిదండ్రులు లేరు. తక్కినవారందఱు తమ తమ పుట్టినిండ్లకు బోగా నీమెమాత్రము మామగారి యింటనే యుండి తనకు ఆదిశేషుడు తప్ప వేరే తండ్రి లేడని విచారముతో జెప్పుకొనుచుండెను. ఆదిశేషుడీవార్తను విని జాలినొంది యొకనాడు వృద్ధ బ్రాహ్మణ వేషధారియై యీామె మామదగ్గఱకు వచ్చి తా నీబాలిక పినతండ్రి ననియు, తన కూతురును పుట్టినింటికి బిలిచికొని పోదుననియు నడిగెను. కోడలు

కూడ మామగారి యింటి నివాసమునకు విసిగి తానీ బ్రాహ్మణుని వెంటబోవుట కొప్పుకొనెను. ఇద్దఱును బ్రయాణమైరి. కొంత దవ్వేగిన పిమ్మట మాయా బ్రాహ్మణుడు తననిజరూపము దాల్చి తన ఫణముపై యాబిడ్డను స్వారీచేయ నాదేశించి నాగలోకమునకుం గొనిపోయి తనయాలుపిల్లలతో నుండ నియమించెను. పిల్లల కందఱకును నీమె నేమాత్రమును హింసించ గూడదని శాసించెను. ఇట్లుండ గొంత కాలమునకు ఆదిశేషుని భార్య ప్రసవించెను. ఇంటినిండ బాముపిల్లలు పాఱాడు చుండెను. ఒకనాడీ కోడలు బరువగు కంచు దీపమును చేతబట్టుకొని భయముచే దానిని జాఱవిడువ పిల్లల తోకలపైబడి యాతోకలు విఱిగిపోయెను. కొంత కాలమగుతఱి యాకోడలు మరల తన మామగారి యింటికి వచ్చెను. ఇట్లుండ శ్రావణశుక్ల పంచమీ దివసము వచ్చెను. ఆనాడీ బాలిక పాముల రూపము నొకచో జిత్రించి, దేవుని గూర్చి తన పాము తమ్ములను రక్షించుటకై ప్రార్థించుచుండెను. తోకలు తెగిన పాములానాడే విచిత్ర విధముగా తమ తల్లితో తాము వికృతులైన కారణమడిగి తెలుసుకొని యీ దుష్టబాలికను జంపుదుమని పట్టుబట్టి యాపై మామ యింటికి వచ్చి పొంచియుండిరి. అప్పుడే యీ బాలిక యా తోకదెగిన పాముల రక్షించుటకై దేవుని బ్రార్థించిన దది చూచి కరుణాతరంగిత హృదయములతో నామె నైవేద్యముగా నుంచిన పాలుపండ్లను మెక్కి దీవించి తమ నెలవుల కేగెను. నాటినుండి ప్రపంచమం దీ నాగుల పూజ జరుగుచు వచ్చెను.

**ఇంకొక కథ**:

ఒక కాపు పొలము దున్నుచుండెను. ఒకనాడు తన నాగేటిమొన యొక రంధ్రములో బడి యెద్దులచే బైకి మన్ను పెకలింపబడగా నారంధ్రమం దుండు పాము పిల్లలన్నియు జచ్చెను. తల్లి వచ్చి యీ ఘోరమును భరింపలేక గాపు వాని యింటికి వచ్చి యందఱను గఱచి చంపెను. ఇంతటితో దృప్తినొందక కాపువాని బిడ్డ మగనియింట సంసారము చేయు దానిని గూడ జంపనెంచి యచటికి బోయెను. ఆనా డా కాపు కోడలు ఆదిశేషుని పూజ సేయుచుండెను. ఈ పాము పూజ యగువఱకు తామసించవలసి వచ్చెను. అంతలో నాకలిగొనినదగుట ఆబిడ యారగింపుగా నుంచిన పండ్లు తిని పాలను ద్రాగి శాంతిబొందెను. పిమ్మట పూజచే దృప్తినొంది యా కాపుబిడ్డముంగల నిలిచి, తా నామె తల్లిదండ్రుల, నన్నదమ్ముల జంపిన వృత్తాంతము దెలిపి, వరము కోరుకొనమని యడిగెను. కాపుది వారల నందఱను పునర్జీవులుగా జేయుమని కోరెను. అటులే వారు మరల బ్రతికింపబడిరి. నాటనుండి నేటి వఱకు కాపులు నాగపంచమినాడు భూమి దున్నుకొనుటను మానిరట!

## ఆచారము

ఇవి నాగులపండుగను గూర్చిన కథలు. నాగపంచమినాడు జనులు శిరస్స్నానము చేసి ప్రాతఃకాలముననే సర్పముల ప్రతిమలకు పాలు, కొబ్బెర, అన్నము ఆరగింపు చేయుదురు. మఱికొందరు పుట్టల దగ్గఱకు పోయి పుట్టలలో పాలు పోసి పుట్ట చుట్టును ప్రదక్షిణము చేసి వచ్చెదరు. ప్రతి గ్రామమందును రాతితో చేయబడిన పాముల విగ్రహములుండును. నాగపంచమీ నాడీ విగ్రహములకు పూజలు చేయబడును.

## విమర్శ

నాగపంచమీ విషయమై స్కాంద పురాణమందును, భవిష్యత్పురాణమందును చర్చలు గలవు. వీనిని బట్టి చూడ నిది యార్యుల పండుగగా నుండినట్లు తోచదు. ఇది విశేషముగా ద్రావిడుల యొక్కయు, ననార్యుల యొక్కయు పండుగగా గనబడున్నది. సర్పములు మనుష్యులను హింసించు జంతువులలో జేరినట్టివి. సింహ శార్దూలాదు లరణ్యములలోనే యుండుటచే నగర వాసులకు వాని భయము తక్కువ. కాని యీ సర్పములు నగరములందు గ్రామములందు చేలలోను, తుద కిండ్లలోను నివసించి మనుష్యులను కఱచి చంపుటచే వీని భీతి జనులకు విశేషమయ్యెను. పాము విషమునకు మందు సాధారణముగా నేటివఱకును మంచిది కనిపెట్టబడలేదు. అట్టిచో దాని భీతి యింకను విశేషమగుట సహజము. మన పురాణకాలమున నీశ్వరుడు, విష్ణువు, వినాయకుడు మున్నగు దేవులకు సర్పములు భూషణములై యున్నవి. శివుడు భుజంగభూషణుడు. విష్ణువు శేషశాయి. కృష్ణుడు కాళియమర్దనుడు. ఈ ప్రకారముగా పాములకు ప్రాముఖ్యత యీయబడినది. దేవతలకు ప్రియమైనవిగాన నీ పాముల కొకే తల యుండిన లోటేమో యని అయిదు తలలు గలవిగా వర్ణింపబడినవి. వ్రతచూడామణి సూచించినరీతిగా నీ పండుగ నాగద్రష్ట వ్రతముగా నున్నది. జనులు సర్పమును పూజించిన సర్పముల బాధ తొలుగునని నమ్మి యీ ప్రకారమొక దినమేర్పాటు చేసి, యాదినము సర్పములను పూజించుటకై ప్రత్యేకించి యుందురు. పాము చాల తెలివిగల జంతువనియు, పగబట్టిన సాధించి తీరుననియు భారతభూమి యంతటను వేనవేలు గాథలు చెప్పుచుందురు. భారతదేశమందుండు నన్ని పాములు బహుశః యేయితర దేశమందును లేకుండును. మన దేశమున నేటేట వేనవేలు జనులు సర్పముల కాట్లచే మరణించుచున్నారు. కావున నీ పై సందర్భములను పర్యాలోచించి

వేరు మందుగానక లోకులు వానిని పూజించ మొదలిడియుందురు.

## విశేషాంశములు

భవిష్యత్పురాణమందు నాగపంచమిని గుఱించి యిట్లు వ్రాయబడినది: ఉచ్చైశ్శ్రవ మను గుఱ్ఱము సముద్ర మథనమం దుద్భవించెను. అది యంతటను తెల్లనిది. దానిని జూచి ద్రువ అను సర్పము వినతతో నిట్లనెను: "అంతటను గుఱ్ఱము తెలుపే కాని వెంట్రుక లేల నల్లగ నున్నవి?" వినత యిట్లనెను: "నాకంతయు తెలుపే కనబడుచుండ నీకు నలు పెట్లు కనబడెను?" అంత వారిరువురు పందెము చఱచిరి. కద్రువ నలుపు చూపిన వినత దానికి దాసి యగునట్లును చూపకుండిన కద్రువే దాసి యగునట్లును పందెము కుదిరెను. కద్రు వింటికి వచ్చి తన మాట దక్కించుకొనదలచి, తన పిల్లలను బిలిచి నల్లని వెంట్రుకలు కలిగిన యశ్వరూపము దాల్చుమని చెప్పెను. పిల్లలు ధర్మవిరుద్ధమని దాని కొడంబడక పోయిరి. అప్పుడు తల్లి వారికి జనమేజయుని సర్పయాగములో నందఱు నశించునట్లు శాపము పెట్టెను. వారు చింత చేయుచుండ బ్రహ్మ కరుణించి వారిని అస్తికుడనువాడు ముందు రక్షించగలడని వరమిచ్చెను. ఈ వరమును బ్రహ్మదేవుడు పంచమీ దివసమున ననుగ్రహించెను. కావున నా దివసము పాములకు శ్రేష్ఠమైన దినము. ఆ దినమునాడు పాముల నెవ్వరు పూజింతురో వారి వంశమందు సర్పదష్టభయము లేదు. అయిదు పాములను బంగారువికాని, వెండివికాని, కట్టెవిగాని, తుదకు మట్టివిగాని జేసి, గోక్షీరము చేతను, పాయసము చేతను పూజించి, తర్వాత బ్రాహ్మణలును బూజించి వారికి రుచిరాన్నముల భుజింప బెట్టవలయును. నాగపూజ చేసిన భయము లేదనుట కీ క్రింది శ్లోకములను పై భవిష్యత్పురాణము నుండిచే యుదాహరించుచున్నాను:

శ్లో॥ వసుకి స్తక్షకశ్చైవ కాళియో మణిభద్రకః
ఐరావతో ధృతరాష్ట్రః కర్కోటక ధనంజయౌ
ఏతే ప్రయచ్ఛం త్యభయం ప్రాణినాం ప్రాణజీవితాం
పంచమ్యాం స్నపయంతీహ నాగాన్ క్షీరేణ యేనరాః

తేషాం కులే ప్రయచ్ఛంతీ తేభయం ప్రాణ దక్షిణాం
శప్తానాగా యదా మాత్రా దహ్యమానా దివానిశం
నిరాపయంతి స్నపనైర్గహం క్షీరేణ మిశ్రితైః
యేస్నపయంతివై నాగాన్ భక్త్యా శ్రద్ధా సమన్వితాః

తేషాం కులే సర్పభయం న భవేదితి నిశ్చయః

పై శ్లోకముల సారాంశమేమన:

వాసుకి, తక్షకి మున్నగు పేరులు గల సర్పరాజములు ప్రాణికోటి కభయమిచ్చు నట్టివి. ఏ జనులు పంచమీతిథినాడు పాములను (విగ్రహములను) గోక్షీరముచే స్నానము చేయింతురో వారికి సర్పభయము లేదు. పాములు తమ తల్లిచే శపింపబడినవి గాన నవి రాత్రింబవళ్ళును శాపాగ్నిచే దహింపబడుచుండును. కావున వానికి క్షీరస్నానము శాంతి కలిగించును. అట్లు శాంతిబొందిన వగుట కతన భక్తులను కృతజ్ఞతాసూచకముగా హింసింపనేరవు. తల్లి శాపమును గుఱించిన కారణము ముందే చూపించబడినది.

ఈ భవిష్యత్పురాణ విషయములను జూచిన సర్పముల భయముచే నీ ప్రకారము పూజించుట యారంభమయ్యెనని నే నిదివఱకే విమర్శించిన యంశము ప్రబలమగుచున్నది. ఈ పురాణమందలి సర్పములు కొన్ని మన కితర పురాణములందు పరిచితములై యున్నవి. జనమేజయుని సర్పయాగమందు కొన్ని సర్పములు గనబడుచున్నవి. మఱియు కాళియుడు శ్రీకృష్ణునిచే నొంపబడెను. నలుని కుపకారము చేసినవాడు కర్కోటకుడు.

ఈ నాగపంచమిని యనార్యులు పండుగ యనుట కొక యనుమానము కలుగుచున్నది. ద్రావిడదేశమందు పాముల పుట్టలకు కొబ్బెర టెంకాయల నైవేద్యము నిచ్చుదురు. నారికేళము నుండి కేరళనామము దక్షిణదేశమునకు గలిగెను. ఈ కారణము చేత నిది యనార్యుల పండుగ యనవచ్చును.

పాశ్చాత్య పండితులు 'నాగుల'ను గుఱించి కొన్ని చారిత్రక సిద్ధాంతములను చర్చించియున్నారు. అందు ముఖ్యముగా ఫెర్గూజన్ పండితుడు 'నాగపూజ' అను ఇంగ్లీషు గ్రంథమందు వ్రాసిన సిద్ధాంతములో ముఖ్యాంశముల నిందుదాహరించు చున్నాను:

"In the mountanious country bordering upon Kashmir, especially in the tract lying between Chenab & Ravi rivers a remnant of the Nagas of the Mahabharata still survives. Here the serpent gods are worshipped now as they were then, not as dangerous reptlies nor as mere symbols but as the defied rulers of an ancient people whose tribal or racial emblem was the Naga or the hooded serpent and whose chief diety was the sun. These people

do not call themselves Nagas. The name of the tribe is Taksha Taxilas, ally of Alexander was a Takshaka. The Naga Temples are not dedicated to the serpents but to the Naga Rajas, the ancient rulers of the race Sesh Nag, Basuki Takht, Karkota, Prithu, & c....... are all worshipped in human form."

దీని భావమేమన, కాశ్మీర దేశమందలి రావీ, చీనాబు నదుల మధ్య నుండు పర్వత ప్రదేశములందు నేటికిని మహాభారతమం దుదాహరింపబడిన 'నాగ' జాతివారున్నారు. ఇచ్చట శేష, వాసుకి, వాసుదేవ, తక్షకి మున్నగు పేరులుగల దేవతలు పూజింపబడుచున్నవి. కాని ఈ దేవతలు పాములుగావు. వీరిని మనుష్యరూపమున నుంచి పూజించుచున్నారు. ఈ జాతియొక్క జాతీయ చిహ్నములు మాత్రమే సర్పములై యుండును. ఇచ్చటి దేవాలయములు ఈ జాతిలోని పూర్వరాజులను పూజించు స్థలములు. ఈ రాజుల విగ్రహములపై మూడు, అయిదు, ఏడు తలలు గల పాముల ఫణములను చిత్రించినారు.

పై యంశములను జూడ మన నాగపంచమికిని, పై నాగజాతికిని గొంత సంబంధ మేర్పడుచున్నది. అర్జునుడు కాశ్మీర ప్రాంతమందలి వాడే. కావుననే ఉలూచిని, అనగా కాశ్మీర దేశమందలి నాగజాతిరాజు కూతును పెండ్లాడెను. మఱియు సుప్రసిద్ధమగు నాగానందములోని కథయి నీజాతి సంబంధమైనదిగా నున్నది. వాసుకికిని, గరుడునికిని ద్వేషముండెను. అనగా వీరిరువురు వేర్వేరు జాతుల రాజులు. వాసుకికి (నాగజాతి రాజుకు) జీమూతవాహనుడను మంత్రి యుండెను. ఇతడు యుద్ధమందు చంపబడెను. వాసుకి దాగుకొనెను. తర్వాత కొంత కాలమునకు వాసుకి తన ప్రజలను జీమూతవాహనుని తనతోబాటుగ పూజింపనాజ్ఞాపించెను. ఈ కథ వలన నాగజాతివారనువారు కొందరు ప్రాచీన హిందూస్థానమం దుండిరనియు, వారనార్యులుగా నుండి రనియు, వారికిని నార్యులకును యుద్ధములు జరుగుచుండెననియు నూహింపవచ్చును.

నాగుల చరిత్రను గుఱించి టాడ్‌గారు తమ రాజస్థాన కథావలిలో నిట్లు వ్రాసియున్నారు: "సిరియా దేశములో సూర్యారాధనమునకై యుంచిన ధ్వజ స్తంభముపై పాములను చిత్రించినారు. అదేవిధమున హిందూ దేవాలయములలో 'ఏకలింగస్వామి' విగ్రహము చుట్టును పాముచుట్టి యున్నది. ఇదేరీతినే (ఇటలీ దేశములోని) పాంపే నగరమందలి ప్రాచీన దేవాలయమగు 'ఇసిస్' దేవాలయములో నొక లింగము చుట్టు పామున్నది." (ఇసిస్ మన ఈశస్ పదమును పోలియుండుట గమనింపదగినది.)

"ప్రాచీన హిందూస్థానములో 'ఇందు' వంశమువారు నాగధ్వజులై యుండిరి. వీరు సూర్యపూజకులు. యాదవులు గరుడధ్వజులై యుండిరి. ఈ సూర్యరాధకులగు నాగధ్వజులకును, గరుడధ్వజులగు యాదవులకును బహుకాల ద్వేషముండెను. దీనినే భారతమందు గరుడ సర్పముల ద్వేషకథలనుగా వర్ణించి యున్నారు. నాగధ్వజులే నాగజాతివారనబడిరి. వీరు పాండవుల శత్రువులు. ప్రాచీన కాలమందు బహుదేశములలో సర్పములకు ప్రాముఖ్యత గలిగియుండెను. ఈజిప్టులో హర్మిన్ దేవునికిని, గ్రీసులో మార్క్యూరీ దేవునికిని సర్పము ముఖ్య భూషణము." (Vol.1.Page 419, 420) టాడ్ గారింకను ఇట్లు వ్రాసియున్నారు:

"Few subjects have more occupied the notice of the learned world than the mysteries of Ophite worship, which are to be traced wherever there existed a remnant of civilization or indeed of Humanity. Among the savages of the savanahs of America and the magi of Fars, with whom it was the type of evil-their Ahrimanes. The Nagas are the serpent-genii of the Rajputs, precisely as the Diodorus describes the snake mother of the Scythae, in whose country originated this serpent-worship engrafted on the tenets of Zardusht, of the Puranas of the priesthood of Egypt and on the fables of early Greece... The traditions of the Jains or Buddhists originated in the land of the Takshas." James Tod's "Annals and antiquities of Rajasthan."

(Vol.1.Page 455)

దీని భావమేమన, నాగరికత వ్యాపించిన దేశము లందంతటను సర్ప (నాగ) పూజ కనబడుచున్నది. అమెరికాలోని ఆటవికులలో, ఫర్స్ (పర్షియా) దేశపు 'మాజీ' జాతిలో నిది కలదు. సర్పములు 'అహ్రిమాను'లుగా భావింపబడుచున్నవి. అనగా 'మాన'వుల 'అరి' (శత్రువులు) అని యర్థము. సిథీజాతి (శక) లోను ఈ పూజ కలదు. జరథుస్త్రమతమందును, ఈజిప్టులోను, గ్రీసులోను నీ యాచారముండెను. జైన బౌద్ధమతములు నాగజాతిలోనే మొదలు ప్రారంభమయ్యెను.

మొత్తముపై టాడ్ చరిత్రకారుని యభిప్రాయములో నాగపూజ బహు ప్రాచీనము నుండి బహుదేశములందుండినది. ఆర్యావర్తములో నాగులు అన సర్పములు కాదు. సర్పములు జాతీయచిహ్నములు కల జాతి యొకటి యుండెను. వీనికిని, యాదవులకును నిరంతరము ద్వేషముండెను. ఈ కథనే భారతమం దాదిపర్వములో గరుడుని అమృత హరణమందును, జనమేజయుని సర్పయాగమందును వర్ణించియుందురు.

మొత్తముపై ఫర్గూజన్ పండితుని యభిప్రాయములో నాగజాతి వారే మొట్టమొదట బౌద్ధమతమును స్వీకరించిరి. నాగజాతి వారు క్రీ॥ పూ॥ 691 లో మగధరాజ్యము నాక్రమించుకొనిరి. బుద్ధభగవానులు క్రీ॥ పూ॥ 623 లో జన్మించిరి. కావున నీ మగధరాజులగు నాగులే మొదట బౌద్ధులైరి. దస్యులను జాతివారును మొట్టమొదట బౌద్ధులైరనియు, వారు కాశ్మీర, తక్షశిల, గాంధార దేశమందుండిన యనార్య జాతులనియు పై పండితుని యభిప్రాయము.

ఇట్లే నాగులు మొదట బౌద్ధులైన కారణమున వారు బౌద్ధులైన తర్వాత కూడా తమ పూర్వపు పూజాస్మరణను మానలేదు. బుద్ధగయలోని శిల్పములలో కొన్ని విగ్రహములు కలవు. ఆ విగ్రములు క్రీ॥ పూ॥ 250 సంవత్సరాల నాడు నిర్మింపబడినవి. బార్హూత్ స్తూపములు క్రీ॥ పూ॥ 200 సంవత్సరాల నాడు నిర్మింపబడినవని ఫర్గూజన్ గారి అభిప్రాయము. అచ్చట నాగరాజుల విగ్రహములు కలవు. అచ్చుటి యొక స్తంభముపై నుండు శాసనములలో నీ పదములున్నవి:

"ఎఱపత్రుడు అను నాగరాజు బుద్ధుని పూజించుచున్నాడు."

అమరావతీ స్తూపములు క్రీ॥ శ॥ 300 ప్రాంతములందలివి. అందొక డాగోబాపై బుద్ధుడు కూర్చొను స్థలమున బుద్ధునికి మారుగా నొక అయిదు తలల సర్పవిగ్రహమున్నది. ఈ కారణములచే నాగులు అనువారొక మనుష్యజాతివారనియు, వారు సర్పచిహ్నులుగను, సర్పధ్వజులుగను, సర్పములందు గౌరముగలవారుగ నుండిరనియు, వారినుండి భారతాదులందు ప్రసిద్ధులైన నాగరాజు లుత్పత్తి యైరనియు, నీ పౌరాణిక నాగరాజులు నిజముగా సర్పములు కావనియు, వీరు అనార్యజాతులుగా నుండిరనియు, వీరి నార్యులత్యంతముగా హింసించిరనియు, దీనికి నిదర్శనము జనమేజయుని యజ్ఞమనియు, వీరార్యులతో సంబంధములు చేసిరనియు, దీనికి నిదర్శనము అర్జునాదుల వివాహములనియు, తర్వాత బుద్ధుని కాలములో వీరు బౌద్ధులైరనియు, అట్లైనను వీరు తమ జాతీయచిహ్నములగు సర్పములను వదలక బౌద్ధాలయములందు వీనినుంచి పూజించిరనియు, వీరి యాచారమే తర్వాత హిందువులును స్వీకరించిరనియు పై ఫర్గూజన్‌గారి సిద్ధాంతములనుండి మన మూహింపవచ్చును. ఏది ఎట్లున్నను నీ పండుగ హిందువులలో చాల ప్రాముఖ్యమైనదనుటలో నేమియు సందేహము లేదు.

శ్రీనాథకవి తన శివరాత్రి మాహాత్మ్యమం దిట్లు వర్ణించినాడు:

చలి ప్రవేశించు నాగుల చవితినాడు;

మెఱయు వేసవి రథసప్తమీ దివసమున;
అచ్చ సీతు బ్రవేశించు బెచ్చు పెరిగి
మార్గశిర పౌష మాసాల మధ్యవేళ.

ఈ పద్యములో 'నాగులచవితి' యను పదమును గమనించుడు. శ్రీనాథుని పద్యములోని భావములు మొదట నాకు సరిగా బోధకాలేదు. తర్వాత మిత్రులగు శ్రీ ఆదిరాజు వీరభద్రరావుగారు నాకీ విషయమున తెలిపినదానిని బట్టి సరియైన భావము నిప్పుడు తెలుసుకొనుచున్నాను.

పై పద్యములో మార్గశిర మాసములో నిండ చలి యుండునని చెప్పి నాగుల చవితి నాడు చలి ప్రవేశించునని చెప్పినపుడు నాగులచవితి కార్తీకమాసములో వచ్చునని యర్థమగును. తెలంగాణములో నాగుల పండుగ, నేను ఈ పండుగలో వ్రాసిన ప్రకారము శ్రావణమందు 'నాగపంచమి' అను పేరుతో శుద్ధపంచమినాడు చేయుదురు. దానికి శాస్త్రాధారములును చూపించినాను. అయితే నా మిత్రులు తెలిపినదాని వలన ఇతర ప్రాంతాలలోని ఆంధ్రులు 'నాగులచవితి' అను పేరుతో నిదే పండుగను కార్తిక శుద్ధ చవితినాడు చేయుదురట. అప్పుడు పై శ్రీనాథుని పద్యములోని భావము సమంజసముగా నున్నదని చెప్పవలెను.

అయితే తెలంగాణములో చేయునట్టి 'నాగపంచమి'నే ఇతర ప్రాంతపు ఆంధ్రులు 'గరుడ పంచమి' అను పేరుతో అందందు చేయుదురట. వ్రత గ్రంథములలో 'గరుడపంచమీ' చర్చ, నాకు జ్ఞాపకమున్నంతవరకు, లేనట్లే. అయినను దేశాచారముగా నున్నందున పేర్కొనుచున్నాను.

## మరికొన్ని విషయములు

నాగులను గురించి దరిమిలాను నాకు తోచిన కొన్ని విషయములను పరిశోధకుల వినోదార్థము మనవి చేసుకొనుచున్నాను. కొందరు పాశ్చాత్య పండితులు నాగజాతి మనుష్యులు హిమవత్పర్వత ప్రాంత దేశములందును, సింధు తీరములందును నుండినట్లు వ్రాసినారు. ఇది సత్యమే. 'నాగులు' అను అడవి జాతివారు నేటికిని అస్సాము (శ్యామ) దేశములో నున్నారు. ఈ నాగజాతి జనులు పాములు కారు. వీరు ఒకఅనార్యజాతి మనుష్యులు. వీరి తెగలు క్రమముగా హిందూ దేశమంతటను వ్యాపించెను. వీరి ప్రాధాన్యతను చూపుటకై మధ్యపరగణాలలోని నాగపురమును,

దక్షిణదేశమందును, ఆంధ్రదేశమందును నాగశబ్దముతో కూడిన స్త్రీ పురుష నామములు బహుళముగా నుండుటయు నిదర్శనములు. సంస్కృత భారతమందు వీరిని గురించి యిట్లు వ్రాయబడినది:

బహూని నాగవేశ్మాని గంగావ స్తీర ఉత్తమే,
తత్రస్థానపి సంస్తోమి మహత పన్నగా నహంః.

గంగాతీరమందు అనేక నాగుల ఇండ్లుండెననియు, అందు నివసించు నాగులను స్తుతింతుననియు పై శ్లోకభావము. నాగులు పాములే అయిన వారి పుట్టల వర్ణింపవలసియుండెను. కాని వారి ఇండ్లను వర్ణించుట చేత వారు మనుష్యులే యని ద్యోతకమగును. తెనుగు మహాభారతమందు ఆదిపర్వములో నిట్లున్నది:

"ఉదంకుడు తన చేతి కుండలంబులు వెట్టి యాచమించుచున్నంత తన తోడన వచ్చి తక్షకుండు నగ్న వేషధారుండై, యక్కుండలంబులుగొని పారిన నుదంకుండును వాని పిరుందన పారిపట్టుకొనుడు" అని యున్నది. పై వాక్యములో నగ్న వేషమును ధరించుట అనునది జైన సిద్ధాంతమును స్ఫురింపజేయుచున్నది. జైనులకు 'క్షపణకులు' అనియు పేరుకలదు. ఈ సందర్భములో 'క్షపణక' పద ముపయోగించిన నగ్నవేషమునకు పూర్తిగా సరిపోయి యుండును. అయితే ఆంధ్ర భారతములో 'తక్షకుడు' అని మాత్రమే యుండగా నతనిని సంస్కృత మహాభారతములో 'క్షపణకుడు' అనియు వాడియున్నారు. ఎట్లన:

సాధయామస్తావదిత్యుక్త్వా ప్రాతిష్ఠతోత్తంక స్తేకుండలే గృహీత్వా సోపశ్యదథ పథి నగ్నం క్షపణక మాగచ్ఛంతం ముహూర్ముహుర్ దృశ్యమాన మదృశ్యమానం చ.

నగ్న క్షపణకులు జైనులగుటచే ఈ శ్లోకములు జైన మతవ్యాప్తి తర్వాత భారతములో చేర్చినారని చెప్పజాలను. కాని క్షపణకు డనగా సన్యాసి యని యైనను అర్థము చేయవలసియుండును. ఎందుకనగా శబ్ద కల్పద్రుమ నిఘంటువులో పై శ్లోకమునే యుదాహరణముగా తీసికొని క్షపణక శబ్దమునకు బౌద్ధుడు అను నొక యర్థమును, సన్యాసియని యింకొక యర్థమును వ్రాసినారు. 'క్షపణక' శబ్దము యొక్క వ్యుత్పత్త్యర్థమును జూచిన (క్షపతి దూరం లజ్జా మితి క్షపణకః) లజ్జను పోగొట్టుకున్న బిత్తలవాడు అన నర్థము వచ్చును. ఈ తక్షకుడు సర్పమే అయి యుండిన అతనికి నగ్నత్వమును, సన్యాసమును కలిగించు శ్రమ యెందులకు? కావున నాగులు అనువారు దిగంబరులై తిరుగుచుండిన అడవిజాతివారై యుందురు. ఈజాతి భారతకాలములో

గంగా తీరములందుండెనని చెప్పితిమి. అంతేకాదు, ఈ జాతివాడగు శేషుడు "గంధమాదన బదరీతపోవన గోకర్ణ పుష్కరణ్య హిమవంతంబున... తపంబు చేసెను" అని ఆదిపర్వమందున్నది. అనగా పై స్థలములలో నాగులుండిరని యూహింపవచ్చును. ఆ స్థలములన్నియు నుత్తర హిందూస్థానములోనివే అనగా నాగులింకను దక్షిణమునకును, తూర్పునకును వ్యాపింపలేదని విశదమగును. తక్షకుడు పరీక్షిత్తును జంపునప్పుడు తన వారితో బ్రాహ్మణవేషుడైపోయెను. మరియు ఆస్తీకుడు జనమేజయుని యొద్దకు పోయినప్పుడు "సకల వేదవేదాంగ పారగులైన విప్రవరుల తోడం జనె." తర్వాత 'ఈ ద్విజనాథు కోర్కి బెంపున వృథసేయగా దగదు' అనియు నీ ఆస్తికునికోరికను సభాసదులు బలపరిచిరి. ఈ విషయమున నింకొక ప్రశ్న బయలుదేరుచున్నది. నాగులలో బ్రాహ్మణాది వర్ణములుండెనా? లేకున్న ఆస్తీకుడు నాగజాతివాడై యుండగా వైదిక బ్రాహ్మణులలో కలిసియుండుట యెట్లు? అతనిని సభాసదులు 'ద్విజనాథుని'గా అంగీకరించుటెట్లు?

యథార్థమేమన, ఆస్తీకుని తండ్రి జరత్కారుడు. అతడు బ్రాహ్మణుడు. 'వివేక న్యాయాన్విత భూసురోత్తమ! జరత్కారూ!' అని యతని సంబోధించిరి. ఇటు చూచిన జరత్కారువలనను, నాగజాతి స్త్రీ వలనను ఆస్తీకుడు జన్మించి తండ్రి కులములో అనులోమ పద్ధతిచే చేరిన వాడయ్యెను. భారత కాలములో బ్రాహ్మణులును, క్షత్రియులును నాగులతో సంబంధములు చేసిరి. అర్జునుడు ఉలూచి యను నాగకన్యను వివాహమాడినది సుప్రసిద్ధ విషయమే.

నగ్న శబ్దమునే హిందీలో 'నంగా' అందురు. హిమాలయ శిఖరములలో నొకటి 'నంగా' పర్వతము (నగ్న పర్వతము) ఈ 'నంగా' పదమును, 'నగ్న' పదమును సమానార్థ ద్యోతకములు. నగ్నులుగా నుండినందున వారికి నాగజాతి యని పేరు వచ్చెనో యేమో చెప్పజాలము. లేక నగములందు (పర్వతములందు) ఉండువారు కావున నాగులని యైనను శబ్ద మేర్పడియుండును.

ఏది యెట్లున్నను నాగులు అడవిజాతివారనియు, బహు ప్రాచీన కాలము నుండియు వారు భారతదేశమం దుండిన వారనియు నిశ్చయమయ్యెడి. ఇక ఈ నాగజాతికిని, నాగపంచమికిని ఏమైన సంబంధమున్నదో లేదో చెప్పజాలము.

ఈరానులోని నేటి షీస్‌స్థాన్ అనునది ప్రాచీనమందలి శీష్. లేక శేష అను నాగజాతి స్థాన మనవలెను. నేటి ఖుర్దిస్థాన్ పౌరాణిక కద్రూ నాగరాణి నివాసస్థాన మనవలెను. తక్షకజాతి వారే తక్షశిలను నిర్మించిరి. ఈ చారిత్రక దృష్టిని కూడ

# ఏకాదశి

హిందువులలో ఏకాదశీ దివసమన్ని దివసములలో శ్రేష్ఠముగా పరిగణింపబడుచున్నది. ఏకాదశీ దినమున నుపవాస ముండవలయును. అనగా దశమిరాత్రి భుజింపగూడదు. ఏకాదశీ దినమున ముఖమైన కడుగకూడదు. ఏమాత్రమును భుజింపగూడదు. ద్వాదశినాడు ప్రొద్దున భోజనము చేయవలయును.

అన్ని యేకాదశులలో ఆషాడ ఏకాదశి చాల ముఖ్యమైనది. దానినే ప్రథమైకాదశి యని యందురు. చాతుర్మాస్య మప్పటినుండి ప్రారంభమగును. ఆషాఢ శుద్ధ ఏకాదశి మొదలుకొని కార్తిక శుక్ల ఏకాదశి వఱకు చాతుర్మాస్య మనబడును. ఈ నాలుగు నెలలందు వచ్చు నేకాదశీ దిములు చాల పవిత్రమని భావింపబడుచున్నవి. ఆషాఢ శుక్ల ఏకాదశి నాడు చేయు వ్రతమును గోపద్మ వ్రతమందురు. దీని కథ యిట్లు చెప్పుదురు.

పూర్వమొక మారు యమసభయందు దేవయక్ష రాక్షసాదులు సభలో గూర్చుని యుండ యమునితో నా సభ్యులు తమ దుందుభులకై చర్మము నిప్పింపుమని కోరిరి. అప్పుడు యముడు తన భటులకు చాతుర్మాస్య వ్రతమును, సంక్రాంతి వ్రతమును చేయని మానవస్త్రీల చర్మములు తెమ్మని యాజ్ఞాపించెను. ఈ సందర్భమును నారదుని వలన శ్రీకృష్ణుడు విని తన నగరమందు స్త్రీలందరఱును గోపద్మ వ్రతమును జేయవలయునని యాజ్ఞాపించెను. పూర్వము సూతు డీ వ్రతమును జేయు విధానమును ఋషులతో చెప్పి యుండెనట. దానినే శ్రీకృష్ణుడు తన చెల్లెలగు సుభద్రతో నిట్లు చెప్పెను:

"ముఖ్యముగా ఆషాఢశుక్ల ఏకాదశినాడు ప్రారంభించి కార్తిక ద్వాదశ్యంతము వఱకు నీవ్రతమును చేయవలయును. గోష్ఠమందు గోమయముతో పరిశుభ్రముగా నలికి, గంధ పుష్పాదులతో నలంకరించి, బ్రాహ్మణులకు వాయనము లియ్యవలెను. కదళీస్తంభములతో మంటపమును నిర్మించి, సువర్ణకల్పితమైన లక్ష్మీనారాయణ విగ్రహము నందుంచి పూజింపవలెను."

సుభద్రయు నిదే ప్రకారము వ్రతమాచరించెను. వ్రతము ముగిసిన వెంటనే యమదూతలు సుభద్ర చర్మమునకై వచ్చిరి. సుభద్ర తాను వ్రతమాచరించితినని వారితో జెప్పుచుండగనే విష్ణుదూతలు వచ్చి యమదూతలను మెత్తగా దన్ని, పలాయితులనుగా జేయ వారు పోయి తమ మహిష వాహనునితో జెప్పుకొన, నాతడంతయు గ్రహించి యిక నెప్పటికిని హరిహరాదుల వ్రత మెందు సాగునో యచ్చటికి దనభటులు పోగూడదని శాసించెను.

మార్గశీర్షమాసమందలి యేకాదశి కూడ చాల ముఖ్యమైనదని చెప్పుదురు. కృతయుగమందు మురనామక దానవుడొకడుండెను. వాడు మహారౌద్రుడును. సర్వలోక భయంకరుడునై, ఇంద్రాది దేవతలను శివ బ్రహ్మాది మహాదేవులను నిర్జించి, వారికి నిలువ నీడలేకుండునట్లుగా జేసెను. అందఱును విష్ణువుతో మొఱపెట్టుకొనిరి. విష్ణువు వారి స్తోత్రములను ప్రసన్నుడై యీ దానవుడెవడు, వాని బలమెంత, వాడు మిమ్మల బెట్టు శ్రమయెట్టిది అని విచారించెను. ఇంద్రుడిట్లనెను: “పూర్వము బ్రహ్మసముద్భవుడైన తాళజంఘుడను రాక్షసుడొకడుండెను. వాని కుమారుడే యీ మురాసురుడు. వాడు చంద్రవతీ నామనగరమున కేలిక. వాడిప్పుడు సర్వలోకములను జయించి మమ్ముల దిక్కులేని వారినిగా జేసెను.”

ఈ పలుకుల విని విష్ణువు మహోగ్రుడై వానిని త్వరలో జంపి దేవతలకు సౌఖ్యము చేకూర్తునని చెప్పి యందరను తమతమ నెలవులకు బోవ సెలవొసంగెను. విష్ణువు మురుని పక్షమందుండిన రాక్షసులను చంపి, మురాసురునితో వేయి సంవత్సరములు బాహుయుద్ధము చేసియు వాని నోడింపజాలకపోయెను. ఇట్లు పరాజితుడై విష్ణువు పారిపోయి సింహవతియను గుహయందు దాగి యచ్చటికి దానవుడు వచ్చినట్లైన వానిని తప్పక సంహరింతునని నిశ్చయించెను. ఇట్లు సంకల్పము కలిగిన వెంటనే యొక కన్యక యాయను శరీరము నుండి యుద్భవించి వచ్చిన మురునితో యుద్ధముచేసి వానిని సంహరించెను. ఈమెయే యేకాదశీదేవి. ఈ యేకాదశి చేసిన మహోపకారమునకు విష్ణువు సంతసించి, యామెను వరముల గోరుమని చెప్పెను. ఏకాదశి యిట్లు పలికెను:

“తాము నాకు మూడు వరము లనుగ్రహించవలెను. మొదటిది నేను సర్వ కాలములందు మీ ప్రియురాలనుగా నుండవలెను. రెండవది నేను సర్వతిథులలో ప్రధానమగు తిథిగా పూజింపబడవలయును. మూడవది లోకమందెవ్వరెవ్వరు నాతిథి

యందు మహా భక్తియుక్తులై యుపవసింతురో వారందఱు ముక్తిని బొందవలయును.” విష్ణు నదే ప్రకారము వరము లొసగుట చేత బ్రపంచమం దేకాదశీ వ్రతము మొదలయ్యెను.

పూర్వము కుచేలుడు సహితము సర్వదరిద్రుడై, యేకాదశీ వ్రతమాచరించి నందున ధనికుడయ్యెననియు చెప్పబడియున్నది.

ఈ యేకాదశీ ప్రాముఖ్యతను గుఱించి సుప్రసిద్ధమగు కథ యొకటి కలదు. అదెట్లన, పూర్వము రుక్మాంగదుడను రాజు పాలించు చుండెను. అతని రాజ్యమందు సర్వజనులు ఏకాదశీ దినమందు భోజన పానాదులను వదలి భక్తిచే దేవుని పూజింపవలయునని యాతడాజ్ఞాపించి యుండెను. రాజాజ్ఞాబద్ధులై జనులంద అటులే యాచరించుటచే యమలోకమందు జనాభా లెక్కలలోచాల తక్కువ మంది లెక్కకు వచ్చిరి. మరియు స్వర్గలోకమంతయు భక్తులచే నిండిపోవుట చేత రంభాదులకు చాల కష్టము సంభవించెను. అప్పుడు యముడు తన ముఖ్యులతో నాలోచించి, దీనికి ప్రత్యాచరణ యెట్లని ప్రశ్నింప వారు రంభను మోహినీవేషమున రుక్మాంగదుని మోహింపజేసి యాతని వ్రతమును నాశనము చేయవలయునని నిర్ణయించిరి. అదే విధముగా రంభ యొకనాడు రుక్మాంగదు డడవిలో వేటాడుచుండ సుందరమగు స్త్రీ రూపధారిణియై, యొకచో రుక్మాంగదుని దృష్టిపథమున వసించి యాతని మోహింపజేసెను. రుక్మాంగదు డా యువిదను పెండ్లాడగోరెను. కాని యువతి మాత్రము బహుభార్యాసక్తులగు రాజులను బెండ్లియాడుట కిచ్చగింపలేదు. తుదకు రుక్మాంగదు డామె వశవర్తియై యామె చెప్పిన ట్లాచరించుకొందునని శపథము చేయగానామె యియ్యకొని యతని వెంట నరిగి యేకాదశి నాడు రంభ తనను సురత కేళియందు గూడమని రుక్మాంగదుని గోరెను. రుక్మాంగదుడు నిరాకరించెను. ఆమె తన యిష్టము నెల్లప్పుడు నెరవేర్తునని మాట యిచ్చినది అతనికి జ్ఞాపకము చేసెను. రుక్మాంగదు డేకాదశీ పుణ్యదినమున సంభోగము కూడదని ఎన్నియో విధముల బోధించి, కాని తలంపు నుజ్జగింపుమని ప్రార్థించెను. కాని రంభ తన పట్టినపట్టును వదలదు. తుదకు రుక్మాంగదుడు తానా పని తప్ప, నితరమగు నే పని చేయమన్నను చేయుదునని యెచ్చరించెను. ఇదియే యదనని రంభ యాతని కుమారుని వధింపుమని కోరెను. జంకు కొంకు లేక రుక్మాంగదుడు తన కుమారుని చంప నుద్యుక్తుడై శిరమును ఛేదింప తన ఖడ్గము నెత్తెను. అప్పుడు విష్ణువు ప్రత్యక్షమై రుక్మాంగదుని భక్తికి మెచ్చుకొని యాతనికి మోక్షమొసంగెను.

ఏకాదశి ప్రతి మాసమందు రెండుమారులు శుక్లపక్షమందును, కృష్ణపక్షమందును వచ్చును. ఇట్లు మొత్తముపై సంవత్సరమునకు 24 ఏకాదశులు వచ్చును. ప్రతి ఏకాదశియు నేదోయొక మహత్త్వము కలదిగా పౌరాణికులు వర్ణించి యున్నారు. ఈ విషయములను సంగ్రహముగా నిందు నేకాదశీ మాహాత్మ్యము నుండి యుదాహరించుచున్నాను.

1. చైత్ర శుక్ల పక్షము – కామదైకాదశి:–

   లలిత గంధర్వుడనువాడు సంగీతము సరిగా పాడనందున రాక్షసుడుగా శపింపబడెను. వాని భార్య లలిత యీ వ్రతమును జేసి భర్తను శాపవిముక్తుగావించెను.

2. చైత్ర కృష్ణపక్షము – వరూధిన్యేకాదశి:–

   ఈ ఏకాదశి నెవ్వరు చేయుదురో వారికి 1000 గోవుల దానము చేసిన ఫలము లభించును.

3. వైశాఖ శుక్ల పక్షము – మోహిన్యేకాదశి:–

   దుష్టబుద్ధి యను కోమటి తన ధనమంతయు దుర్మార్గములందు వ్యయపఱచెను. అందుచే గృహ బహిష్కృతుడయ్యెను. అడవి యందుదిరుగుచు నొక మునిచే నాదేశితుడై యీ వ్రతమును జేసి ధనమును బొందెను.

4. వైశాఖ కృష్ణ పక్షము – అపరైకాదశి:–

   ఈనాటి యుపవాసమువలన స్నాన దాన ఫలములు చేకూరును.

5. జ్యేష్ఠ శుక్ల పక్షము – నిర్జలైకాదశి:–

   భీముడు తిండికాడు. ఏకాదశినా డుపవాస దీక్షకు జాలనివాడు. అందుచే వ్యాసు డితనితో నీయొక్క యేకాదశినాడు నిర్జల నిరాహారదీక్షతో నెట్లైన నుండుమని చెప్పెను. అతని జన్మలో నిదొక్క యేకాదశిని చేసి అందఱు 24 ఏకాదశులు చేసిన ఫలమును బొందెను.

6. జ్యేష్ఠకృష్ణ పక్షము – యోగిన్యేకాదశి:–

   కుబేరుని తోటమాలి ప్రతిదినము శివార్చనకు పూలుతెచ్చి, తన యేలిక

కిచ్చుచుండెడివాడు. ఒకనాడు వాడు భార్యాలోలుడై తన సేవ యందు ప్రమత్తుడయ్యెను. కుబేరుడు వానిని కుష్ఠుగా శపించెను. ఈ ఏకాదశి యందలి యుపవాసముచే వాడు రోగ విముక్తుడయ్యెను.

7. ఆషాఢ శుక్ల పక్షము – శయనైకాదశి:–

ఈనాడు చాతుర్మస్యము ప్రారంభమగును. విష్ణువు క్షీరాబ్ధి శయను డగును.

8. ఆషాఢ కృష్ణ పక్షము – కామికై కాదశి:–

అభీష్ట సిద్ధి కలుగును.

9. శ్రావణ శుక్ల పక్షము – పుత్రదైకాదశి:–

మహిజి త్తనువానికి సంతానము లేక యీ యేకాదశి చేసి కొడుకును గనెను.

10. శ్రావణ కృష్ణ పక్షము – అజైకాదశి:–

హరిశ్చంద్రుడు రాజ్యమును, దారాపుత్రులను బోనాడుకొని యీ వ్రతమును జేసి, మరల అన్నింటిని బొందెను.

11. భాద్రపదశుక్ల పక్షము – పరివర్తిన్యేకాదశి:–

విష్ణువు నిద్రచెంది రెండు మాసములైనది. ప్రక్క త్రిప్పినాడు. ఎడమనుండి కుడికి బొరలినాడు. కాన ఈ యేకాదశి పేరు పరివర్తిన్యేకాదశి.

12. భాద్రపద కృష్ణపక్షము – ఇంద్రైకాదశి:–

ఇంద్రసేను డనువాడు యమలోకమందు బాధపడుచుండెను. అతని కొడు కీయేకాదశి చేసి తండ్రిని స్వర్గమున కంపెను.

13. ఆశ్వీజశుక్ల పక్షైకాదశి:– ఇది స్వర్గ ప్రాప్తి నిచ్చును.

14. ఆశ్వీజ కృష్ణ పక్షము – రమైకాదశి:–

శోభనుడను రాజుకు ఈ ఏకాదశిచే స్వర్గప్రాప్తి కలిగెను.

15. కార్తిక శుక్లపక్షము – ప్రబోధిన్యేకాదశి:–

ఈ దినము చాతుర్మాస్యాంతము. విష్ణువు ప్రబోధము (మెలకువ) పొందును కావున నీ పేరు.

16. కార్తిక కృష్ణపక్షము – ఉత్పత్త్యేకాదశి:–

మురమర్దన మీనాడే జరిగెననియు, ఏకాదశీదేవి యీనాడే జనించెననియు నింతకు పూర్వము వ్రాసిన కథ కిది సంబంధించినది.

17. మార్గశీర్ష శుక్ల పక్షము – మోక్షదైకాదశి:–

వైఖానసుడను రాజు తన తండ్రి నరకమందున్నట్లు కలగాంచి, యీ వ్రతము చేసి తన తండ్రిని స్వర్గమున కంపెను.

18. మార్గశీర్ష కృష్ణ పక్షము – సఫలైకాదశి:–

మహిష్మంతుని కొడుకు లుంపకు డనువాడు దేశభ్రష్టుడై, యొక యేకాదశి నాడు ఏమియు దొఱకక బలవంతపు ఉపవాసముండి నందున నీ యజ్ఞాత కార్యఫలమునకు సహితము సత్ఫలము బొందెను.

19. పుష్య శుక్ల పక్షము – పుత్రదైకాదశి:–

సుకేతు వను రాజీనాటి యుపవాసముచే కొడుకును గాంచెను.

20. పుష్య కృష్ణ పక్షము – షట్తిలైకాదశి:–

ఈనాడు ఆఱు విధములుగా నువ్వుల నుపయోగింపవలెను. (1) స్నానము చేయు నీటిలో వేయవలెను. (2) తిలపిష్టము శరీరమునకు రుద్దుకొనవలెను. (3) ఆరు నూలగింజలు తినవలెను. (4) పానోదకములో నూలను వేయవలెను. (5) బ్రాహ్మణలుకు తిలదానము చేయవలెను. (6) దేవతలకును సమర్పింప వలెను.

21. మాఘ శుక్ల పక్షము – జయైకాదశి:–

ఇంద్రసభలో పుష్పవంతుడనువాడు తన భార్యను జూచికొనుచు నాట్యములో నెత్తుతప్పగా ఇంద్రుడీ దంపతులను రాక్షసులనుగా శపింప వీరి దివసమున నేమియు దినుటకు లభింపనందున నుపవాసముండిన కారణమున శాపవిముక్తులైరి.

22. మాఘ కృష్ణ పక్షము – విజయైకాదశి:–

రాముడు లంకపై సేతువు నిర్మించిన దీ దినమే యట.

23. ఫాల్గుణ శుక్లపక్షము – ఆమలకైకాదశి:-

చిత్రరథుడు పరశురాము నీ దినమున బూజించెను.

24. ఫాల్గుణ కృష్ణ పక్షము – పాపమోచన్యేకాదశి:-

మంజుఘోష యను నప్సర మేధావియను ముని తపోభంగ మొనర్చి శపింపబడెను. ఈ ఏకాదశి వలన నామె విముక్తి బొందెను.

## విమర్శ

ప్రతి మతమందును నుపవాసపద్ధతి కలదు. వైద్యులు సహిత ముపవాస మప్పుడప్పుడుండుట యారోగ్యప్రదమే యని యందురు.

ఈ కారణము చేత గాబోలు హిందువు లేకాదశినా డుపవసింపవలసినదిగా నేర్పాటు చేసి యుందురు. ఈ పద్ధతి వలన నిహమును, బరమును జేకూరున ట్లొనర్చినారు. ప్రతి ఏకాదశియం దుపవాసవ్రతమును జనసామాన్య మాచరించుట లేదు. బ్రాహ్మణులలో విశేషముగా నుపవాసము చేయుదురు. కాని తక్కిన జాతులు ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు మాత్రముపవసించి ద్వాదశినాడు పండుగచేసి తృప్తి పడుదురు.

ఏకాదశీ వ్రతమును గుఱించి వేమనయోగి యభిప్రాయము చూడుడు:

దశమి, యేకాదశి యటంచు వ్రతముబూని
మెతుకు దినకున్న దుర్గుణ మేల మాను
పుట్టపై గొట్ట నురగంబు గిట్టబోదు
విమలగుణరాజ, యోగీంద్ర, వేమనార్య.

# శీతలా సప్తమి

శీతలాదేవిని బెంగాలు దేశమందు తప్ప యితర ప్రాంతములందు పూజింపరు. పేరు మాత్రము భిన్నమైనను నితర ప్రాంతములలో నిట్టి దేవతనే వేరు నామములతో పూజింతురు. ఈ శీతల స్ఫోటకవ్యాధికి అధిదేవత. ఈ దేవతనే మన తెనుగులో ఎల్లమ్మ యందురు. 'అమ్మ' పోయుట యనియు స్ఫోటకమునకు ముఖ్యమగు పేరు. ఈ అమ్మ ఎల్లమ్మ. మన దేశములో పామర జనులు ప్రతియేట ప్రతి గ్రామమందు ఎల్లమ్మను చేయుదురు. ఆంధ్రదేశమందు ప్రాచీనమందును నీ ఎల్లమ్మ చాల ప్రసిద్ధిపొందిన దేవత. ఓరుగంటి ఎల్లమ్మ యనియు, పానుగంటి ఎల్లమ్మ యనియు నేటికిని జనులు వాకొనుచుందురు. వల్లభరాయుడు తన క్రీడాభిరామములో నీఎల్లమ్మనే ఏక వీరాదేవినిగా వర్ణించి యున్నాడు. అలంపురీ మాహాత్మ్యములో రేణుకాదేవియే ఎల్లమ యయ్యెనని.

**'ఎల్లమ్మ ఇతినామ్నా సా దేవీ పరికీర్త్యతే'**. అని వర్ణించియున్నారు.

'అమ్మ' పోసినవారికి ఎల్లమ్మ నైవేద్యము నిచ్చిన జాడ్యము పోవునని జనులు విశ్వసింతురు.

రాజపుత్ర స్థానములో మనువుబిడ్డ 'ఎల్ల' యనియు, నామె బుధుని వివాహమాడెననియు, నీ ఎల్లయే భూదేవత యనియు టాడ్ తన రాజస్థాన్ కథావళిలో వ్రాసియున్నాడు. ఈ 'ఎల్ల' యే రాఠోడులు (రాష్ట్రకూటులు) ఆంధ్రదేశమునకు వచ్చినపుడు వారివెంట వచ్చి యిచట 'ఎల్ల'మ్మ అయ్యెనో యేమో!

ఈ ఎల్లమ్మనే బెంగాలు దేశమందు శీతలాదేవి యను పేరుతో బూజింతురు. ఈ దేవి వాహనము గాడిద.

యాదృశీ శీతలాదేవీ తాదృశః ఖరవాహనః

అని మన దేశమందు సామెతయు గలదు. ఏమి చిత్రమో యీ దేవత వాహనమును జనులు ముట్టుకొనరు. ప్రమాదముచే ముట్టుకొనిన స్నానము చేయుదురు.

ఈ శీతలాదేవిని ప్రతి సంవత్సరము చైత్ర బ॥ 7 దివసమున బూజింతురు. ఈ దేవికి వేపచెట్టు చాల ప్రియము. కావున జాడ్యస్థులకు వేపపుల్లలతో గూడిన నీటిని ద్రావింతురు. నిజమగు తత్త్వమేమన, వేపచెట్టులో ననేక సుగుణములున్నవి. స్ఫోటకమునకు ముఖ్యముగా నీ వేప పుల్లలతో గాచిన నీటిని నౌషధముగా నిచ్చిన జాడ్యము కుదురునని ఆయుర్వేద గ్రంథములు నిరూపించుచున్నవి. కావున శీతలాదేవికన్న వేపచెట్టే గుణము నిచ్చునది. అదే విధముగా గార్దభము యొక్క ప్రాముఖ్యమేమన, జాడ్యస్థులకు దాని పాలనిత్తురు. కావున నీజంతువు కూడ వేపచెట్టువలెనే పనికి వచ్చునట్టిది.

మొత్తముపై ఈ శీతలావ్రతము బెంగాలునకు సంబంధించినది. 'టీకాలు' వేయు నీ కాలములో నీ దేవీ మహత్త్యము కొంత తగ్గియుండవచ్చును.

ఆయుర్వేద గ్రంథములలో సుప్రసిద్ధ గ్రంథమగు మాధవ నిదానములో 'అమ్మ' జాడ్యమునకు నాలుగు పేరులు పేర్కొనబడినవి: (1) శీతలాజాడ్యము, (2) స్ఫోటకము, లేక విస్ఫోటకము, (3) మసూరిక, (4) సర్షపిక. స్ఫోటకము అనగా సన్నని బొబ్బలు శరీరముపై స్ఫుటముగా కనిపించుట. మసూరిక యనగా సెనగల వలె బెందులు గల జాడ్యము. సర్షిపిక అనగా ఆవాలవలె సన్నని బెందులు కల 'తట్టు' పోయుట అను స్ఫోటక జాడ్యభేదము. ఈ పేరులన్నియు సూచించు 'అమ్మి' జాడ్యమునకు అభిదేవత శీతల, లేక ఎల్లమ్మ. మాధవ నిదానములో శీతలజాడ్యమును గురించి యిట్లు వ్రాసినారు:

దేవ్యా శీతలయా క్రాంతా మసూర్యః శీతలా బహిః,
జ్వరయేయుర్యతాభూతాధిష్ఠితో విషమజర్వః

పై ప్రమాణము వలన వైద్యమందును శీతలాదేవిని ఈ స్ఫోటకమునకు అధిష్ఠానదేవతగా జనులు భావించి ప్రాచీనకాలము నుండి పూజించుచు వచ్చినారని స్పష్టమగుచున్నది. ఇక ఈ శీతలాదేవి యొక్క వాహనమును గురించి కొంత చర్చింతము.

ఏ కారణము చేతనో యేమో గాడిద జంతువులన్నింటిలో నీనాడు అస్పృశ్య జాతిలో చేర్చబడినది. శీతలాదేవికి గాడిద వాహమైనందున జనులు శీతలాదేవిని నీచదేవతగా భావింతురేమో! అట్టివారి భ్రాంతిని దొలగించుటకై గాడిద యొక్క చరిత్ర కూడ సంగ్రహముగా వ్రాయుచున్నాను.

వేదకాలమందును, పురాణకాలమందును గాడిదకు గౌరవస్థానమే యుండినది. దేవతలలో శీతలాదేవికే కాక దేవీకాళరాత్రికిని గార్దభము వాహనముగా నుండినది.

"ఏకవేణీ జపాకర్ణపూరా నగ్నా ఖరాస్థితా" అని దేవీకాళరాత్రి వర్ణనలో కలదు. అశ్వినిదేవతలు దేవ లోకములోని ప్రసిద్ధవైద్యులు. వారికి గాడిద (రాసభము) వాహనముగా నుండినట్లు ఈ క్రింది ప్రమాణములు కలవు:

కదాయోగా వాజినో రాసభస్య యేన యజ్ఞం నాసంత్యో.

(ఋగ్వేదము, 1-34-9)

యుంజాథాం రాసభం యమస్మిన్ యామో. (కృ. యజు. 4-1-2)

సగర్దభరథే నాశ్వినా. (ఐ.బ్రాహ్మ. 4-2-9)

తా వశ్వినా రాసభాశ్వాహవంమే. (యజురారణ్యకము, 1-1-10-1)

శూద్రులు విష్ణువుయొక్క పాదమందు పుట్టగా గాడిదలు బ్రహ్మయొక్క పాదమందు పుట్టినవని మార్కండేయ పురాణము చెప్పుచున్నది:

పద్భ్యాం చాశ్వాన్ సమాతంగాన్
రాసభాన్ శశకాన్ మృగాన్
ఉష్ట్రా నశ్వతరాంశ్చైవ
నానారూపాశ్చ జాతయః

భారతకాలములో గుర్రముల వలె గాడిదలను కూడా రథములకు కట్టి వాడుకొనుచుండిరి. లక్కయిల్లు కాల్చుటకై దుర్యోధనుడు పురోచనుని నియోగించునప్పుడు వానిని గాడిద రథముపై నెక్కి వారణావతమునకు బొమ్మని చెప్పుచున్నాడు.

సత్యం రాసభయుక్తేన స్యందనే నాశుగామినా,
వారణావత మద్యైవ యథా యాసి తథా కురు. (ఆది. 145 ఆధ్యా.)

ఇట్లు ప్రాచీనములో గాడిదకు గౌరవస్థాన మండినను మనుస్మృతి కాలము వరకే కొంత గౌరవలోపము కలిగినట్లున్నది. తప్పుచేసిన వారిని నెత్తి గొరిగించి గాడిదపై నెక్కించి ఊరేగించవలెనని మనవు శాసించెను. మరియు పూర్వము అశ్వమేధ, గోమేధాది యజ్ఞములుండెను కదా! అందు గార్ధభయజ్ఞము కూడ నొకటి యుండెను.

మనుస్మృతిలో అవకీర్ణికి ప్రాయశ్చిత్తము చెప్పినాడు. అవకీర్ణి యనగా బ్రహ్మచారియై స్త్రీ సంపర్కము చేసినవాడు. అట్టివాడు ఒంటికన్నుగల గాడిద యొక్క వపచేత పాక యజ్ఞవిధానముచే చతుష్పథ మందు హోమము చేసి ఈ గాడిద చర్మమును కప్పుకొని ఏడిండ్లలో బిచ్చము నెత్తవలెను. (చూడుడు. 11వ అధ్యాయము)

పై చర్చ వలన గాడిద పూర్వము ముట్టరాని జంతువుగా లేకుండెననియు, ముఖ్య వాహనములలో నదియు నొకటిగా నుండెననియు విశదమగును.

# వసంత పంచమి

ఇది మాఘ పంచమినాడు జరుగును. ఈ దినమున సరస్వతీ పూజ జరుగును. ఇది ఆంధ్రదేశములో ప్రచారమందు లేదు.

ఉత్తర హిందూస్థానములోను, బెంగాలులోను నిది చాలా ప్రాముఖ్యముగా నున్నది. సరస్వతి మన పౌరాణిక బోధయందు విద్యాధిదేవత. బ్రహ్మకు భార్య. సంగీత సాహిత్యముల కధిష్ఠాన దేవత. వీణాపాణి. హంసవాహన.

ఈ పండుగనాడు సరస్వతిని విద్య లభించుటకై విద్యాభిలాషులందఱు పూజింతురు. తాటియాకులు, గంటము, గ్రంథములు మున్నగు విద్యాసాధనము లన్నిటి నీ దేవి యెదుట బెట్టి గంధ పుష్పాదులతో బూజింతురు. విద్య కధిదేవతను కల్పించుట యార్యుల మర్యాదయే కాక గ్రీసు, రోము దేశవాసులై యుండిన ప్రాచీనులందును గలదని చరిత్రలు తెలుపుచున్నవి. కవులు తమ తమ గ్రంథములను బ్రారంభించునప్పుడు సరస్వతిదేవిని బ్రార్థించియున్నారు. ఇట్లు సరస్వతిదేవి విద్యకు అధి దేవతయై మాఘమాసమందు బూజింపబడుచున్నది. ఈ పై విషయములను గుప్తేగారు వ్రాసి యున్నారు. కాని హిందీ గ్రంథకారులగు భవానీ ప్రసాదుగా రీపండుగ వసంతరుతు సంబంధమైనదని వ్రాసి యున్నారు. ఈ యిరువురు పండితులు తమ తమ సిద్ధాంతములకు దృష్టికరమగు కారణములు గనబఱపలేదు.

# మహాశివరాత్రి

ప్రతి సంవత్సరము మాఘకృష్ణ చతుర్దశీ దివసమున నీ పండుగ చేయబడును. ఈ శివరాత్రి శైవులకు చాలా ముఖ్యమైనది. ఆనాడు భక్తులందఱు పగలంతయు నుపవాసముండి రాత్రియంతయు మేల్కొని యుందురు. దీనినే జాగరమందురు.

శివరాత్రియందు పైన జెప్పిన రీతిగా నాచరించి శివపూజలు చేయు వారి పాపము లన్నియు నాశనమై వారికి ముక్తి దొఱకుని చెప్పుదురు. అట్లాచరించినవారు ఘోరనరకముల ననుభవింతురు. శివరాత్రిని గుఱించి లింగ పురాణమం దిట్లున్నది:

ఒకనాడు కైలాస శిఖరముపై పార్వతీ పరమేశ్వరు లాసీనులై యుండ పార్వతీదేవి భర్త నిట్లు ప్రశ్నించెను: “లోకమందు సర్వ వ్రతములలో నుత్తమ వ్రతమేది? భక్తి ముక్తి ప్రదాయకమగునట్టి వ్రతమును గుఱించి నాకు బోధింపవలయును.” అంత శివుడిట్లు ప్రత్యుత్తరమిచ్చెను: “దేవి! పరమ రహస్యమగు నీవ్రతమును గుఱించి వినుము. ఆ వ్రతమును శివరాత్రి వ్రతమందురు. మాఘకృష్ణ చతుర్దశీ దివసమున దాని నాచరింపవలెను. తెలిసి కాని తెలియక కాని ఆ వ్రత మాచరించువాడు మోక్షమును పొందును. ఎన్ని పాపములు చేసిన వాడైనను నీ వ్రతమును జేయు మనుజుడు యమలోకమునుండి తప్పించుకొని శివలోకమును జెందును. దీనికి నిదర్శనముగా పూర్వము జరిగిన వృత్తాంతము నొకదానిని వినుము.

పూర్వ మొకప్పుడు జీవఘాతకుడై జంతు మాంసముచే కుటుంబ పరిపాలకుడైన ఒక నిషాదుడుండెను. వాడు నల్లని శరీరియు, సదా ధనుర్ధారియు నైయుండువాడు. వాడొక శివరాత్రినా డొక కోమటి కప్పుబడి శివాలయములో బంధింపబడెను. రాత్రియంతయు వాడు భక్తుల శివశివారావ పూర్వక స్తోత్రములను విని, యుపవసింపవలసిన వాడయ్యెను. ప్రాతఃకాలమున గొందఱు భక్తులు వాని ఋణమును గోమటికి జెల్లించి వానిని విముక్తునిగా నొనరించి, ఇట్లు ముక్తుడై యాబోయ మృగయార్థమై యరణ్యమున కరిగెను. అరణ్యమందొంటరిగా బోవుచు దాను రాత్రి విని వేసారినట్టి శివ శివ శబ్దములను హేళనా పూర్వకముగా నుచ్చరించికొన దొడగెను. దినమంతయు నరణ్యమున మృగముల వెదకి వెదకి తుద కొక్కటియు గానడయ్యెను.

సాయంకాలమగుడు వాడొక తటాకమును సమీపించి రాత్రి సంచరించు సింహ శార్దులాదుల నుండి తప్పించుకొనుటకై యొక బిల్వ వృక్షము నెక్కెను. ఆ వృక్షము క్రింద నొక గుప్తలింగ ముండినది వాడెఱుగడు. వాడు చెట్టెక్కునప్పు డద్దమువచ్చు కొమ్మలను విరిచి క్రింద బారవేయు చుండెను. ఆ బిల్వ పత్రములు లింగమునకు దలపని పూజగా బరిణ మించుచుండెను. రాత్రియంతయు జెట్టుపై నుండి పడుదునేయోయను భీతిచే వాడు నిద్రించలేదు. ఉబుసుపోనట్టి వేళల హేళనముగా శివశివ యని వదరుచుండెను. ఇట్లు మొదటి మూడు యామములు గడచువఱకు వాని పాపములలో నాల్గవ భాగము నశించి పోయెను. ఇంతలో నొక లేడి జలపానార్థ మా చెరువుదగ్గఱకు వచ్చెను. బోయ దానిని జూచి యాకొన్న వాడగుట సంతసించి దానిని జంప వింటిపై బాణము సంధించెను. మృగము సహితము హఠాత్తుగా నాబోయను జూచి మనుష్యవాక్కుతో నిట్లు సంబోధించెను:

"ఓయీ! నన్నేల చంపెదవు?"

బోయ:- నేను, నా తల్లియు, గుటుంబమును నొక దినము నుండి యాహారము లేక యుపవాసమున్నారము. అయితే నే నెన్నియో జంతువుల జంపితిగాని నీ వలె మాటలాడనేర్చిన జంతువును జూడలేదు. ఈ విపరీతమునకు గారణము ముందు జెప్పుము.

లేడి:- వ్యాధోత్తమా! నాయుదంతమును వినుము. నేను రంభను. హిరణ్యాక్షుడను దానవుని బ్రేమించి వాని వినోదములందే చిక్కి శివుని కొలువు మఱచితిని. ఈశ్వరుడు నిజమెఱిగి, క్రోధారుణితనేత్రుడై, నన్నును, నా దానవుని పంద్రెండు సంవత్సరములు మృగీమృగములుగా నరణ్యమందు సంచరించి పిమ్మట ఒక్క వ్యాధుని దర్శనముచే ముక్తి పొందునటుల శపించెను. ఓయీ వ్యాధా! నేను పూర్ణగర్భవతిని. నాపై మాంసమేమియు లేదు. ఇంతలో నింకొక లేడి రాగలదు. దాని మాంసమును దినుము. లేక నన్నే చంపగోరిన నేను నా వసతికి బోయి ప్రసవించి యిచ్చుటికి వచ్చెదను.

బోయ:- నీవు ప్రాణాపాయము నుండి తప్పించుకొనుట కిట్టి యుపాయమును వెదకినట్లున్నది.

అప్పుడు జింక యనేక శపథములు సేసి వ్యాధుని యనుమతి బొంది నిజగృహమున కేగెను.

మధ్యరాత్రి యయ్యెను. వ్యాధునికి నిదురలేదు. శివ శివ యను మాట మాత్రము మఱువలేదు. ఇట్లానాలోచిత వ్రతము చేయ వాని పాతకములు సగము వఱకు

క్షాళితములయ్యెను. అంత మధ్యరాత్ర్యనంతర మింకొక పెంటిజింక యా కొలను జేరెను. దానిపై వ్యాధుడు తన బాణము వేయ సంసిద్ధుడయ్యెను. ఆ జింకయు వానిని జూచి, యిట్లనెను: "నేను నా భర్తను వెదుకుచు నిటువచ్చితిని. నీవేమయిన జూచితివా?" లుబ్ధుడు స్తబ్ధుడై దీని భాషణము జూచి "నీకన్న పూర్వమొక జింక వచ్చియుండెను. అదేమైన నిన్ను బంపెనా? అట్లయిన నీవు చచ్చుటకు సంసిద్ధురాలవై యుండుము." అని యనెను. జింక యిట్లనెను: "నేను లేఁబ్రాయము దానను. నేను విరహవ్యథచే నార్తి నొందు చున్నాను. నన్ను జంపి నీవేమి లాభము పొందుదువు? ఇంతలో నీ మార్గమున నొక బలిసిన జింక రాగలదు. దాని మాంసము నీకు దృప్తి గలిగించును. అటు కాదేని నేను మరల తప్పక వత్తును."

బోయ దానిని శపథము చేయుమనెను. జింక యటులే చేసి యింటికి బోయెను. కొంతసేపటికి కొక కృష్ణమృగ మాచక్కి వచ్చెను. బోయ పూర్వమువలెనే దానిని జంపనుద్యుక్తుడయ్యెను. కృష్ణమృగమాబోయను జూచి వాడు తన పెంటిని గూడ జంపియుండునని యూహించి యిట్లు విలపింప దొడగెను:

(దాంపత్య లాభమును గుఱించి చెప్పిన యీ భావములు చాలా సుందరముగా నుండుటచే మూలము నిచ్చట నుదాహరింతును.)

శ్లో॥ తయా విరహితస్యాస్య నూనం మృత్యు ర్భవిష్యతి,
మహాకాలకృతం పాపం యద్భార్యాదుఃఖ మాగతం.
భార్యయా న సమం సౌఖ్యం గృహేపిచ వనేపిచ,
తయావినా న ధర్మోస్తి నార్థకామో విశేషతః.
వృక్షమూలేపి దయితా యత్ర తిష్ఠతి తద్గృహం,

ప్రాసాదోపి తయా హీనః కాంతారా దతిరిచ్యతే.
ధర్మ కామార్థకార్యేషు భార్యా పుంస స్సహాయినీ,
విదేశచ గతస్యాపి సైవ విశ్వాసకారిణీ.

నాస్తి భార్యాసమో బంధు ర్నాస్తి భార్యసమం సుఖం,
నాస్తిభార్యసమం లోకే నర స్యార్తస్య భేషజం
యస్య భార్యా గృహే నాస్తి సాపి చేత్ ప్రియవాదినీ,
అరణ్యం తేన గంతవ్యం యథారణ్యం తథా గృహం.

"భార్యా వియోగ మనునది మహాపాపఫలము. భార్యావిరహము చావుదెచ్చును. గృహందుండినను, నరణ్యమందుండినను భార్యగలవాని సౌఖ్యమే సౌఖ్యము. ఆమె లేనిది ధర్మము లేదు. కామము లేదు. అర్థము లేదు. చెట్టు క్రింద సంసారము చేసినను భార్యగలవానికదే గృహము. కాని భార్యలేనివాడు ప్రాసాదములందుండి నను వాని కవి యరణ్యతుల్యములే! పురుషుడు భార్యాసహాయుడై సకల పురుషార్థములను సాధించును. విదేశములందు భార్యయే విశ్వాసకారిణి. భార్యతో సాటియగు బంధువులు లేరు. ఆర్తుడైన నరునికి భార్యవంటి యుత్తమభేషజ మింకొకటి లేదు. ప్రియవాదినియగు భార్య యెవనికి లేదో వాడు వనమున కేగవలసినదే! ఏలయన, వా డింట నుండినను నది యరణ్యతుల్యమే."

ఇట్లు దుఃఖించి, వ్యాధునితో, "ఓయీ! నీవు రెండు పెంటి జింకల జూచితివా? వాని నేమైన జంపితివా?" యని ప్రశ్నించెను.

వ్యాధుడవి తనతో మరల వత్తుమని మాటయిచ్చి పోయినట్లు చెప్పెను. అంత కృష్ణమృగ మిట్లనెను: "నేను గృహమునకు బోయి వానితో విహరించి మరల నీ దగ్గఱకు వచ్చెదను. పిమ్మట చంపవచ్చును." అని నచ్చబలికి సెలవు తీసికొని పోయెను. మృగము గృహమునకు బోవు వఱకొక పెంటిజింక శిశువును గనియుండెను. ఇంకొకదానితో క్రీడించి పిమ్మట తన కుటుంబమును జూచి, దుఃఖముతో, దాను వ్యాధునికి శరీరము సమర్పింపబోవుచున్నాని తెలిపెను. పెంటిజింకలు భర్త వియోగమును భరింపజాలక భర్తతోబాటి లోకమే తమదికూడనని తామును భర్తను వెంబడించి చత్తుమని పట్టుపట్టెను. తుదకు నా మూడు జింకలును తెల్లవారు వఱకు బోయ దగ్గఱకు వచ్చి తమను జంపుమని కోరెను. వ్యాధుని హృదయములో నొక గొప్ప మార్పు కలిగెను. జింకలయొక్క సత్యనిష్ఠను జూచి యాశ్చర్యమంది వానిని జంపుట కియ్యకొనక తన విల్లును తునియలుగా జేసి బాణముల బాఱవైచి నాటినుండి యిక ముందు జీవహింస చేయనని వాని వలగొని శపథము చేసెను.

అంత నాకాశము నుండి పుష్పవర్షము గురిసెను. దివ్యయానము వచ్చి జింకలను, లుబ్ధుని సశరీరముగా దీసికొని శివలోకమున కేగెను. కృష్ణమృగము నేటికిని నాకాశమందొక గొప్ప నక్షత్రమై వెలయుచున్నది. దానినే మృగశీర్షయని యందురు. దాని వెనుక నుండి నక్షత్రమునే లుబ్ధక (బోయ) నక్షత్ర మందురు.

ఇట్లు తెలియకయే శివరాత్రినాడు జాగరణము చేసి యుపవసించిన వారికే శాశ్వత పదవులు దొఱకినప్పుడు, తెలిసి భక్తిపూర్వకముగా శివుని భజించు నరులకు

ముక్తి గలుగుననుటలో నేమియు సందేహము లేదని శివుడు శివరాత్రి మాహాత్మ్యమును గుఱించి పార్వతీదేవితో జెప్పెను.

శ్రీనాథ మహాకవి శివరాత్రి మాహాత్మ్యము అను పద్యకావ్యమును రచించెను. అందువారు సుకుమార చరిత్రమును వ్రాసినారు. అందలి కథ యిట్లున్నది. ఒక మంత్రికి సంతానము లేక, లేక లేక బహుతపః ఫలితముగా నొక కుమారుడు– సుకుమారుడను వాడు– పుట్టెను. వాడు యౌవన దశలో వ్యభిచరించెను. వాని రాజు వానిని దేశభ్రష్టునిగా చేసెను. నానాదేశములు తిరుగుచు ఒకచోట ఒక చండాల స్త్రీని పొంది, దానితోనే యుండి సంతానము గనెను. అగ్ని ప్రమాదముచే ఆ చండాలియు, దాని సంతానమును మడిసిరి. సుకుమారుడు కల్లు త్రాగుట, మాంసము తినుట బాగుగా అలవాటు చేసుకొన్నాడు. అవసానకాలమునాడు ఒక శివరాత్రి దినమున ఆ సుకుమారుడు శివభక్తుల పూజలను చూచుచు, వారి భజనల వినుచు మరణించెను. తత్ఫలితముగా వానికి కైలాసప్రాప్తి కలిగెను. ఇది శివరాత్రి మాహాత్మ్యములోని కథాసారము. ఈ కథ సంస్కృతములో 'ఈశాన సంహిత' యనుదానిలో సంక్షిప్తముగా నున్నదట.

## విమర్శ

ఈ శివరాత్రి శైవులకే ప్రధానమైనది. శ్రీరామనవమి, లేక కృష్ణాష్టమివలె నీశ్వరు డవతారపురుషుడుగా బరిగణింపబడినవాడు కాడు. కావున నిది శివజయంతిగా భావింప వలనుపడదు. ఈ శివరాత్రి మాహాత్మ్యమును గుఱించి చెప్పు పురాణములు లింగపురాణ, స్కాందపురాణములు.

వైష్ణవులు అనంతచతుర్దశి నెట్లు పవిత్రముగా భావింతురో యట్లే శైవులీ శివరాత్రి చతుర్దశిని భావింతురు.

దక్షిణమున నాంధ్రదేశమున నీశివరాత్రి చాలా ప్రాముఖ్యముగా జూడబడుచున్నది. రాత్రియంతయు జాగరము చేయుట దేవుని భజించు నిమిత్తమై యేర్పాటు చేసియుండ ఆ ప్రధాన విషయమును మాటుపఱచి రాత్రియంతయు నెటులో యొకరీతి మేల్కొని యుండుటయే ప్రధానమని యెంచి కొందరు జూదముతో కాలము వెళ్లబుచ్చుచుందురు.

ఈ శివరాత్రిని గుఱించి గుప్తే పండితుడొక నూతన సిద్ధాంతమును లేవదీసినాడు. ఇంతకు బూర్వము వ్రాయబడిన లుబ్ధక మృగముల కథను జూడ నీ

కథ కేవలము మృగశీర్షా నక్షత్రము యొక్క సంబంధమైనదిగా దోచుచున్నదని వారు వ్రాసియున్నారు. సిద్ధాంతులు లుబ్ధక నక్షత్రమును యోగతారయని పిలుతురనియు, నీ మృగశీర్షారాశి చంద్రుని నైదవ నక్షత్రమనియు జెప్పుదురట. 'రత్నమాల' యను గ్రంథములో మృగశీర్షను జింకతలగా వర్ణించినారట. ఛాల్డియా దేశము బహుపురాతన దేశము. వేదకాలమందు ఛాల్డియా దేశమునకు, మన భారత దేశమునకు వ్యాపారము విశేషముగా జరుగుచుండెను. అట్టి ఛాల్డియా దేశపు జ్యోతిశ్శాస్త్రమందు నక్షత్రకూటమందీ తొమ్మిదవ నక్షత్రమండలిని 'ధనస్సు' అని యందురట. ఈ ధనస్సు మన కథలోని ధనుర్ధ్జని యగు లుబ్ధకునితో సరిపోలును. ఛాల్డియా శాస్త్రమందు ధనస్సు తర్వాతి నక్షత్రమును మేక (మేషము) యందురు. ఈ మేక బహుశః మన జింకకు మారుగా నుండి యుండును.

అయితే యీ నక్షత్రములకును, శివరాత్రికినేమి సంబంధమని యాలోచించిన శివరాత్రి నాటి రాత్రి చాల దీర్ఘమైనదియు, దట్టమగు చీకటితో నిండినదియు నగుటయే నా రాత్రి నక్షత్రములను బరీక్షించుట కనువగునని యీ దిన మేర్పాటు చేసి యుందురేమో చెప్పజాలను అని యీ గుప్తే పండితుడు వ్రాసి యున్నాడు.

ఈ విమర్శనయందు యుక్తి హెచ్చుగా నున్నను యుక్తముగా దోపదు. మనవారు నక్షత్రముల కొఱకు జనులనందఱును మేల్కొనుమని చెప్పియుండరు. శివరాత్రి మాహాత్మ్యమునకై యొక కథను గల్పించి యీ కథనుండి యొక నీతిని బోధించుటకై యా నక్షత్రములను భక్తికి నిదర్శనముగా జూపియుందురు. ఇది మన పౌరాణికులకు క్రొత్తకాదు. బాలభక్తాగ్రేసరుడగు ధ్రువుడు ధ్రువనక్షత్రమై నిలిచినాడు. సప్తర్షులు నక్షత్రమండలియై నిలిచినారు. పతివ్రతాగ్రగణ్యయగు నరుంధతియు నిజనాథుని బాయక యాకాశమందు భర్తచెంత నిలిచి నూతన వధూవరుల కందఱకును దర్శనీయమై యున్నది. కావున మన శైవులకుగూడ శివభక్తులైన లుబ్ధక మృగములు నక్షత్రములైనవని బోధించియున్నారు.

భవిష్యత్పురాణమందు నీ పండుగను 'శివచతుర్దశి' యను పేరున వర్ణించినారు. అందు లైంగ్యమగు మృగలుబ్ధక కథలేదు. మరియు లింగపురాణ మందు మాఘ కృష్ణ చతుర్దశి దినమున మహాశివరాత్రిగా చెప్పియుండ నిందు మార్గశీర్ష శుక్ల త్రయోదశి ముఖ్యదినముగా బేర్కొనబడియున్నది. ఇది యే శివరాత్రియో తెలియదు. కాని జనులందఱు లింగపురాణరీత్యా యాచరించుట చేతనదియే ప్రమాణముగా గొనవలసియున్నది. ఇంతియకాక శివపురాణమందును మాఘకృష్ణ చతుర్దశినాడే

జాగరణ యుక్తముగా వ్రతమాచరించుట యాదేశితము. ఇదే పురాణమందు ప్రతిమాసమందు కృష్ణ చతుర్దశీ దినమున శివరాత్రిగా భావించి చేయవలెనని వ్రాయబడియున్నది.

మృగలుబ్ధకులను గుఱించి యించుక విశేషము చెప్పవలసి యున్నది. అలంపురీ మాహాత్మ్యమను గ్రంథములో పూర్వమొకప్పుడు అలంపురీ దేవాలయమును నాశనము చేసిన 'విలసత్' అను రాజు చాల దుర్మార్గుడై, మృగయా వినోదియై యుండ, నొకనాడు వాని సేవకుడొక మృగమును తనస్వామి కాహారార్థమై చంపబోవ నా మృగము మనుష్యోక్తులతో వానిని, వాని యేలికను నిందించినట్లును, వాడది విని యాశ్చర్యమగ్న మానసుడై విలసత్తుతో నివేదించుకొనగా నా విలసిత్తు ఆ జింకను ప్రార్థించి కారణమడుగగా నా మృగ మిట్లనెనట: "నీవు దేవాలయమును నాశనము చేసినందున మహాపాతకివైతివి. మరల పాప విముక్తి పొందదలచిన దేవాలయమును గట్టించి, యందు నీ విగ్రమును, దానియెదుట నా విగ్రమును జెక్కించుము. భక్తులందఱు చూచుచుండ బహుకాలమునకు నీ పాపము శమించి నీ వుత్తమలోకములను బొందుదువు." విలసత్తు అట్లే చెసెను. ఇది పురాణము. దీనికి నిదర్శనముగా నేటికిని అలంపురీ దేవాలయములో నొక వ్యాధునియొక్కయు, జింక యొక్కయు విగ్రహములు స్తంభములపై చెక్కబడి యున్నవి కానవగును.

శివునికి లింగాకారముండు విషయములో ప్రాచీప్రతీచిలోని పరిశోధకులు కొందఱొక నూతన తత్త్వమును లేవదీసినారు. లింగము పురుషచిహ్నమని వారి యభిప్రాయము. బహుపురాతన కాలమందొక నాడు ప్రపంచమందంతటను స్త్రీ పురుష చిహ్నముల పూజలుండెనని వారి సిద్ధాంతము. ఈజిప్టులోను, బాబిలోనియాలోను, అసిరియాలోను, కొంత కొంత రోము, గ్రీసు దేశములందును నీ యాచారముండెనని వాదింతురు. అదే తత్వము మన యార్యావర్తమున లింగపూజ యనబడెనని యందురు.

వివేకానందస్వామిగారీ సిద్ధాంతము నొప్పుకొనలేదు. గస్టవ్ ఆపర్ట్ (Gustav Oppert) అను జర్మను పండితుడు సాలగ్రామములు స్త్రీ లింగ చిహ్నములనియు, శివలింగములు పురుషలింగ చిహ్నములనియు వాదింపగా దాని కిట్లు వివేకానందస్వామిగారు ప్రత్యుత్తరమిచ్చిరి:

"ఈ సిద్ధాంతములు నిరాధారములు. శివలింగ పూజగురించి అథర్వవేద మందలి యూపస్తంబమును స్తోత్రము జేయు మంత్రము నుండి ప్రారంభమైనది. ఈ

మంత్రములోని యూపస్తంభమును 'స్కంభ'మని వర్ణించినారు. ఈ స్కంభము ఆద్యంతరహితమై పరబ్రహ్మకు ప్రత్యామ్నాయమైనట్లుగా వర్ణింపబడినది. తర్వాతి కాలములో యజ్ఞమందలి అగ్ని, ధూమము, బూడిద, సోమలత, యజ్ఞార్థము కట్టెల మోయునెద్దును శివుని ప్రకాశమానమగు శరీరముగా, నీలకంఠముగా, జటాజాలములుగా, శివవాహనముగా మార్పబడెను. అదేవిధముగా నీ యూపస్తంభము శివునికి బదులుగా బూజింపబడెను. లింగ పురాణమందిదే మంత్రమును కథారూపముగా వివరించియున్నారు. సాలగ్రామములు లింగచిహ్నములను కథ కేవలము కల్పితము. అవి బౌద్ధుల 'ధాతుగర్భముల' బోలినవగుటచే బౌద్ధులు మొదట వానిని బూజించుచుండిరి. తర్వాత వైష్ణవులు వానిని స్వీకరించిరి."

పై యంశముల యొక్క మూలములోని కొంత భాగమిం దుదాహరించుచున్నాను.

The Swami said that Worship of the Siva Lingam originated from the famous hymn in the Atharva Veda Samhita sung in praise of the Yupastambha, the sacrificial post. In that hymn, a description is found of the beginningless and endless Stambha or skambha, and it is shown that the said Skambha is put in place of Eternal Brahman.

As afterwards, the Yajna fire, its smoke, ashes and flames, the Soma plant, and the Ox that used to carry on its back the wood for the Vedic sacrifice-gave place to the Vedic conceptions of the brightness of Siva's body, his tawny matter hair, his blue throat, and the riding on the bull of Siva, and so on - just so, the Yupa Skambha gave place in time to the Siva Lingam and was deified to the high Devahood of Sri Sankara. In the Ling Purana, the same hymn is expanded in the shape of stories meant to establish the glory of the great stambha and the superiority of Mahadeva."

-Swami Vivekananda's works

*(1923 edition, vol. IV, Pages 357 & 358)*

త్రిమూర్తి సిద్ధాంతము వేదకాలమందు లేదనియు, క్రమేణ యేర్పడెననియు పండితుల యభిప్రాయము. క్రీ.పూ. 2వ శతాబ్ద మందుండిన పతంజలి తన భాష్యములో శివ, స్కంద, విశాఖుల విగ్రహములు తన కాలములో వీథులందమ్మ బడుచుండెనని యుదాహరించుటచే శైవసిద్ధాంతము అప్పటికే ప్రబలియుండెనని విశదమగుచున్నది.

పాణినీయ సిద్ధాంతకౌముదిలో 5-3-96 సూత్రములలో నిట్లున్నది:

సూ. జీవికార్థే చాపణ్యే.

దీనిపై భాష్యమిట్లున్నది:

జీవికార్థం యదవి క్రియమాణం తస్మిన్ వాచ్యే కనోలుప్స్యాత్. వాసుదేవః, శివః, స్కందః. దేవలకానాం జీవికార్థాసు దేవప్రతికృతిష్విదం. అపణ్యేకిం. హస్తికా న్విక్రీణీతే.

ఇందు సూచితమేమన, అమ్మదగనట్టి దేవతావిగ్రహములు ఆ కాలమందు 'దేవలకులు' అమ్ముచుండిరి. అట్టి విగ్రములలో ముఖ్యమైనది వాసుదేవుని యొక్కయు, శివుని యొక్కయు, స్కందునియొక్కయు విగ్రహములు ముఖ్యమైనవి. దీనివలన శివస్కందులు 2500 యేండ్లకు పూర్వము జనసామాన్య మందు ఎన్నిక కెక్కిన దేవతలని స్పష్టము.

శైవమత మాదియందు కులభేదములను పాటింపక గొప్ప సంఘసంస్కారమును జేసెను. కాని తర్వాతి కాలములో నీశైవము సహితము వైష్ణవమతమువలె శూద్రాది భేదములను పాటింపజొచ్చెను.

పార్థివ లింగ పూజావిధానమును వర్ణించుచు నొక ప్రమాణగ్రంథ మిట్లు శాసించినది.

"స్త్రీ శూద్రులకు వైదిక మంత్రపూర్వక పూజావిధికూడదు. పురాణానుసారమ్ముగనే లింగపూజ చేయవలెను. స్త్రీ శూద్రులు ఓంకార శబ్ద విరహితమైన 'నమశ్శివాయ' యను మంత్రము నుచ్చరింపవలెను."

మరియు శివ కేశవ విగ్రహములను స్త్రీ శూద్రులు స్పృశించిన నరకమును బొందుదురట.

శూద్రులచే పూజింపబడిన లింగము దూష్యమట!

బసవేశ్వరుని యనంతర కాలమునుండి యెవరి మూలముననో యేమో శైవ వైష్ణవులకు బద్ధవైరమేర్పడి యనేక గ్రంథములలో నుభయులును పరస్పర దూషణమును జేసికొనిరి. తైత్తరీయోపనిషత్తు చాల ప్రాచీనమైనది. అందుకొన్ని మంత్రము లిట్లున్నవి:

మం. తత్పురుషాయ విద్మహే,
మహాదేవాయ ధీమహిః
తన్నో రుద్రః ప్రచోదయాత్.

ఈ మంత్రము గణేశుని గుఱించిన మంత్రము వంటిదే. ఈ విషయమున అచ్చటి విమర్శను జూడనగును.

హిందూస్థానమందు శైవమత వ్యాపనము బహుప్రాచీనము నుండి వృద్ధి పొందినట్టిది. కాశీవిశ్వనాథుడు, శైవ సాంప్రదాయ ప్రాచీనతను, ప్రాముఖ్యతను నిరూపించుచున్నాడు. దక్షిణ హిందూస్థానమందు నిది ఆంధ్ర కర్ణాటకులలో బిజ్జలుని కాలము నుండి బసవేశ్వర, పండితారాధ్యాదుల చేత విశేష ప్రచారము చేయబడెను.

ఏది యెట్లున్నను నీ శివరాత్రి శైవులయిన వారికిని, స్త్రీ శూద్రులకును, స్మార్త బ్రాహ్మణులకును చాల ప్రధానమై యున్నదనుటలో నేమియు సందేహము లేదు.

# హరితాళిక

ఈ వ్రతము భాద్రపద శుక్ల తృతీయనాడు చేయబడును. భవిష్యోత్తర పురాణమందిట్లు కథ కలదు. పార్వతీదేవి కన్యకగా నుండి నపుడు శివునిదప్ప నితరుని పెండ్లాడనని నిశ్చయించుకొనియుండెను. కాని కొంతకాలమైన తర్వాత నారదుని ప్రేరణముచే హిమవంతుడామెను విష్ణువున కియ్యనున్నాడని యామె విని యొక చెలికత్తెను వెంబడించుకొని యరణ్యమునకు పారిపోయెను. అచ్చట నిసుకతోమూడు లింగములను జేసి వానిని బూజించుచుండెను. ఈశ్వరుడామె ప్రార్థనలకు సంతసించి యామెను పెండ్లాడుటకు నంగీకరించెను. ఇట్లు (ఆళి) చెలికత్తెచే హరింపబడి పారిపోయినందున నీ వ్రతమును హరితాళికా వ్రతమని యందురు.

కన్యకలు అనుకూల భర్తలను బడయుటయు, వివాహితులు వితంతువులు గాకుండుటయు నీ వ్రతోద్దేశములు. ఈ వ్రతమును జేయు స్త్రీలు రాత్రియంతయు జాగరణచేసి పగలంతయు నుపవసించెదరు. మఱియు పార్వతీ పరమేశ్వరుల పూజ చేయుదురు.

# దుర్వాష్టమి

భాద్రపద శుద్ధాష్టమినే దుర్వాష్టమి యందురు. ఈ దినము దుర్వాపూజను జేయవలెను. ఈ పూజను రోహిణీయుతమైన శుక్లాష్టమి నాడే చేయవలెను. గాని జ్యేష్ఠా నక్షత్రముతో గూడిన యష్టమియందు గూడదు. వ్రతఫల మేమన, నే స్త్రీ యీ వ్రతము జేయునో యామె మూడు జన్మములలో వైధవ్యమును బొందదు. ఈ వ్రతమునాడు శంకరుని, వినాయకుని బూజింపవలెనని భవిష్యత్పురాణము చెప్పుచున్నది.

# చంపాషష్ఠి

శ్లో॥ విశాఖా భానువారేణ వైధృత్యా చ సమన్వితా,
నభస్య శుక్ల షష్ఠీ యా సా చంపేతి నిగద్యతే.

విశాఖ నక్షత్రము, భానువారము, వైధృతియోగము నీ మూడును భాద్రపద శుద్ధ షష్ఠి యందు సంభవించిన చంపాషష్ఠి యనబడును. ఈ యోగకాలమందు చేసిన స్నానాదికములు అక్షయములై యుండును.

# స్కంద షష్ఠి

స్కందుని కార్తికేయుడనియు, దక్షిణమున సుబ్రహ్మణ్యుడనియు, దానినే యాంధ్రమున సుబ్బరాయుడనియు వ్యవహరింతురు. కావున నీ స్కందషష్ఠినే సుబ్బరాయషష్ఠి యనియు అందురు. ఇది ద్రావిడులలో ప్రాముఖ్యముగ నున్నది. స్కందుడు లేక కుమారస్వామి ఈశ్వరుని కుమారుడు. ఇతని పండుగను కార్తిక శుక్ల షష్ఠినాడు చేయుదురు.

# గౌరీ తృతీయ

గౌరీ దేవియే పార్వతి. ఈ వ్రతము స్త్రీలకు ముఖ్యము. ఈ వ్రతమును చైత్ర శుద్ధ తృతీయనుండి వైశాఖ శుద్ధ తృతీయ వఱకు చేయుదురు.

ఈ వ్రత ఫలమేమన, స్త్రీలు వైధవ్యము పొందరు. ఇందులకు ప్రమాణము జ్యోతిర్నిబంధమం దిట్లున్నది:

శ్లో॥ అవైధవ్యకరా స్త్రీణాం పుత్రపౌత్ర ప్రవర్ధనీ.

# దశహర

'దశహర' యనగా పది (పాపములను) పోగొట్టునది. ఈ పూజ గంగానది నుద్దేశించి చేయబడును. దీనినే గంగోత్సవమనియు నందురు. దీనిని జ్యేష్ఠ శుక్ల పాడ్యమి నుండి దశమి వఱకు జేయుదురు.

గంగానదిని గంగాదేవిగా భావించుట హిందువుల కందఱకును సమ్మతము. గంగావతరణము భూలోకమున గలిగిన విషయమును పురాణమును లిట్లు చెప్పుచున్నవి: సగర చక్రవర్తి అనేక యజ్ఞములు చేయుటచే నింద్రునికి దన పదవి పోవునేమో యను భయము వాటిల్లెను. అందుచే నింద్రుడు సగరుని యజ్ఞాశ్వమును దొంగిలి కపిలుడను ఋషి తపస్సు చేయుచోట నిలిపెను. సగరునికి 60,000 కొడుకులు, వారు గుఱ్ఱమును

వెదకుచు కపిలు డుండుచోటికి వచ్చి యతడే ఘోటక తస్కరుడని యెంచి యతనిని హింసించిరి. కపిలుడు తన తపోగ్నిచే వారిని దహించెను. తర్వాత శాంతించి వారిపై గంగోదకము ప్రవహించిన వారు సజీవులగుదురని యనుగ్రహించెను. ఈ సగరునికి భగీరథుడను మనుమడుండెను. అతడు తపస్సు చేసి గంగను ప్రసన్ననుగా చేసికొనెను. కాని గంగ భూమిపై పడిన ప్రమాదము. కావున నీశ్వరుని గుఱించి తపస్సు చేయ నీశ్వరుడు గంగను తన జడలలోనిరికింతునని యొప్పుకొనెను. కావుననే గంగ ఈశ్వరుని భార్యయై యతని నెత్తికెక్కినది. ఆ తావు నుండియే యాయమ భూమిపైకి తిన్నగా జారెను. ఇట్లు గంగచే సగర సంతతి పుణ్యగతి నొందెను.

గంగాదేవిని గుఱించి యింకొక కథ భారతమందున్నది. ఆమె శంతనునికి భార్యయై భీష్ముని గనెను.

గంగోదకము చాల పవిత్రమని హిందువుల విశ్వాసము. గంగా తీరమున నుండు ప్రదేశము లనేకములు తీర్థ స్థలములైనవి, ఆ అన్నింటిలో ముఖ్యమైనది కాశీక్షేత్రము.

# అశోక షష్ఠి

ఇది చైత్ర శు॥ 6 దివసమున చేయబడును. ఇది ఉత్తర హిందూస్థానమందే ప్రాధాన్యము వహించినది. స్త్రీలు తమ సంతతికి క్షేమము కలుగుటకై అశోకవృక్షము యొక్క ఆరు పూమొగ్గలను నీటిలో కలిపి త్రాగెదరు. దీనిని గుఱించి కథ నిట్లు గుప్తే పండితుడు వ్రాసినాడు.

ఒక ముని యొకనాడొక బాలికను జూచి యామెను పెంచి పెద్దదైన తర్వాత నొకరాజు కిచ్చి పెండ్లిచేసి యామెను వీడ్కొలుపుచు కొన్ని యశోకపు విత్తుల నిచ్చి మార్గమందు వానిని జల్లుచు పొమ్మనెను. కొంతకాలమున కామె సంతతి యంతయు నశింపగా నామె యశోక వృక్షముల జాడ పట్టుకొని తనముని దగ్గఱకు పోయి యాతని వలన మంత్రోదకమును గొని తన సంతతిని బ్రదికించుకొనెను.

ఈ కారణముచే స్త్రీలు నేటికిని తమ సంతతి యొక్క క్షేమార్థమై యీ యశోక షష్ఠిని చేయుదురు.

# వార వ్రతములు

## ఆదివార వ్రతము

ఆదివారమును ఆదిత్యవారమని యందురు. ఆదిత్యుడన సూర్యుడు. కావున నీ వారమున సూర్యునుద్దేశించి పూజలు సేయవలయును. కైలాసశిఖరమందు పార్వతి యీశ్వరు నిట్లొకనాడు ప్రశ్నించెను: "రజోదర్శనకాలమందుతెలిసియో, తెలియకయో చేసిన పాపముల నుండి స్త్రీ పురుషులు ముక్తులగుటెట్లు?" ఈశ్వరుడిట్లనెను: "ఓ పార్వతీ! నీవు చాల హితమైన మాటనడిగితివి. ఇది సర్వలోకోపకరమైన విషయము. మనమిద్దఱమును 'మహా... సంకల్ప' మందు చిరకాలముంటిమి. అప్పుడు నీవే వ్రతమును జేసియుంటివో, యా వ్రతమునే విష్ణువు కూడా తులసీసహితముగా జేసెను. సప్తర్షి భార్యలు కూడ నిదే వ్రతమును జేరిరి. ఈ వ్రతము పేరు అర్కవార వ్రతమందురు. లోకములో స్త్రీలు కామోపేతలు. పురుషులు మూఢులు; దుర్మార్గులు. వీరు తమ పాపముల నుండి ముక్తిగోరిన నిరశ నార్కవారవ్రతమును జేయవలయును. పూర్వము భూలోకమందొక బ్రాహ్మణుడు డిదిచేసి ముక్తి పొందెను. ఎట్లన, కృతయుగమందు గోదావరీ తీరమందు తుందిలుడను బ్రాహ్మణుడు పూర్వజన్మ పాపళితముగా కుష్ఠ వ్యాధిగ్రస్తుడై యుండెను. ఏమి చేసినను నా వ్యాధి కుదురకపోయెను. ఇట్లుండ నాతని గ్రామమునకు దూరముగా నొక యగ్రహారముండెను. అచ్చట అర్కశర్మ యను బ్రాహ్మణుడును, నతని సహధర్మచారిణి సుశీలయను నామెయు నుండిరి. ఈ యర్కశర్మ యర్కవారవ్రతమును జేయుచుండెను. ఈ వ్రతానంతరము హవిశ్శేషమును బ్రాహ్మణులకు భుజింప నిచ్చెను. అది భుజించిన బ్రాహ్మణులలో మన కుష్ఠ వ్యాధిగ్రస్తుడు నుండెను. ఇతడు భుజించిన వెంటనే కుష్ఠంతయు మాయమై, శరీరము బంగారువన్నె కలదై ప్రకాశింపజొచ్చెను.

కావున నిట్టి వ్రతము నే మానవులు చేయుదురో వారు ముట్టయిన స్త్రీల ముట్టిన దోషమునుండియు, నట్టివారితో రమించి రోగములు సంపాదించుకొనిన పీడలనుండియు విముక్తులగుదురు. ఈ వ్రతమును జేయువారు రవివారమందుపవసించి మూడు సంవత్సరముల వఱకు సూర్యారాధన చేయవలెను."

## విమర్శ

ఇతర వారవ్రతములవలె నిదియు గల్పితమే అర్కశర్మయనగా సూర్యశర్మ యని యర్థము. సూర్యవ్రతము చేయు కథకై యీ అర్కశర్మ సృష్టియైనాడు. యథార్థమేమనగా సూర్యకిరణములు మానవుల రోగములను హరించునట్టివి. ప్రాతఃకాలమందును, సాయంకాలమందును అనగా సంధ్యాకాలమందు ఆకాశముపై కాషాయవర్ణము వ్యాపించుకొనును. ఆ కాషాయవర్ణముపై దృష్టి నిలిపి (Concentrate) ధ్యానించుట చాల ఆరోగ్యప్రదము. కుష్ఠ, క్షయాదిరోగములను సహిత మది మాన్పును. అందుచేతనే మన ప్రాచీనులు గాయత్రీ జపము సంధ్యాకాలములందే చేయవలెనని ఆదేశించిరి. దాని పరమార్థమును గ్రహించనివారు గాయత్రీ విముఖులైనారు.

ఈ కాలములో పాశ్చాత్య దేశములందును సూర్యకిరణ చికిత్సలును, ఆతపస్నానములును (Sun-baths) బహుళమైనవి. మన ప్రాచీనులీ విషయము లానాడే గమనించి సూర్యునికి ప్రాధాన్యత నిచ్చియుండిరి. ప్రాచీనమందు ఉత్తర హిందూస్థానమున ప్రత్యేకముగా సూర్యదేవాలయములుండెను.

## సోమవార వ్రతము

సప్తవారములు కొన్ని కొన్ని మాసములందు పవిత్రముగా నెంచబడుచున్నవి. అందు సోమవారమును గుఱించి యిట్లు చెప్పుదురు: సోమవారవ్రత మాహాత్మ్యమును గుఱించి భీష్మని ధర్మరాజు ప్రశ్నింపగా నతడిట్లు చెప్పెను: కాంచీపురమున దేవస్వామియను బ్రాహ్మణుడుండెను. అతనికి గణపతి యను కూతురును, నేడ్గురు కొడుకులును గలిగిరి. ఒకనాడొక సన్యాసి వారి యింటికి వచ్చి యా యింటిబిడ్డ పెండ్లినాడే వితంతువగునని భావిగతి సూచించి దానిని దప్పించుటకై యతడిట్లు చెప్పెను: సింహళద్వీపమున నొక చాకలిది సోమ యను పేరుగలది యున్నది. దానిని మీ యింటికి బిలిచికొని వచ్చిన మీ గండము తప్పును. ఈ పనికై యా బ్రాహ్మణుని కడపటి కొడుకును, కూతురును బ్రయాణమైరి. దారిలో నొక చెట్టు క్రింద నివసించిరి. ఆ చెట్టుపై నొక గృధ్ర ముండెను. దాని పిల్లల కది యాహారము తెచ్చి యీయ, నవి, క్రింద నతిథులుండ దాము తినుట భావ్యముగాదనెను. గృధ్రము వారి యిష్టము నెరవేర్తునని చెప్పి వారిని మఱునాడు సింహళములో విడిచెను. వారు చాకలిదాని యింటికి బోయి ప్రతిదినము చీకటి యందే యిల్లూడ్చి శుభ్రము చేయుచుండిరి. ఒకనాడు చాకలి యీ సంగతి గమనించి వారిని కారణమడిగెను. వారామెను తమ

గృహమునకు రమ్మని వేడిరి. అటులే యాయమ వచ్చెను. కూతునకు నొక బ్రాహ్మణ వరుని దెచ్చి వివాహము చేయుచుండగనే వాడు మరణించెను. అప్పుడు సోమ తన వ్రతఫలమును వారికిచ్చి యా బాలుని బ్రదికించెను. ఇట్లు చేయగా సోమ యింటిలో నందఱు మరణించిరి. కాని మరల నామె సోమవ్రతమును జేసి తనవారిని బ్రదికించికొనెను. ఈ పూజ చేయునప్పు డశ్వత్థవృక్షమును సోమవారమునాడు పూజింపవలెను. ఇట్లు ధర్మరాజు ఉత్తరచే పూజచేయించి యామె గర్భమందుండు శిశువును బ్రదికించెనట.

## మంగళవార వ్రతము

ఈ వ్రతమునే మంగళగౌరీవ్రత మందురు. ఇది క్రొత్తగా వివాహితులైన దంపతులు మొదటి యైదు సంవత్సరములు ప్రతి శ్రావణమాసమందు ప్రతి మంగళవారము చేయుదురు. ఈ వ్రతము వలన స్త్రీలు వైధవ్య మొందరట. దీనిని బోధించుటకై శ్రీకృష్ణుడు యుధిష్ఠిరుని ప్రార్థనపై ఇట్లు కథను చెప్పెను:

పూర్వకాలమందు కుండిన మనుపురమున నొక కోమటి యుండెను. అతనికి కొడుకులు లేరు. అతని యింటి ముంగిట ప్రతిదినమొక భిక్షుకుడు పోవుచుండెను. కాని వారి భిక్ష యతడు స్వీకరింపకుండెను. ఒకనాడు భర్త యాదేశమున భార్య భిక్షుకుని జోలెలో హఠాత్తుగా కొంత భిక్ష యిడెను. దానికి భిక్షుకుడు కుపితుడయ్యెను. చాల వఱకు ప్రార్థింపగా నతడిట్లనెను: "మీ రనపత్యులు. మీ వలన భిక్ష తీసుకొనగూడదు. మీరు పుత్రవంతులు కాదలచిన సమీపారణ్యమందు భవానీదేవి యున్నది. ఆమె నుపాసింపుడు." అదే ప్రకారము భార్యాభర్తలు దేవి నుపాసించి యామె కరుణ బడసిరి. దేవి వారికొక కొడుకు గలుగుననియు, వాడు 16 ఏండ్లకే చచ్చునియు వరమిచ్చెను. ఆ కొడుకును గూడ బడయుట కొక యుపాయము చెప్పెను. "సమీపమందు గణేశ విగ్రహమున్నది. దానిపై నెక్కి యచ్చటనున్న మామిడికొమ్మ లాగి దాని నుండి యొకే పండును ద్రుంచవలయును." భార్య యదేవిధ మాచరించెను. ఒక కొడుకు పుట్టెను. వాడు నానాటికి పెరిగి పెద్దయయ్యెను. కాని తల్లిదండ్రులు వాని యల్పాయుష్యమును దలచి వగచి పుత్రునికి గాశిలో మరణమైన సద్గతియైన నుండునని వానిగొని కాశికేగిరి. మార్గమందొక వింత వారికి గానవచ్చెను. కొందఱు పడుచులు ఆటలాడుచు తిట్టుకొనుచుండిరి. అందొక పడుచు సుశీలయను కన్యకను 'రండా' యని తిట్టెను. దానికి సుశీల యిట్లనెను: "మా యింట నేటివఱ కందఱును పుణ్యస్త్రీలే. దేవుడు మేలు

చేసిన నేను నట్లే కాగలదానను.” ఈ మాటలు కోమటులు విని దానిని వెంబడించి, దాని తల్లిదండ్రుల నొప్పించి, భూరి ధనమొసగి తమ పిల్లవాని కా బిడ్డను పెండ్లిచేసిరి. వధూవరులతో దల్లిదండ్రులు తమ నగరమునకు తరలిరి. ఈ సుశీల మంగళగౌరీ వ్రతము నెల్లప్పటికినీ జేయు చుండెను. మార్గమందు వచ్చుచుండ శ్రావణ మాసమగుటచే నా బిడ్డ మంగళ వారము నాడు తప్పక తన దేవిని పూజింపవలెనని అత్తమామలతో చెప్పెను. వారు వచ్చునది యరణ్యము. దేవాలయము లేదు. అప్పుడు సుశీల మట్టితోనొక చిన్న బొమ్మరిల్లు చేసి యందు తన మంగళగౌరిని ప్రతిష్ఠించి భక్తితో పూజించెను. అంత నామె భర్తకు 16 ఏండ్లు నిండెను. చచ్చిపడెను. కాని సుశీల యేమియు చలింపక తన దేవిని పూజించి యా జలముతో భర్త శవముపై చల్లగా వాడు లేచి కూర్చుండెను. ఇట్లా సుశీల తన మంగళగౌరీ ప్రభావముచే భర్తను బ్రతికించుకొనగల్గెను.

## బుధవార వ్రతము

బ్రాహ్మణుల కాపత్కాలమందు వాణిజ్యము, వ్యవసాయము చేయవచ్చునని యాజ్ఞ యున్నది. ఇది యాపద్ధర్మముగానే యాచరింపవలయును. తక్కిన కాలమందిది నింద్యము.

ఒక కాలమందు బ్రాహ్మణులకు గొప్ప యాపద కలిగెనని ‘సాక్ష్యాద్వ్యా సేన యత్ప్రోక్తం విప్రజీవన కారణం’ అని సాక్ష్యాద్వ్యాసుల వారే స్కాందపురాణమందు సెలవిచ్చిరట. బ్రాహ్మణులను దుష్టరాజులు పీడించిరి. వారందరు కలయబలికికొని కాశిలో గంగలో బడిచత్తుముకాకయని తీర్మానించిరి. గంగాతీరమున మూడునాళ్లు ప్రాయోపవేశము చేసిరి. అప్పుడు వారికి సాక్షాద్విశ్వనాథుడే ప్రత్యక్షమై వారి యాపదలు పోవు నిమిత్తమై బుధవార వ్రతమును, దత్క్రమమును బోధించి యంతర్ధానమయ్యెను.

ఈశ్వరుడు బ్రాహ్మణులతో నిట్లు చెప్పెను:

కలౌ త్వబ్దసహస్రాణి యావత్పంచ గతానిచ,
విష్ణుస్త్యక్ష్యతి భూలోకం గంగా త్యక్ష్యతి భూతలం.
అద్యహంతాధికాజాతాః కలౌ వింశతి వత్సరాః,
అనుచానకులం నష్టం వేదో నష్టశ్చ సత్పథః

ఈ శ్లోకముల యర్థము నాకిట్లు తోచుచున్నది.

“కలియుగమందు 5000 యేండ్లు గతించువఱకు గంగా విష్ణువులు

భూలోకమును విడుతురు. ఇప్పుడు 5020 యేండ్లైనవి. వేదములు, ధర్మము, వేదవిదుల కులము అంతయు నష్టమయ్యెను." అని పై శ్లోకముల యర్థము. విష్ణువు వెళ్ళిపోయెనో యేమోకాని గంగ యింకను పోలేదు.

## గురువార వ్రతము

గురువు అనగా దేవతల గురువు. ఇతడు బృహస్పతి. గురువారము బృహస్పతి వారము. కావున నీ దివసమున బృహస్పతి పూజ చేయవలయును. మూడు సంవత్సరముల వఱకు ప్రతి గురువారమును నీ పూజ చేసి బ్రాహ్మణులకు దానము లియ్యవలెను. దీని గుఱించిన కథను సూతుల వారు శౌనకాది మహర్షులతో నిట్లు చెప్పిరి:

పూర్వకాలమందు చిదంబర క్షేత్రమందు మణీంద్రుడను బ్రాహ్మణుడుండెను. అతడు శక్తిలోపము లేకుండ మూడు సంవత్సరము లీ వ్రతమును జేసెను. అతడు సర్వజ్ఞుడయ్యెను. అతని దగ్గఱ యవనుడు అను పేరుగల తురుష్కుడు నౌకరుగా నుండెను. మణీంద్రుడు గురువారమునా డుపవసింపగా ఆ తురుష్కుడును నుపవసించెను. వానికిగూడ వాక్సిద్ధి కలిగెను. ఇట్లు చేయుటచే ద్వాపరయుగాదిలో వీరు సర్వోత్తములై శాపానుగ్రహకర్తలై జన్మించిరి. కావున నీ వ్రతము వలన వాక్సిద్ధి ఫలము కలుగును.

## శుక్రవార వ్రతము

ఈ వ్రతమునే వరలక్ష్మీ వ్రతమనియు నందురు. కైలాసశిఖర మందు పార్వతీ పరమేశ్వరు లొకనాడు పాచికలాడిరి. ఆ యాటయందు పార్వతి యోడిపోయెను. అంత నాలుమగలకు వాదము జరిగెను. ఈ వాదమును దీర్చుటకు చిత్రనేమి యనువానిని గోరిరి. చిత్రనేమి యీశ్వరుడే గెలిచెనని చెప్పెను. పార్వతి కోపగించుకొని చిత్రనేమికి కుష్ఠ రోగము గలుగునట్లు శపించెను. చిత్రనేమి మరల నా దేవిని బ్రార్థించి శాపవిముక్తిని గోరెను. వరలక్ష్మీ వ్రతమును శ్రావణపూర్ణిమనాటి శుక్రవారము నాడు చేసిన నీ రోగము పాయునని చెప్పెను. ఇతడట్లే పూజించి మేలుపొందెను. ఈ లక్ష్మీవ్రతమును పార్వతికూడ జేసి షణ్ముఖుని గనెనట! మఱియు నందుడును, విక్రమార్కుడును నీ వ్రతమును జేసి రాజ్యములను బొందిరట. నంద విక్రమార్కులు చారిత్రిక పురుషులు. ఒకరు చంద్రగుప్తునిచే నాశనమైరి. రెండవవారు శాలివాహనునిచే. ఇక వ్రతఫలమెట్టిదో యేమో!

## శనివార వ్రతము

పూర్వము కోసలదేశ మందు దశరథ మహారాజు రాజ్యము చేయుచుండ గొప్ప క్షామము సంభవించెను. అప్పుడా రాజు శనిగ్రహమును పూజించి యతని ప్రసన్నుని గావించుకొని యతనిచే నెవ్వడు శ్రావణ మాసమందలి శనివారములందు శనిని బూజించునో వాడు శుభముల బొంది ధనధాన్య యుక్తుడగునని వరము బొంది రాజును నదే ప్రకార మాచరించి, లాభము పొందెను. ఇట్లు స్కాంద పురాణమందు వ్రాయబడినది.

ఈ శనివారములందే తిరుపతి వేంకటేశ్వరుని గూడ భక్తులు పూజించెదరు. ఈ వేంకటేశ్వరుడు కలియుగ మందు ముఖ్యదేవుడనియు, త్రేతాయుగమం దీతడు కుమారస్వామిగా నుండెననియు స్కాందపురాణ మందు వర్ణింపబడినాడు.

మఱియు–

శ్లో॥ మ్లేచ్ఛరాజ సుతోద్వాహ రక్షితాస్తిక మండలః.

అని యితడు స్తుతింపబడినాడు. మ్లేచ్ఛరాజు కూతు నీతడు పెండ్లియాడెనట. మ్లేచ్ఛులన సాధారణముగా తురకల కర్థము చేయుదురు! అట్లైన నిదేమి విపరీతమో.

# భక్తేశ్వర వ్రతము

కార్తీక పౌర్ణమినా డీ వ్రతమును జేయుదురు. ఇది శంకరుని గూర్చి చేయబడునట్టిది. భక్తేశ్వరుడన ఈశ్వరుడే. ఈ వ్రతమును "క్షేమ స్థైర్య విజయాయురారోగ్యైశ్వర్యాభి వృద్ధ్యర్థం, ధర్మార్థ కామ మోక్ష చతుర్విధఫల పురుషార్థ సిద్ధ్యర్థం, పుత్ర పౌత్రాభివృద్ధ్యర్థం, వంధ్యాత్వనివృత్యర్థం, అఖండితలక్ష్మీ ప్రాప్త్యర్థం..." చేయుదురు.

## కథ

దీనిని గుఱించిన కథను శివుడు పార్వతితో నిట్లు చెప్పెను: పూర్వము మధురలో నొకరాజు చంద్రపాండ్యుడనువాడుండెను. అతని భార్య కుముద్వతి. వీరికి సంతానము లేదు. వీరనేక వర్షములు శివుని గూర్చి తపస్సు చేసిరి. శివుడు ప్రత్యక్షమై "మీకు చిరంజీవినియు, సౌమంగల్యవిహీనయు నగు కూతురు కావలెనా, లేక అల్పాయువు, అతి మేధావియు నగు పుత్రుడు కావలెనా?" అని యడిగెను. "మాకు కొడుకే అవసరము" అని వీరనిరి. కొడుకు పుట్టెను. 16 యేండ్ల యీడువాడయ్యెను. తల్లిదండ్రులు వాడింక చచ్చునని చింతింతి తుదకొక యుక్తి చేయదలచిరి. అలకాపురి రాజగు మిత్రసహు డొకడుండెను. అతనికి భక్తేశ్వర వర ప్రసాదలబ్ధయగు కూతురుండెను. ఆ బిడ్డ నొప్పించి తమ కుమారునికి పెండ్లిచేసిరి. పెండ్లి ముగిసిన వెంటనే యముడు ప్రత్యక్షమై యా పెండ్లి కొడుకును దీసికొని పోదునని పలికెను. పెండ్లి కూతురు భక్తేశ్వర లింగమును సదా పూజించునట్టిది. ఆమె మాహాత్మ్యముచే భక్తేశ్వరుడు ప్రత్యక్షమై యముని చావగొట్టెను. అప్పుడు చిత్రగుప్తాదులు శంకరుని బ్రార్థించి తమ యేలిక తప్పును క్షమింపుమని వేడి యముని బ్రతికించుకొని "బ్రతుకు జీవుడా" యని తమ నిలయమునకు పోయిరి. భక్తేశ్వరుడు పెండ్లికూతురు భక్తికి మెచ్చి యామె భర్తకు దీర్ఘాయువిచ్చి పోయెను. ఆ కారణముచే ప్రపంచమందీ వ్రతము నాచరింపదొడగిరి.

# కేదారేశ్వర వ్రతము

ఈ వ్రతం భక్తేశ్వర వ్రతము వంటిది. ఇదియు శివుని గూర్చినదే. ఇంత మాత్రమే భేదము కలది. అది పూర్ణిమ నాటిది. ఇది అమావాస్య నాటిది. ఇది అశ్వినీయమావాస్యనాడు చేయబడును. ఈ వ్రతము కూడా తత్కర్తలకు "ఆరోగ్యమాయుః కీర్తుల" నిచ్చును. ఈ వ్రతము చేతనే పూర్వము పార్వతి ఈశ్వరుని శరీరమం దర్ధభాగమును బొందు హక్కును కలిగెను. అదెట్లన:

ఒకనాడు కైలాస శిఖరమందు ఈశ్వరుని సభ జరిగెను. అందు భోగము మేళము గూడ జరిగెను. రంభ బాగుగా నాట్యము చేసెను. తర్వాత భృంగిరిటి యను నతడు బోగపుసానుల ననుకరించుచు వికట నాట్యముచేసి యందఱును నవ్వించెను. పరమేశ్వరుడు బ్రసన్నుడయ్యెను. భృంగిరిటి పార్వతిని వదలి ఈశ్వరుని వలగొని నమస్కరించెను. పార్వతికి గోపము వచ్చెను. తనను గూడ సమానముగా లోకము గౌరవింపవలెనని పట్టుబట్టి తపస్సు చేసెను. అప్పుడు గౌతముడను ఋషి యామెకు కేదారేశ్వర వ్రత ముపదేశించెను. ఈ వ్రతఫలముగా నామె యీశ్వరుని మెప్పించి యతని అర్ధాంగి యయ్యెను.

చోళభూపాలుడును, నతని భార్యయు వ్యామోహముచే మొదలు చేయనందున రాజ్యభ్రష్టులై తరువాత తెలిసి యీ వ్రతమును జేసి సర్వసుఖముల బొందిరి.

# యమ ద్వితీయ - భ్రాతృ ద్వితీయ

ఇది కార్తీక శుక్ల ద్వితీయనాడు చేయవలసినట్టిది. దీనిని గుఱించి సనత్కుమార సంహితా వచనముగా నిట్లు చెప్పబడుచున్నది. యమునికి చెల్లెలు యమునానది. పూర్వము యమునాదేవి ప్రతి దివసము పోయి యమునితో దన యింటికి వచ్చి భుజించి పొమ్మని ప్రార్థించుచుండెను. యముడిదిగో అదిగో వచ్చెద ననుచు రాడయ్యెను. అతనికి పనులు విశేషమగుటచే నవకాశము చిక్కలేదు. తుదకొకనాడు రానే వచ్చెను. ఆదినము కార్తీక శుక్ల ద్వితీయ. తన గణములతోగూడ నతడువచ్చి తన సోదరి వడ్డించిన రుచిరాన్నములను భుజించి ప్రీతుడై నీకేమి వరము కావలెనో కోరికొనుమని తన భగిని నడిగెను.

భగిని యిట్లనెను: "మీరు ప్రతివర్ష మీదివసము నాయింటికి వచ్చి భుజింపవలెను. మఱియు నీదినమున నెవ్వరు సోదరీ హస్తము నుండి వడ్డింపబడిన యన్నమును భుజింతురో వారు నరకమును బొందకుందురు గాక"

యముడట్లు యగుగాక యని వరమిచ్చుచు మఱియు ఇట్లు సెలవిచ్చెను:

"యమునా నదిలో నెవ్వడీ దినము స్నానము చేసి పితృదేవతలు తర్పణములు విడిచి తన సోదరిని బూజించి యామె యింటిలో భుజించుచున్నాడో వాడు నరకద్వారము నెన్నడును చూడడు." ఇట్లు వరమొసగుటచేత నరులందఱీ దివసమున భగినీ గృహమందు భుజించిన పరలోక సౌఖ్యము లందుదురు. మఱియు నీ సోదరి తన సోదరుని నీనాడు భుజింపజేసి భక్తితో నర్చించునో యామె వైధవ్యమును బొందదు. ఇది యీ యమద్వితీయా కథ.

ఇదే దివసమున భ్రాతృద్వితీయను గూడ జేయుదురు. యమ ద్వితీయకును, భ్రాతృద్వితీయకును భేదమంతగా లేదు. పేరులందే భేదము కనపడుచున్నది. భ్రాతృద్వితీయమందు సోదరి తన సోదరులను పూజించి వస్త్రాదికములను తన విత్తానుసారముగా నొసగవలెను.

# అముక్తాభరణము

ఈ వ్రతమును ప్రతిభాద్రపద శుక్ల సప్తమీ దినమున జేయుదురు. ఇది శంకరుని గుఱించి చేయబడునట్టి పూజ. దీనివలన సంతానము లేనివారికి సంతానము కలుగునట. దీనిని గుఱించి స్కాందపురాణమందిట్లు కథ కలదు: పూర్వము దేవకీ పుత్రులను కంసుడు సంహరించి నందున దేవకి శోకార్తకాగా రోమశుడను ముని యామె కీ వ్రతము నుపదేశించుచు నీ కథను జెప్పెను.

అయోధ్యలో నహుషుడను రాజుండెను. అతని భార్య చంద్రముఖి. అచ్చటనే విష్ణుగుప్తుడను బ్రాహ్మణుని భార్య భద్రముఖి యనున దుండెను. వీరిద్దఱొకనాడు సరయూనదికి స్నానార్థమై వెడలిరి. అందు బ్రాహ్మణాంగనలు వేవురు అవ్యక్తరూపియగు శివుని పూజించి దోరకముల కట్టుకొనుట చూచి విషయము కనుగొని తామును దోరకములు కట్టుకొనిరి. కాని వ్రతము చేయుట మఱచిరి. కొంతకాలమునకు చచ్చి రాజుభార్య కోతిగను, బ్రాహ్మణి కుక్కగను జన్మించిరి. కాలాంతరమున నిరువురు మరల చచ్చి పూర్వమువలె నొకరు క్షత్రియుల యింటను, నింకొకరు బ్రాహ్మణుల యింటను బుట్టిరి. పూర్వపు చంద్రముఖికి నిప్పుడు ఈశ్వరి యను పేరు కలిగెను. పూర్వపు భద్రముఖి నిప్పుడు భూషణ యని పిలిచిరి. వీరిలో భూషణకు సంతానము సమృద్ధి. కాని ఈశ్వరికి పుట్టక పుట్టక ముసలిముప్పున కొక మూగిబాలుడు పుట్టి వాడును తొమ్మిదవ యేటనే గిట్టెను. ఆ కళేబరమును జూచి దుఃఖోపశమనము చేయుటకు భూషణ తనపిల్లల గుంపుతో పోయెను. ఈశ్వరికీ సంతతిని జూచి ఈర్ష్య కలిగెను. వారిని చంపించెను. కాని చంపినను వారు మరల బ్రదుకుచుండిరి. ఇదే మాశ్చర్యమని ఈశ్వరి భూషణను బిలిచి విచారించెను. ఆమె యిది యంతయు అముక్తాభరణదోరక మహిమ యని వర్ణించెను. ఈ వ్రతమును 12 ఏండ్లు చేయు క్రమమును బోధించెను. అట్లామె చేసి సుఖించెను.

ఈ కథను కృష్ణుడు ధర్మరాజుతో చెప్పెనట.

# సంకష్టహరణ చతుర్థి

ఇది గణపతి పూజాసంబంధమగు వ్రతము. పూర్వము పార్వతి తన భర్తను ప్రసన్నుటగా జేసికొనదలచి, యేమిచేసినను లాభము లేక గణపతిని నుపాయమడిగెనట. అప్పు డాత డిట్లనెను: "శ్రావణ బహుళ పక్షమందు చతుర్థినాడు రాత్రి చంద్రోదయ పర్యంత ముపవసించి గణపతిని పూజించిన సర్వకష్టము లను భవించిన లోకులు సౌఖ్యము పొందుదురు. నీవును నీ వ్రతమును జేయుము. ఈశ్వరుడు త్రిపురాసుర వధ కాలమున నిది చేసెను. రావణుడును, రాముడును, ధర్మరాజును, దమయంతియు, నహల్యయు దీనిని జేసి లాభము పొందిరి."

# వట సావిత్రీ వ్రతము

ఇది జ్యేష్ఠ పూర్ణిమనాడు చేయబడును. "క్వచిద్దేశజనై రాచరితం వ్రత మిద" మని వ్రతకారుడు వ్రాయుటచే నీవ్రతము కొన్ని దేశములందున్నదనియు, కొన్నిట లేదనియు విశదమగును. ఈ వ్రతమును గుఱించిన కథ సుప్రసిద్ధమైనది. కావున మరల వ్రాయవలసిన యవసరము లేదు. సావిత్రి యముని వెంటబడి తన భర్తను మరల బ్రతికించి కొనినట్టి వీర పతివ్రత. ఈ కథ నెఱుగని స్త్రీకాని, పురుషుడు కాని హిందువులందు లేరు. ఈ వ్రత మాదేవి నుద్దేశించి పుణ్యకాంతలు తమకు వైధవ్యప్రాప్తి కాకుండుటకై చేయుచుందురు.

# ఏరువాక పున్నమ

ఈ పండుగ బ్రాహ్మణేతరులలో, అందు ముఖ్యముగా వ్యవసాయకులలో జాల ప్రాముఖ్యము వహించినట్టిది. ఈ పండుగను గుఱించి యేవ్రత గ్రంథమందును జర్చలేదు. 'ఏరువాక' అను పదము దేశ్యపదము. సంస్కృత పదము కానందున నిది యాంధ్రదేశమందే ప్రచారమందున్న పండుగ యని తేటపడును. ఈ పండుగకు ప్రత్యామ్నాయమైన పదము సంస్కృతమందేమైన నున్నదో యేమో యని వ్రత గ్రంథములందు జాచితిని. ఎందును లేదు. ఈ పండుగను జ్యేష్ఠ పౌర్ణమినాడు చేయుదురు. వ్రత గ్రంథములందు జ్యేష్ఠ పౌర్ణిమనాడు వటసావిత్రీ వ్రతము చేయవలసినదని యున్నది. దానికని దీనికిని సంబంధమేమియు గానరాదు. కావున నా విషయమును ద్రోసివేయవలసివచ్చెను. ఇక ఈ పండుగ కేవలము తెలుగువారిలో, నందును సేద్యగాంధ్రలో నున్నదని ఏరువాక అను పదము నుండి యూహింపబడుచున్నది. కాని యిది యట్లు కాదు. ఈ పండుగ పూర్వకాలమందు హిందువులందఱిచే గావింపబడు చుండెను. 'ఏరువాక' యను పదమునకు ఆంధ్రదీపికా నిఘంటుకారు డిట్లర్థము వ్రాసియున్నాడు:

ఏరు=సర్వావయవములు కల నాగటికి యెడను పూసినది. సర్వావయవములు గల నాగలి. ఏరువాక=దున్నుట కారంభము.

శబ్దరత్నాకర నిఘంటుకారులును నిట్లు సెలవిచ్చి యున్నారు:

ఏరు=ఎద్దులను గట్టిదున్నుటకు సిద్ధపరచిన నాగలి.

ఏరువాక=దుక్కి యొక్క ప్రారంభము.

ఈ రెండర్థములను విచారించి చూచిన నది వ్యవసాయకులకు సంబంధించిన దని విశదమయ్యెడి. ఈ పండుగ వర్షర్తువు యొక్క యారంభదశలో జేయబడును. అప్పుడు వర్షములు గురిసి భూమి పదునైన యెడల (పునర్వసు కార్తిలో) పునాస విత్తనములు వేయుదురు. (పునర్వసు నుండియే పునాస పదమేర్పడినది) ఈ పండుగనా డెద్దులను కడిగి, కొమ్ములకు రంగులు పూసి, గజ్జెలు, గంటలు, అద్దము, కుచ్చులు గట్టి యలంకరింతురు. ప్రొద్దుననే యింటిలో పొంగలి (పులగము) చేసి యెద్దులకు

బెట్టుదురు. ఎద్దులను కట్టివేయు గాడికి ధూప దీప నైవేద్యము లిత్తురు. సాయంకాలమందు మంగళవాద్యములతో ఊరిపసుల నన్నిటిని ఊరి బయటకు దోలుకొని పోవుదురు. ఊరవాకిటి కొక పుంటినారతో జేసిన తోరణము కట్టుదురు. ఈ తోరణమును గ్రామజనులు చేఱుకోలలతో గొట్టి పీచుపీచుచేసి యెవ్వరికి దొఱకిన పీచువారు తీసుకొని పోయి యింటబెట్టుకొందురు. ఇది పసులకు మేలు కలిగించునదని వారి విశ్వాసము.

ఈ పండుగ ఆంధ్రదేశమందంతటను వ్యవసాయకులకు ప్రాముఖ్యమైనది.

## విమర్శ

ఏమి విచిత్రమో వ్యవసాయ ప్రాధాన్యమగు నీ భారతవర్షమందు మనుస్మృతి కాలము నుండియే వ్యవసాయము నిరసింపబడినది. ఇది శూద్రుల పని యనియే తలచినారు. ఇట్లు దృక్పథము మారిన నాటి నుండియే కాబోలు ఏరువాక పున్నమ కూడ వ్రత గ్రంథముల కెక్కక పోయెను. కాని తక్కువ జాతులనబడు తక్కిన హిందువులందఱు మాత్రము బహుప్రాచీన సాంప్రదాయసిద్ధమైన యీ పండుగను జేయుటను మానకపోయిరి. పామరుల పండుగ యగుటచే వ్రతగ్రంథకారులును దీని జోలికి బోయినవారు కారు.

యథార్థ మాలోచించిన నీ ఏరువాక పున్నమనే సంస్కృతమందు 'ఉద్వృషభ యజ్ఞ' మని పూర్వకాలమందు చేయుచుండిరి. జైమినీయ న్యాయమాల గ్రంథమందు హోలాకాధికరణములో నిట్లు మన పండుగ సూచనగా నున్నది.

సూ. ఉద్వృషభయజ్ఞాదయ ఉదీచ్యైః జ్యేష్ఠ మాసస్య పౌర్ణిమాస్యాం బలీవర్దాన్ అభ్యర్చ్య ధావయంతి సోయమ్ ఉద్వృషభయజ్ఞః.

"ఔత్తరాములు ఉద్వృషభ యజ్ఞము చేయుదురు. ఇది జ్యేష్ఠమాస పౌర్ణిమనాడు చేయబడును. ఆనాడు ఎద్దులను పూజించి, వాని నురికింతురు. ఇదియే ఉద్వృషభ యజ్ఞ మనబడును."

ఇట్లు జైమినికాలము నాటికే యీ పండుగ సుప్రసిద్ధమై యుండెను.

ఈ యజ్ఞమునే అచ్చ తెనుగులో ఏరువాక పున్నమయని యనిరి. జైమిని చూపించిన తిథియు సరిపోవుచున్నది. కర్షకులకు ఎద్దులే జీవిత సర్వస్వము. కావున వాని పూజ కృతజ్ఞతాసూచకము ప్రశంసనీయము.

**సంపూర్ణము**

# ప్రతి మాసమందలి పండుగల పట్టి

## చైత్రము

| పండుగ | తిథి | విశేషము |
|---|---|---|
| ఉగాది | శు॥ 1 | ఆంధ్ర కర్ణాట మహారాష్ట్రుల సంవత్సరాది |
| గౌరీతృతీయ | శు॥ 3 | మహారాష్ట్ర స్త్రీలకు ముఖ్యము |
| అశోక షష్ఠి | శు॥ 6 | స్త్రీలకు ముఖ్యము |
| శీతలాసప్తమి | శు॥ 7 | బెంగాలునందు మాత్రమే |
| శ్రీరామనవమి | శు॥ 9 | ద్విజులకు మాత్రము |
| హనుమజ్జయంతి | శు॥ 15 | మధ్వులకు ముఖ్యము |

## వైశాఖము

| పండుగ | తిథి | విశేషము |
|---|---|---|
| అక్షయ తృతీయ | శు॥ 3 | జన సామాన్యమున మృగ్యము |
| పరశురామజయంతి | శు॥ 3 | బ్రాహ్మణులకు మాత్రమే |
| నృహింహజయంతి | శు॥ 14 | జన సామాన్యమున లేదు |
| కూర్మజయంతి | శు॥ 15 | జన సామాన్యమున లేదు |
| బుద్ధజయంతి | శు॥ 15 | జన సామాన్యమున లేదు |

## జ్యేష్ఠము

| పండుగ | తిథి | విశేషము |
|---|---|---|
| దశహర | శు॥ 1 | కొన్ని ప్రాంతములలో స్త్రీలకు ప్రధానము |
| వటసావిత్రి | శు॥ 15 | స్త్రీలకు మాత్రమే |
| ఏరువాక పున్నమ | శు॥ 15 | వ్యవసాయకులకు మాత్రమే |

## ఆషాఢము

| | | |
|---|---|---|
| చాతుర్మాస్యము | శు॥ 11 | శు॥ 11 నుండి 4 మాసముల వఱకు ఇదియే |
| ఏకాదశి | శు॥ 11 | ప్రథమైకాదశి లేక శయనైకాదశి |

## శ్రావణము

| | | |
|---|---|---|
| నాగపంచమి | శు॥ 5 | తెలంగాణా రాయలసీమలలో నీ తిథియందు |
| శ్రావణపూర్ణిమ | శు॥ 15 | ద్విజులకు ప్రధానము. దీనినే రక్షికాపూర్ణిమ, తదపభ్రంశమైన రాకీపున్నమ యనియు నందురు. |
| సంకష్టహరణ చతుర్థి | బ॥ 4 | జనులు చేయరు |
| జన్మాష్టమి | బ॥ 8 | అందరికిని ముఖ్యము |

## భాద్రపదము

| | | |
|---|---|---|
| హరితాళిక | శు॥ 3 | స్త్రీలకు ప్రధానము |
| గణేశ చతుర్థి | శు॥ 4 | అందరును చేయుదురు |
| ఋషి పంచమి | శు॥ 5 | బ్రాహ్మణులకే |
| చంపాషష్ఠి | శు॥ 6 | బ్రాహ్మణులకే |
| అముక్తాభరణము | శు॥ 7 | అరుదు |
| దూర్వాష్టమి | శు॥ 8 | అరుదు |
| వామన జయంతి | శు॥ 12 | బ్రాహ్మణులకే |
| అనంత చతుర్దశి | శు॥ 14 | శూద్రులు చేయరు |
| మహాలయ పక్షము | బహుళపక్షము | ఈ పక్షమందు పితృతర్పణములు జరుగును |
| కపిలాషష్ఠి | బహుళపక్షము | సర్వజనులు చేయుదురు |

## అశ్వయుజము

| | | |
|---|---|---|
| నవరాత్రులు | శు॥ 1 నుండి 9 వరకు | వీనినే దేవీనవరాత్రులనియు, మహానవమి నందురు. |
| విజయదశమి | శు॥ 10 | అందరును చేయుదురు. |
| దీపావళి | బ॥ 14 | అందరును చేయుదురు. |
| కేదారేశ్వరవ్రతము | బ॥ 15 | ఎవ్వరును చేయరు. |

## కార్తీకము

| | | |
|---|---|---|
| యమద్వితీయ | శు॥ 2 | ఎవ్వరును చేయరు |
| భాతృద్వితీయ | శు॥ 2 | ఎవ్వరును చేయరు |
| స్కందషష్ఠి | బ॥ 6 | ఎవ్వరును చేయరు |
| భీష్మైకాదశి | శు॥ 11 | బ్రాహ్మణులకే |
| తులసీ వ్రతము | శు॥ 12 | స్త్రీలకు ప్రధానము |
| భక్తేశ్వర వ్రతము | శు॥ 15 | ఎవ్వరును చేయరు |

## మార్గశిరము

| | | |
|---|---|---|
| దత్తాత్రేయజయంతి | శు॥ 10 | బ్రాహ్మణులకే |

## మాఘము

| | | |
|---|---|---|
| వసంత పంచమి | శు॥ 5 | ఉత్తర హిందుస్థానమందే |
| రథసప్తమి | బ॥ 7 | కొందరికే ముఖ్యము |
| భీష్మాష్టమి | శు॥ 8 | కొందరికే ముఖ్యము |
| మహాశివరాత్రి | బ॥ 14 | శైవులకు మాత్రమే |

## ఫాల్గుణము

| | | |
|---|---|---|
| హోలీ | శు॥ 15 | వసంతోత్సవ భేదము |

# అకారాది విషయసూచిక


| విషయము | పుటలు |
|---|---|
| అక్షయ తృతీయ | 90 |
| అనంతచతుర్దశి | 82 |
| అముక్తాభరణము | 166 |
| అశోక షష్ఠి | 156 |
| ఉగాది | 30 |
| ఋషి పంచమి | 70 |
| ఏకాదశి | 132 |
| ఏరువాక పున్నమ | 168 |
| కపిలాషష్టి | 66 |
| కూర్మ జయంతి | 57 |
| కేదారేశ్వర వ్రతము | 164 |
| గణేశ చతుర్థి | 92 |
| గౌరీ తృతీయ | 155 |
| చంపాషష్ఠి | 154 |
| చాతుర్మాస్య వ్రతము | 101 |
| జన్మాష్టమి | 36 |

| | |
|---|---|
| తులసీ వ్రతము | 62 |
| దత్తాత్రేయ జయంతి | 56 |
| దశహర | 155 |
| దీపావళి | 08 |
| దూర్వాష్టమి | 154 |
| నవరాత్రులు | 88 |
| నాగపంచమి | 121 |
| నృసింహ జయంతి | 58 |
| పరశురామ జయంతి | 102 |
| బుద్ధ జయంతి | 107 |
| భక్తేశ్వర వ్రతము | 163 |
| భ్రాతృద్వితీయ | 165 |
| భీష్మైకాదశి – భీష్మాష్టమి | 46 |
| మహాలయ పక్షము | 52 |
| మహాశివరాత్రి | 144 |
| యమద్వితీయ | 165 |
| రథసప్తమి | 85 |
| వటసావిత్రీ వ్రతము | 167 |
| వసంత పంచమి | 143 |
| వామన జయంతి | 60 |

| | | |
|---|---|---|
| వారవ్రతములు – | ఆదివారము | 157 |
| | సోమవారము | 158 |
| | మంగళవారము | 159 |
| | బుధవారము | 160 |
| | గురువారము | 161 |
| | శుక్రవారము | 161 |
| | శనివారము | 162 |
| విజయదశమి | | 18 |
| వ్రతమనగా నేమి? | | 01 |
| శీతలాసప్తమి | | 139 |
| శ్రావణపూర్ణిమ | | 75 |
| శ్రీరామనవమి | | 34 |
| సంకష్టహరణ చతుర్థి | | 167 |
| సంక్రాంతి | | 79 |
| సత్యనారాయణ వ్రతము | | 72 |
| సూర్య చంద్ర గ్రహణములు | | 68 |
| స్కందషష్టి | | 155 |
| హనుమజ్జయంతి | | 44 |
| హరితాళిక | | 154 |
| హోలీ | | 110 |